బుధవారం 4-2-2026

'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు. పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు ఉన్నత చదువులు చదవాలి.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 6.50

సంపుటి: 18 సంచిక: 314

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

మళ్లీ ఢిల్లీనే..
గుజరాత్‌పై గెలిచి.. 4వసారి డబ్ల్యూపీఎల్ ఫైనల్‌లోకి క్యాపిటల్స్ - 15లో

సెన్సెక్స్ సునామీ
రూ.12.10 లక్షల కోట్లు పెరిగిన ఇన్వెస్టర్ల సంపద - 15లో



వ్యక్తిగత గోప్యతతో ఆటలొద్దు
డేటా షేరింగ్ పేరుతో పౌరుల గోప్యత హక్కుతో ఆడుకోవద్దంటూ వాట్సాప్‌ను సుప్రీంకోర్టు మందలించింది.
వివరాలు 6లో ▸

మాకు సమాచారం లేదు
చమురు కొనుగోళ్ల నిలిపివేతపై భారత్ నుంచి అధికారికంగా ఎలాంటి సమాచారమూ లేదని రష్యా పేర్కొంది.
వివరాలు 6లో ▸

మణిపూర్ సీఎంగా ఖేమ్‌చంద్ సింగ్!
మణిపూర్ సీఎంగా ఖేమ్‌చంద్ సింగ్, ఉప ముఖ్యమంత్రిగా నేమ్చా కిప్‌జెన్ బాధ్యతలు స్వీకరించబోతున్నట్లు సమాచారం.
వివరాలు 6లో ▸

ట్రెండ్‌లోకి వెండి
జీవితకాల గరిష్ట స్థాయిల నుంచి మూడు రోజులపాటు పతనమైన వెండి, బంగారం ధరలు తిరిగి పెరిగాయి.
వివరాలు 15లో ▸

రెడ్‌బుక్కే రాజ్యాంగం..

నేనే 'సుప్రీం'!

రాజ్యాంగ విరుద్ధ చర్యలతో కుట్రలకు చంద్రబాబు పదును

నిర్భీతిగా సుప్రీంకోర్టు ఆదేశాలను ధిక్కరిస్తూ..

'లడ్డూ'పై బాబు మళ్లీ సొంత విచారణ

దేశ చరిత్రలోనే కనీవిని ఎరుగని దుస్సంప్రదాయానికి నాంది

శ్రీవారి లడ్డూ ప్రసాదం పవిత్రతను దెబ్బతీసే కుతంత్రం

తమకు అనుకూలంగా, కోరుకున్న నివేదిక ఇప్పించుకునే పన్నాగం

తద్వారా వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులే లక్ష్యం

లడ్డూ ప్రసాదంలో జంతు కొవ్వు కలవలేదని

ఇప్పటికే నిర్ధారించిన ఎన్‌డీఆర్‌ఐ, ఎన్‌డీడీబీ ల్యాబొరేటరీలు

అదే విషయాన్ని తన చార్జ్‌షీట్‌లో స్పష్టం చేసిన సీబీఐ సిట్

కుట్రలు బెడిసికొట్టడంతో బాబు సర్కారు న్యాయ ధిక్కారం

లడ్డూపై మళ్లీ దర్యాప్తునకు సొంతంగా

విచారణ కమిషన్ ఏర్పాటుకు నిర్ణయం

మంత్రివర్గ సమావేశం వేదికగా నిర్భీతిగా రాజ్యాంగ ఉల్లంఘన

సుప్రీంకోర్టు అధికార పరిధిని సవాల్ చేసిన బాబు సర్కారు

2లో



ICAR-National Dairy Research Institute (ICAR-NDRI,Karnal),Haryana:

During the investigation, four sealed ghee samples drawn by TTD from four tankers of M/s A R Dairy Food Private Limited (A-1) on 06.07.2024 and 12.07.2024 at TTD Warehouse, Godown-IV, Tirumala, were sent through this Hon'ble Court to ICAR-NDRI, Karnal, Haryana, to test for the presence of lard and other animal fats. NDRI, Karnal, in its report dated 16.05.2025, stated that all four samples were analyzed using a PCR-based method (Ref. No NDRI/DC/VS/SOP-I), Limit of detection (LOD):>10%, but not detected LARD in any of the four samples.

తిరుమల లడ్డూ తయారీలో వినియోగించిన నెయ్యిలో జంతువుల కొవ్వు లేనే లేదని ఎన్‌డీఆర్‌ఐ పరీక్షల్లో వెల్లడైందని స్పష్టం చేసిన విషయాన్ని సీబీఐ సిట్ తన చార్జ్‌షీట్‌లో పేర్కొన్న భాగం

అభాసుపాలయ్యాం.. ఎదురుదాడి చేయండి!

- లడ్డూ విషయంలో మంత్రులకు సీఎం చంద్రబాబు ఆదేశం
- సీబీఐ సిట్ చార్జ్‌షీట్‌తో ప్రజలు ఇక మన మాటలను నమ్మని పరిస్థితి ఏర్పడింది
- అందుకే రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో మళ్లీ విచారణ చేయిద్దాం
- ఈలోపు వైఎస్సార్‌సీపీపై ఎదురుదాడి ఇంకా పెంచాలని నిర్దేశం

2లో

గత టీడీపీ హయాంలోనే

నెయ్యి కల్తీ

- 87 వేల కిలోల కల్తీ నెయ్యి కొని ఫ్లేవర్ కలిపి దురాగతం
- భోలేబాబాను తీసుకొచ్చింది చంద్రబాబు సర్కారే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై చేసిన ప్రచారం కూడా అవాస్తవమని తేల్చిన సీబీఐ సిట్
- సుప్రీంకోర్టు 'సిట్' రిపోర్ట్‌పై మళ్లీ విచారించే అధికారం ఈ సర్కారుకు లేదు
- అడ్డంగా దొరికిపోయిన చంద్రబాబు తప్పిదాన్ని కప్పిపుచ్చుకునేందుకు కొత్త డ్రామా
- సీఎం చంద్రబాబు నీచ రాజకీయాన్ని ఎండగట్టిన భూమన

16లో

ప్రధాని మోదీని సత్కరిస్తున్న ఎన్డీయే ఎంపీలు, కేంద్ర మంత్రులు

అమెరికాతో ఒప్పందంతో ప్రతి ఒక్కరికీ లబ్ధి

6లో

మన తయారీ రంగం బలోపేతం అవుతుంది.. ఎగుమతిదారులకు, వ్యాపారవేత్తలకు మేలు జరుగుతుంది

ఇది అతిపెద్ద నిర్ణయం.. ఎల్లప్పుడూ దేశ ప్రయోజనాల కోసమే పనిచేస్తున్నాం

ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ భేటీలో మోదీ

ప్రధానిని సత్కరించిన ఎన్డీయే ఎంపీలు

మౌనంగానే మెడలు వంచి!

6లో

అమెరికాతో వాణిజ్య ఒప్పందం వెనుక ఫలించిన మోదీ వేచి చూసే ఎత్తుగడ

ఈయూ–భారత్ ఒప్పందంతో ట్రంప్ బెంబేలు.. తప్పనిసరై దిగొచ్చిన అమెరికా అధ్యక్షుడు

నేడు అంబటి కుటుంబానికి వైఎస్ జగన్ పరామర్శ 13లో

గల్లా మాధవి దంపతులకు క్లీన్ చిట్! 13లో

- అంబటి రాంబాబు ఫిర్యాదు చేసినా వారిపై కేసు నమోదు చేయని పోలీసులు
- వారిద్దరి పేర్లు లేకుండానే కార్పొరేటర్ బుజ్జి, మరి కొందరు.. అంటూ ఎఫ్ఐఆర్

టీడీపీ చేతిలో ఖా'కీలు బొమ్మలు' 13లో

అంబటి ఇంటిపై దాడిలో ఆ ఇద్దరు పోలీసుల కీలకపాత్ర

ఏపీలో రాష్ట్రపతి పాలన విధించండి

పార్లమెంట్ మకర ద్వారం వద్ద వైఎస్సార్‌సీపీ ఎంపీల నిరసన

చంద్రబాబు డైరెక్షన్‌లోనే వైఎస్సార్‌సీపీ నేతలపై దాడులు

పెట్రోల్ బాంబులతో ఇళ్లు తగలబెడుతున్నా పోలీసులు పట్టించుకోలేదు

కేంద్రం జోక్యం చేసుకుని బాబు ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్

ప్లకార్డులతో నిరసన హోరు.. ఆరా తీసిన తోటి ఎంపీలు

నేడు ఎన్‌హెచ్‌ఆర్‌సీకి ఫిర్యాదు చేయనున్న ఎంపీలు

16లో

కరకట్ట ప్యాలెస్ కిరాతకమే

మాజీ మంత్రి జోగి రమేశ్ ఇంటిపై దాడికి కుట్ర అక్కడి నుంచే

- పెదబాబు, చినబాబు ఆదేశాలతోనే టీడీపీ గూండాల అరాచకం.. టీడీపీ పార్లమెంటరీ నియోజకవర్గ ముఖ్యనేత డైరెక్షన్‌లోనే దాడి
- ఇందుకు సహకరించిన ఓ పోలీసు అధికారి
- ముందే దాడి సమాచారం తెలిసినా పట్టించుకోని ఖాకీలు

13లో

జోగి రమేశ్ ఇంటిపై దాడి చేసిన ఫతావుల్లాతో చంద్రబాబు

'సీమ' దుమ్మెత్తిపోత

చంద్రబాబు ద్రోహంపై వెల్లువెత్తుతున్న ప్రజాగ్రహం

- వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రేపు చలో పోతిరెడ్డిపాడుకు సర్వంసిద్ధం 3లో
- రాయలసీమ ఎత్తిపోతలను పూర్తిచేయాలని డిమాండ్
- 'సీమ' సుభిక్షం కోసం రూ.3,850కోట్లతో ఎత్తిపోతల పనులు చేపట్టిన వైఎస్ జగన్
- అధికారంలోకి రాగానే తెలంగాణ సీఎం రేవంత్‌తో బాబు చీకటి ఒప్పందం.. సీమ ఎత్తిపోతలతో ప్రయోజనం లేదంటూ బాబు సర్కారు వితండవాదం


ఈ మధ్య అదే రాజ్యమేలుతోంది!!

క్లుప్తంగా...

‘గీతం’ భరత్‌కు హైకోర్టు నోటీసులు

చంద్రబాబు ప్రభుత్వానికి కూడా..

సాక్షి, అమరావతి: విశాఖ నడిబొడ్డున రూ.5వేల కోట్ల విలువ చేసే 54.79 ఎకరాల భూమిని మంత్రి నారా లోకేశ్ తోడల్లుడు, ఎంపీ ఎం.శ్రీభరత్‌కు చెందిన గీతం విద్యా సంస్థకు కట్టబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న యత్నాలను అడ్డుకోవాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు స్పందించింది. ఈ వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, విశాఖపట్నం జిల్లా కలెక్టర్, గ్రామీణ తహసీల్దార్, గీతం ప్రెసిడెంట్ శ్రీభరత్‌కు నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను 4 వారాలకు వాయిదా వేస్తూ న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ మంగళవారం ఉత్తర్వులిచ్చారు. కాగా, విశాఖపట్నంకి చెందిన న్యాయవాది నిమ్మిగ్రేస్ ఈ పిటిషన్ దాఖలు చేశారు.

రాష్ట్రంలో యథేచ్ఛగా లిక్కర్ దందా

- అంగీకరించిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్
- వరుస ఫిర్యాదులు వచ్చాయని పవన్ కార్యాలయం ప్రకటన
- ‘ఎక్స్’ వేదికగా సీఎం, ఎక్సైజ్ శాఖను ట్యాగ్ చేస్తూ పోస్టు



ఎక్స్‌లో పవన్ చేసిన పోస్ట్

సాక్షి, అమరావతి: కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో విచ్చలవిడిగా సాగుతున్న లిక్కర్ దందాపై ఇప్పటిదాకా ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ చెబుతున్న అంశాలే నిజమయ్యాయి. రాష్ట్రంలోని మద్యం దుకాణాల్లో నిబంధనలను పూర్తిగా తుంగలోకి తొక్కుతూ ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు మద్యం అమ్మకాలు జరుగుతున్నట్టు స్వయంగా ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణే అంగీకరించారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కార్యాలయం ‘ఎక్స్’ వేదికగా ఈ మేరకు అధికారికంగా పోస్టు చేసింది. ఎక్సైజ్ శాఖ అధికారులు మద్యం దుకాణాలపై నిరంతర నిఘా ఏర్పాటు చేసి అధిక ధరలకు విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలని సూచించినట్టు పోస్టులో పేర్కొంది. రాష్ట్రమంతటా నియోజకవర్గాల్లో అధికార టీడీపీ, జనసేన ఎమ్మెల్యేల కనుసన్నల్లోనే మద్యం సిండికేట్లు లిక్కర్ దందా సాగుతోంది. ఈ దురాగతాలపై ‘సాక్షి’ సహ వివిధ పత్రికల్లో ప్రత్యేక కథనాలు వచ్చాయి. దీంతోపాటు ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ నేతలూ టీడీపీ నేతల లిక్కర్ అరాచకాలను బట్టబయలు చేశారు. ఇప్పుడు ఈ లిక్కర్ దందాపై పవన్‌కళ్యాణ్ కార్యాలయం ఎక్స్ పోస్టు చేయడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఈ పోస్టును సీఎం, ఎక్సైజ్ శాఖ, ఎక్సైజ్ శాఖ మంత్రికీ, ప్రెస్ బ్యూరో ఆఫ్ ఇండియా (పీఐబీ)తో పాటు రాష్ట్ర సమాచార శాఖ, విజయవాడలోని పీఐబీ విభాగానికీ పవన్ కళ్యాణ్ కార్యాలయం ట్యాగ్ చేయడం గమనార్హం.

‘సర్వే’ పూర్తి చేయలేదని ఏడుగురు ఉద్యోగుల సస్పెన్షన్

డోన్: అక్షరాంధ్ర సర్వేపై అలసత్వం వహించారంటూ డోన్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్ పట్టణంలోని ఏడుగురు సచివాలయ ఉద్యోగులను సస్పెండ్ చేశారు. ఇప్పటికే ఏకీకృత కుటుంబ సర్వే, పీ 4, వాట్సాప్ గవర్నెన్స్, ఆధార్ సీడింగ్ లాంటి సర్వేలతో సతమతమవుతున్నామని, ఇప్పుడు అక్షరాంధ్ర సర్వేతో మరింత ఒత్తిడికి గురవుతున్నామని ఉద్యోగులు వాపోయారు. తాము అక్షరాంధ్ర సర్వేను పూర్తి చేసినా మిగిలిన సర్వేలను పూర్తి చేయలేదనే నెపంతో కమిషనర్ సస్పెండ్ చేయడం అన్యాయమంటూ మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు.

రెడ్‌బుక్కే రాజ్యాంగం.. నేనే ‘సుప్రీం’!

రాజ్యాంగ విరుద్ధ చర్యలతో కుట్రలకు చంద్రబాబు పదును

నిర్భీతిగా సుప్రీం ఆదేశాలను ధిక్కరిస్తూ.. ‘లడ్డూ’పై బాబు మళ్లీ సొంత విచారణ

> d. In fatty acid analysis of Ghee samples received from TTD, presence of Eicosapentaenoicacid (C20:5 n-3) and Docosahexaenoic acid (C22:6, n-3) were found **below the limit of quantification** in all the four samples. This suggests that the chances for presence of Fish oil in the Ghee samples of TTD appears very rare.

తిరుమల లడ్డూల తయారీకి ఉపయోగించిన నెయ్యిలో చేప నూనె కలిసే అవకాశం లేనేలేదని ఎన్‌డీడీబీ పరీక్షల్లో వెల్లడైందని చార్జిషీట్‌లో సీబీఐ సిట్ పేర్కొన్న అంశం



సాక్షి, అమరావతి: స్వతంత్ర భారత దేశ చరిత్రలో ఏ ప్రధానమంత్రీ, ఏ ముఖ్యమంత్రీగానీ తలపెట్టని దుస్సాహసానికి సీఎం చంద్రబాబు బరి తెగించారు! దేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ఆదేశాలను బేఖాతర్ చేస్తూ రాజకీయ కుట్రకు తెగబడ్డారు. దేశంలో అత్యున్నత దర్యాప్తు సంస్థ సీబీఐ దాఖలు చేసిన చార్జిషీట్‌ను పట్టించుకోకుండా.. తిరుమల లడ్డూ ప్రసాదంలో జంతు కొవ్వు లేదని నిర్ధారిస్తూ ప్రముఖ సైంటిఫిక్ ల్యాబ్‌లు ఎన్‌డీఆర్ఐ, ఎన్‌డీబీ ఇచ్చిన నివేదికలను పక్కనపెట్టేసి సొంత విచారణకు సిద్ధమయ్యారు! సుప్రీంకోర్టు ఆదేశాలను నిర్భీతిగా ధిక్కరిస్తూ.. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం నెయ్యిపై మళ్లీ విచారణకు సొంత విచారణ కమిషన్‌ను నియమించాలని నిర్ణయించారు. తద్వారా తనకు అనుకూలంగా నివేదిక ఇప్పించుకునే కుట్రలకు తెర తీశారు. దీనిపై తాజాగా మంత్రివర్గ సమావేశంలో సుదీర్ఘంగా చర్చలు జరపగా అధికారికంగా ప్రకటన వెలువడాల్సి ఉంది. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ఏర్పాటైన సీబీఐ స్వతంత్ర సిట్ దర్యాప్తు నివేదికను తాము పరిగణలోకి తీసుకోబోమని ఏకంగా రాష్ట్ర మంత్రి మండలి వేదికగా ప్రకటించడం విస్మయం కలిగిస్తోంది. తిరుమల లడ్డూ ప్రసాదంలో జంతు కొవ్వు కలిసిందన్న దుష్ప్రచార కుట్ర బెడిసికొట్టడంతో చంద్రబాబు ఈ కుతంత్రానికి తెగించారు. లడ్డూ ప్రసాదంపై తమ దుష్ప్రచారాన్ని కొనసాగించేందుకు... రాజకీయ కక్ష సాధింపుతో వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులను నమోదు చేసేందుకు తమ వీర విధేయులతో విచారణకు ప్రత్యేకంగా కమిషన్‌ను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఈ కుతంత్రానికి రాష్ట్ర మంత్రి మండలి సమావేశాన్ని వేదికగా చేసుకోవడం గమనార్హం. అంటే సుప్రీం కోర్టుతో తమకేమాత్రం సంబంధం లేదని... టీడీపీ కూటమి ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధంగా ఓ సమాంతర న్యాయ వ్యవస్థగా వ్యవహరిస్తుందని తేల్చి చెప్పారు. దేశ చరిత్రలో ఓ దుస్సాంప్రదాయానికి తెరతీశారు.

సుప్రీంకోర్టును ధిక్కరిస్తూ... బాబు బరితెగింపు

రాజకీయ స్వార్థం కోసం ఎంతకైనా దిగజారుతానని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నోసార్లు చేతల్లో చూపించారు. అందుకోసం తిరుమల శ్రీవారి ఆలయం, ప్రసాదం పవిత్రతకు కూడా భంగం కల్గిస్తానని... ఏకంగా సుప్రీం కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరిస్తానని తాజాగా నిరూపించుకోవడం విభ్రాంతి కలిగిస్తోంది. తిరుమల లడ్డూ ప్రసాదం ప్రాశస్త్యానికి భంగం కలిగించే కుట్రకు ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబే తెరతీసిన విషయం తెలిసిందే. లడ్డూ ప్రసాదం కోసం వినియోగించిన నెయ్యిలో జంతువుల కొవ్వు కలిపారని ఆయన నిరాధారణ ఆరోపణలు చేయడంతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాదిమంది భక్తులు విభ్రాంతి చెందారు. అంతే కాదు ఈ రాజకీయ కుట్రకు అధికారిక ముద్ర వేసేందుకు టీడీపీ అనుకూల ఐపీఎస్ అధికారులతో సిట్‌ను నియమించారు. దీనిపై వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. లడ్డూ ప్రసాదంపై దుష్ప్రచారానికి అడ్డుకట్ట వేసి వాస్తవాలను ప్రజలకు తెలిసేలా చేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై విచారించిన సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. కనీసం దేవుళ్లను అయినా రాజకీయాలకు దూరంగా ఉంచాలని టీడీపీ కూటమి ప్రభుత్వానికి హితవు చెప్పింది. ఈ క్రమంలో లడ్డూ ప్రసాదం కోసం వినియోగించిన నెయ్యి నాణ్యతపై విచారించేందుకు చంద్రబాబు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్‌ను రద్దు చేసింది. ఆ స్థానంలో స్వతంత్ర సిట్‌ను ఏర్పాటు చేయాలని సీబీఐని ఆదేశించింది. ఆ దర్యాప్తును తాము పర్యవేక్షిస్తామని పేర్కొంది. దాంతో సీబీఐ ఏర్పాటు చేసిన సిట్ దర్యాప్తు జరిపి తన నివేదికను ఇటీవల నెల్లూరు న్యాయస్థానంలో దాఖలు చేసింది. దాంతో చంద్రబాబు కుట్ర బెడిసికొట్టింది. ఈ పరిణామాన్ని ఆయన తట్టుకోలేకపోతున్నారు. దాంతో ఏకంగా సుప్రీంకోర్టునే ధిక్కరించడానికి తెగబడ్డారు. 2024లోనే చంద్రబాబు ప్రభుత్వం నియమించిన సిట్‌ను సుప్రీంకోర్టు రద్దు చేయడం గమనార్హం. అనంతరం సీబీఐ ఆధ్వర్యంలోని స్వతంత్ర సిట్ ద్వారా దర్యాప్తునకు ఆదేశించింది. సీబీఐ సిట్ ఆ కేసులో దాఖలు చేసిన చార్జిషీట్ ఇప్పుడు నెల్లూరు న్యాయస్థానంలో ఉంది. ఇంకా కొనసాగుతున్న ఆ కేసు దర్యాప్తును సుప్రీంకోర్టు పర్యవేక్షిస్తోంది.

కేబినెట్ వేదికగా న్యాయధిక్కార కుట్ర...

సీబీఐ దాఖలు చేసిన చార్జిషీట్‌ను ఇతర మార్గాల ద్వారా సేకరించి న్యాయస్థానం పరిధిలోని అంశాలపై మంత్రి మండలి సమావేశంలో చర్చించడం విస్మయపరుస్తోంది. ఇది నిబంధనలకు విరుద్ధం. కోర్టు పరిధిలో ఉన్న అంశాలపై సమాంతరంగా ఎటువంటి నిర్ణయాలు తీసుకోకూడదన్నది కచ్చితంగా పాటించాల్సిన నిబంధన. చార్జిషీట్‌లోని అంశాలపై న్యాయస్థానం పరిశీలించి విచారించాలి. దానిపై ఇరువర్గాల న్యాయవాదులు న్యాయస్థానంలో తమ వాదనలను వినిపించాలి. కానీ ముఖ్యమంత్రి చంద్రబాబు తనే ‘సుప్రీం’ అన్నట్లుగా బరి తెగించారు. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సీబీఐ ద్వారా సాగుతున్న కేసు దర్యాప్తుపై తాము ప్రత్యేకంగా కమిషన్‌ను ఏర్పాటు చేస్తానని ప్రకటించారు.

కేబినెట్ సమావేశానికి ముందుగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, పయ్యావుల కేశవ్, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్‌లతో సమావేశమై చార్జిషీట్‌లోని అంశాలపై చర్చించారు. సుప్రీంకోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ నిర్వహించిన ఈ సమావేశానికి డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, ఇంటెలిజెన్స్ చీఫ్ మహేశ్‌చంద్ర లడ్హా ఇతర పోలీసు ఉన్నతాధికారులు హాజరు కావడం గమనార్హం. సిట్ సభ్యుడిగా ఉన్న ఓ అధికారి కూడా ఈ సమావేశంలో పాల్గొనడం విస్మయపరుస్తోంది. అంటే సుప్రీం కోర్టు ఆదేశాలతో నియమించిన సిట్‌లో సభ్యుడిగా ఉన్న ఆ అధికారి... సుప్రీం కోర్టు ఆదేశాలను ధిక్కరించే సమావేశంలో భాగస్వామి అయ్యారు. ఆది నుంచి అత్యంత వివాదాస్పదుడిగా గుర్తింపు పొందిన ఆ అధికారి మరోసారి రాజ్యాంగబద్ధ ధర్మం కంటే తన రాజకీయ విధేయతకే పెద్ద పీట వేశారు. ఇక ఎంపిక చేసిన మంత్రులతో సమావేశం అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు కేబినెట్ సమావేశంలో కూడా సీబీఐ చార్జిషీట్‌లో పేర్కొన్న అంశాలపై చర్చించారు. అంతే కాదు... సీబీఐ చార్జిషీట్‌లో పొందుపరిచిన అంశాలపై ముఖ్యమంత్రి, మంత్రులు విభేదించారు. ఆ చార్జిషీట్ సమగ్రంగా లేదని వారే తీర్పునిచ్చేశారు. ఈ విధంగా తాము సమాంతర న్యాయ వ్యవస్థ అన్నట్టుగా వ్యవహరించారు. సీబీఐ దర్యాప్తు, నివేదికను తాము గుర్తించబోమని పరోక్షంగా ప్రకటించారు.

జంతు కొవ్వు కలవలేదని సీబీఐ నిజం చెప్పినందునే..

చంద్రబాబు ప్రభుత్వం ఇంతగా బరితెగించి సుప్రీం కోర్టును ఎందుకు ధిక్కరించింది? అంటే కారణం ఒకటే... తిరుమల లడ్డూ ప్రసాదంపై తమ దుష్ప్రచార కుట్ర బెడిసికొట్టడంతోనే ఇంతటి దుస్సంప్రదాయానికి తెగబడింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో సీబీఐ ఏర్పాటు చేసిన సిట్... లడ్డూ ప్రసాదం కోసం వినియోగించిన నెయ్యిలో జంతు కొవ్వు కలవలేదని నిగ్గు తేల్చింది. టీటీడీకి చెందిన నాలుగు వేర్వేరు ట్యాంకర్ల నుంచి నెయి నమూనాలను సేకరించి దేశంలోని ప్రతిష్టాత్మకమైన హర్యానాలోని ‘నేషనల్ డెయిరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఎన్‌డీఆర్ఐ), గుజరాత్‌లోని ‘నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎన్‌డీడీబీ) ల్యాబొరేటరీలకు పంపింది. ఆ ల్యాబొరేటరీలలో పరీక్షించిన అనంతరం ... ఆ నెయ్యిలో జంతు కొవ్వు కలవలేదనే వాస్తవం నిగ్గు తేలింది. శాస్త్రీయంగా పరీక్షించిన రెండు ల్యాబొరేటరీలు సాధికారికంగా వేర్వేరు నివేదికలు ఇచ్చాయి. ఆ నెయ్యిలో జంతు కొవ్వు కలవలేదని ఆ రెండు నివేదికలూ స్పష్టం చేశాయి. ఆ రెండు నివేదికలను ప్రస్తావిస్తూ సీబీఐ న్యాయస్థానంలో చార్జిషీట్ దాఖలు చేసింది. దాంతో తిరుమల లడ్డూ ప్రసాదం కోసం వినియోగించిన నెయ్యిలో జంతు కొవ్వు కలవలేదని నిర్ధారణ అయ్యింది. జాతీయ పత్రికలు సైతం అదే విషయాన్ని ప్రముఖంగా ప్రచురించాయి. జాతీయ మీడియా చానళ్లు, డిజిటల్ మీడియా కూడా ఆ విషయాన్ని అత్యంత ప్రముఖంగా ప్రసారం చేశాయి. ఇక రాజకీయ పార్టీలతో నిమిత్తం లేని తటస్థులు, విశ్లేషకులు కూడా లడ్డూ ప్రసాదంపై చంద్రబాబు చేసిన రాద్ధాంతం అంతా దుష్ప్రచారమేనని అభిప్రాయపడ్డారు. చంద్రబాబు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. దాంతో లడ్డూ ప్రసాదంపై తమ దుష్ప్రచార కుట్ర బెడిసికొట్టడంతో చంద్రబాబు కొత్త కుతంత్రానికి తెరతీశారు. అందుకే టీడీపీ కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో ఓ కమిషన్‌ను నియమించాలని నిర్ణయించారు.

నాడు పచ్చ సిట్.. నేడు పచ్చ కమిషన్!

రాజకీయ కుట్ర కోసం తిరుమల లడ్డూ ప్రసాదంపై దుష్ప్రచారం చేయాలని సీఎం చంద్రబాబు పంతం పట్టారు. విజయవాడను ముంచెత్తిన బుడమేరు వరద సహాయక చర్యల్లో తన దారుణ వైఫల్యం నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే ఈ దుష్ప్రచారానికి తెరతీశారు. లడ్డూ ప్రసాదంలో జంతు కొవ్వు కలిసిందనే దుష్ప్రచార కుట్రకు సీఎం హోదాలో ఆయనే నేతృత్వం వహించి ఘోర అపచారానికి పాల్పడ్డారు. శ్రీవారి ప్రసాదం ప్రాశస్త్యానికి కళంకం తీసుకువచ్చే కుట్రకు రాజముద్ర వేసేందుకు చంద్రబాబు యత్నించారు. అందుకే ఈ అంశంపై దర్యాప్తు కోసం టీడీపీ వీర విధేయులైన రాష్ట్ర పోలీసు అధికారులతో సిట్‌ను నియమించారు. 2024 ఎన్నికల్లో ఉమ్మడి గుంటూరు జిల్లాల్లో టీడీపీకి అనుకూలంగా వ్యవహరించిన వివాదాస్పద అధికారి ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠిని సిట్‌కు చీఫ్‌గా నియమించడం గమనార్హం. మరో వీర విధేయ అధికారి విశాఖపట్నం డీఐజీ గోపీనాథ్ జెట్టీ, అప్పటి తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్ రాజు (ప్రస్తుతం ప్రకాశం జిల్లా ఎస్పీ)లను సభ్యులుగా నియమించారు. గోపీనాథ్ జెట్టి ఎవరో కాదు.. చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడు, కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్‌గా నియమితుడైన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కృష్ణయ్యకు ఆయన అల్లుడు. పచ్చ సిట్ ద్వారా చంద్రబాబు కుట్రలను ఎంపీ వైవీ సుబ్బారెడ్డి సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. దాంతో ఆ సిట్‌ను సుప్రీంకోర్టు రద్దుచేసి స్వతంత్ర సిట్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేయాలని సీబీఐని ఆదేశించింది. దాంతో చంద్రబాబు పన్నాగం బెడిసికొట్టింది. లడ్డూ ప్రసాదంలో జంతు కొవ్వు కలవలేదని తాజాగా సీబీఐ దర్యాప్తులో వెల్లడి కావడంతో టీడీపీ కూటమి ప్రభుత్వం మరో ఎత్తుగడ వేసింది. ఈసారి ఈ అంశంపై దర్యాప్తునకు కమిషన్‌ను నియమిస్తామని ప్రకటించింది. తమ వీర విధేయులైనవారిని అందులో చైర్మన్, సభ్యులుగా నియమించి తమ దుష్ప్రచార కుట్రకు అధికారిక ముద్ర వేయాలన్నదే చంద్రబాబు లక్ష్యమని స్పష్టమవుతోందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

నివేదిక ఇలా ఉండాలి.. నిందితులుగా వీళ్లే!

సుప్రీంకోర్టును ధిక్కరిస్తూ మరీ సొంత కమిషన్ ఏర్పాటుకు బరితెగించడం వెనుక చంద్రబాబు ప్రభుత్వ లక్ష్యం సుస్పష్టం... లడ్డూ ప్రసాదంలో జంతు కొవ్వు కలిసిందని తాము చేసిన దుష్ప్రచారాన్ని బలపరుస్తూ ఓ నివేదిక ఇప్పించుకోవాలి. అంతే కాదు తాము రాజకీయంగా లక్ష్యంగా చేసుకున్న వైఎస్సార్‌సీపీ నేతలను ఆ కేసులో నిందితులుగా చేర్చాలి. వాస్తవాలు, ల్యాబరేటరీలలో పరీక్షలు, విధి విధానాలతో నిమిత్తం లేకుండా తాము చెప్పింది చెప్పినట్టుగా చేసేందుకే కమిషన్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఆ విషయాన్ని మంత్రి పయ్యావుల కేశవ్ మంగళవారం విలేకరుల సమావేశంలో పరోక్షంగా వెల్లడించారు. ఫలానా వారిని నిందితులుగా చేర్చడానికే కమిషన్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నట్టుగా ఆయన వ్యాఖ్యానించడమే అందుకు నిదర్శనం. ఆ కమిషన్‌కు అతి తక్కువ సమయమే ఇస్తామని మంత్రి పయ్యావుల కేశవ్ చెప్పడం గమనార్హం. అంటే దర్యాప్తుతో నిమిత్తం లేకుండా, వాస్తవాలను పట్టించుకోకుండా తాము చెప్పింది చెప్పినట్టుగా నివేదిక ఇచ్చేవారినే కమిషన్ చైర్మన్, సభ్యులుగా నియమిస్తామని ప్రభుత్వం నిర్భీతిగా ప్రకటించుకున్నట్టే! అధికారంలో ఉన్నవాళ్లు తమకు నచ్చినట్టుగా నివేదికలు ఇప్పించుకుంటాం...! తమకు నచ్చనివారిపై అక్రమ కేసులు పెడతామంటే ఇక దేశంలో పోలీస్ స్టేషన్లు, న్యాయస్థానాలు ఎందుకు ఉన్నట్లని రాజకీయ పరిశీలకులు ప్రశ్నిస్తున్నారు. రాజ్యాంగ నిబంధనలు, వ్యవస్థలను తాము పట్టించుకోమంటూ చంద్రబాబు ప్రభుత్వం నియంతృత్వానికి తెగబడుతోందని విమర్శిస్తున్నారు.

అభాసుపాలయ్యాం.. ఎదురుదాడి చేయండి!

లడ్డూ విషయంలో మంత్రులకు సీఎం చంద్రబాబు ఆదేశం

సాక్షి, అమరావతి: తిరుమల లడ్డూ విషయంలో పూర్తిగా అభాసుపాలయ్యామని, ఈ పరిస్థితి నుంచి బయట పడాలంటే ఇంకా సీరియస్‌గా ఎదురుదాడి చేయాలని సీఎం చంద్రబాబు మంత్రులకు సూచించినట్లు తెలుస్తోంది. మంగళవారం సచివాలయంలో కేబినెట్ భేటీ సందర్భంగా ఈ విషయంపైనే ప్రధానంగా చర్చించినట్లు సమాచారం. అజెండాను పక్కనపెట్టి లడ్డూకి సంబంధించిన అంశాలు, సీబీఐ చార్జిషీట్‌పైనే ఎక్కువగా చర్చించారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో జంతుకొవ్వు కలిసిందన్న చంద్రబాబు నిరాధార ఆరోపణలపై శ్రీవారి భక్తులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. దీనిపై సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఏర్పాటైన సీబీఐ సిట్ దర్యాప్తులో జంతు కొవ్వు ఆరోపణల్లో నిజం లేదని తేలిపోయింది. దీంతో రాజకీయ ప్రయోజనాల కోసమే వైఎస్సార్‌సీపీపై బురద చల్లేందుకు యత్నించి చంద్రబాబు భంగపడినట్లు ప్రజల్లో విస్తృతంగా చర్చ జరుగుతోంది. సీబీఐ సిట్ దాఖలు చేసిన చార్జిషీట్‌లోని అంశాలతో తాను మాట్లాడిన మాటలను



ప్రజలు విశ్వసించని పరిస్థితి నెలకొందని చంద్రబాబు అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఎలాగైనా ఈ విషయంలో వైఎస్సార్‌సీపీని ఫిక్స్ చేయాలని, ఇందుకోసం అవసరమైతే సిట్ నిష్పాక్షికతపై అనుమానాలు రేకెత్తేలా మాట్లాడాలని ఆదేశించినట్లు తెలుస్తోంది. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఇంకా లోతుగా విచారణ చేసేందుకు ఒక విచారణ కమిషన్‌ను నియమిద్దామని అన్నట్లు తెలిసింది. ఆ నివేదికను తమకు అనుకూలంగా ఇప్పించుకుని నమ్మించాలనే నిర్ణయానికి వచ్చారు. లడ్డూ వ్యవహారాన్ని డైవర్ట్ చేయడానికి గుంటూరు, ఇబ్రహీంపట్నంలో రేపిన గొడవల వల్ల టీడీపీ ఇమేజ్ డ్యామేజ్ అయిందని సమావేశంలో చర్చించారు. వైఎస్సార్ సీపీ నేతలు అంబటి, జోగి రమేష్ ఇళ్లపై దాడుల వల్ల ప్రజల్లో టీడీపీ పట్ల వ్యతిరేకత వ్యక్తమైందని పలువురు ప్రస్తావించినట్లు తెలిసింది. ఇకపై మరింతగా ఎదురుదాడి చేయాలని చంద్రబాబు నిర్దేశించినట్లు సమాచారం. దీనికి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మద్దతు తెలిపారు. టీడీపీకి తాము పూర్తి అండగా ఉంటామని చెప్పినట్లు సమాచారం.

రాబోయే ప్రభుత్వం ఇలాగే వ్యవహరిస్తే మీ పరిస్థితి ఏంటి?

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ కుమార్ రెడ్డి

కడప, కార్పొరేషన్: ప్రతిపక్ష నేతలపై దాడులు చేసే దుస్సంప్రదాయాన్ని ప్రోత్సహించవద్దని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్ కుమార్ రెడ్డి చంద్రబాబు ప్రభుత్వానికి సూచించారు. మంగళవారం ఇక్కడి మీడియాతో ఆయన మాట్లాడారు. రెండు, మూడు రోజులుగా రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు ఘోరంగా ఉన్నాయని, శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయన్నారు. మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేష్ ఇళ్లపై జరిగిన దాడులను చూసి సభ్య సమాజం సిగ్గుపడుతోందన్నారు. రాష్ట్ర ప్రజలు ప్రాణాలు అరిచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ గడిపే పరిస్థితిని కల్పించారన్నారు. మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేల ఇళ్లపైనే దాడులు చేస్తుంటే ఇక సామాన్యుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. రాబోయే ప్రభుత్వం కూడా ఇలాగే వ్యవహరిస్తే మీ పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవాలన్నారు. పోలీసులు ఏం విలువలు పాటిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. పోలీసుల సమక్షంలోనే దాడి జరిగితే పట్టించుకోరా? దాడికి గురైన వారిపైనే కేసులు నమోదు చేయడాన్ని చంద్రబాబు సమర్థిస్తున్నారా అని ప్రశ్నించారు. ప్రభుత్వం తన చేతగాని తనాన్ని సమర్థించుకోవడానికి ప్రశ్నించే ప్రతిపక్షంపై దాడులు చేయిస్తోందని దుయ్యబట్టారు. ఈ దాడులను ప్రజలు హర్షించబోరని, దీన్ని సుప్రీంకోర్టు దృష్టికి కూడా తీసుకువెళ్తామని స్పష్టం చేశారు.

చంద్రబాబు కేసు మూసివేతపై కౌంటర్ వేయండి

సీఐడీకి హైకోర్టు ఆదేశం.. విచారణ రెండు వారాలకు వాయిదా

సాక్షి, అమరావతి: చంద్రబాబు 2014–19 మధ్య సీఎంగా ఉన్న కాలంలో రూ.వేల కోట్ల విలువైన మద్యం, ఫైబర్ నెట్ కుంభకోణాలపై సీఐడీ నమోదు చేసిన కేసులకు సంబంధించిన డాక్యుమెంట్లను ఇచ్చేందుకు నిరాకరిస్తూ ఏసీబీ కోర్టు జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ రైల్వే విశ్రాంత ఉద్యోగి వేము కొండలరావు దాఖలు చేసిన వ్యాజ్యాలపై హైకోర్టు స్పందించింది. ఈ వ్యాజ్యాల్లో పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని సీఐడీని ఆదేశిస్తూ విచారణను 2 వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప మంగళవారం ఉత్తర్వులిచ్చారు. మద్యం, ఫైబర్‌నెట్ కుంభకోణాలకు సంబంధించి అప్పటి సీఎం చంద్రబాబు, ఆయన మంత్రివర్గ సభ్యులు, పలువురు అధికారులపై గత ప్రభుత్వ హయాంలో సీఐడీ పలు కేసులు నమోదు చేసిని విషయం విదితమే. చంద్రబాబు తిరిగి సీఎం కావడంతో సీఐడీ ఆయనతో పాటు మరికొందరిపై నమోదు చేసిన కేసులను మూసివేయాలని కోరుతూ క్లోజర్ రిపోర్టులు దాఖలు చేసింది. ఈ నివేదిక ఆధారంగా చంద్రబాబు తదితరులపై కేసులను మూసివేస్తూ ఏసీబీ కోర్టు ఇటీవల ఉత్తర్వులిచ్చింది. ఇందుకు సంబంధించిన అన్ని రికార్డులను, డాక్యుమెంట్లను ఇవ్వాలని వేము కొండలరావు ఏసీబీ కోర్టును కోరగా.. ఏసీబీ కోర్టు నిరాకరించింది. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ కొండలరావు హైకోర్టులో రివిజన్ పిటిషన్లు దాఖలు చేశారు. వీటిని న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప మంగళవారం విచారించారు. పిటిషనర్ తరఫు న్యాయవాది ఏసీబీ కోర్టు సైతం వాస్తవాలను పరిగణనలోకి తీసుకోకుండా చంద్రబాబు తదితరులపై కేసులను మూసివేసిందన్నారు. ఈ నేపథ్యంలో డాక్యుమెంట్లు కోరితే ఇవ్వలేదని తెలిపారు. వాదనల అనంతరం న్యాయమూర్తి పై విధంగా ఆదేశాలు జారీ చేశారు.

‘లడ్డూ’పై విచారణకు కమిషన్!

జంతు కొవ్వు లేదని ఇప్పటికే ‘సుప్రీం’ నియమించిన సీబీఐ తేల్చేసినా.. మళ్లీ విచారణ కమిషన్ ఏర్పాటుకు మంత్రివర్గం నిర్ణయం

మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల. చిత్రంలో మంత్రులు పార్థసారథి, నాదెండ్ల

సాక్షి, అమరావతి: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి వినియోగించిన నెయ్యిలో జంతు కొవ్వు కలవలేదని సాక్షాత్తూ సుప్రీం కోర్టు ఆదేశాలతో ఏర్పాటైన సీబీఐ సిట్ దర్యాప్తులో వెల్లడికావడం.. అదే విషయాన్ని స్పష్టం చేస్తూ న్యాయస్థానంలో దర్యాప్తు సంస్థ చార్జిషీట్ దాఖలు చేయడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన మంగళవారం సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశం సుదీర్ఘంగా చర్చించింది. చార్జిషీట్‌లో అప్పటి టీటీడీ పాలకమండలి చైర్మన్ సహా కమిటీ సభ్యులందరినీ చేర్చడంపై సుదీర్ఘంగా మంతనాలు జరిగినట్లు తెలుస్తోంది. సీబీఐ ఇప్పటికే అనుబంధ చార్జిషీట్ దాఖలు చేసినందున ఇక ‘సిట్’ పరిధి ముగిసిందనే నిర్ణయానికి వచ్చిన మంత్రివర్గం దీనిపై తదుపరి విచారణకు ఓ కమిషన్‌ను నియమించాలని నిర్ణయించింది. అయితే స్వయంగా సుప్రీం కోర్టు ఆదేశాలతో ఏర్పాటైన సీబీఐ సిట్ దర్యాప్తు నివేదిక వచ్చాక కూడా మళ్లీ విచారణ కమిషన్ ఎందుకని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. సీబీఐ అనుబంధ చార్జిషీట్ దాఖలు చేసినందున విచారణ పరిధి ముగిసిందని భావిస్తున్నట్లు మంత్రి కేశవ్ చెప్పారు. ‘అప్పటి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డితో సహా కమిటీ సభ్యులందరినీ నేరస్తులుగా పరిగణించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకే విచారణ కమిషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. సీబీఐ సిట్ తన లేఖలో చర్యలు తీసుకోవాలని ప్రస్తావించిన అధికారుల నుంచి వివరణ తీసుకునేందుకు స్వల్పకాలిక కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. భోలే బాబా 2019 ఏప్రిల్‌లోనే టెండర్ల ప్రక్రియలో పాల్గొన్నప్పటికీ అది ఎన్నికల సమయం’ అని మంత్రి కేశవ్ పేర్కొన్నారు. సమావేశం అనంతరం మంత్రులు నాదెండ్ల మనోహర్, సత్యకుమార్, పార్థసారథితో కలిసి పయ్యావుల మీడియాతో మాట్లాడారు.

చార్జిషీట్‌లో లోపాలపై చర్చించాం: మంత్రి పయ్యావుల

టీటీడీ లడ్డూలో జంతు కొవ్వు కలిసిందని ముఖ్యమంత్రి చంద్రబాబు గతంలో మాట్లాడారు. ఎన్‌డీడీబీ అనుమానిత రిపోర్టు ఆధారంగానే సీఎం మాట్లాడారు. అయితే ఆ రోజు ఎన్‌డీడీబీ రిపోర్టు ఉందని సీఎం చెప్పలేదు. ఎన్‌డీడీబీ తన రిపోర్టులో ‘ఎస్’ విలువలో హెచ్చుతగ్గులున్నందున జంతు కొవ్వు అవశేషాలు ఉండవచ్చనే అనుమానం వ్యక్తం చేసింది. దాని ఆధారంగానే సీఎం మాట్లాడారు. నెయ్యి కొనుగోలు నిబంధనలను సడలించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని సీబీఐ సిట్ ప్రభుత్వానికి సూచించింది. సీబీఐ కోర్టులో దాఖలు చేసిన చార్జిషీట్‌లో లోపాలపై మంత్రివర్గ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించాం. 2022లోనే నెయ్యి కల్తీ జరిగినట్లు నివేదిక ఉన్నప్పటికీ అప్పటి టీటీడీ చైర్మన్ సహా కమిటీ సభ్యులెవరూ చర్యలు తీసుకోకుండా నివేదికను తొక్కిపెట్టారు. అంతకు ముందే నెయ్యి కొనుగోలు టెండర్ల నిబంధనలను సడలించారు. దీన్నిబట్టి మొత్తం కమిటీ సభ్యులకు తెలిసే దురుద్దేశపూర్వకంగా నెయ్యి కల్తీకి పాల్పడ్డారని ప్రభుత్వం భావిస్తోంది. సీబీఐ చార్జిషీట్‌ను కోర్టు ఇంకా అధికారికంగా స్వీకరించలేదు. అధికారికంగా స్వీకరిస్తే గానీ అందులో ఎవరున్నారు? ఎవరిని చేర్చలేదనేది తెలియదు. చార్జిషీట్‌లో లోపాలుంటే కోర్టు వెనక్కు పంపించే అవకాశం ఉంది. సప్లిమెంటరీ చార్జిషీట్‌లో వైవీ సుబ్బారెడ్డితో పాటు కమిటీ సభ్యుల పేర్లు లేకపోతే వారిని చేర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై అడ్వకేట్ జనరల్‌ను మంత్రివర్గ భేటీకి పిలిచి సలహా కోరాం.

కల్తీ నెయ్యి గురించి ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మంత్రివర్గ సమావేశంలో సూచించారని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఎన్‌డీడీబీ రిపోర్టు ఆధారంగా నిజాయతీగా ప్రజల్లోకి వెళ్లాలని చెప్పారన్నారు. కల్తీ నెయ్యి గురించి 2022లోనే నివేదిక వచ్చినా జాగ్రత్తలు తీసుకోలేదన్నారు. శ్రీవారి లడ్డూ నెయ్యిలో జంతు కొవ్వు కలిసిందని ఎన్‌డీడీబీ రిపోర్టు ఆధారంగానే సీఎం చంద్రబాబు చెప్పారని, భోలే బాబాను తెచ్చిన ఆలీ బాబా ఎవరో తెలియాలని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. టీటీడీ కొనుగోళ్ల కమిటీలో సభ్యుడిగా ఉన్నప్పటికీ తనను కాకుండా ప్రత్యేక ఆహ్వానితులుగా కరుణాకర్‌రెడ్డి, భాస్కరరెడ్డిని పిలిచేవారని మంత్రి పార్థసారథి పేర్కొన్నారు.

ఆరోగ్యశ్రీ ఉద్యోగులూ ప్రైవేటుపరం!

ఆరోగ్యశ్రీని ప్రైవేట్ బీమా కంపెనీ ద్వారా అమలుకు టెండర్ పిలిచిన ప్రభుత్వం

సాక్షి, అమరావతి: ఆరోగ్యశ్రీ పథకం అమలులో కీలకంగా వ్యవహరిస్తూ పేద ప్రజలకు సేవలు అందించిన వేలాది ఉద్యోగుల గుండెల్లో చంద్రబాబు ప్రభుత్వం రైళ్లు పరిగెట్టిస్తోంది. ఒకటిన్నర దశాబ్దంగా ప్రభుత్వంలో పనిచేస్తూ ఏదో ఒక రోజు ఉద్యోగాలు శాశ్వతం అవుతాయని వారు పెట్టుకున్న ఆశలపై నీళ్లు చల్లుతోంది. ఆరోగ్యశ్రీ పథకాన్ని బీమా విధానంలో అమలు చేయడానికి ప్రభుత్వం టెండర్ పిలిచింది. పథకం కింద సేవలు అందిస్తున్న ఆరోగ్య మిత్ర, టీం లీడర్‌లు, ఆరోగ్యశ్రీ ట్రస్టు ఉద్యోగులందరినీ బీమా కంపెనీకి అప్పజెప్పేలా టెండర్ నిబంధనలు రూపొందించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా రెండు వేల మంది ఆరోగ్య మిత్రలు, వంద మంది టీం లీడర్‌లు క్షేత్ర స్థాయిలో సేవలు అందిస్తున్నారు. వీరితో పాటు ఆరోగ్యశ్రీ ట్రస్ట్ రాష్ట్ర, జిల్లా కార్యాలయాల్లోని ఉద్యోగులందరు కలిపి 2,500 మందికి పైగా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్నారు. వీరిలో మెజారిటీ శాతం 18 ఏళ్లుగా పనిచేస్తున్న వారే ఉన్నారు.

అందరిలో కలవరపాటు

2019–24 మధ్య ఆరోగ్యశ్రీ పథకాన్ని బలోపేతం చేసిన వైఎస్ జగన్ సర్కారు.. ఈ పథకం అమలులో కీలకమైన ఉద్యోగులకు ఆర్థికంగా భరోసా ఇచ్చింది. 2014–19 మధ్య టీడీపీ ప్రభుత్వంలో మిత్రలకు రూ.6 వేలు, టీం లీడర్‌లకు రూ.10,600 చొప్పున వేతనాలు ఉండేవి. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక 2019 నవంబర్‌లో ఆరోగ్య మిత్రలకు రూ.12 వేలు, టీం లీడర్‌కు రూ.15 వేల వరకూ వేతనాలను పెంచారు. ప్రభుత్వ రంగంలో నిశ్చింతగా పని చేసుకుంటూ, ఏదో ఒక రోజు ఉద్యోగాలు శాశ్వతం అవుతాయని కోరుకుంటున్న ఉద్యోగుల గుండెల్లో 2024లో చంద్రబాబు బీమా బాంబు పేల్చారు. ప్రీమియంలో వీలైనంత మిగుల్చుకోవాలనే లాభాపేక్షతో పనిచేసే బీమా కంపెనీల చేతుల్లో ప్రజారోగ్యాన్ని పెట్టడమే కాకుండా, 2500 మంది ఉద్యోగుల కుటుంబాలకు పొగ పెట్టడానికి సిద్ధం అయ్యారు. పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ, ఖర్చులను తగ్గించుకోవడం కోసం ప్రపంచ దిగ్గజ సంస్థలు సైతం ఉద్యోగులను ఎడాపెడా తొలగించేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో లాభాపేక్షే పరమావధిగా పనిచేసే ప్రైవేటు బీమా కంపెనీల్లో తమ భవిష్యత్తు ప్రశ్నార్థకమేనని చిరుద్యోగులు కలవరపాటుకు గురవుతున్నారు.

క్లుప్తంగా...

'చలో పోతిరెడ్డిపాడు' పోస్టర్ ఆవిష్కరణ

చలో పోతిరెడ్డిపాడు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

సదుం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 5వ తేదీన చేపట్టనున్న చలో పోతిరెడ్డిపాడు, తిరుమల లడ్డూ అంశంపై సిట్ నిర్ధారణ అంశాలకు సంబంధించిన ప్రచార పోస్టర్లను ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. అన్నమయ్య జిల్లా పుంగనూరులో జరిగిన పార్టీ సమావేశంలో వారు మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీమకు న్యాయం చేకూర్చేలా లిఫ్ట్ స్కీం సామర్థ్య పెంపునకు కృషి చేస్తే.. చంద్రబాబు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో కలసి రాయలసీమకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఈ అన్యాయంపై చేపట్టే చలో పోతిరెడ్డిపాడు కార్యక్రమానికి అందరూ తరలి రావాలన్నారు.

నిరసన సభకు అనుమతి కోసం హైకోర్టులో పిటిషన్

దాఖలు చేసిన వైఎస్సార్‌సీపీ నేత కాటసాని రాంభూపాల్‌రెడ్డి

సాక్షి, అమరావతి: రాయలసీమ ప్రాంతానికి, రాయలసీమ ఎత్తిపోతల పథకానికి సీఎం చంద్రబాబు చేస్తున్న అన్యాయాన్ని నిరసిస్తూ తాము బహిరంగ సభ నిర్వహించనున్నామని, పోలీసులు అనుమతి ఇవ్వడం లేదంటూ మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. అనుమతినిచ్చేలా పోలీసులను ఆదేశించాలని కోరారు. ఈ వ్యాజ్యంపై అత్యవసరంగా లంచ్ మోషన్ రూపంలో విచారణ జరపాలని కోరారు. అనుమతి కోరుతూ జనవరి 30న వినతి పత్రం ఇచ్చామని, ఉద్దేశపూర్వకంగానే పోలీసులు అనుమతినివ్వడం లేదని కోర్టుకు వివరించారు. సీమ ఎత్తిపోతల పథకం విషయంలో అంతరాష్ట్ర వివాదాలు వచ్చినప్పుడల్లా చంద్రబాబు ప్రభుత్వం సమర్థంగా వ్యవహరించడం లేదన్నారు. ప్రభుత్వ తీరుపై నిరసన తెలిపేందుకు బహిరంగ సభ నిర్వహిస్తున్నామని రాంభూపాల్‌రెడ్డి తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై బుధవారం విచారిస్తామని న్యాయమూర్తి స్పష్టం చేశారు.

కూటమి ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌పై కేసు నమోదు

రైల్వేకోడూరు అర్బన్/ఓబులవారిపల్లె: తిరుపతి జిల్లా రైల్వేకోడూరు కూటమి ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌పై బాధితురాలి ఫిర్యాదు నేపథ్యంలో జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) ఆదేశాల మేరకు రైల్వే కోడూరు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. 318(2), 318(4), 88, 351(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్టు వెల్లడించారు.

'సీమ' దుమ్మెత్తిపోత

చంద్రబాబు ద్రోహంపై వెల్లువెత్తుతున్న ప్రజాగ్రహం

వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రేపు చలో పోతిరెడ్డిపాడుకు సర్వంసిద్ధం

- రాయలసీమ ఎత్తిపోతలను పూర్తిచేయాలని డిమాండ్
- 'సీమ' సుభిక్షం కోసం రూ.3,850కోట్లతో ఎత్తిపోతల పనులు చేపట్టిన వైఎస్ జగన్
- పథకాన్ని అడ్డుకునేందుకు చంద్రబాబు కుయుక్తులు
- అధికారంలోకి రాగానే తెలంగాణ సీఎం రేవంత్‌తో బాబు చీకటి ఒప్పందం
- తెలంగాణ అసెంబ్లీ సాక్షిగా చీకటి ఒప్పందాన్ని బట్టబయలు చేసిన ఆ రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి
- ప్రజాగ్రహంతో రాయలసీమ ఎత్తిపోతలతో ప్రయోజనం లేదని బాబు సర్కారు వితండవాదం

రాయలసీమను సుభిక్షం చేసేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టిన రాయలసీమ ఎత్తిపోతల పథకంపై కక్ష పెంచుకున్న టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అధికారంలోకి రాగానే తన వక్రబుద్ధిని చాటారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో చేసుకున్న చీకటి ఒప్పందంతో పథకం నిర్మాణాన్ని నిర్దాక్షిణ్యంగా ఆపేశారు. సీమకు తీరని ద్రోహం చేశారు. మాతృభూమి గుండెలపై తన్నారు. ప్రజలకు తీరని వేదన మిగిల్చారు. చంద్రబాబు చేసిన ద్రోహంపై సీమ భగ్గుమంటోంది. ఆయన తీరుపై ప్రజానీకం దుమ్మెత్తిపోస్తోంది. ఈ నేపథ్యంలో గురువారం చలో పోతిరెడ్డిపాడుకు సిద్ధమైంది. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో సీమకు జరిగిన అన్యాయంపై ఎలుగెత్తనుంది.

- సాక్షి ప్రతినిధి, కర్నూలు

'సీమ' తాగు, సాగు నీటి కష్టాలు తీర్చాలని, సీమ ప్రజల భవిష్యత్తు బాగుండాలని కాంక్షించి ముందు చూపుతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన బృహత్తర పథకం రాయలసీమ ఎత్తిపోతల. ఈ పథకం 'సీమ'జిల్లాలతో పాటు నెల్లూరు జిల్లా రైతుల తలరాత మారుస్తుంది. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్‌ను 11వేల క్యూసెక్కుల నుంచి 44వేల క్యూసెక్కులకు పెంచి వైఎస్ రాజశేఖరరెడ్డి(వైఎస్సార్) సీమకు మేలు చేస్తే.. ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'సీమ' తాగు, సాగు నీటి కష్టాలను శాశ్వతంగా నివారించేందుకు శ్రీశైలంలో 800 అడుగుల నుంచే రోజుకు 3 టీఎంసీలను పోతిరెడ్డిపాడు కాలువలోకి ఎత్తిపోసేందుకు రాయలసీమ ఎత్తిపోతలకు శ్రీకారం చుట్టారు. కానీ చంద్రబాబు మాత్రం వైఎస్ జగన్‌కు పేరు వస్తుందనే అక్కసుతో 'రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్' పనులను ఆపేసి 'సీమ'కు తీరని ద్రోహం చేశారు.

రాయలసీమ ఎత్తిపోతల ఆవశ్యకత ఇదీ..

శ్రీశైలం ప్రాజెక్టును 'సీమ'వాసుల త్యాగాలతో 1981లో నిర్మించారు. 1983–84 నుంచి 2003–04 వరకూ శ్రీశైలం నుంచి రోజుకు 11వేల క్యూసెక్కుల చొప్పున మాత్రమే సీమకు నీటిని తరలించే సామర్థ్యం మాత్రమే ఉంది. శ్రీశైలం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు. 854 అడుగులకు నీటి మట్టం చేరుకున్నప్పుడే పోతిరెడ్డిపాడు నుంచి నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. అది కూడా రోజుకు 7వేల క్యూసెక్కులు మాత్రమే తరలించవచ్చు. దీంతో 'సీమ'కు కృష్ణాజలాలు తరలింపునకు తీవ్ర ఇబ్బంది ఉండేది. 2004 వరకూ అప్పటికే తొమ్మిదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ఏ రోజూ 'సీమ' బాగు గురించి ఆలోచించలేదు. 2004లో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక పోతిరెడ్డిపాడు సామర్థ్యాన్ని 44వేల క్యూసెక్కులకు పెంచారు. దీంతో సీమకు కృష్ణా జలాలు తరలింపు సులువైంది. అయితే శ్రీశైలంలో 800 అడుగుల నీటి మట్టం ఉన్నప్పుడే రోజుకు 2 టీఎంసీలు తరలించుకునేలా తెలంగాణ ప్రభుత్వం పాలమూరు–రంగారెడ్డి, దిండి ఎత్తిపోతల చేపట్టింది. నెట్టెంపాడు, బీమా, కోయిల్‌సాగర్ ఎత్తిపోతలతో పాటు పలు మార్గాల ద్వారా రోజుకు కృష్ణాజలాలు శ్రీశైలం చేరుకోక మునుపే రోజుకు 8 టీఎంసీలు ఎత్తిపోసుకునేలా తెలంగాణ ప్రభుత్వం ప్రాజెక్టులు నిర్మించింది. ఇదే క్రమంలో కర్ణాటకలోని ఆల్మట్టి డ్యాం సామర్థ్యం కూడా 129 టీఎంసీల నుంచి, 229 టీఎంసీలకు పెంచేందుకు అక్కడి సర్కారు ఉపక్రమించింది. ఈ పరిణామాల నేపథ్యంలో 'సీమ' ఎడారిగా మారే పరిస్థితి. పైగా శ్రీశైలంలో 854 అడుగుల నీటి మట్టం ఉంటేనే పోతిరెడ్డిపాడు నుంచి 44వేల క్యూసెక్కులు తీసుకోవచ్చు! అంతకు తక్కువ ఉంటే పూర్తిస్థాయి నీటిని తీసుకోలేం. 854 అడుగుల కంటే ఒక అడుగు తక్కువ ఉన్నా పోతిరెడ్డిపాడు నుంచి ఒక చుక్క నీరు అందదు. ఈ మొత్తం పరిణామాలను నిశితంగా పరిశీలించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మనకు రావల్సిన నీటిని 800 అడుగుల నుంచే తీసుకునేలా పోతిరెడ్డిపాడు దిగువన 'రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని' చేపట్టి నీటిని పోతిరెడ్డిపాడు కాలువలో ఎత్తిపోసేలా పనులు చేపట్టారు. దీంతో శ్రీశైలం నీటి మట్టం 854 అడుగులకు చేరుకోకపోయినా, తెలంగాణ 800 అడుగుల నుంచే ఎత్తిపోసినా మనం భయపడాల్సిన పనిలేదు. ఎందుకంటే మనం కూడా 800 అడుగుల నుంచే మనకు హక్కుగా రావల్సిన నీటిని దక్కించుకోవచ్చు. ఈ కారణంతోనే రాయలసీమ ఎత్తిపోతలకు జగన్ శ్రీకారం చుట్టారు.

తెలంగాణ టీడీపీ సానుభూతిపరులతో కోర్టులో కేసులు

రాయలసీమ ఎత్తిపోతలను రూ.3,850 కోట్ల అంచనాతో 2020 మే 5న అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే జగన్‌మోహన్‌రెడ్డికి పేరు వస్తుందని, తన రాజకీయ మనుగడ ప్రమాదంలో పడుతుందనే విద్వేషంతో చంద్రబాబు నాయుడు తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లాలోని టీడీపీ సానుభూతి పరులతో ఎన్జీటీ(నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్)లో కేసులు వేయించారు. ఎన్జీటీ అనుమతి తీసుకున్న తర్వాతే పనులు చేపట్టాలని 2020 అక్టోబర్ 29న ఏపీ ప్రభుత్వాన్ని ఎన్జీటీ ఆదేశించింది. అయితే తెలుగుగంగ, గాలేరు–నగరి, ఎస్సార్బీసీ ప్రాజెక్టులకు ఎన్జీటీ అనుమతి ఉందని, ఆ ప్రాజెక్టుల కిందే చేపడుతున్న రాయలసీమ ఎత్తిపోతలకు మళ్లీ అనుమతులు తీసుకోవాల్సిన అవసరం లేదని ట్రిబ్యునల్‌లో అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గట్టిగా వాదించింది. ఓవైపు ఎన్జీటీ అనుమతుల కోసం యత్నిస్తూనే మరోవైపు పనులు ఆపకుండా పరుగులు పెట్టించింది. 2024 మే వరకు వేగంగా పనులు జరిగాయి. అప్పటికి రూ.990 కోట్ల విలువైన పనులకు ప్రభుత్వం బిల్లులు చెల్లించింది.

బాబు ముఖ్యమంత్రి కావడమే 'సీమ'కు శాపమా?!:

2024 మే వరకూ జరిగిన పనులు ఆ తర్వాత జూన్‌లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశాక గ్రహణం పట్టింది. చంద్రబాబు సీఎం అయ్యాక 2025 జనవరి 1న కేంద్ర అటవీ, పర్యావరణశాఖ ఈఏసీ (ఎక్సపర్ట్ అప్రైజల్ కమిటీ) ఏపీ జలవనరులశాఖ అధికారులతో సమావేశం నిర్వహించింది. రాయలసీమ ఎత్తిపోతల ఆవశ్యకతపై సమర్థంగా వాదనలు వినిపించడంలో ప్రభుత్వం విఫలమైంది. కేంద్ర అటవీ, పర్యావరణశాఖ అడిగిన సమాచారాన్నీ 2025 ఫిబ్రవరి 27న నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వలేదు. ఈ నేపథ్యంలోనే ఈ ఏడాది జనవరి 4న తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఆ రాష్ట్ర అసెంబ్లీలో ప్రసంగిస్తూ 'చంద్రబాబుతో ఏకాంతంగా జరిగిన సమావేశంలో రాయలసీమ ఎత్తిపోతలను ఆపాలని అడిగానని, తన కోరికను ఆయన మన్నించారని తమ మధ్య జరిగిన చీకటి ఒప్పందాన్ని బట్టబయలు చేశారు. దీంతో బాబు వక్రబుద్ధి బయట పడింది.

చంద్రబాబు సర్కారు వితండవాదం

రేవంత్, చంద్రబాబు చీకటి ఒప్పందం బట్టబయలు కావడంతో ఆత్మరక్షణలో పడిన చంద్రబాబు సర్కారు వితండవాదానికి దిగింది.. శ్రీశైలంలో 840 అడుగుల దిగువన 34 టీఎంసీలే ఉంటాయని, అందులో ఏపీ వాటా 22 టీఎంసీలేనని, ఆ నీటిని తరలించేందుకు రాయలసీమ ఎత్తిపోతల అవసరం లేదని ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల ఉన్నాయని మంత్రి నిమ్మల రామానాయుడుతో ప్రకటన చేయించింది. ఈ వాదన పూర్తిగా అవాస్తవమని సాగునీటి రంగ నిపుణులూ స్పష్టం చేస్తున్నారు.

ప్రభుత్వం కళ్లు తెరిపించేందుకు రేపే చలో పోతిరెడ్డిపాడు

'సీమ'కు చంద్రబాబు చేస్తున్న తీరని ద్రోహంపై వైఎస్సార్ సీపీ పోరాటం చేపట్టింది. ఈ నేపథ్యంలో గురువారం చలో పోతిరెడ్డిపాడు కార్యక్రమానికి పిలుపునిచ్చింది. ఉమ్మడి కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు, నెల్లూరు జిల్లాల వైఎస్సార్‌సీపీ నేతలు, శ్రేణులు, ప్రజలు, మేధావులు, నిపుణులు, ప్రజాసంఘాల నేతలు, సీమ రైతులు ఈ కార్యక్రమానికి భారీగా తరలిరానున్నారు. ఈ క్రమంలో చలో పోతిరెడ్డిపాడు పోస్టర్లను వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలు అన్ని నియోజకవర్గాల్లో ఆవిష్కరించారు.

చంద్రబాబు అస్తవ్యస్త పాలనతో ఆర్థిక విస్ఫోటనం

- 20 నెలల్లోనే రాష్ట్ర ప్రజలపై రూ.3.27 లక్షల కోట్ల అప్పుల భారం
- ఎక్కడ అప్పు పుడితే అక్కడ తేవడమే లక్ష్యంగా చంద్రబాబు పాలన
- మంగళవారం మరో రూ.3,300 కోట్ల అప్పు
- దీంతో బడ్జెట్ పరిధిలోని అప్పులే రూ.1,79,168 కోట్లకు చేరిక
- బడ్జెట్ బయట అప్పులు మరో రూ.1.48 లక్షల కోట్లు
- అయినా సూపర్ సిక్స్ అమలు చేయడం లేదు..
- ప్రభుత్వ ఆస్తుల కల్పన లేనే లేదు
- అప్పు తెచ్చిన మొత్తం తమ జేబుల్లోకి మళ్లించుకుంటున్న ప్రభుత్వ కీలక నేతలు



సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు సర్కారు ఆర్థిక నిర్వహణ వైఫల్యంతోపాటు అస్తవ్యస్త పాలనతో రాష్ట్రం ఆర్థిక విధ్వంసం దిశగా పయనిస్తోంది. రెండేళ్లు కూడా కాకుండానే రాష్ట్రాన్ని చంద్రబాబు రుణ విస్ఫోటనంలోకి నెట్టేశారు. ఎక్కడ దొరికితే అక్కడ అప్పు తేవడమే లక్ష్యంగా చంద్రబాబు పాలన కొనసాగుతోంది. అప్పు తెచ్చిన డబ్బులను సూపర్ సిక్స్‌తోపాటు ప్రజలకిచ్చిన హామీల అమలుకు ఖర్చు చేయడం లేదు. అలాగే ప్రభుత్వ ఆస్తుల కల్పనకు వ్యయం చేయడం లేదు. అప్పు తెచ్చిన సొమ్ము మొత్తం తమ జేబుల్లోకి వచ్చేలా ప్రభుత్వంలోని కీలక నేతలు మళ్లించేస్తున్నారు. చంద్రబాబు 2024లో ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి కేవలం 20 నెలల్లోనే రాష్ట్ర ప్రజలపై ఏకంగా రూ.3,27,725 కోట్ల అప్పుల భారాన్ని మోపారు. అంటే... సగటున నెలకు రూ.16,386 కోట్లు, రోజుకు రూ.546.20 కోట్లు చొప్పున అప్పు చేస్తున్నారు. బడ్జెట్ బయట అప్పులు చేసేందుకు కొత్తగా కార్పొరేషన్లను, స్పెషల్ పర్పస్ వెహికల్స్(ఎస్‌పీవీలు) ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ఖజానా ఆదాయాన్ని వాటికి మళ్లించి మరీ రాజ్యాంగ సూత్రాలు, నియమావళికి విరుద్ధంగా చంద్రబాబు సర్కారు గ్యారెంటీలు ఇస్తూ అప్పుల మీద అప్పులు చేస్తోంది. సహజ సంపద అయిన గనులను తాకట్టుపెట్టడంతోపాటు మద్యం ఆదాయాన్ని తనఖా పెట్టి మరీ అప్పు చేస్తోంది. మరోవైపు ప్రభుత్వ భూములను, వివిధ సంస్థల ఆస్తులను సైతం తాకట్టు పెట్టి దొరికిన చోటల్లా అప్పులు తీసుకుంటోంది.

మళ్లీ రూ.3,300 కోట్ల అప్పు

మంగళవారం ప్రభుత్వ సెక్యూరిటీలను వేలం వేయడం ద్వారా ఆర్‌బీఐ 7.71 శాతం వడ్డీతో రూ.3,300 కోట్ల అప్పును రాష్ట్ర ప్రభుత్వానికి సమీకరించింది. దీంతో బడ్జెట్ అప్పులే రూ.1,79,168 కోట్లకు చేరాయి. ఇవికాక బడ్జెట్ బయట అప్పులు మరో రూ.1,48,557 కోట్లకు చేరాయి. ఇందులో వివిధ కార్పొరేషన్ల ద్వారా ప్రభుత్వ గ్యారెంటీతో తెచ్చిన అప్పులు రూ.1,01,170 కోట్లు. రాజధాని పేరుతో చేస్తున్న అప్పులు రూ.47,387 కోట్లకు చేరాయి. దీంతో రెండేళ్లు కాకుండానే రాష్ట్రాన్ని రూ.3,27,725 కోట్ల అప్పుల ఊబిలో చంద్రబాబు సర్కారు ముంచేసింది.

ఏపీ అమరావతి రెవెన్యూ ఎంప్లాయీస్ జేఏసీ ఆవిర్భావం

చైర్మన్‌గా భూపతిరాజు రవీంద్ర ఎన్నిక

సమావేశంలో పాల్గొన్న జేఏసీ నాయకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏపీ అమరావతి రెవెన్యూ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఏర్పాటైంది. మంగళవారం విజయవాడలో జరిగిన సమావేశంలో జేఏసీ ఏర్పాటు చేసి కమిటీని ఎన్నుకున్నారు. జేఏసీ చైర్మన్‌గా భూపతిరాజు రవీంద్ర, వైస్ చైర్మన్‌గా నల్లిపోగు నాగేశం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని రెవెన్యూ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం దిశగా ఒక ఐక్య ఉద్యమ కార్యాచరణను రూపొందించేందుకు జేఏసీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని రకాల ఉద్యోగులకు ఒకే ఉద్యమ కార్యాచరణ ఉండాలనే ఉద్దేశంతో జేఏసీ ఏర్పాటు చేశామన్నారు. త్వరలో అన్ని జిల్లాల్లో రెవెన్యూ జేఏసీ కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు.

STAR HEMATOLOGY CENTRE
World Cancer Day 4 February
STAR CANCER CENTRE

క్యాన్సర్ ఎదుర్కోవడానికి మనం ఎంతవరకు సిద్ధంగా ఉన్నాము?
ప్రతి ఒక్కరూ తప్పక తెలుసుకోవాల్సిన విషయాలు

క్యాన్సర్ అనేది ఇప్పుడు రహస్యంగా ఉండాల్సిన అంశం కాదు. ఇది మన కుటుంబాల్లో, కార్యాలయాల్లో, పొరుగువారిలో కనిపిస్తోంది. గతంలో కంటే ఇప్పుడు ఎక్కువగా యువతలో కూడా ఈ వ్యాధి పెరుగుతోంది. అయితే, క్యాన్సర్ అంటే ఇకపై "ఖచ్చితమైన మరణ శాసనం కాదు". ముఖ్యంగా ముందస్తుగా గుర్తించి, సరైన నైపుణ్యంతో చికిత్స అందిస్తే, ఇది నయం చేయగల మరియు నియంత్రించగల వ్యాధి. అసలు ప్రశ్న ఏమిటంటే: క్యాన్సర్‌ను ఎదుర్కోవడానికి మనం ఎంత సిద్ధంగా ఉన్నాము?

స్టార్ హాస్పిటల్స్‌లోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అయిన స్టార్ క్యాన్సర్ సెంటర్ నమ్మేది ఏంటంటే, సంసిద్ధత భయాందోళనకు మరియు ధైర్యానికి మధ్య, అలాగే వ్యాధి ముదిరిన దశలో పడే ఇబ్బందులకు మరియు ప్రారంభ దశలో పొందే స్వస్థతకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని చూపిస్తుంది.

భారతదేశంలో క్యాన్సర్: మనం నమ్మలేని గణాంకాలు

GLOBOCAN 2020 (IARC/WHO) ప్రకారం, భారతదేశంలో ఏడాదికి సుమారు 13.2 లక్షల కొత్త క్యాన్సర్ కేసులు మరియు సుమారు 8,50,000 మరణాలు నమోదవుతున్నాయి. ఇప్పటికీ చాలా మంది రోగులు స్టేజ్ 3 లేదా స్టేజ్ 4లో ఆసుపత్రికి వస్తున్నారు. ఆ సమయంలో చికిత్స మరింత సంక్లిష్టంగా, ఖరీదైనదిగా మరియు మానసికంగా భారంగా మారుతుంది.

యువతపై క్యాన్సర్ పంజా

క్యాన్సర్ ఇప్పుడు కేవలం వయస్సు పైబడిన వారికి మాత్రమే పరిమితం కాలేదు. 20, 30 మరియు 40 ఏళ్ల వయస్సు గల వారిలో కూడా క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయి. ప్రస్తుతం ఈ ముప్పు వయస్సు మీద కాకుండా జీవనశైలి మీద ఆధారపడి ఉంది.

ప్రధాన కారణాలు: పొగాకు (నమలడం మరియు ధూమపానం), మద్యం, ఊబకాయం, వ్యాయామం లేకపోవడం, ప్రాసెస్ చేసిన ఆహారాలు, ఒత్తిడి, నిద్రలేమి, కాలుష్యం, HPV ఇన్ఫెక్షన్లు మరియు వంశపారంపర్య కారణాలు ప్రధానంగా ఉన్నాయి.

ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా తెలుసుకోవలసినవి:

1. ముందస్తు గుర్తింపు ప్రాణరక్ష: కారణం లేకుండా బరువు తగ్గడం, నిరంతరాయంగా వచ్చే దగ్గు, మల/మూత్ర విసర్జనలో రక్తం పడటం, మానని పుండ్లు, అసాధారణ గడ్డలు, అసాధారణ రక్తస్రావం, మింగడంలో ఇబ్బంది మరియు విపరీతమైన నీరసం వంటి సంకేతాలను ఎప్పుడూ విస్మరించకూడదు.
2. స్క్రీనింగ్ తప్పనిసరి: ముఖ్యంగా రొమ్ము, గర్భాశయ, కొలొరెక్టల్ మరియు నోటి క్యాన్సర్ల కోసం క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలి.
3. అవయవ-నిర్దిష్ట సంరక్షణ క్యాన్సర్ చికిత్స అనేది ఆయా అవయవాలపై లోతైన అవగాహన ఉన్న నిపుణుల నేతృత్వంలో జరగాలి.

స్టార్ క్యాన్సర్ సెంటర్ ప్రత్యేకతలు

స్టార్ క్యాన్సర్ సెంటర్ ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల్లో అత్యాధునిక సాంకేతికతతో వైద్య ప్రమాణాలను పెంచుతోంది.

అధునాతన సాంకేతికత: TrueBeam లీనియర్ యాక్సిలరేటర్, డిజిటల్ PET-CT, 128-స్లైస్ CT, 3 టెస్లా MRI మరియు రోబోటిక్ సర్జరీ.

ప్రత్యేక సేవలు: మల్టీడిసిప్లినరీ ట్యూమర్ బోర్డ్, BMT/స్టెమ్ సెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్, CAR T-Cell థెరపీ, జెనెటిక్ క్యాన్సర్ క్లినిక్ మరియు అవయవ-సంరక్షణ ప్రోగ్రామ్‌లు.

హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ మరియు నానక్‌రామ్ గూడలో ఉన్న స్టార్ హాస్పిటల్స్, ప్రపంచ స్థాయి క్యాన్సర్ చికిత్సను మీకు అందుబాటులోకి తెస్తోంది. క్యాన్సర్‌కు భయం అవసరం లేదు, సరైన చికిత్స మరియు అంకితభావం కలిగిన బృందం తోడుంటే చాలు.

Advertisement

STAR HOSPITALS
Expertise • Excellence • Empathy
Financial District, Hyderabad.
అపాయింట్‌మెంట్ల కోసం: 07969 250 191

బాగా వెన'కేసు'కుంటున్నారు!

- సొంత కేసులు వాదించిన లాయర్లకు ప్రజాధనం దోచిపెడుతున్న చంద్రబాబు
- పోసానికి కేసుకు రూ.3 లక్షల చొప్పున 17 కేసులకు రూ.51 లక్షలు చెల్లింపు
- గతంలో రూ.1.26 కోట్లు.. వెరసి రూ.1.77 కోట్లు..
- లూథ్రాకు ఇప్పటి వరకు రూ.10.54 కోట్లు చెల్లించిన సర్కారు

సాక్షి, అమరావతి: రాజకీయ కేసుల్లో తన ఆస్థాన న్యాయవాదులకు కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ఫీజుల కింద దోచిపెట్టడాన్ని చంద్రబాబు ప్రభుత్వం కొనసాగిస్తూనే ఉంది. ఒకవైపు సిద్ధార్థ లూథ్రాకు కోట్ల రూపాయలు ఫీజుల కింద చెల్లిస్తున్న చంద్రబాబు ప్రభుత్వం, మరోవైపు టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లుకూ ఫీజుల చెల్లింపు పరంపరను కొనసాగిస్తూనే ఉంది. వివిధ రాజకీయ కేసుల్లో పోసాని వెంకటేశ్వర్లుకు ప్రభుత్వం ఇప్పటికే రూ.1.26 కోట్లు చెల్లించగా, తాజాగా మద్యం అక్రమ కేసులో సీఐడీ తరఫున వాదనలు వినిపించినందుకు రూ.51 లక్షలు చెల్లించింది. ఆయనకు ఒక్కో కేసుకు రూ. 3 లక్షల చొప్పున మొత్తం రూ.51 లక్షలు చెల్లించింది. 7 క్రిమినల్ వ్యాజ్యాల్లో వాదనలు వినిపించినందుకు రూ.3 లక్షల చొప్పున రూ.21 లక్షలు చెల్లించింది. మరో 10 రిట్ పిటిషన్లలో రూ.3 లక్షల చొప్పున రూ.30 లక్షలు ప్రభుత్వం చెల్లించింది. మద్యం కేసులతో సంబంధం లేని సర్వీసు వివాదానికి సంబంధించిన వ్యాజ్యంలో పోసాని వాదనలు వినిపించకపోయినా ఆయనకు రూ.3 లక్షలు ఇచ్చింది. మరో కేసులో అసిస్టెంట్ పీపీ, హోంశాఖ ప్రభుత్వ న్యాయవాది హాజరైన కేసులో కూడా పోసానికి రూ. 3 లక్షలు చెల్లించింది. వాస్తవానికి ఈ కేసుల్లో సీఐడీ తరఫున ఒకవైపు సిద్ధార్థ లూథ్రా, మరోవైపు పోసాని వెంకటేశ్వర్లు ఇద్దరికీ ప్రభుత్వం ఫీజులు చెల్లిస్తుండటం గమనార్హం. మద్యం కేసులతో సహా ఇతర రాజకీయ కేసులకు చంద్రబాబు ప్రభుత్వం లూథ్రాకు ఇప్పటి వరకు రూ.10.54 కోట్లు చెల్లించిన విషయం తెలిసిందే.

జనసేనకు బొలిశెట్టి రాజీనామా



సాక్షి, అమరావతి: కూటమిలో జరుగుతున్న పరిణామాలు, పొత్తులు, పదవుల విషయంలో జనసేన కోసం పనిచేసిన వారికి అన్యాయం జరుగుతోందంటూ ఇటీవల వీడియో విడుదల చేసిన జనసేన ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ మంగళవారం పార్టీ పదవులకు రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. రాష్ట్రంలో కాలుష్యానికి సంబంధించి దాఖలైన ఒక ప్రధాన పర్యావరణ ప్రజా ప్రయోజన వ్యాజ్యంలో తానే పిటిషనర్‌గా ఉన్నానన్నారు. ప్రస్తుతం జనసేన పార్టీ ఎన్డీయే ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉండడం, పార్టీ అధ్యక్షులు పవన్ పర్యావరణ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తుండడంతో స్వచ్ఛమైన నీరు, గాలి కోసం జరుగుతున్న న్యాయ పోరాటం ప్రభావితం కాకూడదని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. గతంలో ఆయన 'పవన్‌కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రి అయ్యాక 3400 మంది జనసేన నాయకులకు పోస్టులు వచ్చాయంటే, మాకే ఆశ్చర్యమేసింది. ఇంతమందికి వచ్చాయా అని.. నిజంగా వస్తే సంతోషమే. అందులో ఎంతమంది జనసేన నాయకులు ఉన్నారో కూడా చూడాలి.. ఎందుకంటే అందులో పొరపాట్లు జరిగాయన్నది వాస్తవం. చాలామంది పదవులిచ్చిన వారి పేర్లకు జనసేన అని పెట్టారు.. తప్పు.. వాళ్లు జనసేన పార్టీ కోసం ఎప్పుడూ పనిచేసిన వారు కాదు'' అంటూ వీడియో విడుదల చేసిన విషయం విదితమే.

NISM National Institute of Securities Markets
A Capacity Building Initiative of SEBI

Learn Today..
Lead Tomorrow...
Academic programs offered:

Applications Open Now

Residential program
AICTE-approved 2-Year Full-time Program
Post Graduate Diploma in Management (Securities Markets) PGDM(SM)
1-Year Full-time Program
LL.M (Investment & Securities Laws)
Jointly offered by NISM and MNLU Mumbai
1-Year Full-time Program
Post Graduate Program in Investments & Securities Markets
1-Year Full-time Program
Post Graduate Certificate in Securities Markets
Jointly offered by NISM and ICICI Bank

Non-Residential program
1-Year Weekend Program | Online mode
Post Graduate Program in Financial Planning
Jointly offered by NISM and FPSB INDIA
15-Months, Weekend Program (Hybrid Mode)
Post Graduate Program in Securities Market (Portfolio Management/Investment Advisory/Research Analysis)
6-Months Duration | Online Live Classes
Certificate Program in Data Science (Basic)
8-Months Duration | Online Live Classes
Certificate Program in Data Science (Advance)
10-Months | Online Live Classes
Post Graduate Certificate in FinTech
Jointly offered by NISM and NSE Academy

SCAN HERE
Experiential Learning
Bloomberg Finance Lab | Data Science Lab | Trading Simulation Lab
For more details contact or visit:
+91-82680 02412
www.nism.ac.in/long-term-programs
NISM Campus: Plot No. IS 1 & IS 2, Patalganga Industrial Area, Mohopada, Rasayani, Dist. Raigad, Near Navi Mumbai, Maharashtra – 410222.

కోపాన్ని ఆపుకోలేకపోవటం అంటే,
వేరొకరిపై విసిరే ఉద్దేశంతో నిప్పు కణికను
పట్టుకోవటం లాంటిది. మీ చెయ్యే కాలిపోతుంది.
– బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, 4 ఫిబ్రవరి 2026

హింసన చణ... ధ్వంస రచన!

సుప్రసిద్ధ కథా, నవలా రచయిత రావి శాస్త్రి అయిదు దశాబ్దాల క్రితం 'సొమ్ములు పోనాయండి' అనే నవలిక రాశారు. ఊరి ప్రెసిడెంట్ కుట్రలకు బలైన ఒక సామాన్యుడి స్వీయ కథనమది. అతని కుటుంబాన్ని కడతేర్చిన ప్రెసిడెంట్‌ను వదిలి, వ్యవస్థలన్నీ ఏకమై ఆ సామాన్యుడికే నరకం చూపిన వైనం అందులో కనబడుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి పాలన ఏణ్ణర్థంగా అచ్చం అదే రీతిలో సాగుతోంది. తిరుమల లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిసిందంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేసిన దుష్ప్రచారం బూటకమని సీబీఐ నివేదిక తేల్చినప్పటి నుంచీ ఆ అరాచకం మరిన్ని రెట్లు పెరిగింది. ఎప్పటిలాగే లడ్డూ ప్రసాదం స్వచ్ఛంగా ఉన్నదనీ, కొవ్వెక్కిన ఈ మాయగాళ్ల పుర్రెలే వికృత పోకడలకు పోయాయనీ ప్రజలకు తేటతెల్లమైనప్పటి నుంచీ అధికార ముఠాకు కాళ్లూ చేతులూ ఆడటం లేదు. ఆ పర్యవసానంగానే రోడ్లపైకొచ్చి దుర్భాషలతో, దుశ్చేష్టలతో రెచ్చిపోతున్నారు. హంతక దాడులకు తెగిస్తున్నారు. గృహ దహనాలకు పాల్పడుతున్నారు. 'మళ్లీ మళ్లీ వస్తాం... అంతు తేలుస్తాం'టూ సవాళ్లు విసురుతున్నారు. సీబీఐ నివేదికను వక్రీకరిస్తూ ఫ్లెక్సీలతో జనాన్ని ఏమార్చాలనుకుంటున్నారు. గుంటూరు నడిబొడ్డున తెలుగుదేశం మహిళా ఎమ్మెల్యే, ఆమె భర్త వందలాది మంది గూండాలను పోగేసి కర్రలు, రాడ్లతో వీధిన పడి మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అంబటి రాంబాబు ఇంటిపై దాడికి దిగిన వైనం మీడియా సాక్షిగా ప్రపంచమంతా చూసింది. రక్షక భటులు భయభక్తులతో వారికి కాపలాగాసిన సంగతినీ అందరూ గమనించారు. ఆ మర్నాడు ఇబ్రహీంపట్నంలో అదే పునరావృతమైంది. తొలినాడు ఎంత విధ్వంసం చేసినా, వైఎస్సార్ కాంగ్రెస్ కార్యాలయం తగలబెట్టడానికి కష్టపడాల్సి వచ్చిందని కాబోలు... ఇబ్రహీంపట్నంలో మరో మాజీ మంత్రి జోగి రమేష్ ఇంటిపైకి పెట్రోల్ బాంబులతో వచ్చారు. బండరాళ్లు విసిరారు. నిప్పుపెట్టారు. గుంటూరు నగర పోలీసుల మాదిరే ఇక్కడా ఈ కిష్కింధకాండకు పోలీసులు రక్షణగా నిలబడ్డారు. ఇదా ప్రజాస్వామ్యం?!

పిల్లనిచ్చిన మామ పాలిటే కాదు... ఆంధ్రప్రదేశ్‌కు కూడా దశమ గ్రహంలా దాపురించి, తొండ ముదిరి ఊసరవెల్లి అయినట్టు వయసుడిగిన ఈ కాలంలో కూడా బాహాటంగా తన వికృత నైజాన్ని ప్రదర్శించటం చూసి జనం విస్తుపోతున్నారు. జర్నలిస్టు పింగళి దశరథరామ్, కాపు నాయకుడు వంగవీటి మోహన రంగా తదితరుల మరణాలకు కారకులెవరో... ఇప్పుడు టీడీపీలోనే ఉన్న సీనియర్ నాయకుడు కన్నా లక్ష్మీనారాయణపై ఒకానొకప్పుడు హంతక దాడికి తెగించిందెవరో... అందరికీ తేటతెల్లమే. సాక్షాత్తూ మాజీమంత్రి డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావే తోడల్లుడి హింసన చణనూ, ధ్వంస రచననూ పూసగుచ్చినట్టు వివరించారు. కొన్నేళ్ల క్రితం తగలబడిన వందలాది ఆర్టీసీ బస్సులు, పదేళ్లనాడు అమరావతిలో దగ్ధమైన అరటి తోటలు ఆ ప్రావీణ్యాన్ని కథలు కథలుగా చెబుతాయి.

అవిభక్త ఏపీలో 1995 తర్వాత సకల వ్యవస్థలూ భ్రష్టుపట్టడానికి కారకులెవరో అందరికీ తెలుసు. కెమెరా లేదనుకుని సాక్షాత్తూ స్వర్గీయ ఎన్టీఆర్‌నే 'వాడూ...వీడూ' అని తూలనాడిన ఘనుడు బాబు నుంచి పుత్రరత్నమైనా, మరొకరైనా నేర్చుకునే సంస్కృతి ఏముంటుంది? ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేయదు. అందుకే గుడికెళ్లి వస్తున్న అంబటిపై బూతులు లంకించుకొని రెచ్చగొట్టి, ఆయన తిరిగి తిట్టారని రెచ్చిపోయింది టీడీపీ ముఠా. సంస్కారం ఉంది గనుక క్షమించమని అడిగారాయన. ఆ మాట వెనక్కి తీసుకుంటున్నానన్నారు. కానీ పాపం పెరిగినట్టు పెరిగిన ఆ ముఠా అర్ధరాత్రి దాకా అల్లకల్లోలం సృష్టించింది. చివరకు అంబటినే ఖైదు చేయించింది. ఎంత విడ్డూరం?!

ఏం జరుగుతోంది ఏపీలో? ప్రశ్నించే తత్వాన్ని హత్యాయత్నాలతో, విధ్వంసాలతో చంపేస్తారా? ఈవీఎంల సాయంతో అధికారాన్ని చేజిక్కించుకున్న అరాచకులు ఇక మారరా? ఇదే వారి నిర్ణయమైతే జనమే తొక్కి నార తీస్తారు. అదునుచూసి గుణపాఠం చెబుతారు. ప్రజాస్వామ్యంలో నారావారైనా, వేరేవారైనా ఇందుకు ఎలాంటి మినహాయింపులూ ఉండవు.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** బ.తదియ రా.1.54 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** పుబ్బ రా.12.11 వరకు, తదుపరి ఉత్తర, **వర్జ్యం:** ఉ.8.01 నుండి 9.36 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.52 నుండి 12.36 వరకు, **అమృత ఘడియలు:** సా.5.42 నుండి 7.20 వరకు.

సూర్యోదయం : 6.36
సూర్యాస్తమయం : 5.53
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

సోషల్ టాక్

లేనట్లే!

మీరు ఇప్పటికీ మీ పదేళ్ల క్రిందటి వ్యక్తే అయితే, మీరు తగినంతగా జీవించలేదని అర్థం. మీరున్న రంగం సినిమా అయినా, సామాజిక సేవ అయినా, వేరొకటైనా... మీలో ఎదుగుదల ఉండాలి. అది లేనప్పుడు మీరు చేసింది కూడా ఏమీ లేనట్లే!

– ఊర్మిళా మాతోండ్కర్, నటి

తెచ్చుకోండి!

జరగరానిది జరిగినప్పుడు త్వరగా తేరుకోండి. అలాంటిది జరిగిపోయినందుకు స్థిమితంగా ఉండండి. కోల్పోవటం అంటే ప్రపంచం అంతమై పోవటం కాదు. అంతకు ముందు మీకున్న జీవితాన్ని వెతుక్కుని మళ్లీ వెనక్కి తెచ్చుకోండి.

– రవీందర్ సింగ్, రచయిత

ప్రవాహం

సంప్రదాయ నృత్య రీతులను మిళితం చేస్తున్నానని నా మీద విమర్శలు వచ్చాయి. సంప్రదాయం నిశ్చలమైన చెరువు కాదు. ప్రవహించే నది. దానిని స్వేచ్ఛగా కదలనివ్వాలి. అప్పుడే అది తన సారాన్ని కోల్పోకుండా సజీవంగా ఉంటుంది.

– పద్మా సుబ్రహ్మణ్యం (82), నర్తకి

మైదానం

మీ కెరీర్‌లోని ప్రారంభ దశల్లోనే మీరు అత్యంత కఠినమైన సమయాలను ఎదుర్కోవలసి రావటం నిజానికి మంచి విషయం. అస్థిరత అనేది నేర్చుకోవటానికి, బలంగా మారటానికి మీకు తోడ్పడుతుంది. వైఫల్యాలు విజయానికి శిక్షణా మైదానాలు.

– కుశాగ్ర బజాజ్, బజాజ్ గ్రూప్ ఛైర్‌పర్సన్

పాఠాలు

జీవితం అన్నది మీరు హాజరు కాగల అత్యుత్తమ పాఠశాల. ఏ పాఠ్యపుస్తకమూ అందించని పాఠాలను ఆ పాఠశాల మీకు బోధిస్తుంది. ఇక నేనైతే, 'విపత్తుల విశ్వవిద్యాలయం' నుంచి పట్టభద్రుడినయ్యాను. జీవితం గురించి నేను నేర్చుకున్నదంతా అక్కడే!

– పి. విజయన్, కేరళ ఇంటెలిజెన్స్ చీఫ్

మంచిదే!

మీకు ఏమీ తెలియక పోయినా మీరు గొప్ప విజయాలను సాధించే అవకాశం ఉంది! సంప్రదాయ వ్యాపార పద్ధతుల గురించి అసలేమీ తెలియకపోవటం కూడా ప్రయోజనాన్ని చేకూరుస్తుంది. ఎందుకంటే, మీ నియమాలు మీరే రాసుకుంటారు.

– గౌతమ్ హరి సింఘానియా, రేమండ్ సీఎండీ

రాష్ట్రం కన్నా స్వలాభమే మిన్నా?

కృష్ణా, గోదావరి, వంశధార నదీ జలాలపై రాష్ట్ర హక్కుల పరిరక్షణ కన్నా స్వప్రయోజనాలే తనకు ప్రధానమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎప్పటికప్పుడు తనకు తానుగానే చాటుకుంటున్నారు. రాయలసీమ ఎత్తిపోతల పథకమే అందుకు నిదర్శనం. ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబుతో ఏకాంతంగా సమావేశమై రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులను ఆపేయించానని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి జనవరి 3న ఆ రాష్ట్ర అసెంబ్లీ సాక్షిగా ప్రకటించారు. వాటిని చంద్రబాబు ఖండించకపోగా... రాయలసీమ ఎత్తిపోతల పథకం అవసరమే లేదంటూ తెగేసి చెప్పడం ద్వారా రేవంత్ చేసిన వ్యాఖ్యలను బలపరిచారు. రేవంత్‌తో కుదిరిన చీకటి ఒప్పందం ప్రకారం రాయలసీమ ఎత్తిపోతల పనులను చంద్రబాబు ఆపేయడంపై రాయలసీమ, నెల్లూరు జిల్లాల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎందుకంటే ఆ ఎత్తిపోతల పూర్తయితే ఆ ప్రాంతాల్లో సాగు, తాగునీటికి ఇబ్బందే ఉండదు. శ్రీశైలం ప్రాజెక్టు గరిష్ఠ నీటి మట్టం 885 అడుగులు. ఆ ప్రాజెక్టులో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌ను 841 అడుగుల వద్ద అమర్చారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా ఎస్సార్బీసీ (శ్రీశైలం కుడి గట్టు కాలువ), తెలుగుగంగ, గాలేరు–నగరి ప్రాజెక్టులకు, చెన్నైకి తాగునీటిని సరఫరా చేయాలి. వాటికి 101 టీఎంసీల నీటి కేటాయింపు ఉంది. ఆ ప్రాజెక్టుల కింద 10.33 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. శ్రీశైలంలో నీటి మట్టం 881 అడుగుల స్థాయిలో ఉన్నప్పుడు మాత్రమే ప్రస్తుత డిజైన్ ప్రకారం పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా రోజుకు 44 వేల

◆ ఆంధ్రప్రదేశ్‌కు చట్టబద్ధంగా దక్కిన వాటా జలాలను వినియోగించుకోవడానికే 2020 మే 5న రూ.3,850 కోట్ల వ్యయంతో అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాయలసీమ ఎత్తిపోతలను చేపట్టారు. కానీ రేవంత్‌తో కుదిరిన చీకటి ఒప్పందం ప్రకారం రాయలసీమ ఎత్తిపోతల పనులను చంద్రబాబు ఆపేయడంపై రాయలసీమ, నెల్లూరు జిల్లాల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

క్యూసెక్కులను తరలించడానికి ఆస్కారం ఉంటుంది. మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో శ్రీశైలానికి వరద వచ్చే రోజులు తగ్గిపోయాయి. 881 అడుగుల స్థాయిలో నీటిమట్టం ఉండే రోజులు బాగా తగ్గాయి. శ్రీశైలంలో నీటిమట్టం 854 అడుగుల స్థాయిలో ఉంటే పోతిరెడ్డిపాడు ద్వారా 7 వేల క్యూసెక్కులు... 841 అడుగుల స్థాయిలో నీటిమట్టం ఉంటే పోతిరెడ్డిపాడు ద్వారా 2 వేల క్యూసెక్కులు మాత్రమే తరలించడానికి ఆస్కారం ఉంటుంది. అంతకంటే నీటిమట్టం తగ్గితే... ఆంధ్రప్రదేశ్‌కు నీటి కేటాయింపులు ఉన్నా సరే పోతిరెడ్డిపాడు ద్వారా ఆయకట్టుకు నీళ్లందించడానికి ఆస్కారం ఉండదు.

వాటా జలాలను వాడుకోవడానికే...

కృష్ణా వరద ప్రవాహం శ్రీశైలం ప్రాజెక్టుకు చేరకముందే జూరాల ప్రాజెక్టు నుంచి నెట్టెంపాడు, బీమా, కోయిల్ సాగర్ ఎత్తిపోతల ద్వారా రోజుకు ఒక టీఎంసీ నీటిని తెలంగాణ సర్కార్ తరలిస్తోంది. శ్రీశైలం ప్రాజెక్టులో 777 అడుగుల నుంచి 825 అడుగుల నీటిమట్టం లోపే కల్వకుర్తి, పాలమూరు–రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల, ఎస్సెల్బీసీ, ఎడమ గట్టు విద్యుత్కేంద్రం ద్వారా రోజుకు 7 టీఎంసీలను తరలించే సామర్థ్యం తెలంగాణకు ఉంది. అంటే... జూరాల, శ్రీశైలం నుంచి రోజుకు 8 టీఎంసీలను తరలించే సామర్థ్యం తెలంగాణకు ఉంది. శ్రీశైలం ప్రాజెక్టులో నీటి వినియోగం తొలి ప్రాధాన్యం తాగునీటికే! ఆ తర్వాత సాగునీరు!!

శ్రీశైలం దిగువన సాగునీటి అవసరాలు ఉన్నప్పుడు... అదీ కృష్ణా బోర్డు అనుమతి ఇచ్చిన మేరకు నీటిని మాత్రమే కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల ద్వారా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ విద్యుదుత్పత్తి చేస్తూ దిగువకు తరలించవచ్చు. కానీ తెలంగాణ సర్కార్ కృష్ణా బోర్డు అనుమతి లేకుండానే... దిగువన నీటి అవసరాలు లేకున్నా సరే... శ్రీశైలంలో 800 అడుగుల నీటి మట్టం దిగువ నుంచే యథేచ్ఛగా విద్యుదుత్పత్తి చేస్తూ దిగువకు నీటిని తరలిస్తూ ప్రాజెక్టును ఖాళీ చేస్తోంది. ఎగువ నుంచి వచ్చిన వరదను వచ్చినట్టుగా తెలంగాణ సర్కార్ తరలిస్తుండటంతో శ్రీశైలం నీటి మట్టం 841 అడుగులకు చేరడంలో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోంది. వరద ప్రవాహం నిలిచిపోయాక కూడా తెలంగాణ సర్కార్ యథేచ్ఛగా నీటిని తరలిస్తుండటంతో శ్రీశైలం నీటి మట్టం 841 అడుగులకు దిగువకు చేరుకుంటోంది. దీని వల్ల ఆంధ్రప్రదేశ్‌కు నీటి కేటాయింపులు ఉన్నా సరే వాటిని వాడుకోలేని దుఃస్థితి. 2014–19

నిలిచిపోయిన రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులు

మధ్య రాయలసీమ, నెల్లూరు జిల్లాల్లో ఆయకట్టుకు నీళ్లందక పంటలు ఎండిపోయి రైతులు తీవ్రస్థాయిలో నష్టపోవడమే అందుకు నిదర్శనం. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రయోజనాలకు ఏమాత్రం విఘాతం కలగనివ్వకుండా... ఆంధ్రప్రదేశ్‌కు చట్టబద్ధంగా దక్కిన వాటా జలాలను వినియోగించుకోవడానికే 2020 మే 5న రూ.3,850 కోట్ల వ్యయంతో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాయలసీమ ఎత్తిపోతలను చేపట్టారు.

ఎత్తిపోతల రైతులకు ఇన్సూరెన్స్ పాలసీ!

శ్రీశైలం ప్రాజెక్టులో 800 అడుగుల నీటిమట్టం నుంచే రోజుకు 3 టీఎంసీల చొప్పున పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ దిగువన ప్రధాన కాలువలోకి ఎత్తిపోసి... ఎస్సార్బీసీ (శ్రీశైలం కుడిగట్టు కాలువ), తెలుగుగంగ, గాలేరు–నగరి ఆయకట్టులో పంటలను రక్షించడం... రాయలసీమ, నెల్లూరు జిల్లాలు, చెన్నైకి తాగునీటిని అందించాలనే లక్ష్యంతో జగన్‌మోహన్ రెడ్డి రాయలసీమ ఎత్తిపోతలను చేపట్టి... పనులను పరుగులెత్తించారు. ఆ ఎత్తిపోతల పూర్తయితే వైఎస్ జగన్‌కు రైతులు నీరాజనాలు పలుకుతారని గ్రహించిన చంద్రబాబు... మహబూబ్‌నగర్ జిల్లాలోని టీడీపీ నేతలను ఉసిగొలిపి అక్కడి రైతుల ద్వారా జాతీయ హరిత ట్రిబ్యునల్(ఎన్జీటీ)లో కేసులు వేయించారు. సీమ ఎత్తిపోతల వల్ల పర్యావరణానికి విఘాతం కలుగుతుందంటూ ఆ కేసులు వేయించారు. తెలుగుగంగ, ఎస్సార్బీసీ, గాలేరు–నగరి ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు ఉన్నాయనీ... ఆ ప్రాజెక్టుల ఆయకట్టుకు నీళ్లందించడానికి చేపట్టిన రాయలసీమ ఎత్తిపోతలకు పర్యావరణ అనుమతి అవసరం లేదనీ ఎన్జీటీలో వైఎస్సార్‌సీపీ సర్కార్ సమర్థవంతంగా వాదనలు వినిపించింది. కానీ... పర్యావరణ అనుమతి తీసుకున్నాకే పనులు చేపట్టాలని 2020 అక్టోబర్ 29న ఏపీ ప్రభుత్వాన్ని ఎన్జీటీ ఆదేశించింది. పర్యావరణ అనుమతి కోసం ప్రయత్నిస్తూనే రాయలసీమ ఎత్తిపోతల పనులను వైఎస్సార్‌సీపీ సర్కార్ పరుగులు పెట్టించింది. మళ్లీ దీనిపై ఎన్జీటీలో చంద్రబాబు కేసులు వేయించారు. వాటిని ఎదుర్కొంటూనే... పర్యావరణ అనుమతి కోసం ప్రయత్నిస్తూనే... తాగునీటి అవసరాల కోసం 58 టీఎంసీలను తరలించేలా రాయలసీమ ఎత్తిపోతల పనులను తొలుత పూర్తి చేయాలని 2023 ఆగస్టు 11న ఉత్తర్వులు జారీ చేసింది. 2024 మే వరకూ పనులు జరిగాయి. వాటిని చేసిన కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించిన ఎం–బుక్కులే అందుకు నిదర్శనం.

రాయలసీమ ఎత్తిపోతల ద్వారా తరలించే నీటిని గాలేరు–నగరి, హంద్రీ–నీవాను అనుసంధానం చేయడం ద్వారా తీసుకెళ్లి చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లోని హంద్రీ–నీవా రెండో దశ ఆయకట్టుకు అందించి... శ్రీశైలం నుంచి హంద్రీ–నీవా ద్వారా తరలించే 40 టీఎంసీలను కర్నూల్, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో ఆయకట్టుకు అందించాలన్నది వైసీపీ సర్కారు ఆలోచన. 2024 జూన్ 12న చంద్రబాబు మళ్లీ సీఎంగా ప్రమాణ స్వీకారం చేశాక రాయలసీమ ఎత్తిపోతల పనులను పూర్తి స్థాయిలో ఆపేశారు. దానికి ప్రధాన కారణం ఏమిటన్నది తెలంగాణ అసెంబ్లీలో ఆ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి కుండబద్దలు కొట్టారు.

రాష్ట్ర ప్రయోజనాలకు ఎప్పుడూ విఘాతమే!

ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి 1995లో చంద్రబాబు తొలిసారిగా అధికార పీఠాన్ని అధిరోహించారు. 1996 లోక్‌సభ ఎన్నికల తర్వాత యునైటెడ్ ఫ్రంట్ ద్వారా కేంద్రంలో చక్రం తిప్పాననీ, అప్పటి కర్ణాటక సీఎం హెచ్‌డీ దేవెగౌడను తానే పీఎంను చేశాననీ చంద్రబాబు పదే పదే గొప్పలు చెప్పుకొంటారు. కానీ... అదే సమయంలో ఆనకట్టగా ఉన్న ఆల్మట్టిని కర్ణాటక రిజర్వాయర్‌గా మార్చేసి... దాని నీటి నిల్వ సామర్థ్యాన్ని 53 నుంచి 129 టీఎంసీలకు పెంచేసినా నోరు మెదపకుండా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కృష్ణా జలాలపై ఉన్న హక్కులను కర్ణాటకకు చంద్రబాబు తాకట్టు పెట్టారు. ఆల్మట్టి సామర్థ్యం పెంచడం వల్ల శ్రీశైలానికి జూన్ నెలాఖరుకు రావాల్సిన వరద జూలై చివరకు... ఆగస్టు మొదటి వారానికి గానీ రావడం లేదు. దాంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణా జలాలపై ఆధారపడ్డ ప్రాజెక్టుల రైతులకు తీవ్రంగా నష్టం వాటిల్లింది.

ఇక బచావత్ ట్రిబ్యునల్ అవార్డు కాలపరిధి 2000తో ముగుస్తుందనీ, కృష్ణా జలాల పంపిణీకి కొత్త ట్రిబ్యునల్ వేస్తారనీ, ఆంధ్ర ప్రాంతంలో వెలిగొండ, గాలేరు–నగరి, హంద్రీ–నీవా, తెలంగాణలో కల్వకుర్తి, నెట్టెంపాడు, ఎస్సెల్బీసీ వంటి ప్రాజెక్టులను చేపడితే వాటికి నీటి కేటాయింపులను ట్రిబ్యునల్ చేస్తుందనీ అప్పటి సీఎం చంద్రబాబుకు జలవనరుల శాఖ అధికారులు, సాగునీటిరంగ నిపుణులు అనేక మార్లు విజ్ఞప్తులు చేశారు. కానీ వాటిని పట్టించుకోలేదు. అప్పట్లో వాటిని చేపట్టి ఉంటే... తెలుగు గంగకు 25 టీఎంసీలు కేటాయించినట్లే ఆ ప్రాజెక్టులకు కూడా బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ నీటి కేటాయింపులు చేసేది.

పోలవరం రిజర్వాయర్ కాదు బ్యారేజే!

గోదావరి ట్రిబ్యునల్ అవార్డు అనుమతి ఇచ్చిన మేరకు 45.72 మీటర్ల గరిష్ఠ నీటిమట్టంతో పోలవరం ప్రాజెక్టును 2005లో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి చేపట్టారు. ఆ స్థాయిలో నీటిని నిల్వ చేసేలా 2021 జూన్ 11 నాటికే స్పిల్ వేను అప్పటి సీఎం వైఎస్ జగన్

◆ రాయలసీమ, నెల్లూరు జిల్లాలు, చెన్నైకి తాగునీటిని అందించాలనే లక్ష్యంతో జగన్ మోహన్ రెడ్డి రాయలసీమ ఎత్తిపోతలను చేపట్టి... పనులను పరుగులెత్తించారు. ఆ ఎత్తిపోతల పూర్తయితే జగన్‌కు నీరాజనాలు పలుకుతారని గ్రహించిన చంద్రబాబు... మహబూబ్‌నగర్ జిల్లాలోని టీడీపీ నేతలను ఉసిగొలిపి అక్కడి రైతుల ద్వారా జాతీయ హరిత ట్రిబ్యునల్(ఎన్జీటీ)లో కేసులు వేయించారు.

పూర్తి చేశారు. కానీ 2024 ఆగస్టు 28న 41.15 మీటర్ల ఎత్తు వరకే నీటిని నిల్వ చేసేలా పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయడానికి అవసరమైన రూ.12,157 కోట్లను మాత్రమే ఆంధ్రప్రదేశ్ సర్కార్‌కు విడుదల చేయాలని కేంద్ర కేబినెట్ తీర్మానాన్ని ఆమోదించింది. ఆ కేబినెట్ సమావేశంలో ఉన్న టీడీపీ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు ఆ తీర్మానాన్ని వ్యతిరేకించలేదు. చంద్రబాబు సర్కార్ కూడా దానిపై అభ్యంతరం చెప్పలేదు.

పోలవరంలో 45.72 మీటర్ల ఎత్తులో 194.6 టీఎంసీలను నిల్వ చేయవచ్చు. 41.15 మీటర్ల ఎత్తు వరకు కేవలం 119.4 టీఎంసీలను మాత్రమే నిల్వ చేయవచ్చు. ఇక 41.15 మీటర్ల ఎత్తుకే నీటి నిల్వను పరిమితం చేస్తే... పోలవరం కుడి, ఎడమ కాలువ కింద 7 లక్షల ఎకరాలకు నీళ్లందించడం సాధ్యం కాదు. కేవలం 1.98 లక్షల ఎకరాలకు మాత్రమే నీళ్లందించడానికి వీలుంటుందని సాక్షాత్తూ పోలవరం ప్రాజెక్టు అథారిటీనే స్పష్టం చేస్తోంది. పోలవరం రిజర్వాయర్‌ను బ్యారేజ్‌గా మార్చేయడం వల్ల కృష్ణా డెల్టాకు 80 టీఎంసీలను మళ్లించడానికీ, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం ద్వారా 63 టీఎంసీలను వెనుకబడిన ఉత్తరాంధ్రకు మళ్లించడానికీ ఆస్కారం ఉండదు. జీవనాడి పోలవరంలో జీవం తీసేసి రాష్ట్ర ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలిగించిన ఘనత బాబుకే దక్కుతుంది.

ఇక వంశధార జలాలపై రాష్ట్ర హక్కులను వంశధార ఫేజ్–2 స్టేజ్–2ను 2004 దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి చేపట్టి పరిరక్షించారు. ఆ ప్రాజెక్టు వల్లే వంశధారలో 75 శాతం నీటి లభ్యతగా ఉన్న 115 టీఎంసీలలో ఆంధ్రప్రదేశ్, ఒడిశాలకు చెరి సగం పంపిణీ చేస్తూ ట్రిబ్యునల్ తీర్పు ఇచ్చింది. నేరడి బ్యారేజ్ నిర్మాణానికి అనుమతి ఇచ్చింది. ఆ బ్యారేజీ నిర్మాణం కోసం 2021 నవంబర్ 9న నాటి సీఎం వైఎస్ జగన్ ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో అప్పటి ఆ రాష్ట్ర సీఎం నవీన్ పట్నాయక్‌తో చర్చలు జరిపారు. నేరడి బ్యారేజీ నిర్మాణం కోసం సంప్రదింపులు జరుపుతూనే... వంశధార జలాలను పూర్తి స్థాయిలో వాడుకుని శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో వంశధార ఆయకట్టులో రెండు పంటలకు నీళ్లందించేందుకు హీరమండలం ఎత్తిపోతల పథకాన్ని చేపట్టి 40 శాతం పనులు పూర్తి చేశారు. కానీ... 2024 జూన్ 12 తర్వాత ఆ ఎత్తిపోతల పనులను చంద్రబాబు సర్కార్ ఆపేయడం ద్వారా వంశధార ఆయకట్టు రైతులకు తీరని అన్యాయం చేసింది.

– ఆర్.జి.ఆర్.

బంగారం... భద్రతా? భారమా?

ఇన్ బాక్స్

భారతీయ సామాజిక, ఆర్థిక వ్యవస్థల్లో బంగారం కేవలం విలువైన లోహం మాత్రమే కాదు; అదొక సెంటిమెంట్, సామాజిక హోదా. ప్రస్తుతం మధ్యతరగతి మనఃస్థితికి, జాతీయ ఆర్థిక నిర్మాణానికి మధ్య ఇది ఒక విరోధాభాసగా మారింది. ఒకవైపు బంగారం కొనాలనే సామాజిక అంచనాలు, మరోవైపు కొనలేని ఆర్థిక వాస్తవాల మధ్య సామాన్య కుటుంబాలు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నాయి.

బంగారం ధరల పెరుగుదల ప్రభావం ప్రధానంగా ఆడపిల్లల తల్లిదండ్రులపై పడుతోంది. సమాజంలో వేళ్లూనుకున్న కట్నకానుకల సంస్కృతి, పరువు–ప్రతిష్ఠల పేరిట సాగే ఆడంబరాలు ఒక సామాజిక సంక్షోభాన్ని సృష్టిస్తున్నాయి. కుమార్తె వివాహం కోసం జీవితకాలపు పొదుపును ఖర్చు చేయడమే కాకుండా, బ్యాంకులు, ప్రైవేటు వ్యక్తుల వద్ద అప్పులు చేసి చివరకు 'అప్పుల చక్రం'లో చిక్కుకుంటున్నారు.

సంపన్న వర్గాలకు బంగారం ఒక 'హెడ్జింగ్' సాధనం. మార్కెట్ అస్థిరత ఉన్నప్పుడు అది భద్రమైన పెట్టుబడిగా మారి వారి సంపదను పెంచుతుంది. అయితే ఇదే క్రమంలో సామాజిక, ఆర్థిక అసమానతలు మరింత పెరుగుతున్నాయి. దేశ ఆర్థిక కోణంలో చూస్తే, ప్రపంచంలోనే అగ్రగామి బంగారం దిగుమతి దేశంగా భారత్ విదేశీ మారక ద్రవ్య నిల్వలపై ఒత్తిడి ఎదుర్కొంటోంది. ఇది చెల్లింపుల సమతుల్యత లోటును పెంచి, రూపాయి విలువను బలహీనపరుస్తోంది. రూపాయి బలహీనపడితే దిగుమతుల ఖర్చు పెరిగి ద్రవ్యోల్బణం మళ్లీ తీవ్రమవుతుంది.

కీలకమైన అంశం ఏమిటంటే, బంగారంపై పెట్టే అధిక పెట్టుబడి వల్ల దేశంలో ఉత్పాదక మూలధనం క్షీణిస్తోంది. పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, సాంకేతిక రంగాల్లో పెట్టుబడిగా వెళ్లాల్సిన నగదు బంగారం రూపంలో అచేతనంగా ఉండిపోతోంది. ఇది దేశ ఆర్థికవృద్ధి రేటును మందగింపజేస్తూ 'అవుట్‌పుట్ గ్యాప్'ను సృష్టిస్తోంది. ప్రభుత్వం సావరీన్ గోల్డ్ బాండ్లు, జీఎస్టీ వంటి చర్యల ద్వారా భౌతిక బంగారం వైపు ప్రజలు వెళ్లకుండా చూస్తున్నా, సామాజిక దృక్పథం మారనంతవరకు ఆశించిన ఫలితం ఉండదు.

బంగారాన్ని గౌరవానికి చిహ్నంగా కాకుండా, ఒక సాధారణ పెట్టుబడిగా మాత్రమే చూడాలి. ప్రజలు మ్యూచువల్ ఫండ్లు, పెన్షన్ పథకాల వంటి ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలి. పాఠశాల స్థాయి నుంచే ఆర్థిక విద్యను అందించడం ద్వారా ప్రజల్లో అవగాహన పెంచాలి. బంగారం ధరల పెరుగుదల కేవలం మార్కెట్ పరిణామం కాదు; అదొక వ్యవస్థాగత హెచ్చరిక. మానవ మూలధనం, ఆర్థిక అవగాహన, సామాజిక సంస్కరణలే నిజమైన సంపద అని గుర్తించడమే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం.

– ఆత్మకూరి ప్రశాంత్ చారి । ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ ఫ్యాకల్టీ

గ్రామీణ కుటుంబాల ఇతర ఖర్చులు

డేటా పాయింట్

కోవిడ్–19 అనంతర కాలంలో 2,61,953 గ్రామీణ, పట్టణ కుటుంబాలను సర్వే జరిపిన కేంద్ర గణాంక శాఖ సగటున వాటి నెలవారీ ఖర్చు దేని కోసం చేస్తున్నాయో వెల్లడించింది. ఇందులో 1,54,357 గ్రామీణ కుటుంబాలు. గ్రామీణ కుటుంబాల ఆహారేతర ఖర్చులు నూరు రూపాయలకు ఇలా ఉన్నాయి...



అవసరం	2022–23	2023–24
ఇంధనం, కరెంట్	6.66	6.11
చదువు	3.30	3.24
వైద్యం	7.13	6.83
రవాణా	7.55	7.59
దుస్తులు, బెడ్డింగ్, పాదరక్షలు	6.10	6.63
నిలిచే వస్తు సామగ్రి	6.89	6.48
చిల్లర వస్తువులు, వినోదం	6.21	6.22
వినియోగ సేవలు	5.08	5.25
ఇతర ఆహారేతర వస్తువులు	4.70	4.61

వాయిదా మోక్షం

జ్యోతిర్మయం

శ్రీలంకలో ఒక బౌద్ధ గురువు ఉండేవారు. ఆయన మహాజ్ఞాని కావడంతో బౌద్ధ ధర్మంలోని ముఖ్యాంశాలను అత్యంత స్పష్టంగా వివరించేవారు. ఆయన ఉపన్యాసాలు వినడానికి జనం తండోపతండాలుగా వచ్చేవారు. ఒకనాటి సాయంత్రం సమావేశ ప్రాంగణంలో ఉన్నవారిని చూస్తూ... 'గత యాభై ఏళ్లుగా మీకు ధర్మాన్ని బోధిస్తున్నాను, చేయవలసిన సాధనను వివరిస్తున్నాను. ఇక సమయం లేదు, నేను దేహాన్ని త్యజించాల్సిన కాలం ఆసన్నమైంది. ఇప్పుడు నిర్వాణం గురించి బోధించను, నేరుగా ప్రసాదిస్తాను. పొందదలచిన వారు ఆలస్యం చేయకుండా వెంటనే నా వద్దకు రండి' అన్నారు.

ఆనాడు సభలో వేలమంది ఉన్నా ఏ ఒక్కరూ నిర్వాణం కోసం ముందుకు రాలేదు. ఒక వ్యక్తి మాత్రం 'గురువుగారూ! నేను నిర్వాణాన్ని పొందడానికి సిద్ధమే, కానీ ఇప్పుడు కాదు. ఇంకా చేయాల్సిన ముఖ్యమైన పనులు కొన్ని మిగిలి ఉన్నాయి' అన్నాడు. అంటే, ఇంతకాలం గురువు వివరిస్తూనే ఉన్నారు, ఈయన వింటూనే ఉన్నాడు. ('ద వాయిస్ ఆఫ్ సైలెన్స్'– ఓషో).

మనం పరలోకం, స్వర్గం, మోక్షం గురించి ఎంత కాలమైనా, ఎంతసేపైనా వినగలం. కానీ ఎవరైనా 'నిన్ను ఇప్పుడే స్వర్గానికి పంపిస్తాను' అనో, 'మోక్షాన్ని ప్రసాదిస్తాను' అనో అంటే... నిజంగా ఆయనకు అంత శక్తి ఉందని భావిస్తే, అక్కడి నుంచి పారిపోతాం.

మనకు ఇప్పుడే స్వర్గం వద్దు, మోక్షం వద్దు. ఈ లోకమే కావాలి, ఈ బతుకే కావాలి. సద్గురువుల ఉపన్యాసాలు వినడంలో ఉన్న శ్రద్ధ, వారి బోధనలను ఆచరించడంలో ఉండదు. మారాలనే సంకల్పం లేకుండా ఎన్ని ఏళ్లు ప్రవచనాలు విన్నా ప్రయోజనం ఏంటి? ప్రవచనాలను కాలక్షేపం కోసమో, వినోదం కోసమో వినకూడదు. లౌకిక సుఖాలను వెంటనే అనుభవించాలనీ, శ్రేయస్సును ఇచ్చే మోక్షాన్ని భవిష్యత్తుకు వాయిదా వేయాలనీ భావించడం భక్తి కాదు! ఆధ్యాత్మికత అస్సలే కాదు!!

– రాచమడుగు శ్రీనివాసులు

దురుద్దేశంతోనే తిరుమల లడ్డూపై దుష్ప్రచారం

చంద్రబాబు, పవన్, లోకేశ్‌పై క్రిమినల్ కేసులు పెట్టండి

సీబీఐ సిట్ నివేదికను వక్రీకరించి బ్యానర్లతో దుష్ప్రచారం చేయిస్తున్నారు

రాష్ట్ర వ్యాప్తంగా పోలీసులకు వైఎస్సార్ సీపీ నాయకుల ఫిర్యాదు

అనంతపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన వైఎస్సార్‌సీపీ నేతలు, శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు, కాకినాడ జిల్లా ప్రత్తిపాడులో ఫిర్యాదు ఇస్తున్న ముద్రగడ గిరిబాబు

సాక్షి నెట్‌వర్క్: తిరుమల వేంకటేశ్వర స్వామి వారి పవిత్ర లడ్డూలో జంతువుల కొవ్వు కలవలేదని సీబీఐ సిట్ నివేదిక స్పష్టం చేసినప్పటికీ... దురుద్దేశంతో అసత్య ప్రచారం చేస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రి లోకేశ్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిట్ నివేదికను వక్రీకరించి బ్యానర్లతో దుష్ప్రచారం చేస్తూ కోట్లాది హిందువుల మనోభావాలు దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు. అలాగే మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేష్, విడదల రజినిపై దాడులకు పాల్పడిన గూండాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

- మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు విజయవాడ, కొత్తపేట సీఐ కొండలరావుకు ఫిర్యాదు అందచేశారు. వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ విజయవాడలోని మాచవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.
- అనంతపురం టూ టౌన్ పోలీస్ స్టేషన్, ఉరవకొండ సర్కిల్ కార్యాలయంలో, కదిరి పట్టణ పీఎస్‌లో వైఎస్సార్‌సీపీ నేతలు ఫిర్యాదు చేశారు. మడకశిర వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈర లక్కప్ప ఆధ్వర్యంలో ఎస్ఐ లావణ్యకు ఫిర్యాదు చేశారు.
- వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు ఫోర్తుటౌన్ పోలీస్ స్టేషన్‌లో, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పెందుర్తి పీఎస్‌లో, గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి న్యూపోర్టు పీఎస్‌లో, విశాఖ తూర్పు నియోజక వర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు, మాజీ మేయర్ గొలగాని హరివెంకటకుమారి ఎంవీపీ పీఎస్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు.
- మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల సన్యాసిపాత్రుడు నర్సీపట్నం టౌన్ సీఐకి, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, పార్టీ ఎస్ఈసీ సభ్యుడు బోదెపు గోవింద్ యలమంచిలి రూరల్ ఎస్ఐకి, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు నక్కపల్లి పీఎస్‌లో, అనకాపల్లి సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ డాక్టర్ పినిపె శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీలు బొమ్మి ఇజ్రాయిల్, కుడుపూడి సూర్యనారాయణరావు, పార్టీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జిన్నూరి రామారావు ఫిర్యాదు చేశారు.
- పి.గన్నవరం పోలీస్ స్టేషన్‌లో వైఎస్సార్‌సీపీ కో–ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్‌కు పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్, కాకినాడ జిల్లా జగ్గంపేటలో వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం ఉభయ గోదావరి జిల్లాల వర్కింగ్ ప్రెసిడెంట్ తోట శ్రీరాంజీ, తదితరులు సీఐ వైఆర్‌కే శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రత్తిపాడులో పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు తదితరులు సీఐ బి.సూర్య అప్పారావుకు ఫిర్యాదు చేశారు.
- శ్రీకాకుళం జిల్లాలోని ఆమదాలవలస, జేఆర్‌పురం, పాతపట్నం, టెక్కలి, ఇచ్ఛాపురం, శ్రీకాకుళం రూరల్, నరసన్నపేట పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేశారు.
- మార్కాపురం జిల్లా గిద్దలూరులో నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, యర్రగొండపాలెంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి ఫిర్యాదు చేశారు.
- పశ్చిమగోదావరి జిల్లా ఆచంట పోలీస్ స్టేషన్‌లో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి గురుప్రసాద్ తదితరులు ఫిర్యాదు చేశారు.

బెజవాడ రైల్వేస్టేషన్‌లో దారుణ హత్య

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): లోకో పైలెట్ హత్య ఘటన మరువక ముందే మరో యువకుడి హత్య జరగడం మంగళవారం విజయవాడ రైల్వేస్టేషన్‌లో కలకలం రేపింది. ఈ రెండు హత్యలూ గంజాయి మత్తులో జరిగినవే కావడంతో మరింత భయాందోళనకు గురిచేస్తోంది. మంగళవారం 8వ నంబర్ ప్లాట్‌ఫాంపై చోటు చేసుకున్న ఈ భయానక ఘటనకు ప్రయాణికులు పరుగులు తీశారు.

గంజాయి మత్తులోనే హత్య...

కాకినాడకు చెందిన సరగడ రాము అలియాస్ పొట్టి రాము కొంత కాలంగా విజయవాడలోని ఊర్మిళనగర్ సమీపంలోని అజీత్ నగర్‌లో ఉంటున్నాడు. బీహార్‌కి చెందిన సాయి (30) అనే వ్యక్తి రైల్వేస్టేషన్ పరిసరాల్లో తిరుగుతూ ప్లాట్‌ఫాంపైనే నిద్రిస్తుంటాడు. వీరి మధ్య స్నేహం కుదరటంతో మద్యం, గంజాయి మత్తులో ప్రయాణికులను, ఒంటరిగా వెళుతున్నవారిపై దాడులు చేసి డబ్బులు లాక్కుని జల్సాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం రాత్రి తాగొచ్చిన విషయంలో వీరిద్దరి మధ్య వివాదం తలెత్తడంతో ఒకరిపై ఒకరు దూషణలకు దిగారు. స్థానికులు అడ్డుకుని అక్కడి నుంచి పంపించేశారు. అనంతరం మంగళవారం ఉదయం సుమారు 6.30 గంటల సమయంలో తారాపేటలోని సాటికింగ్ కార్యాలయం బయట మరోసారి ఇద్దరి మధ్య వివాదం నెలకొనడంతో పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ క్రమంలో సాయి ప్రాణ భయంతో రైల్వే స్టేషన్‌లోకి పరుగులు తీయగా రాము అతన్ని వెంబడించి ఎనిమిదో నంబర్ ప్లాట్‌ఫాం వద్ద మద్యం బాటిల్ పగులకొట్టి సాయి తల, మెడపై పొడవటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం రాము అక్కడి నుంచి పరారయ్యాడు. జీఆర్‌పీ పోలీసులు నిందితుడు రామును అదుపులోకి తీసుకున్నారు.

బాబు సర్కారు బరితెగింపుపై ధర్మా‘గృహం’

- భగ్గుమన్న మూలపర్ర మహిళలు
- స్టీల్‌ప్లాంట్, బల్క్ డ్రగ్‌పార్కుల కోసం బలవంతంగా ఇళ్లను ఖాళీ చేయిస్తున్న అధికారులు
- ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వకుండానే ఇళ్ల కూల్చివేతపై ఆందోళన

మూలపర్రలో ఇళ్లను జేసీబీతో కూలుస్తున్న అధికారులు

నక్కపల్లి (అనకాపల్లి జిల్లా): నక్కపల్లి మండలం మూలపర్ర, అమలాపురం గ్రామాల్లో స్టీల్‌ప్లాంట్, బల్క్ డ్రగ్‌పార్క్ కోసం నివాస ప్రాంతాలు త్యాగం చేసిన నిర్వాసితులకు పూర్తి స్థాయిలో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ చెల్లించకుండా ఇళ్లు కూల్చివేతకు చంద్రబాబు సర్కారు బరితెగించింది. దీంతో బాధితులు భగ్గుమన్నారు. పొక్లెయిన్‌తో వచ్చి ఇళ్లు కూల్చుతున్న అధికారులను మంగళవారం అడ్డుకున్నారు. చందనాడ, అమలాపురం, మూలపర్ర, డీఎల్ పురం, వేంపాడు, రాజయ్యపేట, బుచ్చిరాజుపేట, తమ్మయ్యపేట, పాటిమీద గ్రామాల పరిధిలో ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (ఏపీఐఐసీ) రైతుల నుంచి సుమారు 4,500 ఎకరాలు సేకరించింది. వీటిలో 2,000 ఎకరాలు బల్క్ డ్రగ్‌పార్క్‌కు, 2,200 ఎకరాలు ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కు కేటాయించారు. జిరాయితీ, డీఫాం, ప్రభుత్వ భూములతోపాటు, జిరాయితీ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారిని ఈ కంపెనీల కోసం ఖాళీ చేయించాల్సి వస్తోంది. ఈ గ్రామాల పరిధిలో 734 మంది ఇళ్లు, నివాస ప్రాంతాలను కోల్పోతున్నట్లు గుర్తించారు. అయితే భూసేకరణ సమయంలో నష్ట పరిహారంతోపాటు నిర్వాసిత కుటుంబాల్లో మేజర్లయిన వారికి, వివాహం కాని ఆడపిల్లలకు ఇంటి స్థలం, ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీ కింద రూ.9 లక్షలు చెల్లిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. నిర్వాసితులు మాత్రం ప్యాకేజీ కింద రూ.25 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. వివాహం అయిన ఆడపిల్లలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, ఇంటి స్థలం ఇవ్వలేదు. అవార్డు పాస్ చేసిన సమయానికి తాము వివాహం కాకుండా తల్లిదండ్రులమీదే ఆధారపడి ఉన్నామని, తర్వాత వివాహాలు కావడంతో తమకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ వర్తింపజేయడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. తమకూ ప్యాకేజీ వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేస్తున్నామని, తమ డిమాండ్లు పరిష్కరించకుండా తమ తల్లిదండ్రుల ఇళ్లు బలవంతంగా ఖాళీ చేయిస్తున్నారని, పొక్లెయిన్‌లతో వచ్చి ఇళ్లను కూల్చివేస్తున్నారంటూ వారంతా ఆందోళనకు దిగారు. ఇలా పెళ్లయిన ఆడపిల్లలు నిర్వాసిత గ్రామాల్లో సుమారు 120 నుంచి 150 మంది వరకు ఉన్నారు. వీరికి 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేసి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని అధికారులతో వాగ్వాదానికి దిగారు. పునరావాస కాలనీలో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించలేదని, రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాలు లేకుండానే నిర్వాసితులను తరలి వెళ్లిపోవాలని హుకుం జారీ చేయడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇచ్చిన హామీనే ఇప్పుడు అమలు చేయాలని కోరుతున్నట్టు వెల్లడించారు. మూలపర్ర గ్రామంలో ఇళ్లు కూల్చివేస్తున్న విషయం తెలుసుకున్న సీపీఎం, రైతు కూలి సంఘ నాయకులు ఆర్.శంకర్రావు, ఎం.రాజేష్, సత్యనారాయణ తదితరులు వచ్చి బాధితులకు మద్దతుగా ఆందోళన చేపట్టారు.

నిర్వాసితులకు అన్యాయం చేస్తున్న ప్రభుత్వం

భూసేకరణ సమయంలో పెళ్లి కాని ఆడపిల్లలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇస్తామని హామీ ఇచ్చారు. అప్పటికి మాకు వివాహం కాలేదు. ఇళ్లు నివాసాలు కోల్పోయిన కుటుంబంలో కుమార్తెలుగా ఉన్న మాకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని అడుగుతున్నాం. ప్రభుత్వం పట్టించుకోకుండా ఇళ్లు ఖాళీ చేయాలని ఒత్తిడి చేస్తోంది. యంత్రాలతో ఇళ్లు కూల్చివేయడానికి వస్తే అడ్డుకున్నాం. – మానస, వివాహిత, మూలపర్ర

మాజీ ఎమ్మెల్యే బొల్లాపై అక్రమ కేసు

సాక్షి, నరసరావుపేట: పల్నాడు జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలపై పోలీసుల అక్రమ కేసుల పరంపర కొనసాగుతోంది. తిరుపతి లడ్డూలో జంతువుల కొవ్వు కలవలేదని సీబీఐ సిట్ నివేదిక ఇచ్చిన నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ పిలుపుమేరకు ఈ నెల 31న వినుకొండ పట్టణం ఎన్ఆర్టీ రోడ్డులోని ఆలయంలో వేంకటేశ్వర స్వామికి మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి పూజలు చేశారు. అనంతరం శాంతియుతంగా నిరసన చేపట్టగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో మాజీ ఎమ్మెల్యే అని కూడా చూడకుండా బొల్లా పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. లాఠీచార్జీ చేయడంతో బొల్లా తలకు స్వల్ప గాయం కావడంతో ఒక్కసారిగా రక్తపోటు తగ్గి రోడ్డుపై సొమ్మసిల్లి పడిపోయారు. వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు డైరెక్షన్‌లో నడుచుకుంటున్న పోలీసులు.. విధులకు ఆటంకం కలిగిస్తున్నారంటూ ఈపూరు పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ రావూరి సాంబశివరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బొల్లా బ్రహ్మనాయుడుతో పాటు మరో 27 మంది వైఎస్సార్‌సీపీ నేతలపై వినుకొండ టౌన్ స్టేషన్‌లో అక్రమ కేసు నమోదు చేశారు.

మహిళా ఉద్యోగినిపై హత్యాయత్నం

- కళ్లల్లో కారం కొట్టి, చెప్పులతో దాడిచేసిన టీడీపీ మహిళలు
- వెలుగు కార్యాలయంలో ఘటన

ఇందుకూరుపేట: శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా ఇందుకూరుపేటలోని వెలుగు కార్యాలయం సాక్షిగా దారుణం చోటు చేసుకుంది. రాజకీయ కక్షలు, అసూయతో ఓ మహిళా ఉద్యోగిని కళ్లల్లో కారం కొట్టి, అమానుషంగా దాడి చేసి, ఆమె ప్రాణాలు తీసేందుకు ప్రయత్నించిన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కార్యాలయ ఉద్యోగులు, కార్యార్థుల సమాచారం మేరకు.. ఇందుకూరుపేట సంఘమిత్ర కార్యాలయంలో సృజన పనిచేస్తున్నారు. సోమవారం ఆమె కార్యాలయంలో ఉన్న సమయంలో ఇందుకూరుపేట దళితవాడకు చెందిన చలం గౌతమి, అనపల్లి ప్రతిభ మరో 10 మంది మహిళలు ఒక్కసారిగా లోపలికి ప్రవేశించి దుర్భాషలాడారు. సృజన కళ్లలో కారం కొట్టి తీవ్రంగా హింసించారు. గౌతమి ఆమెను గట్టిగా పట్టుకోగా, ప్రతిభ చెప్పులతో కొడుతూ, దాడి చేసి ప్రాణాలు తీసేందుకు ప్రయత్నించింది. అక్కడే ఉన్న వారు అడ్డుకుని వారిని బయటకు పంపించారు.

రాజకీయ ప్రేరేపిత కుట్రేనా?

సృజనను ఎలాగైనా తొలగించి, ఆ స్థానంలో టీడీపీకి అనుకూలంగా ఉండే మరో మహిళను నియమించాలని స్థానిక టీడీపీ నేత దుర్బుద్ధితోనే ఈ దాడికి పాల్పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సృజనపై నిందలు వేస్తూ, మానసికంగా వేధిస్తూ చివరకు దాడికి ఒడిగట్టడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏవైనా తప్పులు ఉంటే అధికారులకు ఫిర్యాదు చేయాలే కానీ, ఇలా కార్యాలయానికి వచ్చి హత్యాయత్నం చేయడం ఎంత వరకు సమంజసమని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఆమె మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

హస్తినాపురంలో మల్లన్న తలపాగా సిద్ధం

చేనేత మగ్గంపై వడివడిగా తయారీ

ఆలయ శిఖరానికి పాగా చుట్టే భాగ్యం చీరాల వాసిదే..

తలపాగా తయారీకి సిద్ధం చేస్తున్న తెల్లటి నూలు దారం

వేటపాలెం: ద్వాదశ జ్యోతిర్లింగ శైవక్షేత్రాల్లో శ్రీశైలం ఒకటి. మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని ఆ క్షేత్రంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించే విశిష్టమైన సేవ మల్లన్నకు పాగాఅలంకరణ. అంతటి విశిష్టత ఉన్న పాగాను జిల్లా చీరాల మండలం దేవాంగపురి హస్తినాపురం గ్రామస్తులైన పృథ్వీ వంశస్తులు అనువంశికంగా తయారు చేస్తున్నారు.

నియమ నిష్ఠలతో: శ్రీశైల మల్లన్నకు అలంకరించే పాగాను పృథ్వీ వంశస్తులు నియమనిష్ఠలతో చేనేత మగ్గంపై నేస్తారు.సూర్యోదయానికి ముందు ప్రత్యేక పూజలు చేసి రోజుకు ఒక మూర చొప్పున 365 మూరల వస్త్రాన్ని నేస్తారు.శివరాత్రికి రెండు రోజుల ముందు సిద్ధం చేసిన పాగాను చీరాల ప్రాంతంలోని 13 గ్రామాల్లో ఊరేగిస్తారు. శివరాత్రికి ఒక రోజు ముందు శ్రీశైలం వెళ్లి అధికారులకు తలపాగా వస్త్రాన్ని అందజేస్తారు. వీరితో పాటు కర్ణాటక, రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల్లో ఉన్న దేవాంగులు ప్రభుత్వ అనుమతి ప్రకారం వస్త్రాన్ని తయారు చేసి అందిస్తారు. అన్ని వస్త్రాలను కలుపుతూ స్వామికి తలపాగా కడతారు. అలాగే గోపురానికి పాగా చుట్టే భాగ్యం కూడా చీరాల వాసిదే.చీరాల మండలం దేవాంగపురి పంచాయతీ హస్తినాపురానికి చెందిన పృథ్వీ వెంకటేశ్వర్లుకు 11వ ఏట నుంచే గోపురానికి పాగా చుట్టే భాగ్యం లభించింది. అయితే వెంకటేశ్వర్లు గతేడాది కాలం చేయడంతో అతని కుమారుడు వెంకట సుబ్బారావు తలపాగా వస్త్రాన్ని పండగ రోజున శిఖరానికి కడుతున్నారు.

గిరిజన హక్కులకు తూట్లు పొడుస్తున్న టీడీపీ సర్కార్

కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షల్లో గిరిజన సంఘాల ఐక్యవేదిక నాయకులు

- రాష్ట్రపతికి నెల్లూరు మాజీ మేయర్ స్రవంతి లేఖ
- గిరిజనులపై టీడీపీ దుర్నీతి పాలనను ఢిల్లీ పెద్దల దృష్టికి తీసుకెళ్లేందుకు సన్నాహాలు
- నాలుగో రోజుకు చేరిన గిరిజన సంఘాల ఐక్యవేదిక రిలే నిరాహార దీక్ష
- ప్రభుత్వ తీరుపై గిరిజన నేతల ఆగ్రహం

నెల్లూరు(దర్గామిట్ట): భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు నెల్లూరు మాజీ మేయర్ పొట్లూరి స్రవంతి లేఖ రాశారు. గిరిజనుల హక్కులకు టీడీపీ ప్రభుత్వం తూట్లు పొడుస్తున్న వైనాన్ని లేఖలో వివరించారు. పథకం ప్రకారం తనపై అవిశ్వాస తీర్మానం పెట్టి, గిరిజన మహిళకు రిజర్వేషన్ అయిన పీఠంపై రాజ్యాంగ విరుద్ధంగా బీసీ నేతను కూర్చొబెట్టారని, తనను ఘోరంగా అవమానించారని తెలిపారు. కుట్రపూరితంగా టీడీపీ ప్రభుత్వ పెద్దలు వ్యవహరిస్తూ గిరిజనుల హక్కులను హరిస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. టీడీపీ దుర్నీతి పాలనపై, గిరిజనుల పట్ల ప్రభుత్వం చూపుతున్న చులకన భావాన్ని ఢిల్లీ పెద్దలను కలిసేందుకు ఆమె సన్నాహాలు చేస్తున్నట్లు మీడియాకు వివరించారు.

4వ రోజుకు చేరిన గిరిజన సంఘాల ఐక్యవేదిక రిలే నిరాహార దీక్ష..

నగరపాలక సంస్థ నూతన మేయర్ ఎంపికపై వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గిరిజన సంఘాల ఐక్యవేదిక చేపట్టిన రిలే నిరాహార దీక్ష మంగళవారంతో నాలుగో రోజుకు చేరుకుంది. గిరిజన సంఘాక్షేమ సంఘం నేతలు బీఎల్ శేఖర్, తలపల జయవర్ధన్, చేవూరు శ్రీనివాసులు మాట్లాడుతూ.. మేయర్‌పై అవిశ్వాస తీర్మానం ఏర్పాటు చేసి ఒకటిన్నర నెల కావస్తున్నా ఇంత వరకు చంద్రబాబు ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

మద్యం మత్తులో స్నేహితుడి హత్య

తాడేపల్లిగూడెం అర్బన్: మద్యం మత్తులో స్నేహితుడిని హత్య చేసిన ఘటన పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో జరిగింది. వివరాలు.. తాడేపల్లిగూడెంలోని కొత్తగూడెం ప్రాంతానికి చెందిన నీలి శివ (50), అతని స్నేహితుడు విజయ్ మంగళవారం సాయంత్రం పాత ప్రభాత థియేటర్ స్థలంలో నిర్మాణంలో ఉన్న భవనంపైకి మద్యం సేవించేందుకు వెళ్లారు. మద్యం సేవిస్తున్న సమయంలో పాత గొడవల ప్రస్తావన వచ్చి.. వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో మద్యం మత్తులో ఉన్న నీలి శివను విజయ్ భవనం పైనుంచి కిందకు తోసివేయడంతో తీవ్ర గాయాలపాలై ఘటనాస్థలిలోనే ప్రాణాలు కోల్పోయాడు.

కల్తీ మద్యం తాగి ప్రాణాలు పోతున్నాయి

తక్షణం బెల్టుషాపులను తొలగించాలి.. లేదంటే తీవ్రంగా ఉద్యమిస్తాం

శ్రీకాకుళం జిల్లా బొడ్డపాడులో మహిళల ఆగ్రహం

బెల్టుషాపులను ఎత్తివేయాలంటూ నిరసన ర్యాలీ చేస్తున్న మహిళలు

పలాస: మద్యం బెల్టుషాపుల వల్ల పేదల కుటుంబాలు నాశనమవుతున్నాయని శ్రీకాకుళం జిల్లా పలాస మండలం బొడ్డపాడు గ్రామ మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్యం వ్యాపారులు సిండికేటుగా ఏర్పడి కల్తీ మద్యాన్ని గ్రామాలకు పంపి బెల్టుషాపుల ద్వారా అమ్మిస్తున్నారని తీవ్ర స్థాయిలో ఆరోపిస్తూ మహిళా సంఘాల నాయకులు పోతనపల్లి కుసుమ, నాగమణి, వివిధ ప్రజాసంఘాల నాయకులు మద్దిల ధర్మారావు, బొడ్డపాడు సర్పంచి తామాడ మదన్ గ్రామాల్లోని యువకులు, మహిళలు పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ చేపట్టారు. పలాస మండలంతో పాటు వజ్రపుకొత్తూరు మండలంలోని అక్కుపల్లి, బొడ్డపాడు కాలనీ, అల్లుకోల, గరుడఖండి తదితర గ్రామాలతో పాటు కాశీబుగ్గలో కూడా అడుగడుగునా బెల్టు షాపులు దర్శనమిస్తున్నాయని, ఈ విషయం తెలిసినా పలాస ఎక్సైజ్ పోలీసులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సిండికేటు వ్యాపారులు చెప్పిందే వారికి వేదమన్నట్టుగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్తీ మద్యం తాగి చాలామంది ప్రాణాలు పోతున్నాయని, ఊపిరితిత్తులు పాడవుతున్నాయని, అనేక మంది ఆస్పత్రుల పాలవుతున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే బెల్టుషాపులపై తగిన చర్యలు తీసుకోవాలని, లేదంటే పోరాటాలు మరింత తీవ్రం చేస్తామని వారు హెచ్చరించారు.

ఆస్తి కోసం తల్లి, కొడుకు దారుణ హత్య

అనంతపురం జిల్లా తరిమెలలో ఘటన

ఘాతుకానికి పాల్పడిన పెద్ద భార్య, కుమారులు

హత్యకు గురైన ఎల్లమ్మ, చిన్నా

శింగనమల: పెద్ద భార్య, ఆమె కుమారుడు ఆస్తి మొత్తం తమకే చెందాలన్న లక్ష్యంతో చిన్న భార్య, ఆమె కుమారుడిని అత్యంత దారుణంగా హత్య చేశారు. ఈ ఘటన అనంతపురం జిల్లా తరిమెల గ్రామంలో సోమవారం రాత్రి జరిగింది. వివరాలు.. శింగనమల మండలం తరిమెల గ్రామానికి చెందిన దండోరా నల్లప్పకు ఇద్దరు భార్యలు. పెద్ద భార్య లక్ష్మీదేవికి ఇద్దరు కుమారులు జగ్జీవన్ రావు, ఓంకార్‌తో పాటు ఒక కుమార్తె ఉంది. చిన్న భార్య ఎల్లమ్మ(45)కు ఒక కుమారుడు అంబేడ్కర్ అలియాస్ చిన్నా(25). దండోరా నల్లప్ప ఐదేళ్ల క్రితం మరణించాడు. ఆయనకు గ్రామంలోనే 1.50 ఎకరాల భూమి, మూడు ఇళ్లు ఉన్నాయి. వీటి కోసం నల్లప్ప భార్యలిద్దరూ తరచూ ఘర్షణ పడేవారు. పెద్ద భార్య లక్ష్మీదేవి కుమారులిద్దరూ బెంగళూరులోని ఓ కంపెనీలో పనిచేస్తుండగా.. చిన్న భార్య ఎల్లమ్మ(అంగన్‌వాడీ), చిన్నా తరిమెలలోనే నివసిస్తున్నారు. సోమవారం రాత్రి లక్ష్మీదేవి, ఆమె కుమారులు తరిమెలకు వచ్చి నిద్రిస్తున్న ఎల్లమ్మ, చిన్నాపై దాడి చేశారు. వారు మేల్కొని తప్పించుకునేందుకు ఎదురింట్లోకి పరిగెత్తారు. అయినా కూడా వారిని వెంటాడి.. చిన్నాను బండరాయితో తలపై బాది హత్య చేశారు. అక్కడి నుంచి మరో ఇంట్లోకి వెళ్లిన ఎల్లమ్మపై కూడా దాడి చేసి.. ఆమె తలను నరికేశారు. అనంతపురం రూరల్ ఇన్‌చార్జ్ డీఎస్పీ శ్రీనివాసరావు, బుక్కరాయసముద్రం సీఐ పుల్లయ్య, శింగనమల, నార్పల, గార్లదిన్నె ఎస్ఐలు విజయకుమార్, సాగర్, మహమ్మద్ గౌస్, సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఓంకార్‌ను అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన ఇద్దరూ పరారీలో ఉన్నారు. అనంతపురం ఎస్పీ జగదీష్ తరిమెలకు వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ఇంద్రకీలాద్రికి మహా శివరాత్రి శోభ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్ర కీలాద్రికి శివరాత్రి శోభ వచ్చింది. విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై ఈ నెల 13 నుంచి 20 వరకూ మహా శివరాత్రి ఉత్సవాలు నిర్వహించడానికి దుర్గా మల్లేశ్వరస్వామివార్ల దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. తొలిరోజైన 13న ఉదయం 8 గంటలకు గంగా పార్వతీ సమేత మల్లేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను నూతన వధూవరులుగా అలంకరిస్తారు. 15న మల్లేశ్వరస్వామికి త్రికాల అభిషేకాలు, నిర్వహిస్తారు. రాత్రి 9 గంటలకు మహాన్యాసం, లింగోద్భవ కాలంలో అభిషేకాలు అనంతరం రాత్రికి గంగా పార్వతీ సమేత మల్లేశ్వరస్వామి దివ్య లీలా కల్యాణోత్సవం జరుగుతుంది. 16న సాయంత్రం రథోత్సవం ఉంటుంది.

నకిలీ మద్యం కేసులో ఆరుగురికి బెయిల్

ములకలచెరువు: ములకలచెరువు నకిలీ మద్యం కేసులో ఆరుగురికి బెయిల్ మంజూరైంది. ప్రధాన నిందితుడు ఎ.జనార్ధన్‌రావు (ఏ1), సయ్యద్‌హాజీ (ఏ3), మిథున్‌దాస్ (ఏ10), అంతదాస్ (ఏ11), జగన్‌మోహన్‌రావు (ఏ26), అల్లాభక్షు(ఏ29)లకు తంబళ్లపల్లె కోర్టు మంగళవారం బెయిల్ మంజూరు చేసినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
హెల్త్ డిపార్ట్‌మెంట్
ఇ-టెండర్లు కోరుతూ ప్రకటన
Roc No.TTD-33021(69)/5/2025-HEALTH-TPT తేది: 02.02.2026
ఐడి: 894606 ప్రకారం వార్షిక బ్రహ్మోత్సవాలు-2026 సందర్భంగా శ్రీ కోదండ రామ స్వామి దేవాలయం, ఒంటిమిట్ట, కడప జిల్లా వద్ద పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టుటకు 3134 నం.లు అన్‌స్కిల్డ్ వర్కర్లు మరియు 134 నం.లు సెమీస్కిల్డ్ వర్కర్లు సరఫరా కొరకు హెల్త్ డిపార్ట్‌మెంట్, తిరుపతి వారు ఇ-టెండర్లు (1వ పిలుపు) (ఆన్-లైన్) కోరుతున్నారు. సమాచారం కొరకు హెల్త్ డిపార్ట్‌మెంట్, టీటీడీ, తిరుపతిను సంప్రదించగలరు మరియు వివరాల కొరకు https://apeprocurement.gov.inకు లాగిన్ కాగలరు.
TTD-40021/10/2025-PRO SEC (Adv. No.383), Dt.: 03.02.2026 | ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ లిమిటెడ్
(ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వరంగ సంస్థ)
చీఫ్ ఇంజినీర్- (సెంట్రల్) కార్యాలయం, APIIC టవర్స్, ప్లాట్ నం. 1, IT పార్క్, మంగళగిరి, గుంటూరు (జిల్లా), ఆం.ప్ర.-522503
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
సంక్షిప్త టెండరు ప్రకటన నం. 98 & 99/CE-C/APIIC/2025-26 తేది: 02.02.2026
సంక్షిప్త టెండరు ప్రకటన నం.98: డిపాజిట్ కంట్రిబ్యూషన్ వర్క్ క్రింద ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డ్ (APEDB) కార్యాలయం (5వ అంతస్తు), మయూరి టెక్ పార్క్, మంగళగిరి, గుంటూరు జిల్లా వద్ద మాడ్యూలర్ ఫర్నిచర్ సరఫరా, స్థాపన మరియు ఇంటీరియర్ పనులు. **సంక్షిప్త టెండరు ప్రకటన నం.99:** ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డ్ (APEDB) మంగళగిరి, గుంటూరు జిల్లా యొక్క కార్పొరేట్ కార్యాలయంలో ఇంటిగ్రేటెడ్ ఆడియో- విజువల్ మరియు డిజిటల్ కమ్యూనికేషన్ ఎకోసిస్టమ్ ఏర్పాటు చేయుట. టెండరు ప్రకటన వివరాలు మరియు బిడ్ డాక్యుమెంట్లను www.apeprocurement.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును.
సం/- చీఫ్ ఇంజినీర్–C, APIIC లిమిటెడ్, మంగళగిరి
DIPR RO No. 4793PP/CL/Advt/1/1/2021-22, Dt: 03.02.2026

విశేషపత్రం
పార్ట్-II - సెక్షన్ 3 - సబ్-సెక్షన్ (ii)
రైల్వే మంత్రిత్వ శాఖ
(దక్షిణ మధ్య రైల్వే)
PUB/1873
ప్రకటన
సికింద్రాబాద్, 29 జనవరి, 2026

S.O.421(E)- రైల్వే చట్టం 1989 (24 ఆఫ్ 1989)లోని సెక్షన్ 20A లోని సబ్-సెక్షన్ (1) ద్వారా సంక్రమించిన అధికారాలు వినియోగించుకుంటూ (ఇకమీదట సదరు చట్టంగా నిర్దేశించబడును) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని బాపట్ల జిల్లాలో బాపట్ల గ్రామం మరియు మండలంలో విజయవాడ - ఒంగోలు సెక్షన్‌లో బాపట్ల TSS నిర్మాణం - 3000 MT లోడింగ్ టార్గెట్‌ను నెరవేర్చుటకు 1x25 kV నుండి 2x25kV వరకు ఎలక్ట్రిక్ ట్రాక్షన్ సిస్టమ్ యొక్క స్థాయిపెంపుదల పని కొరకు దీనికి జత చేసిన షెడ్యూలులో ఇచ్చిన సంక్షిప్త వివరణ గల భూమి ప్రజోపయోగార్థం కావలసివున్నదని కేంద్ర ప్రభుత్వం సంతృప్తి చెందిన తరువాత సదరు అవసరానికి సదరు భూసేకరణకు తన ఉద్దేశాన్ని ఇందుమూలంగా ప్రకటిస్తోంది.

సదరు భూమిలో ప్రయోజనం గల ఏ వ్యక్తి అయినా అధికారిక గెజిట్‌లో ఈ ప్రకటన ప్రచురించబడిన తేదీ నుండి ముప్పై (30) రోజులలోగా సదరు చట్టంలోని సెక్షన్ 20D లోని సబ్-సెక్షన్ (1) క్రింద, పైన తెలిపిన అవసరార్థం సదరు భూమి ఉపయోగానికి మరియు సేకరణకు ఆక్షేపణలు తెలియచేయవచ్చును.

అట్టి ప్రతి ఆక్షేపణను సమర్థ ప్రాధికారి (LA) అంటే రెవెన్యూ డివిజినల్ ఆఫీసర్, బాపట్ల వారికి వ్రాతపూర్వకముగా దానికి గల కారణాలతో తెలియచేయవలెను మరియు సమర్థ ప్రాధికారి రెవెన్యూ డివిజినల్ ఆఫీసర్, బాపట్ల వారు ఆక్షేపణదారుకు స్వయంగా లేదా లీగల్ ప్రాక్టీషనర్ ద్వారా విచారణ జరిపేందుకు అవకాశం కల్పిస్తారు మరియు అట్టి ఆక్షేపణలన్నీ విచారించిన మీదట భూ సేకరణ కొరకు సమర్థ ప్రాధికారి (CALA) అవసరమని భావిస్తే తదుపరి విచారణ జరిపిన తరువాత ఆక్షేపణలను అనుమతిస్తూ లేదా అనుమతించకుండా ఉత్తర్వు జారీచేస్తారు.

సదరు చట్టంలోని సెక్షన్ 20(D) లోని సబ్-సెక్షన్ (2) క్రింద భూ సేకరణ కోసం సమర్థ ప్రాధికారిచే చేయబడిన ఏ ఉత్తర్వు అయినా తుదిగా ఉంటుంది. ఈ ప్రకటన క్రింద కవరయ్యే భూమి ప్లాన్లు మరియు భూమి ఇతర వివరాలు సమర్థ ప్రాధికారి (CALA) యొక్క పైన తెలిపిన కార్యాలయంలో లభిస్తాయి మరియు ప్రయోజనంగల వ్యక్తులు తనిఖీ చేసుకోవచ్చును.

షెడ్యూలు

సేకరణ క్రింద ఉన్న భూముల వివరణ: బాపట్ల జిల్లాలో బాపట్ల గ్రామం మరియు మండలంలోవిజయవాడ - ఒంగోలు సెక్షన్‌లో బాపట్ల TSS నిర్మాణం - 3000 MT లోడింగ్ టార్గెట్‌ను నెరవేర్చుటకు 1x25 kV నుండి 2x25kV ట్రాక్షన్ సిస్టమ్‌కు ఎలక్ట్రిక్ ట్రాక్షన్ సిస్టమ్ యొక్క స్థాయిపెంపుదల పనికొరకు

క్ర. సం.	మండలం పేరు	గ్రామం పేరు	అభ్యర్థన ప్రతిపాదనల ప్రకారం సర్వే నెంబరు	భూమి రకం (ప్రభుత్వ/ ప్రైవేట్, మొ॥)	భూమి స్వభావం (మాగాణి/ మెట్ట)	తాత్కాలిక విస్తీర్ణం (ఎకరాలలో)	తాత్కాలిక విస్తీర్ణం (హెక్టార్లలో)	తాత్కాలిక విస్తీర్ణం (చ.మీ.లో)	పట్టాదారు/ అనుభవదారు పేరు
1	బాపట్ల	వెస్ట్ బాపట్ల	363-1B	ప్రైవేట్ భూమి	మెట్ట	1.78	0.720	7203.404	సాల్వేషన్ ఆర్మీ
2	బాపట్ల	వెస్ట్ బాపట్ల	372-1B	ప్రభుత్వ అన్యాక్రాంత భూమి	మెట్ట	0.73	0.295	2954.205	సాల్వేషన్ ఆర్మీ
	మొత్తం					2.51	1.015	10157.609	

[F. No. W.Con/182/SRP/TSS/Bapatla/20A]
A2372 కె.సూర్యనారాయణ, చీఫ్ ఇంజనీర్/ Con-III

మౌనంగానే మెడలు వంచి!

అమెరికాతో వాణిజ్య ఒప్పందం వెనక...

- ఫలించిన మోదీ వేచి చూసే ఎత్తుగడ
- ఇతర దేశాలతో వరుసగా ఒప్పందాలు
- దాంతో ట్రంప్‌పై పెరిగిన ఒత్తిడి
- ఈయూ–భారత్ ఒప్పందంతో బెంబేలు
- దిగొచ్చిన అమెరికా అధ్యక్షుడు

ట్రంప్, మోదీ (ఫైల్)

అసలే అతను డొనాల్డ్ ట్రంప్. శత్రువులా, మిత్రులా అన్న తేడా కూడా లేకుండా అన్ని దేశాలనూ హడలెత్తిస్తూ వస్తున్న వ్యక్తి! కఠిన పదజాలంతో కూడిన బెదిరింపులతో, ఎడాపెడా టారిఫ్‌ల బాదుడుతో వణుకు పుట్టించడాన్నే తన నైజంగా మార్చుకున్నారు. రెండోసారి అధికారం చేపట్టింది మొదలు, ఈ ఏడాది కాలంలో ప్రపంచ దేశాలకు ఒకరకంగా పీడకలలా పరిణమించారు. చివరికి దక్షిణ కొరియా, బ్రిటన్ వంటి అతి సన్నిహిత మిత్ర దేశాలు కూడా ట్రంప్ బెదిరింపులకు జడిసి ఆయన డిమాండ్లకు అనుగుణంగా అమెరికాతో వాణిజ్య ఒప్పందాలకు తలొగ్గాల్సి వచ్చింది. ఇలాంటి పరిస్థితుల్లో భారత్ విషయంలో మాత్రం ట్రంప్ హఠాత్తుగా దిగొచ్చిన తీరు ప్రపంచ దేశాలను విస్మయానికి గురి చేస్తోంది. భారత్‌పై 50 శాతం టారిఫ్‌లను ఏకంగా 18 శాతానికి తగ్గిస్తున్నట్టు సోమవారం ట్రంప్ ప్రకటించడం తెలిసిందే. దీన్ని భారత్ సాధించిన ఘన విజయంగా పరిగణిస్తున్నారు. ముఖ్యంగా ప్రధాని నరేంద్ర మోదీ ఈ విషయంలో తొలినుంచీ వ్యూహాత్మకంగా వ్యవహరించారు. ట్రంప్ బెదిరింపులకు తలొగ్గకుండా, మాటల యుద్ధానికి బదులివ్వకుండా సంయమనం పాటిస్తూనే చివరికి మౌనంగానే ఆయన మెడలు వంచారన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

బెదిరింపులనే తిరుగులేని ఆయుధంగా చేసుకుంటూ గత ఏడాది కాలంలో ట్రంప్ చెలరేగిపోయారు. దేశాధినేతలంతా తాను చెప్పినట్టు వినాలన్న ఒంటెత్తు పోకడ ప్రదర్శించారు. చివరికి నోబెల్ శాంతి పురస్కారానికి తాను అర్హుడినంటూ ప్రకటనలు చేయాల్సిందిగా వారిని ఒత్తిడి చేసే స్థాయికీ వెళ్లారు! పాక్ లాంటి పలు దేశాల అధినేతలు అందుకు తలొగ్గారు కూడా. కానీ మోదీ నుంచి మాత్రం మౌనమే సమాధానమైంది. దాంతో ట్రంప్ ఇగో దెబ్బ తిన్నది కూడా. మోదీ వ్యక్తిగతంగా ఫోన్ చేయనందుకే భారత్‌తో వాణిజ్య ఒప్పందం ఖరారు కాలేదని అమెరికా వాణిజ్య మంత్రి లుట్నిక్ బాహాటంగా చేసిన వ్యాఖ్యలు ఇందుకు అద్దం పట్టాయి. ప్రధాని మాత్రం వీటిని పట్టించుకోలేదు. అంతేగాక ట్రంప్ బెదిరింపుల ఉచ్చులో పడకుండా వ్యూహాత్మకంగా వ్యవహరించారు. ఒప్పందం విషయమై ట్రంప్ నాలుగుసార్లు స్వయంగా ఫోన్ కాల్స్ చేసినా పట్టించుకోలేదు. ఆయన కారాలు, మిరియాలు నూరుతున్నా లక్ష్యపెట్టకుండా బ్రిటన్, న్యూజిలాండ్, అనంతరం ఒమన్‌లతో లాభదాయక రీతిలో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్నారు. తద్వారా స్వతహాగా వ్యాపారి అయిన ట్రంప్‌నే మించిపోయే స్థాయిలో మోదీ వ్యాపార దక్షత ప్రదర్శించారు. ఈ చర్యతో ఆయనను పునరాలోచనలో పడేశారు. ఇక గత నెలలో యూరోపియన్ యూనియన్‌తో అతి కీలకమైన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని భారత్ ఖరారు చేసుకుంది. ప్రపంచ చరిత్రలోనే అత్యంత భారీదని కొనియాడుతున్న ఈ డీల్ భారత్‌పై దూకుడు విషయంలో ట్రంప్‌కు గట్టిగా బ్రేకులు వేసిందని చెబుతున్నారు. 27 దేశాల కూటమి అయిన ఈయూతో కుదిరిన ఈ ఒప్పందం అంతర్జాతీయ వేదికపై భారత స్థాయిని మరింత పెంచింది. ట్రంప్ చపలచిత్తం పుణ్యమా అని ఇతర దేశాల దృష్టిలో అమెరికా శరవేగంగా విశ్వసనీయతను కోల్పోతూ వస్తోంది. అందుకు విరుద్ధంగా భారత్ మాత్రం అత్యంత నమ్మదగ్గ భాగస్వామ్య దేశంగా తన ప్రతిష్టను పెంచుకుంటూ వచ్చింది. పైగా ప్రపంచంలోకెల్లా అతి పెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఒకటైన భారత్‌ను ఏ దేశమూ ఇప్పుడు తేలిగ్గా తీసుకునే పరిస్థితి లేదు. ఇందుకు అమెరికా కూడా మినహాయింపు కాదు. అందుకే వ్యవసాయ, పాడి తదితర కీలక రంగాలను అమెరికా పరిశ్రమలకు బాహాటంగా తెరిచేందుకు కరాఖండిగా నిరాకరించి కూడా ఒప్పందానికి ట్రంప్‌ను భారత్ ఒప్పించగలిగింది! అదే సమయంలో ట్రంప్ ఎంతగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా ప్రతి వ్యాఖ్యలకు దిగకుండా మోదీ పరిణతి ప్రదర్శించారు.

చైనాతో స్నేహ గీతం

ట్రంప్ దూకుడుకు చెక్ పెట్టే చర్యల్లో భాగంగా వ్యూహాత్మకంగా చైనాకు దగ్గరయ్యేందుకు కూడా భారత్ వెనకాడలేదు. గతేడాది షాంఘై సహకార సమాఖ్య భేటీకి హాజరయ్యేందుకు ఏడేళ్ల అనంతరం మోదీ చైనాలో పర్యటించారు! ఆ సందర్భంగా చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో కలిసి ఫొటోలకు పోజులిచ్చారు. అవి సృష్టించిన సంచలనం అంతా ఇంతా కాదు. చివరికి ట్రంప్ కూడా వాటిపై చిర్రుబుర్రులాడారు. భారత్, రష్యాలను అమెరికా చివరికి చైనాకు కోల్పోయిందంటూ నిట్టూర్చారు! ఆ తర్వాత రెండు నెలలకే పుతిన్‌కు ఢిల్లీలో మోదీ రాచమర్యాదలు చేశారు. రష్యాతో పలు ఒప్పందాలు కూడా కుదుర్చుకున్నారు. ఇలా పలు అగ్ర రాజ్యాలతో భారత్ వ్యూహాత్మకంగా ద్వైపాక్షిక బంధాలను బలోపేతం చేసుకుంటున్న వైనం కూడా ట్రంప్‌ను పునరాలోచనలో పడేసింది. భారత్ అక్కడితోనే ఆగలేదు. ట్రంప్ టారిఫ్‌లకు ప్రతీకారంగా తాను కూడా అమెరికాపై సుంకాలు బాదింది! అమెరికా నుంచి దిగుమతయ్యే పప్పులు, తృణధాన్యాలపై ఏకంగా 30 శాతం టారిఫ్‌లు విధించింది. ట్రంప్‌లా గొంతెత్తి ప్రకటనలు చేయకుండా మౌనంగానే గత నవంబర్ నుంచే వాటిని వసూలు చేయడం కూడా ప్రారంభించింది.

'ఒప్పందం'పై మోదీ మౌనం

భారత్‌తో వాణిజ్య ఒప్పందం కుదిరిపోయిందని ట్రంప్ ప్రకటించినా, దానిపై మోదీ మాత్రం సూటిగా స్పందించకపోవడం విశేషం. అంతేగాక రష్యా నుంచి చమురు కొనుగోళ్లను పూర్తిగా నిలిపేసేందుకు భారత్ ఒప్పుకుందని, అమెరికా నుంచి దిగుమతులను ఏకంగా 500 బిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లనుందని ట్రంప్ చేసిన వ్యాఖ్యలపైనా మోదీ మౌనమే వహించారు. కేవలం టారిఫ్‌ల తగ్గింపుకు హర్షం వ్యక్తం చేయడానికే తన స్పందనను పరిమితం చేయడం గమనార్హం.

- సాక్షి, నేషనల్ డెస్క్

'గోర్' ఫ్యాక్టర్

సెర్గియో గోర్. భారత్‌లో అమెరికా నూతన రాయబారి. భారత్‌తో అమెరికా వాణిజ్య ఒప్పందం, టారిఫ్‌ల తగ్గింపు వెనక ఆయన పాత్ర కీలకంగా నిలిచింది. ఇరు దేశాల సంబంధాలు కొన్ని దశాబ్దాల్లో ఎన్నడూ లేనంతగా దిగజారిన తరుణంలో గత జనవరి 12న ఆయన బాధ్యతలు స్వీకరించారు. ద్వైపాక్షిక సంబంధాలను ఎన్నడూ లేనంత బలోపేతం చేయడమే ఆ సందర్భంగా స్పష్టంగా ప్రకటించారు. 'నిజమైన మిత్రులు తొలుత విభేదించవచ్చు. కానీ అంతిమంగా ఒక్కతాటిపైకే వస్తారు' అని చెప్పుకొచ్చారు. అమెరికాకు భారత్ కంటే ముఖ్యమైన దేశం మరేదీ లేదని కూడా స్పష్టం చేశారు. ఖనిజాల అన్వేషణ, ఏఐ టెక్నాలజీ వాడకానికి సంబంధించి అమెరికా ఏర్పాటు చేసిన 'పాక్స్ సిలికా' కూటమిలో చేరాల్సిందిగా భారత్‌ను ఆహ్వానించారు కూడా. అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై నెలకొన్న సుదీర్ఘ ప్రతిష్టంభన కాస్తా ఆయన వచ్చిన మూడు వారాల్లోపే వీడిపోవడం విశేషం. ట్రంప్‌కు అత్యంత సన్నిహితుల్లో గోర్‌కు పేరుంది. ఏ సందర్భంలోనైనా గోర్‌ను తాను పూర్తిగా విశ్వసిస్తానని ట్రంప్ చెబుతుంటారు. భారత్‌తో ఒప్పందం, టారిఫ్‌ల తగ్గింపు విషయంలో ట్రంప్‌పై ఆయన ప్రభావం చాలా ఉన్నట్టు విశ్లేషకులు చెబుతున్నారు.

మాకు సమాచారం లేదు: రష్యా

మాస్కో: చమురు కొనుగోళ్ల నిలిపివేతపై భారత్ నుంచి ఇప్పటి దాకా అధికారికంగా ఎలాంటి సమాచారమూ లేదని రష్యా పేర్కొంది. రష్యా నుంచి చమురు కొనుగోళ్లను పూర్తిగా నిలిపేసేందుకు భారత్ అంగీకరించినట్టు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడం తెలిసిందే. ఇక్కడి వెనెజువెలా నుంచే అధికంగా చమురు కొనుగోలు చేస్తుందని కూడా ఆయన చెప్పుకొచ్చారు. ఈ నేపథ్యంలో ట్రంప్ వ్యాఖ్యలపై క్రెమ్లిన్ అధికార ప్రతినిధి ద్మిత్రీ పెస్కోవ్ మంగళవారం ఈ మేరకు స్పందించారు. భారత్‌తో వ్యూహాత్మక బంధాన్ని బలోపేతం చేసుకోవాలన్నదే తమ లక్ష్యమని ఆయన చెప్పారు. ట్రంప్ వ్యాఖ్యలను నిశితంగా పరిశీలిస్తున్నట్టు రష్యా ఇంధన రంగ వ్యవహారాలు చూసే ఉప ప్రధాని అలెగ్జాండర్ నొవాక్ చెప్పారు. భారత రిఫైనరీల నుంచి ఒప్పందాల రద్దు దిశగా ఎలాంటి నోటీసులూ అందలేదని రష్యా ఇంధన శాఖ వర్గాలు కూడా స్పష్టం చేశాయి. ఉక్రెయిన్‌తో యుద్ధం అనంతరం రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ భారీగా పెంచుకోవడం తెలిసిందే. ఆ దేశం నుంచి అత్యధికంగా చమురు కొనుగోలు చేస్తున్న దేశంగా కూడా నిలిచింది. దీనిపై అమెరికాతో పాటు యూరప్ దేశాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసినా లెక్కచేయని సంగతి తెలిసిందే.

లోక్‌సభలో అదే రగడ

8 మంది విపక్ష సభ్యుల సస్పెన్షన్
- సమావేశాలు ముగిసేదాకా వేటు
- నరవణె పుస్తకంపై కొనసాగిన వివాదం
- దానిపై మాట్లాడనివ్వాలన్న రాహుల్
- పోడియంపైకెక్కి సభ్యుల నిరసనలు
- కాగితాలు చించి స్పీకర్‌పైకి విసిరివేత

రాహుల్

సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభలో ప్రతిష్టంభన కొనసాగుతోంది. ఆర్మీ మాజీ చీఫ్ ఎం.ఎం.నరవణె పుస్తకం ఉదంతంపై సోమవారం సభలో రేగిన వివాదం మంగళవారం కూడా కొనసాగింది. దానిపై తనను మాట్లాడనివ్వాలంటూ విపక్ష నేత రాహుల్‌గాంధీ పట్టుబట్టారు. అందుకు సభాపతి అనుమతించకపోవడంతో కాంగ్రెస్‌తో పాటు ఇతర విపక్ష సభ్యులు నిరసనలకు దిగారు. నినాదాలతో సభను హోరెత్తించారు. కాగితాలను చించి స్పీకర్ కేసి విసిరారు. పోడియంపైకి ఎక్కేందుకు ప్రయత్నించారు. ఈ ఉదంతం చివరికి ఎనిమిది మంది విపక్ష సభ్యుల సస్పెన్షన్‌కు దారితీసింది.

ఉదయం నుంచే...

మంగళవారం ఉదయం సభ ప్రారంభం కాగానే రాహుల్‌గాంధీ మాట్లాడారు. 2020 నాటి భారత్, చైనా ఘర్షణకు సంబంధించి నాటి ఆర్మీ చీఫ్ నరవణె తన పుస్తకంలో పేర్కొన్న అంశాలకు సంబంధించి ఓ మేగజైన్‌లో వచ్చిన వ్యాసాన్ని సోమవారం ఆయన సభలో ఉటంకించడం, అందుకు స్పీకర్ బిర్లా అభ్యంతరం తెలపడం తెలిసిందే. స్పీకర్ సూచించిన మేరకు సదరు వ్యాసాన్ని తాను ధ్రువీకరిస్తున్నట్టు మంగళవారం రాహుల్ సభలో ప్రకటించారు. ఈ మేరకు దానిపై తాను సంతకం చేసిన కాపీని సమర్పించారు. దాన్ని పరిశీలించాక స్పందిస్తామని సభాపతి స్థానంలో ఉన్న ప్యానెల్ స్పీకర్ దిలీప్ సైకియా ప్రకటించారు. అయినా నరవణె పుస్తకంపై మాట్లాడేందుకు రాహుల్ తిరిగి ప్రయత్నించారు. దాంతో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అభ్యంతరం తెలిపారు. స్పీకర్ ఒకసారి రూలింగ్ ఇచ్చాక అదే అంశాన్ని పదేపదే లేవనెత్తకూడదన్న కనీస నిబంధనను సూచించారు. తాను విపక్ష నేతనని, మాట్లాడేందుకు అనుమతి కోరాల్సిన అవసరం లేదని రాహుల్ బదులిచ్చారు. మేగజైన్‌లోని అంశంపై మాట్లాడి తీరతానని పట్టుబట్టారు. ప్యానెల్ స్పీకర్ మాత్రం ఇతర విపక్ష సభ్యులను మాట్లాడాల్సిందిగా కోరారు. కానీ వరుసగా ముగ్గురు సభ్యులు మాట్లాడేందుకు నిరాకరించారు. తద్వారా రాహుల్‌కు సంఘీభావం ప్రకటించారు. దాంతో ఎన్డీఏ భాగస్వామి టీడీపీకి చెందిన హరీశ్ బాలయోగిని మాట్లాడాల్సిందిగా ప్యానెల్ స్పీకర్ కోరారు. ఆయన మాట్లాడుతుండగా విపక్ష సభ్యులు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దాంతో సభ పదేపదే వాయిదా పడింది. అయినా పరిస్థితి అదుపులోకి రాకపోగా విపక్ష సభ్యులు కాగితాలు చించి స్పీకర్ కేసి విసిరారు. పోడియంపైకి, లోక్‌సభ సెక్రెటరీ జనరల్ టేబుల్‌పైకి ఎక్కేందుకు ప్రయత్నించారు. దాంతో తీవ్ర గందరగోళం నడుమ సభ మరోసారి వాయిదా పడింది. మధ్యాహ్నం మూడింటికి సభ తిరిగి సమావేశం కాగానే సభాపతి స్థానంలో ఉన్న దిలీప్ సైకియా నేరుగా ఎనిమిది మంది విపక్ష సభ్యుల గుర్జీత్‌సింగ్ ఔజ్లా, హిబీ ఈడెన్, సి.కిరణ్‌కుమార్‌రెడ్డి, అమరీందర్‌సింగ్ రాజా వారింగ్, మాణిక్యం ఠాగూర్, ప్రశాంత్ పడోలే, డీన్ కురియాకోస్ (కాంగ్రెస్), ఎస్.వెంకటేశన్ (సీపీఎం) పేర్లు చదివి వినిపించారు. వారిని సస్పెండ్ చేయాల్సిందిగా రిజిజు తీర్మానం ప్రవేశపెట్టారు. సభ్యులు సభ పట్ల, సభాపతి అధికారాల పట్ల అమర్యాదగా ప్రవర్తించారని ఆక్షేపించారు. తీర్మానాన్ని సభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. 8 మంది సభ్యులను ఏప్రిల్ 2న బడ్జెట్ సమావేశాలు ముగిసేదాకా సస్పెండ్ చేస్తున్నట్టు సభాపతి ప్రకటించారు. విపక్ష ఎంపీలు రాహుల్ నేతృత్వంలో పార్లమెంటు ఆవరణలో ధర్నాకు దిగారు.

ప్రజాస్వామ్యానికి తీరని మచ్చ

స్పీకర్ ఓం బిర్లాకు రాహుల్ లేఖ

జాతీయ భద్రతకు సంబంధించిన అంశంపై విపక్ష నేతను లోక్‌సభలో మాట్లాడకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి తీరని మచ్చ అని రాహుల్ గాంధీ మండిపడ్డారు. సభాపతి స్థానంలో ఉన్నవారు సోమ, మంగళవారాల్లో తనతో ప్రవర్తించిన తీరును తీవ్రంగా నిరసిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు ఆయన లేఖ రాశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానంపై విపక్ష నేతను మాట్లాడకుండా అడ్డుకోవడం దేశ చరిత్రలో ఇదే తొలిసారని రాహుల్ అన్నారు. ''కేంద్ర ప్రభుత్వ సూచన మేరకే స్పీకర్ నన్ను మాట్లాడనివ్వకుండా అడ్డుకున్నారు. ఇలా జరగడం మన పార్లమెంటరీ చరిత్రలోనే తొలిసారి!'' అంటూ మండిపడ్డారు.

ఖేమ్‌చంద్

మణిపూర్ సీఎంగా ఖేమ్‌చంద్ సింగ్!

న్యూఢిల్లీ: మణిపూర్‌లో నూతన ప్రభుత్వ ఏర్పాటుకు రంగం సిద్ధమవుతోంది. ముఖ్యమంత్రిగా ఖేమ్‌చంద్ సింగ్, ఉప ముఖ్యమంత్రిగా నేమ్చా కిప్‌జెన్ బాధ్యతలు స్వీకరించబోతున్నట్లు సమాచారం. మంగళవారం ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో తొలుత బీజేపీ శాసనసభాపక్ష భేటీ నిర్వహించారు. 37 మంది ఎమ్మెల్యేలకు గాను 35 మంది హాజరయ్యారు. బీజేపీ కేంద్ర పరిశీలకుడు తరుణ్ చుగ్, ఈశాన్య రాష్ట్రాల ఇన్‌చార్జి సంబిత్ పాత్ర, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు ఎ.శారదాదేవి కూడా పాల్గొన్నారు. అనంతరం మణిపూర్ భవన్‌లో ఎన్డీయే శాసనసభాపక్ష సమావేశం జరిగింది. బీజేపీ ఎమ్మెల్యేలతోపాటు ఆరుగురు నేషనల్ పీపుల్స్ పార్టీ సభ్యులు, ఐదుగురు నాగా పీపుల్స్ ఫ్రంట్ సభ్యులు, ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఎన్డీయే శాసనసభాపక్ష నేతగా ఖేమ్‌చంద్ సింగ్, ఉప నేతగా కుకీ వర్గానికి చెందిన మహిళా నాయకురాలు, మాజీ మంత్రి నేమ్చా కిప్‌జెన్‌ను ఎన్నుకున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటైతే ముఖ్యమంత్రిగా ఖేమ్‌చంద్ సింగ్, ఉప ముఖ్యమంత్రిగా కిప్‌జెన్ బాధ్యతలు స్వీకరిస్తారని ఎన్డీయే వర్గాలు వెల్లడించాయి.

అమెరికాతో ఒప్పందంతో ప్రతి ఒక్కరికీ లబ్ధి

- ఇది అతిపెద్ద నిర్ణయం
- ఎల్లప్పుడూ దేశ ప్రయోజనాల కోసమే పనిచేస్తున్నాం
- ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ భేటీలో ప్రధాని మోదీ స్పష్టీకరణ
- ప్రధానమంత్రిని సత్కరించిన ఎన్డీయే ఎంపీలు

న్యూఢిల్లీ: భారత్–అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం కుదరడం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తంచేశారు. ఇది అతిపెద్ద నిర్ణయమని, మనదేశంలో ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ దేశ ప్రయోజనాల కోసమే పని చేస్తోందని ఉద్ఘాటించారు. ఆయన మంగళవారం ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో మాట్లాడారు. యూరోపియన్ యూనియన్(ఈయూ)తోపాటు అమెరికాతో కీలకమైన వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్నందుకు అధికార పక్ష ఎంపీలు ప్రధాని మోదీని అభినందించారు. ఘనంగా సత్కరించారు. ఈ ఒప్పందాలతో మన తయారీ రంగం బలోపేతం అవుతుందని, ఎగుమతిదారులకు, వ్యాపారవేత్తలకు మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. మోదీ స్పందిస్తూ.. మనదేశ ప్రయోజనాల పరిరక్షణ విషయంలో ఏమాత్రం రాజీ పడకుండా విదేశాలతో ఒప్పందాలు చేసుకుంటున్నట్లు వివరించారు. భారత ఉత్పత్తులపై అమెరికా ప్రభుత్వం సుంకాలు విధించడంపై ఎన్ని విమర్శలు వచ్చినా సహనం వహించామని అన్నారు. ఆ సహనమే ఇప్పుడు మనదేశానికి మంచి ఫలితాలు ఇస్తోందని ఉద్ఘాటించారు. ప్రజాహిత విధానాలు, దేశ అభివృద్ధి కోసం సాగిస్తున్న కృషితోనే ఎన్నికల్లో విజయాలు సాధిస్తున్నామని ప్రధానమంత్రి స్పష్టంచేశారు ఈ విజయాలు చూసి మురిసిపోవద్దని, ప్రజాక్షేత్రంలో ఉంటూ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పని చేస్తూనే ఉండాలని ఎన్డీయే ఎంపీలకు పిలుపునిచ్చారు. పలు కీలక అంశాలపై వారికి దిశానిర్దేశం చేశారు. పార్లమెంట్ సమావేశాల్లో చురుగ్గా పాలుపంచుకోవాలని చెప్పారు. స్టాండింగ్ కమిటీల్లో సభ్యులుగా వందశాతం కష్టపడి పని చేయాలన్నారు. వికసిత్ భారత్ లక్ష్యం గురించి పునరుద్ఘాటించారు. తాజా బడ్జెట్‌పై అభిప్రాయాలు పంచుకున్నారు.

ఆ క్రెడిట్ మోదీకే చెందుతుంది

అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదరడంతో దేశవ్యాప్తంగా ఉత్సాహం కనిపిస్తోందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు చెప్పారు. ప్రధాని మోదీ నేతృత్వంలో తొమ్మిది వాణిజ్య ఒప్పందాలు కుదిరినట్లు గుర్తుచేశారు. ఇప్పటిదాకా 39 దేశాలతో వేర్వేరు ఒప్పందాలు చేసుకోవడం చరిత్రాత్మకమని అభివర్ణించారు. ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ భేటీలో రిజిజు మాట్లాడారు. నేడు మనదేశంలో ఎక్కడ చూసినా సానుకూల వాతావరణం ఉందన్నారు. వ్యాపార, వాణిజ్యాలు మరింత వృద్ధి చెందుతాయని వ్యాఖ్యానించారు. ఇండియా–అమెరికా, ఇండియా–ఈయూ వాణిజ్య ఒప్పందాల క్రెడిట్ ప్రధాని మోదీకే చెందుతుందని శివసేన ఎంపీ మిలింద్ దేవ్‌రా తేల్చిచెప్పారు.

దేశాన్ని బజారులో పెట్టారు

- మన రైతన్నల రక్తం, స్వేదాన్ని అమెరికాకు అమ్మేస్తున్నారు
- అదానీపై కేసు, ఎప్‌స్టీన్ ఫైళ్ల కారణంగా మోదీ లొంగిపోయారు
- దేశ ప్రయోజనాల పరిరక్షణ విషయంలో రాజీపడ్డారు
- ప్రధానిపై రాహుల్ ఆగ్రహం

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా ఒత్తిడికి లొంగిపోయి ఆ దేశంతో వాణిజ్య ఒప్పందం చేసుకున్నారని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ ఒప్పందం ద్వారా మన రైతన్నల రక్తాన్ని, స్వేదాన్ని అమెరికాకు అమ్మేస్తున్నారని ధ్వజమెత్తారు. రాహుల్ మంగళవారం పార్లమెంట్ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రపతి ప్రసంగంపై లోక్‌సభలో ప్రతిపక్ష నేతను మాట్లాడనివ్వకపోవడం చరిత్రలో ఇదే మొదటిసారి అంటూ విమర్శించారు. అసలు విషయం నరవణే పుస్తకం గురించి కాదని.. ప్రధాని మోదీ నిర్వాకాలను బయటపెడతానన్న భయంతోనే పార్లమెంట్‌లో తనకు ఇవ్వలేదని మండిపడ్డారు. దేశ ప్రయోజనాల పరిరక్షణ విషయంలో ప్రధానమంత్రి రాజీపడ్డారని ఆక్షేపించారు. నాలుగు నెలలుగా ఆగిపోయిన ఒప్పందం ఒక్కపూటలోనే ఎలా కుదిరిందో చెప్పాలని నిలదీశారు. మోదీ ఎందుకో కంగారు పడుతున్నారని, హఠాత్తుగా బయటి శక్తుల ఒత్తిడికి తలొగ్గారని విమర్శించారు. మోదీ ఇమేజ్ బుడగ ఒక్కసారిగా పేలిపోయిందని రాహుల్ ఎద్దేవా చేశారు. ఒప్పందం వెనుక అసలేం జరిగిందో ప్రజలు ఆలోచించాలని సూచించారు.

మోదీ లొంగుబాటుకు రెండు కారణాలు

అమెరికాతో ఒప్పందం కారణంగా మన రైతులకు నష్టం జరుగుతుందని రాహుల్ ఆందోళన వ్యక్తం చేశారు. వారి శ్రమ, రక్తం, స్వేదాన్ని పరాయి దేశానికి తాకట్టు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కేవలం రైతులనే కాకుండా మొత్తం దేశాన్ని బజారులో పెట్టారని ప్రధానమంత్రిపై నిప్పులు చెరిగారు. తాను నోరివిప్పితే నిజాలు బయటకు వస్తాయని భయపడుతున్నారని, అందుకే పార్లమెంట్‌లో మాట్లాడేందుకు అనుమతి ఇవ్వడం లేదని పేర్కొన్నారు. అమెరికా ఒత్తిడికి మోదీ లొంగిపోవడం వెనుక పలు కారణాలు ఉన్నాయని తెలిపారు. మోదీ మిత్రుడు, వ్యాపారవేత్త గౌతమ్ అదానీపై అమెరికాలో కేసు నడుస్తోందని గుర్తుచేశారు. అలాగే ఎప్‌స్టీన్ ఫైళ్లలో పలు రహస్యాలు దాగి ఉన్నాయని చెప్పారు. ఈ రెండు అంశాలూ మోదీ ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారాయన్నారు. అనంతరం రాహుల్ 'ఎక్స్'లో పోస్టుచేశారు. జనరల్ నరవణే స్టేట్‌మెంట్, ఎప్‌స్టీన్ కేసుపై తాము మాట్లాడితే మోదీకి భయమెందుకని ప్రశ్నించారు. గతంలో అమెరికా టారిఫ్‌ల అంశంలోనూ మోదీ లొంగిపోయారని విమర్శించారు.

మోదీజీ.. నిజాలు చెప్పండి: ప్రియాంక

అమెరికా వాణిజ్య ఒప్పందంలోని నిజాలను బయటపెట్టాలని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, ఎంపీ ప్రియాంకగాంధీ వాద్రా ప్రధాని మోదీని డిమాండ్ చేశారు. అమెరికా వ్యవసాయ ఉత్పత్తులను ఇకపై భారత్‌లో విక్రయించుకుంటామని, తద్వారా రైతులకు లాభం కలుగుతుందని అమెరికా చెబుతున్నట్లు గుర్తుచేశారు. అంటే భారత వ్యవసాయ రంగంలోకి అమెరికా పూర్తిస్థాయిలో అడుగు పెడుతుందా? మోదీ ప్రణాళిక అదేనా? అని ప్రశ్నించారు. మన రైతులు అమెరికా కంపెనీలతో పోటీ పడాలా? అని అనుమానం వ్యక్తంచేశారు. మన రైతుల ప్రయోజనాలపై రాజీ పడ్డారా? అని ప్రియాంక నిలదీశారు.

మమత

సీఈసీని అభిశంసించాలి

- తీర్మానం ప్రవేశపెడితే మేము మద్దతిస్తాం
- పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ వెల్లడి

న్యూఢిల్లీ: ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌ను అభిశంసించాలని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు మమతా బెనర్జీ అన్నారు. ఆయనపై అభిశంసనకు తీర్మానం ప్రవేశపెడితే తాము కచ్చితంగా మద్దతిస్తామని ప్రకటించారు. ఈ విషయంలో ఇతర విపక్ష పార్టీలు సైతం ముందుకు రావాలని కోరారు. ఆమె మంగళవారం ఢిల్లీలో మీడియా సమావేశంలో మాట్లాడారు. బెంగాల్‌లో తమ పార్టీ మద్దతుదారుల ఓట్లను ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) ముసుగులో తొలగిస్తున్నారని ఆరోపించారు. ఓటర్ల జాబితాలో అక్రమాలకు సీఈసీని జబాబుదారీ చేస్తూ చట్టం తీసుకురావాలంటూ కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేసిన సూచనను మమతా బెనర్జీ గట్టిగా సమర్థించారు. ఇప్పుడు ఓటర్ల జాబితాలో అవకతవకలు జరుగుతున్నాయి కాబట్టి సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను అభిశంసించాలని తేల్చిచెప్పారు. ఈ దిశగా కాంగ్రెస్ ముందడుగు వేస్తే మద్దతిస్తామని అన్నారు.

ఓట్లు తొలగిస్తే బాధితులు ఎక్కడికెళ్లాలి?

బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తామని మమతా బెనర్జీ తేల్చిచెప్పారు. ఎన్నికల సంఘాన్ని వాడుకోకుండా తమతో ముఖాముఖి తలపడాలని బీజేపీకి సవాలు విసిరారు. బెంగాల్‌లో ఎస్ఐఆర్ వల్ల దళితులు, గిరిజనులు, మైనార్టీలు, అణగారినవర్గాల ప్రజలకు అన్యాయం జరుగుతోందని, వారి ఓట్లు రద్దవుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఎస్ఐఆర్‌తో తొలగింపునకు గురైన ఓట్లు వంద శాతం తృణమూల్ కాంగ్రెస్ మద్దతుదారులవేనని చెప్పారు. బీజేపీపై అనుమానం రాకుండా ఒకటి రెండు ఓట్లు ఇతర పార్టీల మద్దతుదారులవి కూడా తొలగించి ఉండొచ్చని వ్యాఖ్యానించారు. ఓట్లు తొలగిస్తే వారంతా ఎక్కడికి వెళ్లాలి? అని ప్రశ్నించారు.

నేడు సుప్రీంకోర్టులో విచారణకు మమత హాజరు!

బెంగాల్‌లో ఎస్ఐఆర్ చేపట్టడాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టనుంది. ఈ విచారణకు బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్వయంగా హాజరయ్యే అవకాశం కనిపిస్తోంది.



రన్‌వేపై ఢీకొన్న విమానాల రెక్కలు

ముంబై విమానాశ్రయంలో ఘటన ● ప్రయాణికులంతా క్షేమం

ముంబై: ఎయిరిండియా, ఇండిగో విమానాల రెక్కలు రన్‌వేపై ఒకదాన్ని ఒకటి తాకాయి. మంగళవారం రాత్రి ముంబై విమానాశ్రయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. కోయంబత్తూరు వెళ్లాల్సిన ఎయిరిండియా విమానం టేకాఫ్‌కు బయల్దేరగా ఇండిగో విమానం హైదరాబాద్ నుంచి వచ్చి లాండై తనకు కేటాయించిన స్థానానికి వస్తోంది. రెండింటి రెక్కల కొనభాగాలు పరస్పరం తాకాయి. దాంతో తమ విమానం రెక్క భాగం దెబ్బతిన్నట్టు ఎయిరిండియా ఒక ప్రకటనలో పేర్కొంది. రెండు విమానాల్లోని ప్రయాణికుల్లో అందరూ సురక్షితంగానే బయటపడ్డారు. వాటికి వెంటనే పూర్తిస్థాయిలో భద్రత తనిఖీలు నిర్వహించారు. ఈ ఘటనపై డీజీసీఏ దర్యాప్తు చేయనున్నట్టు పౌర విమానయాన శాఖ ప్రకటించింది.

పౌరుల వ్యక్తిగత గోప్యతతో ఆటలొద్దు

డేటా షేరింగ్ ఉదంతంపై మెటాకు సుప్రీం మొట్టికాయ

న్యూఢిల్లీ: మెటా సంస్థ, ఆ కంపెనీకి చెందిన వాట్సాప్ తీరును సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. డేటా షేరింగ్ పేరుతో పౌరుల వ్యక్తిగత గోప్యత హక్కుతో ఆటలాడుకోవద్దంటూ గట్టిగా మందలించింది. మార్కెట్‌లో గుత్తాధిపత్యం చెలాయిస్తూ, వినియోగదారుల వ్యక్తిగత సమాచారాన్ని దోచుకుంటున్నారంటూ మండిపడింది. ఈ దేశ పౌరుల్లో ఏ ఒక్కరి హక్కులకు భంగం కలిగించేందుకు తాము ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని తేల్చి చెప్పింది. రాజ్యాంగం కల్పించిన గోప్యతా హక్కు ప్రాముఖ్యతను నొక్కి చెప్పిన న్యాయస్థానం, భారతీయ వినియోగదారుల డేటాను ఒకచోట నుంచి మరొకచోటుకు బదిలీ చేసే వ్యాపారపరమైన ఆస్తిగా పరిగణించవద్దని టెక్ కంపెనీలను హెచ్చరించింది. యూజర్లకు ఛాయిస్ ఇచ్చామంటూ చేసిన వాదనలను ధర్మాసనం మండిపడింది. ''కావాలంటే మీరే ఈ దేశం నుంచి మీ సేవలను ఉపసంహరించుకోండి. మార్కెట్‌లో ఒక ఏకఛత్రాధిపత్యాన్ని సృష్టించారు. ఇక్కడ వినియోగదారుడికి వేరే మార్గమే లేకుండా చేశారు'' అని పేర్కొంది.

అసలు కేసేమిటి?

మెటా సంస్థ గోప్యతా విధానాలు లోపభూయిష్టంగా ఉన్నాయంటూ ఇటీవల కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ఎత్తి చూపింది. మెటా అనుబంధ మెసేజింగ్ యాప్ వాట్సాప్ తన వినియోగదారుల డేటాను మరో అనుబంధ సంస్థ ఫేస్‌బుక్‌తో పంచుకోవడాన్ని తప్పుబట్టింది. ఈ విధానం మార్కెట్‌లో తనకున్న ఆధిపత్యాన్ని దుర్వినియోగం చేయడమేనని సీసీఐ నిర్ధారించింది. అందుకుగాను రూ.213.14 కోట్ల జరిమానా విధించింది. ఈ తీర్పును నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్(ఎన్‌సీఎల్ఏటీ) సైతం సమర్థించింది. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ మెటా, వాట్సాప్ సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది.

అర్థంకాని నిబంధనలు

ఈ సందర్భంగా ధర్మాసనం.. 'ఎలాంటి సాంకేతిక పరిజ్ఞానం లేకపోయినా, అవసరం కొద్దీ ఈ యాప్‌లను కోట్ల మంది నిశ్శబ్ద వినియోగదారులు వాడుతున్నారు. తమ డేటా ఎలా చోరీ అవుతోందో కూడా వారికి తెలియదు. ప్రస్తుతం బ్యాంకింగ్ నుంచి వ్యక్తిగత చాటింగ్ వరకు అన్నీ డిజిటల్ మయమయ్యాయి. దీనిని కంపెనీలు స్వార్థానికి వాడుకోరాదు' అని హెచ్చరించింది. 'డేటా షేరింగ్ పేరుతో భారత పౌరుల వ్యక్తిగత గోప్యత హక్కుతో మీరు ఆడుకోలేరు. వినియోగదారుల డేటాలో చిన్న ముక్కను కూడా మీరు ఇతరులతో పంచుకోవడానికి మేం అనుమతించం' అని సీజేఐ పేర్కొన్నారు. వాట్సాప్ వందల కొద్దీ పేజీల్లో రూపొందించిన ప్రైవసీ నిబంధనలు సామాన్యులకు ఏమాత్రం అర్థం కాని రీతిలో ఎంతో చాకచక్యంగా రూపొందించారంటూ వ్యాఖ్యానించారు. అందులో కొన్ని తమకు కూడా అర్థంకావని తెలిపింది. వ్యక్తిగత సమాచారాన్ని దొంగిలించడానికి చట్టం/కన్సెంట్ ముసుగులో సాగిస్తున్న మోసంగా ధర్మాసనం అభివర్ణించింది.

ఆలయ నిర్మాణానికి విరాళం

నరసరావుపేట రూరల్: ఇస్సపాలెంలోని మహంకాళి ఆలయ నిర్మాణానికి కాసరగడ్డ వీరేంద్ర, రమాదేవి దంపతులు రూ.1,01,116 విరాళంగా అందజేశారు.



పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు నుంచి దిగువకు 2,400 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో నీటి నిల్వ 36.4577 టీఎంసీలు.



నిమ్మకాయల ధరలు

తెనాలి: తెనాలి మార్కెట్ యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.3,500, గరిష్ట ధర రూ.4,800, మోడల్ ధర రూ.4,300 వరకు పలికింది.

ఒక అబద్ధాన్ని నిజం అని చెప్పి ప్రజలను నమ్మించేందుకు అధికార పార్టీ చేపట్టిన అసత్య ప్రచారం సామాన్యులకు ఇబ్బందికరంగా మారిందని గ్రామాల్లో, పట్టణాల్లో చర్చించుకుంటున్నారు. ప్రజాశాంతికి విఘాతం కలిగిస్తున్న ఫ్లెక్సీలను తొలగించాల్సిన పోలీసులు వాటికి పహారా కాస్తూ ఉండటం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. వారు ప్రజలకు రక్షణ కల్పించేందుకు ఉన్నారా? లేక అధికార పార్టీ చెప్పినట్లు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేందుకు ఉన్నారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

బాబు ఫ్లెక్సీ కుట్రలు..

అబద్ధపు ప్రచారాలకు పోలీస్ పహారా, టీడీపీ గూండాల రక్షణ

- ప్రజాశాంతికి విఘాతం కలిగించేలా వెలిసిన ఫ్లెక్సీలు ఎక్కడివక్కడే..
- చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు కూడా అధికారుల అండ
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం పట్టించుకోరా?
- నల్లపాడు పీఎస్‌లో ఫిర్యాదు అందినా స్పందించని అధికారులు

గోరంట్లలో దాడి జరిగిన ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ వద్ద టీడీపీ గూండాలు కర్రలతో, రాడ్లతో పహారా

గుంటూరు రూరల్: శాంతిభద్రతలకు భంగం కలిగించేలా నగరంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను మున్సిపల్ అధికారులు సైతం పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. అనధికార ఫ్లెక్సీలను ఏర్పాటు చేయవద్దంటూ నిమిషాల్లో తొలగించే మున్సిపల్ అధికారులు ఇప్పుడు మిన్నకుండి పోయారేంటని ప్రజలు నిలదీస్తున్నారు.

రక్షణ కల్పించి మరీ...

రాష్ట్రంలో ప్రజాశాంతికి విఘాతం కలిగిస్తూ ఎందరో సామాన్య ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న ఫ్లెక్సీలకు ఒక పక్క పోలీసులు పహారా కాస్తుంటే. మరో పక్క టీడీపీ గూండాలు కర్రలు, రాడ్లతో రక్షణగా ఉంటున్నారు. ఇదేంటని, రాష్ట్రంలో ప్రజా స్వామ్యం ఉందా? డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం ఇదేనా? అని మేధావులు సైతం చర్చించుకుంటున్నారు. నేడు పోలీసులు, మున్సిపల్ అధికారులు ఈ దుస్థితి కల్పించారని పేర్కొంటున్నారు. చిన్నపాటి బర్త్‌డేలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించుకుని ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తే తెల్లారేసరికే వచ్చి మున్సిపల్ అధికారులు తొలగిస్తారు. కానీ అసత్య ప్రచార ఫ్లెక్సీని ఏర్పాటు చేసి వారం రోజులు గడుస్తున్నా... రాష్ట్రం ఆ ఫ్లెక్సీల వల్లే రావణ కాష్టంలా కాలుతున్నా కనీసం ఎవ్వరూ పట్టించుకున్న పాపాన పోలేదని ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఫిర్యాదు చేసినా దిక్కేది?

రాష్ట్రంలో విధ్వంసాలకు కారణమైన, సామాన్య ప్రజల శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న అటువంటి ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలని ప్రముఖ మహిళా న్యాయవాది రజని నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో సీఐకి ఆదివారం ఫిర్యాదు చేశారు. ఫ్లెక్సీని ఏర్పాటు చేసి దాడులకు పాల్పడి, ప్రజా శాంతికి విఘాతం కలిగించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. రెండు రోజులుగా ఈ ఫిర్యాదుపై కనీస చర్యలు చేపట్టలేదని, కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయకపోవటం చూస్తే దాడులకు, చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పోలీసులే అండగా నిలుస్తున్నారా? అని లాయర్ సైతం పలు డిబేట్‌లలో మాట్లాడినట్లు సమాచారం.

చోద్యం చూస్తున్న పోలీసులు

గుంటూరులో ఫ్లెక్సీ వద్ద పోలీసుల కాపలా

సహజంగా ఎక్కడ గొడవలు జరిగినా, ఎటువంటి ప్రజా శాంతికి విఘాతం కలిగించే కార్యక్రమాలు జరుగుతున్నా వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని గొడవలకు పాల్పడే వారిని బెదిరించో, మాట్లాడో సమస్యను పరిష్కరించేందుకు చూస్తారు. గోరంట్లలో జరిగిన దాడి, విద్యానగర్‌లో మాజీ మంత్రి అంబటి ఇంటి వద్ద జరిగిన దాడిలో పోలీసులు అక్కడే ఉన్నా కనీసం విధ్వంసాన్ని ఆపే ప్రయత్నం కూడా చేయకపోవటం శోచనీయం. అంటే సామాన్య ప్రజలకు ఒక న్యాయం, అధికార పార్టీ వారికి ఒక న్యాయమా? అని విమర్శలు వస్తున్నాయి. రాజ్యాంగానికి విరుద్ధంగా, ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా జరుగుతున్న చర్యలను అడ్డుకోవాల్సిన పోలీసులు, అధికారులు మిన్నకుండిపోవటంపై సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. పోలీసులు, అధికారులు కూడా రెడ్ బుక్ రాజ్యాంగాన్నే అమలు చేస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు.

ప్రభుత్వానికి బుద్ధి చెబుతాం

అంబటి కుటుంబ సభ్యులను పరామర్శించిన వైఎస్సార్ సీపీ నేతలు

విలేకరులతో మాట్లాడుతున్న మాజీ హోం మంత్రి మేకతోటి సుచరిత, పక్కన ముఖ్య నేతలు

- మాజీ హోం మంత్రి మేకతోటి సుచరిత
- టీడీపీ గూండాల దాడిలో ధ్వంసమైన ఇల్లు, కార్యాలయం పరిశీలన
- మహిళ ఎమ్మెల్యే దాడులు చేయించడం సిగ్గుచేటు

నగరంపాలెం: అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని మరచి రాష్ట్రంలో రెడ్ బుక్ పాలన అమలు చేస్తూ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను వేధిస్తున్న చంద్రబాబు ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని మాజీ హోం మంత్రి మేకతోటి సుచరిత అన్నారు. వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు కుటుంబ సభ్యులను పార్టీ సీనియర్ నాయకులు మంగళవారం పరామర్శించారు. ఉదయం గుంటూరు సిద్ధార్థనగర్‌లోని అంబటి ఇంటికి వారు చేరుకున్నారు. మాజీ హోం మంత్రి మేకతోటి సుచరిత, ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, లేళ్ల అప్పిరెడ్డి, మురుగుడు హనుమంతరావు, మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్, గుంటూరు పార్లమెంట్ పరిశీలకులు పోతిన మహేష్, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివ కుమార్, నియోజకవర్గాల ఇన్‌చార్జులు బాల వజ్రబాబు (తాడికొండ), అంబటి మురళీకృష్ణ (పొన్నూరు), దొంతిరెడ్డి వేమారెడ్డి (మంగళగిరి) తదితరులు అంబటి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. టీడీపీ గూండాలు జరిపిన విధ్వంసకాండ గురించి అంబటి కుమార్తెలు మౌనిక, మనోజ్ఞ, అంబటి భార్య విజయలక్ష్మిలు వివరించారు. కార్యాలయంలో అంబటి రాంబాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఇంట్లో కుటుంబ సభ్యులు, మహిళలు, పిల్లలు ఉన్నారని.. బయట నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు కేకలు వేసినా ఏమాత్రం ఆలకించకుండా కోడిగుడ్లు, కర్రలు, రాళ్లతో దాడికి పాల్పడ్డారని కన్నీటిపర్యంతమయ్యారు. ఎన్నడూలేని విధంగా భయానకరమైన బీభత్సాన్ని సృష్టించారని తెలియజేశారు. అనంతరం మాజీ హోంమంత్రి మేకతోటి సుచరిత మీడియాతో మాట్లాడుతూ అంబటిని పోలీస్ కస్టడీకి తీసుకుని శారీరకంగా, మానసికంగా మళ్లీ వేదనకు గురి చేసేందుకు పోలీసులు చూస్తున్నారని రాంబాబు కుమార్తె చెబుతున్నారని అన్నారు. మహిళలు ఉంటున్న ఇంట్లోకి ఒక మహిళ ఎమ్మెల్యే వచ్చి దాడులు చేయించడమనేది చాలా దారుణమని పేర్కొన్నారు. రాష్ట్రంలో సాగుతున్న రాక్షస పాలన గురించి రాష్ట్రపతికి నివేదించాలని అన్నారు. గవర్నర్ పాలనను రాష్ట్రంలో విధిస్తే గానీ రెడ్‌బుక్ పాలనకు అంతం ఉండదన్నారు.

■ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజా పరిపాలన చేద్దామనే ఆలోచన కూటమి ప్రభుత్వానికి లేదనేది స్పష్టమైందన్నారు. వైఎస్సార్ సీపీకి ఇలాంటి పోరాటాలు కొత్తేమీ కాదన్నారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా తిరిగి వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడం ఖాయమని ప్రజలు చెబుతున్నారని అన్నారు. లడ్డూకి సంబంధించి వాస్తవాలు బయటకు వచ్చాయని, ఆ వాస్తవాలను మరుగున పెట్టి ప్రజలను డైవర్ట్ చేసేందుకు అంబటి రాంబాబు ఇంటిపై, కార్యాలయంపై దాడి జరిగిందని అన్నారు. మాజీ మంత్రి జోగి రమేష్ ఇంటిపైనా దాడిని ఖండించారు.

న్యూస్‌రీల్

దత్తపీఠంలో మహాసుదర్శన హోమం

ఫిరంగిపురం: ఫిరంగిపురం మండలం అమీనాబాద్ గ్రామంలోని శ్రీ దత్తపీఠంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. అనఘా దేవి, శ్రీ దత్తాత్రేయ స్వామిని విశేషంగా అలంకరించి అష్టోత్తర, సహస్ర నామ పూజలు చేశారు. యాగశాలలో రుత్వికులచే మహాసుదర్శన హోమం నిర్వహించి, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాలను శ్రీదత్త పీఠం నిర్వాహకులు జయశంకర్ పర్యవేక్షించారు.

వైభవంగా పుష్పాలతో విశేష అర్చనలు

తెనాలి టౌన్: శ్రీపంచముఖ ఆంజనేయస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారికి పుష్పాలతో విశేష అర్చనలను వైభవంగా జరిపించారు. స్థానిక షరాఫ్ బజారులోని సువర్చల సమేత పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పుష్ప ఉత్సవం కనులపండువగా నిర్వహించారు. స్వామి వారిని, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన మండపంపై కొలువుదీర్చి వివిధ రకాల పుష్పాలతో అర్చన చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి హరి ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తన సభ్యులు పాల్గొని శ్రీ విష్ణు సహస్ర నామ పారాయణ, అన్నమాచార్య కీర్తనలను ఆలపించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని పుష్పాలంకరణతో ఉన్న స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ వంశ పారంపర్య అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి, ఆర్.వి.కిరణ్‌కుమార్‌లు పర్యవేక్షించారు.

ఆరు నుంచి భారత్ రంగ మహోత్సవ్

నగరంపాలెం: తెలుగు నాటక రంగ గౌరవాన్ని, భారతీయ నాటక సంప్రదాయాల గొప్పతనాన్ని అంతర్జాతీయ స్థాయిలో చాటి చెప్పే లక్ష్యంతో భారత్ రంగ మహోత్సవ్ –అంతర్జాతీయ నాటక ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు వేదిక (తెలుగు నాటక పరిషత్తుల సమ్మేళన సంఘం) అధ్యక్షుడు ముత్తవరపు సురేష్‌బాబు తెలిపారు. మంగళవారం అరండల్‌పేటలోని ఓ హోటల్‌లో జరిగిన మీడియా సమావేశంలో బ్రోచర్ విడుదల చేశారు. తెలుగు నాటక కళా పరిషత్‌ల సమ్మేళనం ఆధ్వర్యంలో భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా (ఢిల్లీ) సహకారంతో ఈ ఉత్సవాన్ని చేపట్టనున్నట్లు ఆయన చెప్పారు. ఈ నెల 6, 7, 8, 9, 10 తేదీల్లో మార్కెట్ కూడలిలోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నాటక ఉత్సవాలు కొనసాగుతాయని అన్నారు. ప్రతి రోజూ మధ్యాహ్నం మూడు గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు, నాటక ప్రదర్శనలు ఉంటాయని చెప్పారు. సమావేశంలో భూషణ్, పోపూరి నాగేశ్వరరావు, ముత్తవరపు పద్మారావు, పొగర్తి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం వివరాలు



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటి మట్టం మంగళవారం 542.30 అడుగులకు చేరింది. ఇది 193.1535 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకు 8,023, ఎడమ కాలువకు 7,852, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 27,866, ఎస్ఎల్‌బీసీకి 2,200, వరద కాలువకు 300 క్యూసెక్కులు విడుదలవుతోంది. సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 46,241 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 46,241 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

వైఎస్ జగన్ పర్యటనను విజయవంతం చేయండి

సమావేశంలో వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు

- వైఎస్సార్ సీపీ ముఖ్య నేతలు
- గుంటూరులో సన్నాహక సమావేశం

నగరంపాలెం: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుంటూరు పర్యటనను విజయవంతం చేయాలని పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో వైఎస్సార్ సీపీ ముఖ్య నేతలు, జిల్లా, నగర, రాష్ట్ర కమిటీ నేతలు, అనుబంధ విభాగాల అధ్యక్షులతో సన్నాహక సమావేశం మంగళవారం జరిగింది. ఇటీవల హత్యాయత్నానికి గురైన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు కుటుంబాన్ని వైఎస్ జగన్ బుధవారం పరామర్శించనున్నారు. సిద్ధార్థనగర్‌లోని ఆయన నివాసానికి వైఎస్ జగన్ వస్తున్న నేపథ్యంలో పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని ముఖ్య నాయకులు పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీలు తలశిల రఘురామ్, లేళ్ళ అప్పిరెడ్డి, మురుగుడు హనుమంతరావు, మాజీ హోం మంత్రి మేకతోటి సుచరిత, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల రెడ్డి, గుంటూరు పార్లమెంట్ జిల్లా పరిశీలకులు పోతిన మహేష్, పార్టీ నగర అధ్యక్షురాలు షేక్ నూరిఫాతిమా, పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ, తెనాలి నియోజకవర్గ సమన్వయకర్త అన్నాబత్తుని శివకుమార్, ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాలవజ్రబాబు, మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, సీఈసీ సభ్యుడు మందపాటి శేషగిరిరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు నిమ్మకాయల రాజనారాయణ, షేక్ గులాంరసూల్, పార్టీ నేతలు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో దాడులకు తావులేదు

- ప్రజాప్రతినిధుల సమక్షంలో రెచ్చిపోయిన కార్యకర్తలు
- టీడీపీకి, వైఎస్సార్‌సీపీకి మధ్య వివాదంలో జనసేన ఎందుకు?
- అంబటి ఇంటిపై దాడి తీరు చూసి న్యాయమూర్తులు సైతం దిగ్భ్రాంతి
- హైకోర్టు న్యాయవాది కన్నా రజిని

గుంటూరు వెస్ట్: ప్రజాస్వామ్య దేశంలో దాడులు ఎవరు చేసినా ఖండించాల్సిన బాధ్యత అందరిపై ఉందని జనసేన అధికార ప్రతినిధి, హైకోర్టు న్యాయవాది కన్నా రజిని పేర్కొన్నారు. గత రెండు రోజుల నుంచి మాజీ మంత్రి అంబటిపైన, ఆయన నివాసం ధ్వంసంపైన ఆమె స్పందించారు. ఈ వివాదం తెలుగుదేశం పార్టీ – వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మధ్య మాత్రమే జరుగుతోందన్నారు. ఇందులో జనసేనకు సంబంధం లేదని పేర్కొన్నారు. అయినప్పటికీ కూటమి ప్రభుత్వ ధర్మానికి కట్టుబడి తాను జనసేన పార్టీ అధికార ప్రతినిధి పదవి నుంచి పక్కకు వచ్చి మాట్లాడుతున్నానని పేర్కొన్నారు. పోలీసులు ఉండగానే టీడీపీ కార్యకర్తలు కర్రలు, రాళ్లు, కత్తులు పట్టుకుని అంబటిపై దాడికి దిగడం సరికాదన్నారు. ఒక మాటలో చెప్పాలంటే పోలీసు వ్యవస్థను సైతం అధికార పార్టీ శాసిస్తోందన్నారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి, ఆమె భర్త గళ్లా రామచంద్రరావు స్వయంగా అంబటి రాంబాబు ఇంటికి వెళ్లి కార్యకర్తలను ప్రొత్సహించడం సరికాదన్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే వారు ఈ దాడులకు పూర్తి బాధ్యత వహించాలని, వారు వ్యవహరించిన తీరు న్యాయమూర్తులను సైతం విస్తుపోయేటట్లు చేసిందని తెలిపారు. రాజకీయాలన్న తరువాత కొన్ని చోట్ల కార్యకర్తలు దురుసుగా వ్యవహరించడం జరుగుతుంటుందన్నారు. వాటిని ఖండించాల్సిన బాధ్యత సంబంధిత నాయకులదేనని పేర్కొన్నారు. గతంలో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలు దూకుడును ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఖండించిన సందర్భాలను రజిని గుర్తు చేశారు. అంబటిపైగానీ, ఆయన నివాసంపైగానీ దాడిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, హోం మంత్రి అనితలలో ఎవరూ ఖండించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తామని చెప్పిన కూటమి నేతలు ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు.

ముందే గుర్తిస్తే.. మెరుగైన వైద్యం

- స్క్రీనింగ్‌తో క్యాన్సర్ బాధితులకు సత్వర వైద్యం
- అందుబాటులోకి అత్యాధునిక వైద్య సేవలు
- కొన్ని రకాల క్యాన్సర్‌లకు వ్యాక్సిన్‌తో చెక్
- నేడు వరల్డ్ క్యాన్సర్ డే

జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్

గుంటూరు మెడికల్: పూర్వం రాచపుండుగా పిలిచే క్యాన్సర్ వ్యాధి సోకితే మరణం తప్పదనే వారు. క్యాన్సర్ సోకగానే వ్యాధికి మందు లేదనే భయాందోళనలతో అనేక మంది చనిపోయేవారు. నేడు ఆధునిక వైద్యం ఎంతో అభివృద్ధి చెందటంతో క్యాన్సర్‌ను పూర్తిగా నయం చేస్తున్నారు. ప్రాథమిక దశలోనే గుర్తించే అత్యాధునిక నిర్ధారణ పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. క్యాన్సర్ రాకుండా ముందస్తుగా కట్టడి చేసే వ్యాక్సిన్లు సైతం మార్కెట్‌లోకి వచ్చాయి. యువ క్రికెటర్ యువరాజ్‌సింగ్ క్యాన్సర్ నుంచి కోలుకున్న విషయం తెలిసిందే. వ్యాధి పట్ల అవగాహన కోసం ప్రతి ఏడాది ఫిబ్రవరి 4న వరల్డ్ క్యాన్సర్ డేగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం.

ఈ లక్షణాలు ఉంటే జాగ్రత్త..

మానకుండా ఉండే పుండు, శరీరంలోని ఏ భాగంలోనైనా ఎదిగే గడ్డ, ఎదుగుతున్న కణుతులు, అసహజమైన రక్తస్రావం, పెరుగుతున్న పుట్టుమచ్చలు, పులిపిరి కాయలు, మింగటం కష్టంగా ఉండటం, గొంతు బొంగురుపోయి తగ్గకుండా ఉండటం, చాలా రోజులుగా ఉన్న అజీర్ణవ్యాధి తదితర లక్షణాలు ఉంటే తక్షణమే క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి. పొగాకు ఉత్పత్తుల కారణంగా 40 నుండి 45 శాతం, కాలుష్యం వల్ల 8 నుంచి 10 శాతం, మద్యం వల్ల మూడు శాతం క్యాన్సర్‌లు వచ్చే అవకాశాలు ఉన్నాయి. గుంటూరు జిల్లా వ్యాప్తంగా 50 మంది క్యాన్సర్ వైద్య నిపుణులు ఉన్నారు. ఒక్కో వైద్యుడి వద్ద రోజూ దాదాపు 10 నుంచి 20 మంది రోగులు చికిత్స పొందుతున్నారు.

గుంటూరు జీజీహెచ్‌లో నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో సేవలిలా...

సంవత్సరం	ఓపీ రోగులు	ఆపరేషన్లు
2021	11,719	168
2022	13,105	417
2023	14,648	753
2024	16,359	823
2025	19,598	1,131

అందుబాటులో ఆధునిక వైద్యం

క్యాన్సర్‌ను నయం చేసే ఆధునిక వైద్య పద్ధతులు నేడు అందుబాటులో ఉన్నాయి. ఇమ్యూనోథెరపీ, టార్గెట్ థెరపీ ద్వారా రోగులు త్వరగా కోలుకుంటున్నారు. నెక్ట్స్ జెనరేషన్ సీక్వెన్సింగ్ టెస్ట్ ద్వారా వ్యాధిని చాలా త్వరగా గుర్తించవచ్చు. ఏ జీన్‌లో తేడా వల్ల సోకుతుందనే విషయం తెలుస్తుంది. ల్యాప్రోస్కోపిక్, రోబోటిక్ సర్జరీలు అందుబాటులో ఉన్నాయి. బీఆర్‌సీఏ–1, 2 పరీక్షల ద్వారా కుటుంబంలో ఒకరికి వ్యాధి ఉంటే ఇతరులకు వస్తుందా రాదా అని నిర్ధారించవచ్చు. హెల్త్ ఇన్సూరెన్సుల ద్వారా అనేక రకాల క్యాన్సర్‌లకు ఉచిత వైద్య సేవలు లభిస్తున్నాయి.

– డాక్టర్ ఎం.జి.నాగకిషోర్, సీనియర్ సర్జికల్ ఆంకాలజిస్ట్, గుంటూరు

జీజీహెచ్‌లో ఉచితంగా వైద్య సేవలు

గుంటూరు జీజీహెచ్‌లోని నన్నపనేని లోకాధిత్యుడు, సీతారావమ్మ స్మారక నాట్కో క్యాన్సర్ సెంటర్‌ను అంతర్జాతీయ వైద్య ప్రమాణాలతో నిర్మించాం. రోగులకు ఉచితంగా కార్పొరేట్ వైద్య సేవలు అందిస్తున్నాం. సర్జికల్ ఆంకాలజీ, మెడికల్ ఆంకాలజీ, రేడియో థెరపీ వైద్య సేవలు, న్యూక్లియర్ మెడిసిన్ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. నాట్కో ట్రస్టు, ప్రభుత్వ భాగస్వామ్యంలో సుమారు రూ. 45 కోట్లతో రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా అత్యాధునిక వైద్య సౌకర్యాలతో 125 పడకలతో ఈ సెంటర్ నిర్మించాం. మరో రూ.18 కోట్లతో 125 పడకల క్యాన్సర్ సెంటర్‌ను నిర్మిస్తున్నాం. ఈ ఏడాది జూన్ నాటికి అందుబాటులోకి వస్తుంది. ఆపరేషన్లు, మందులూ ఉచితం.

–నన్నపనేని సదాశివరావు, నాట్కో ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్

క్యాన్సర్ రాకుండా వ్యాక్సిన్లు

గర్భాశయ ముఖద్వారం క్యాన్సర్, లివర్ క్యాన్సర్ సోకకుండా ముందస్తుగా వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి. తొమ్మిదేళ్ల బాలిక నుంచి 20 ఏళ్ల యువతులు ముందస్తుగా వ్యాక్సిన్లు వేయించుకోవడం ద్వారా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ సోకదు. మమ్మోగ్రామ్ పరీక్ష ద్వారా రొమ్ము క్యాన్సర్‌ను ముందస్తుగానే గుర్తించి, నివారించవచ్చు. అతి తక్కువ సమయంలో వ్యాధిని గుర్తించే ఆధునిక వైద్య పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం ద్వారా క్యాన్సర్ వ్యాధి బారిన పడకుండా ముందస్తుగానే గుర్తించవచ్చు.

– డాక్టర్ బైరపనేని స్రవంతి, క్యాన్సర్ వైద్య నిపుణురాలు, గుంటూరు

అప్రమత్తంగా ఉండాలి

ఆరోగ్యకరమైన జీవనశైలి కలిగి ఉండాలి. క్యాన్సర్ రాకుండా తాజా కూరగాయలు, ఆకు కూరలు ఎక్కువగా తీసుకోవాలి. వీటిల్లో క్యాన్సర్ కారకాలతో పోరాడే యాంటిజెంట్స్ ఉంటాయి. మాంసాహారం తీసుకునేవారు తప్పనిసరిగా వెజిటబుల్ లేదా ఫ్రూట్ సలాడ్ తినాలి. క్యాన్సర్ కణాలతో సలాడ్‌లోని యాంటీజెంట్స్ పోరాడతాయి. పీచు పదార్థం ఉండే ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవాలి. రోజూ కనీసం అరగంటసేపు శారీరక వ్యాయామం చేయాలి. ఒత్తిడి లేకుండా చూసుకోవాలి. స్మోకింగ్, మద్యం, పాన్, గుట్కా, పొగాకు నమలటం లాంటి దురలవాట్లకు దూరండా ఉండాలి.

– డాక్టర్ కందుల రామ్, క్యాన్సర్ వైద్య నిపుణులు, గుంటూరు.

మిర్చి యార్డు సమాచారం
(మంగళవారం ధరలు)

వచ్చిన బస్తాలు	97,204
అమ్మకాలు	93,014
నిల్వ	120,402

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	13,500–23,000
నంబరు–5	13,500–23,000
341	14,000–25,500

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	13,500–21,500
నంబరు–5	13,000–21,500
341	13,000–23,000

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	13,000 – 20,000
బాడిగ–355	14,000 – 25,000
దేవనూరు డీలక్స్	15,000 – 26,500
ఆర్మూర్	12,000 – 17,500
తాలుకాయలు	8,000 – 12,000

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	13,000–19,000
బాడిగ – 355	14,000–24,000
తాలు	8,000 – 11,000

–కొరిటిపాడు (గుంటూరు)

పసుపు ధరలు
(మంగళవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 269

కొమ్ములు : 133 బస్తాలు (ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
13,500	13,640	13,640

కాయలు : 136 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
12,500	13,761	13,761

మొత్తం అమ్మకాలు : 201.75 క్వింటాళ్లు

–దుగ్గిరాల

హోరాహోరీగా ఎడ్ల బలప్రదర్శన పోటీలు

ప్రథమస్థానంలో నిలిచిన సూర్యాపేట జిల్లా గిత్తలు

రెంటచింతల: స్థానిక కానుకమాత చర్చి 176 వ వార్షిక తిరునాళ్ల మహోత్సవాన్ని పురస్కరించుకుని సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో మంగళవారం నిర్వహించిన జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన నువ్వానేనా అన్నట్లు హోరాహోరీగా జరిగాయి. సీనియర్ విభాగంలో జరిగిన ఈ ప్రదర్శనను చూడటానికి అనేక ప్రాంతాల నుంచి వేలాదిమంది తరలిరావడంతో క్రీడామైదానం కిక్కిరిసిపోయింది. ఈ విభాగంలో తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా హుజూరునగర్‌కు చెందిన ఏఎస్పీ సుంకు సురేందర్ రెడ్డి ఎడ్లు 2,656.8 అడుగులు దూరంలాగి ప్రథమ బహుమతి రూ.2.70 లక్షల విలువైన రాయల్ ఇన్‌ఫీల్డ్(బుల్లెట్)ను కై వశం చేసుకున్నాయి. వైఎస్సార్ కడప జిల్లా చౌటప్పల్ గ్రామానికి చెందిన మార్తల చంద్ర ఓబుల్‌రెడ్డి ఎడ్లు 2,637.10 అడుగుల దూరంలాగి 2వ బహుమతి రూ. 1.40 లక్షల విలువైన యూనికార్న్ బైక్‌ను దక్కించుకున్నాయి. వైఎస్సార్ కడప జిల్లా కల్లూరు గ్రామానికి చెందిన పెరుమాళ్ళ శివకృష్ణ యాదవ్ ఎడ్లు 2,519 అడుగులు దూరంలాగి 3వ బహుమతి కైవసం చేసుకున్నాయి. కృష్ణా జిల్లా విజయవాడ గన్నవరంకు చెందిన కాసనేని రాజాచౌదరి, వల్లభనేని మోహన్ రావు ఎడ్లు 2,511.2 అడుగుల దూరంలాగి లాగి 4వ బహుమతి, బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి చెందిన అత్తోట శిరీషా చౌదరి, శివకృష్ణ చౌదరి ఎడ్లు 2,502.4 అడుగులు దూరంలాగి 5 వ బహుమతి, నంద్యాల జిల్లా ఎస్.కొత్తూరు గ్రామానికి చెందిన బీరం సుబ్రమణ్యేశ్వరరెడ్డి, నంద్యాల జిల్లా చాగలమర్రి గ్రామానికి చెందిన బాపతి కొండారెడ్డి కంబైన్డ్ డెడ్లు 2,342 అడుగుల దూరంలాగి 6 వ బహుమతి, వైఎస్సార్ కడప జిల్లా చౌటప్పల్ గ్రామానికి చెందిన మార్తల చంద్ర ఓబుల్‌రెడ్డి ఎడ్లు 2,141.4 అడుగుల దూరం లాగి 7 వ బహుమతి, నంద్యాల జిల్లా పెద్దకోట్టాల గ్రామానికి చెందిన బోరెడ్డి కేశవరెడ్డి ఎడ్లు 2,110.4 అడుగులతో 8 వ బహుమతి, నంద్యాల జిల్లా టి.హుసేనాపురం గ్రామానికి చెందిన ఎం. రామచంద్రారెడ్డి ఎడ్లు 2,042 అడుగులు దూరంలాగి 9 వ బహుమతి, కృష్ణా జిల్లా మల్లవల్లి గ్రామా నికి చెందిన అక్కినేని ముకుల్ సత్య చౌదరి ఎడ్లు 1,815 అడుగులు లాగి 10వ బహుమతి రూ. 14 వేలను గెలుచుకున్నాయి.

ప్రథమ బహుమతిని కైవసం చేసుకున్న సూర్యాపేట జిల్లా ఏఎస్పీ సుంకు సురేందర్‌రెడ్డి ఎడ్లు

- అదేవిధంగా 11, 12, 13, 14, 15 జతలకు పోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ విభాగంలో 15 జతలు పాల్గొనగా నిర్వహించిన బలప్రదర్శనలో మొత్తం 8 విభాగాలలో 123 జతల ఎడ్లు పాల్గొన్నట్లు కమిటీ సభ్యులు వైఎల్ మ్రెడ్డి, ఆదూరి ఇన్నారెడ్డి, గొంటు సుమంత్‌రెడ్డి, ఏరువ జోజిరెడ్డి, బి. రామకృష్ణ, ఎం. రాజారెడ్డి, ఎం. చిన్న శౌర్రెడ్డి, కె. జోసఫ్‌రెడ్డి, జె. రాజేష్‌రెడ్డి, ఒ.ఇన్నారెడ్డి తెలిపారు. న్యాయనిర్ణేతలుగా రాధాకృష్ణ, పి.సుబ్బారెడ్డి, దుర్గి శ్రీనివాసరావు వ్యవహరించారు.

వేలాదిమందితో కిక్కిరిసిన ఎడ్ల ప్రదర్శన గరిడి

వైభవం.. సాయిబాబా మందిర వార్షికోత్సవం

- పెదవడ్లపూడిలో భగవాన్ శ్రీ సత్యషిరిడీ సాయిబాబా మందిరం 20వ వార్షికోత్సవం
- పోటెత్తిన భక్తులు.. అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

మంగళగిరి టౌన్: దక్షిణ షిరిడీగా ప్రసిద్ధి గాంచిన మంగళగిరి మండలం పెదవడ్లపూడిలో వున్న భగవాన్ శ్రీ సత్యషిరిడీసాయిబాబా మందిరం 20వ వార్షికోత్సవం ఆలయ కమిటీ చైర్మన్ పాతూరి నాగభూషణం ఆధ్వర్యంలో మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. బాబాను దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఉదయం బాబాకు క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం రామినేని ఫౌండేషన్ చైర్మన్ ధర్మప్రచారక్ ఆధ్వర్యంలో స్వామివారికి అన్నాభిషేకం నిర్వహించారు. పలువురు ప్రముఖులు వార్షికోత్సవానికి హాజరై బాబాను దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సుమారు 70 వేల మందికి పైగా భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. చిన్నారులకు, పెద్దలకు వినోదాన్ని అందించేందుకు ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు, చిలకలూరిపేట ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు, రాష్ట్ర పద్మశాలీ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి, హ్యాండ్ ల్యూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ ప్రధాన కార్యదర్శి సిసోడియా, మెడికల్ కౌన్సిల్ చైర్మన్ శ్రీహరిరావు, రాజ్యసభ మాజీ సభ్యులు గరికపాటి మోహనరావు, ఏపీ స్పెషల్ రిప్రజెంటేటివ్ ఫర్ నార్త్ అమెరికా కోమటి జయరాం, రిటైర్డ్ డీజీపీ మాల కొండయ్య, గంగాధర్ నాదెళ్ళ, బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు పంతల సురేష్, ఎన్ఆర్ఐలు యలమంచిలి జగదీష్‌బాబు, కావూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. స్వామివారి కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించి జయప్రదం చేసిన భక్తులందరికీ ఆలయ కమిటీ చైర్మన్ పాతూరి నాగభూషణం ధన్యవాదాలు తెలిపారు.

స్వామివారిని దర్శించుకున్న ప్రముఖులతో ఆలయ కమిటీ చైర్మన్ పాతూరి నాగభూషణం

అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం

- రాష్ట్ర మంత్రి సత్యకుమార్
- తెనాలిలో పాఠశాల విద్యార్థులకు కళ్లజోళ్ల పంపిణీని ప్రారంభించిన మంత్రి

తెనాలి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యతను ఇస్తోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని పాఠశాలల్లో కంటి పరీక్షలు చేసిన విద్యార్థుల్లో అవసరమైన వారికి కళ్లజోళ్ల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం గుంటూరు జిల్లా తెనాలిలో ప్రారంభించారు. తెనాలి చెంచుపేటలోని కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూలులో సాయంత్రం ఏర్పాటైన సభకు కార్యక్రమ నోడల్ అధికారి సునీల్ నాయక్ అధ్యక్షత వహించారు. నియోజకవర్గంలోని 325 మంది పాఠశాల విద్యార్థులకు కళ్లజోళ్లను అందజేశారు. ముఖ్యఅతిథిగా కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ అంధత్వ నివారణ కార్యక్రమంలో రాష్ట్రంలోని విద్యార్థులకు కంటిపరీక్షలు, కళ్లజోళ్ల పంపిణీనే కాకుండా అన్ని రకాల పరీక్షలు చేయిస్తున్నట్టు చెప్పారు. శస్త్రచికిత్సలూ చేయిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు ఎలక్ట్రానిక్ హెల్త్ కార్డులు రూపొందించి, అన్ని వివరాలను పొందుపరుస్తున్నట్టు చెప్పారు. రక్తహీనత కలిగిన 9 లక్షల మందికి ఐరన్ టాబ్లెట్లు ఇస్తున్నామని, 18 లక్షల బాలికలకు శానిటరీ నాప్‌కిన్స్‌ను పంపిణీ చేస్తున్నట్టు మంత్రి తెలిపారు. క్యాన్సర్‌కు సంబంధించి గొంతు, రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలను చేస్తున్నట్టు చెబుతూ ఎవరినైనా నిర్ధారణ జరిగితే రూ.25 లక్షల వరకు ఉచితంగా చికిత్స అందుబాటులో ఉందన్నారు. రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన విద్యార్థులకు కళ్లజోళ్ల పంపిణీని తెనాలిలో ఆరంభించినందుకు మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు ధన్యవాదాలు తెలిపారు. పిల్లల ఆరోగ్య సమస్యలపై తల్లిదండ్రులు దృష్టిపెట్టాలని సూచించారు. వైద్య, ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి సౌరబ్ గౌర్, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ పద్మావతి, డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ శ్రావణబాబు, ఆర్డీ డాక్టర్ శోభారాణి, బీజేపీ, జనసేన పార్టీల జిల్లా అధ్యక్షులు తిరుపతిరావు, గాదె వెంకటేశ్వరరావు, జనసేన కౌన్సిలర్లు జి.మానసారెడ్డి, వసంతరావు, జయపాల్ స్థానిక అధికారులు బి.జనార్ధనరావు, కేవీ గోపాలరావు, జె.రామఅప్పలనాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులకు కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న మంత్రులు సత్యకుమార్ యాదవ్, నాదెండ్ల

తిరుమల లడ్డూలో నెయ్యే లేదు

తెనాలి: తిరుమల లడ్డూ ప్రసాదంలో అసలు నెయ్యే లేదని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. పామాయిల్‌తోనే లడ్డూలు చేశారనీ, ఆవిధంగా పవిత్రతను తగ్గించడమే కాకుండా కోట్లాది భక్తుల మనోభావాలను దెబ్బతీశారన్నారు. తెనాలిలో మంగళవారం పాఠశాల విద్యార్థులకు కళ్లజోళ్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి, తన ప్రసంగం ఆరంభంలోనే తిరుమల లడ్డూ ప్రసాదంపై ప్రత్యేకంగా మాట్లాడారు.

బీఈడీ మూడో సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ(పెదకాకాని): రెగ్యులర్ బీఈడీ మూడో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను పరీక్షల నిర్వహణ అధికారి ఆలపాటి శివప్రసాదరావు మంగళవారం విడుదల చేశారు. ఏఎన్‌యూ పరిధిలో 2025లో జరిగిన బీఈడీ మూడో సెమిస్టర్‌కు 6534 మంది హాజరు కాగా వారిలో 5650 మంది ఉత్తీర్ణులయ్యారు. 86.47 శాతం ఉత్తీర్ణత సాధించారు. విద్యార్థులు ఈనెల 12వ తేదీలోగా రీవాల్యేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రీవాల్యేషన్ దరఖాస్తులను పీజీ కోఆర్డినేటర్ కార్యాలయంలో 13వ తేదీలోగా సమర్పించాలన్నారు. ఒక్కొక్క సబ్జెక్టుకు రీవాల్యేషన్ ఫీజు రూ.1860 చెల్లించాల్సి ఉంటుందన్నారు. పర్సనల్ వెరిఫికేషన్ ఫీజు రూ.2190 గా నిర్ణయించామన్నారు. పూర్తి వివరాలకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అధికారిక వెబ్‌సైట్‌ను పరిశీలించాలన్నారు.

కొనసాగుతున్న పీఏసీఎస్ ఉద్యోగుల నిరసన

కొరిటెపాడు(గుంటూరు): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల న్యాయమైన కోర్కెలు పరిష్కరిచాలని డిమాండ్ చేస్తూ గుంటూరులోని శ్యామలానగర్‌లో గల రాష్ట్ర సహకార శాఖ కమిషనర్, రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట చేస్తున్న నిరసన, వంటా వార్పు కార్యక్రమం మంగళవారం నాటికి ఆరవ రోజుకు చేరుకుంది. ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన 250 పీఏసీఎస్‌ల ఉద్యోగులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి, తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 12వ తేదీ వరకు నిరసన, వంట వార్పు కార్యక్రమం, 13వ తేదీన కమిషనర్, రిజిస్ట్రార్ కార్యాలయాల ముట్టడి, కార్యక్రమం చేపట్టనున్నామన్నారు. అప్పటికీ ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించకపోతే, 16వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్లనున్నట్లు వారు హెచ్చరించారు. కార్యక్రమంలో సహకార సంఘాల ఉద్యోగుల యూనియర్ల రాష్ట్ర నాయకులు తోట వెంకటరామయ్య, ముప్వా వెంకటేశ్వరరావు, బి.రఘురామ్, ఎస్.ఖాజామొహిద్దీన్, సత్యనారాయణ, జె.రామాంజనేయులు, టీపీఎస్ హనుమంతరావు, జి.కృష్ణవేణి, టి.కృష్ణారావు, వి.రాజేశ్వరరావు, ఉమ్మడి కృష్ణా జిల్లా పీఏసీఎస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఏఐబీఈఏ జాతీయ ప్రధాన కార్యదర్శి రాంబాబు, వెంకటేశ్వరరావు, రాధాకృష్ణ

క్లుప్తంగా

ప్రశాంతంగా ఇంటర్ ప్రాక్టికల్స్

నరసరావుపేట ఈస్ట్: ఇంటర్మీడియేట్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. జిల్లా పరిధిలోని 79 కేంద్రాలలో జనరల్, ఒకేషనల్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఆయా కేంద్రాలలో జిల్లావ్యాప్తంగా మంగళవారం 4,790 మంది విద్యార్థులకుగాను 4,591 మంది హాజరు కాగా మరో 199 మంది గైర్హాజరయ్యారు. గురజాలలోని మూడు పరీక్షా కేంద్రాలను ఇంటర్మీడియేట్ విద్యాశాఖాధికారి ఎం.నీలావతిదేవి సందర్శించి పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా పకడ్బందీగా ప్రాక్టికల్స్ నిర్వహించాలని సూచించారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే స్క్వాడ్ బృందాలు పిడుగురాళ్ల, గురజాల, సత్తెనపల్లిలోని పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి పరీక్షల నిర్వహణను పరిశీలించారు.

రైలు నుంచి జారిపడి వృద్ధుడు మృతి

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

నరసరావుపేట టౌన్: రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్‌ఐ డాక్టర్ ఎం. రాజమోహన్‌రావు మంగళవారం తెలిపారు. నరసరావుపేట రైల్వేస్టేషన్ పరిధిలోని గుండ్లకమ్మ రైల్వేస్టేషన్ సమీపంలో రైలు నుంచి జారిపడి 60 సంవత్సరాల వయస్సు గల వృద్ధుడు మృతి చెందాడన్నారు. మృతుడు తెలుపురంగు చొక్కా, తెలుపు రంగు నైట్ ఫ్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించామన్నారు. మృతుడి ఆనవాళ్లు తెలిసిన వారు నరసరావుపేట రైల్వే స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

గుంటూరు మార్కెట్ యార్డు చైర్మన్‌గా కుర్రా అప్పారావు

మార్కెట్ కమిటీ పూర్తి స్థాయి నియామకం

కొరిటెపాడు: గుంటూరు మార్కెట్ యార్డు చైర్మన్‌గా కుర్రా అప్పారావు, వైస్ చైర్మన్‌గా బిట్రగుంట మల్లికలను నియమిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఎ.వి.రాజమౌళి మంగళవారం సాయంత్రం జీవో విడుదల చేశారు. సభ్యులుగా కొనకళ్ల వెంకటసత్యనారాయణ, ముదావత్ మంగాబాయి, కె.విజయలక్ష్మి, మొహమ్మద్ హాఫీజ్, మేళం సైదయ్య, షేక్ ఖాదర్‌బాయి, బత్తుల జాన్‌సైదా, దర్శనపు విజయమ్మ, చంద్రగిరి బాబు, ఇమ్మడి వెంకటలక్ష్మి, డి.భాగ్యారావు, ఎస్. వంశీకృష్ణ, కె.శ్రావణకుమారిలను నియమిస్తున్నట్లు జీవోలో పేర్కొన్నారు.

రేషన్ దుకాణాల్లో జేసీ విస్తృత తనిఖీలు

గుంటూరు వెస్ట్: జిల్లాలో రేషన్ దుకాణాలలో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ మంగళవారం తెలిపారు. జిల్లా పౌర సరఫరాల అధికారి, వారి సిబ్బందితో కలసి విస్తృతంగా తనిఖీలను నిర్వహిస్తున్నారన్నారు. ఈ నెలలో రేషన్ పంపిణీ జరుగుతున్న పలు చౌక ధరల దుకాణాలలో పౌర సరఫరాల సిబ్బంది ఆకస్మికగా తనఖీలను నిర్వహించి వాటిలో వ్యత్యాసాలు గుర్తించిన రేషన్ దుకాణాల డీలర్లపై 6ఏ, క్రిమినల్ కేసులను నమోదు చేయడం జరిగిందని వివరించారు. గుంటూరు నగరంలో రేషన్ షాప్ నెంబర్ 0781095, 0781106, 0781141లలో తనిఖీలను నిర్వహించగా ఆ దుకాణాల్లో బియ్యం తక్కువగా ఉండటాన్ని గుర్తించడం జరిగిందని తెలిపారు. రేషన్ షాపుల నెంబర్లు 0781003, 0781018, 0781015 లో తనిఖీలను నిర్వహించగా వాటిలో బియ్యం ఎక్కువగా ఉండటాన్ని గుర్తించామన్నారు. తాడేపల్లి మండల పరిధిలో రేషన్ షాప్ నెంబర్ 0793014 లో తనిఖీలు నిర్వహించగా అక్కడ కూడా బియ్యం తక్కువగా ఉండటాన్ని గుర్తించి డీలర్లపై కేసులను నమోదు చేశామన్నారు. పీడీఎస్ బియ్యం కొనుగోలు, విక్రయాలు జరిపితే నేరమని తెలిపారు. అమ్మినా, కొన్నా చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జేసీ హెచ్చరించారు.

ప్రగతినగర్‌లోని 106 రేషన్ డిపోలో తనిఖీలు నిర్వహిస్తున్న సివిల్ సప్లయిస్ సిబ్బంది

బ్యాంక్ నిధుల దుర్వినియోగంలో మరొకరు అరెస్ట్

నగరంపాలెం: జీడీసీసీ బ్యాంక్ (నల్లపాడు బ్రాంచ్)లో నిధుల దుర్వినియోగం కేసులో మరొకర్ని అరెస్ట్ చేశామని గుంటూరు సీసీఎస్ డీఎస్పీ బీవీ.మధుసూదనరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం కేసు వివరాలను సీసీఎస్ డీఎస్పీ తెలిపారు. జీడీసీసీ బ్యాంక్ (నల్లపాడు బ్రాంచ్)లో నిధుల దుర్వినియోగంపై గతేడాది నవంబర్ 28న డివిజనల్ కో–ఆపరేటివ్ అధికారి కె.శీనారెడ్డి ఫిర్యాదుతో నల్లపాడు పీఎస్‌లో కేసు నమోదైందని అన్నారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని చెప్పారు. ఈ మేరకు ఏ–8 అయిన బాపట్ల టౌన్ పటేల్‌నగర్ రెండో వీధిలో ఉంటున్న పీటా వెంకటేశ్వరావు కదలికలపై నిఘా ఉంచామని అన్నారు. ఈనెల రెండో తేదీన అతన్ని గుంటూరు బ్రాడీపేటలోని జీడీసీసీ బ్యాంక్ సమీపాన అరెస్ట్ చేశామన్నారు. గతంలో వెంకటేశ్వరరావు నల్లపాడు జీడీసీసీ బ్యాంక్ పాలకవర్గంలో సభ్యుడిగా నామినేట్ చేశారని తెలిపారు. అతన్ని కోర్టులో హాజరుపరచగా, 14 రోజుల న్యాయస్థాన కస్టడీకి ఆదేశించారని అన్నారు. పరారీలో ఉన్న కొందర్ని త్వరలో అరెస్ట్ చేస్తామన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న గుంటూరు సీసీఎస్ డీఎస్పీ మధుసూదనరావు

మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ అధికారుల విచారణ

వినుకొండ: వినుకొండ మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఏసీబీ అధికారులు విచారణ చేపట్టారు. గతంలో వినుకొండ మున్సిపల్ కార్యాలయంలో ఆర్ఐగా పనిచేస్తూ పదోన్నతిపై ఆర్ఓగా వినుకొండలోనే విధులు నిర్వహిస్తు దర్శి అదనపు మున్సిపల్ కమిషనర్‌గా వ్యవహిస్తూ.. మహేష్ ఇటీవల అక్రమ ఆస్తుల కేసులో అరెస్టు అయ్యారు. దీనిపై ఏసీబీ అధికారుల విచారణ చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్‌తోపాటు మున్సిపల్ మేనేజర్‌లను ఆర్ఐ మహేష్‌కు సంబంధించి సర్వీసు వివరాలు తెలుసుకున్నారు. ఏసీబీ అధికారుల రాకతో మున్సిపల్ అధికారులు ఆందోళనకు గురయ్యారు.

18 నుంచి టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు

గుంటూరు ఎడ్యుకేషన్: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు–2026 (టీసీసీ)లో భాగంగా డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీలో లోయర్, హయ్యర్ గ్రేడ్ పరీక్షలు ఈనెల 18 నుంచి 21 వరకు జరగనున్నాయని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీమ్ బాషా మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు బీఎస్ఈఏపీ.ఓఆర్జీ వెబ్‌సైట్ నుంచి హాల్ టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. గుంటూరు నగరంపాలెంలోని స్టాల్ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో టైలరింగ్, ఎంబ్రాయిడరీ, మార్కెట్ సెంటర్లోని హిందూ కాలేజీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో డ్రాయింగ్ పరీక్షలు ఆయా తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట, తిరిగి మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి గంట ముందుగా చేరుకోవాలని, హాల్ టికెట్‌తోపాటు ప్రభుత్వ గుర్తింపు కలిగిన ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డును వెంట తెచ్చుకోవాలని సూచించారు.

జిల్లాలో పోలీస్ చట్టం 30 అమలు

నగరంపాలెం: జిల్లాలో పోలీస్ యాక్ట్ 30 అమల్లో ఉందని గుంటూరు పశ్చిమ డీఎస్పీ అరవింద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎటువంటి సభలు, సమావేశాలు, ర్యాలీలకు అనుమతి లేదన్నారు. అనుమతుల్లేని సభలు, ర్యాలీలు నిర్వహిస్తే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని ఆయన తెలిపారు.

ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ కీలకం

జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా

గుంటూరు వెస్ట్: జిల్లా పరిధిలోని అన్ని పట్టణ ప్రాంతాల్లో జాతీయ హరిత ట్రిబ్యునల్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఘన, ద్రవ వ్యర్థాలను పకడ్బందీగా నిర్వహించేలా మున్సిపల్ అధికారులు ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో జీఎంసీ కమిషనర్ మయూర్ అశోక్‌తో కలిసి నిర్వహించిన డిస్ట్రిక్ట్ ఎన్‌జీటీ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ... పట్టణ ప్రాంతాల్లో వ్యర్థాలను ఇంటి నుంచే సేకరించటంతోపాటు, పర్యావరణానికి హాని లేకుండా నూరుశాతం సక్రమంగా నిర్వహించాలన్నారు. మురుగునీటిని పూర్తిగా శుద్ధి చేయాలన్నారు. తడి వ్యర్థాలతో ఎరువుల తయారీని నివాస ప్రాంతాల్లోని తయారుచేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రీసైకిలింగ్ వ్యర్థాలతో సంపద సృష్టించే ప్రాజెక్టులను మరింతగా విస్తరించాలన్నారు. పట్టణాల్లో సీవరేజ్ నీటిని శుద్ధి చేయడానికి అనుగుణంగా ఎస్టీపీల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎలక్ట్రానిక్ (ఈ వేస్ట్)ను సైతం ప్రభుత్వంతో ఎంఓయూ చేసుకున్న ఏజెన్సీకి అందించాలన్నారు. ఎన్టీఆర్ క్యాంటీన్ల నిర్వహణ, ఇంటింటికి చెత్త సేకరణ, పబ్లిక్ మరుగుదొడ్లు, శానిటేషన్, డ్రెయిన్ల శుభ్రత అంశాలపై పబ్లిక్ పెర్సెప్షన్‌లో ప్రజల ఫీడ్ బ్యాక్ మరింతగా మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలన్నారు.

వేర్వేరుగా చెత్త సేకరణ..

జీఎంసీ కమిషనర్ మయూర్ అశోక్ మాట్లాడుతూ... నగర పరిధిలో ఇంటింటి నుంచి తడి, పొడి చెత్త వేరు చేసి సేకరించటం జరుగుతుందన్నారు. తడి వ్యర్థాలతో వివిధ ప్రాంతాల్లో 100 టన్నుల సామర్థ్యం కలిగిన ఎరువుల తయారీ కేంద్రాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి డివిజన్‌లో వర్మీ కంపోస్ట్ ఎరువుల తయారీ కేంద్రాలను ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ప్రతి రోజు 300 టన్నుల వరకు వ్యర్థాలను జిందాల్ వేస్ట్ ఎనర్జీ ప్లాంట్‌కు పంపిస్తున్నామని తెలిపారు. మెటీరియల్ రీసైక్లింగ్‌కు 10 టన్నుల వరకు తరలిస్తున్నామని చెప్పారు. సమావేశంలో ఎంటీఎంసీ మున్సిపల్ కమిషనర్ అలీం బాషా, తెనాలి మున్సిపల్ కమిషనర్ జేఆర్ అప్పలనాయుడు, పీసీబీ ఈఈ నజీమా బేగం, సీఎంహెచ్ఓ శాంతి కళా, ఈఈ సుందర రామిరెడ్డి, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ఇంజనీర్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

GOLD FINANCE

- బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071
- బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు. కొనబడును సంప్ర॥ 87907 41166
- బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టు లో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు.తీసుకుంటాం ✆ 83338 33368

LOST

- I, Thella Ashok Kumar lost my Degree Document (Roll No: CB.EN.U4ECE11257) from Amrita University in Nadendla. Police Complaint No: MLD01226000623736. If found Contact me at 9515500208

WANTED

- రేపల్లె సజ్జావారిపాలెం భారతి పెట్రోల్ బంకులో పనిచేయుటకు యువతి యువకులు కావలెను. పని నేర్పించి వసతి + జీతం ఇవ్వబడును. 92461 64672
- గుంటూరులోని ప్రముఖ దయాగ్నస్టిక్స్ డిస్ట్రిబ్యూటర్ దగ్గర పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. అర్హత: డిగ్రీ లేదా B.Sc MLT ల్యాబొరేటరీ అనుభవం గలవారు కావలెను. ✆ 70137 86366
- గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు వార్డెన్స్ మరియు ఇన్‌ఛార్జీస్ గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 12000/- నుండి 14000/- వరకు ఇవ్వబడును. (నాన్ లోకల్ వారికి ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యా అర్హతలు: ఇంటర్ నుండి డిగ్రీ వరకు, వయస్సు: 22 సంవత్సరాలు నుండి 40 సంవత్సరాలు ఉండవలెను. వివరములకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్: 92487 33372
- గుంటూరులో ప్రముఖ హాస్పిటల్ నందు పని చేయుటకు వైద్య పరిజ్ఞానము గల కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. ఫోన్ : 99083 38379
- గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు హాస్టల్ ఇన్‌ఛార్జీస్ వార్డెన్స్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 12,000/- నుండి 15,000/- వరకు ఇవ్వబడును. (ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యా అర్హతలు: ఇంటర్ మరియు డిగ్రీ, వయస్సు : 22 సంవత్సరములపైన ఉండవలెను. వివరములకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్ : 8978480435
- గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు SR Construction Site Incharges గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 35,000/- నుండి 45,000/- వరకు ఇవ్వబడును. విద్యా అర్హతలు: Civil Diploma మరియు Civil Engineering, వయస్సు : 30 సంవత్సరములపైన ఉండవలెను. వివరములకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్ : 8978480429
- గుంటూరు సిటీలోని ప్రముఖ బ్యాంక్ అనుబంధ సంస్థతో కలిసి పనిచేయుటకు విశ్రాంత ఉద్యోగులు, హౌస్ వైఫ్స్, 10th పాస్, 50సం॥ వయస్సు వారు కావలెను. 7036761665
- ఫ్రీ కంప్యూటర్ స్పోకెన్ ఇంగ్లీష్, MS ఆఫీస్ కోర్సు 3నెలల శిక్షణఇచ్చి జాబ్ చూపబడును. ఫ్రీ భోజనం & హాస్టల్, 10th, ఇంటర్, డిగ్రీ. వ:18–28 సం॥లోపు ✆ 9133444985 / 89
- విజయవాడ, గుంటూరు ప్రాంతాలలో పేషంట్లని, పెద్దవారిని వారి ఇంటి వద్దనే ఉండి చూసుకొనుటకు కాంపౌండర్లు, నర్సులు (M/F) కేర్‌టేకర్స్ కావలెను. Sal: 24K. వాట్సాప్ / కాల్. ✆ 98850 25559, 91608 35559
- డ్వాక్రా మహిళలకు, నిరుద్యోగులకు ఇంట్లో ఉంటూ పెట్టుబడి మీరే పెట్టుకొని కొవ్వొత్తులు, పెన్సిల్స్ తయారుచేసి మాకు ఇవ్వండి వీక్లీ పేమెంట్ 9640729906
- శివకార్తికేయ హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను, పిల్లలను చూసుటకు వర్కర్స్ /నర్సులు కావలెను.ఫ్రీవసతి భోజనం.జీ: 20K. Ph:9912011499, 9912011899.
- ప్రముఖ హోంకేర్ సంస్థ Hydలో వృద్ధులకు, పేషెంట్లకు సేవ చేయుటకు బేబీకేర్, ఇంటి/వంట పనికి స్త్రీ/పు, కావలెను. జీ: 16,000 to 24,000, రూం+మీల్స్ ఫ్రీ. Ph: 9347148051

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ. 475/- మాత్రమే
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు
గుంటూరు
7075167663
7075167541

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలను పాఠకులు, వాటిని క్షుణ్ణంగా పరిశీలించిన పిదప ప్రత్యక్షంగా/పరోక్షంగా మా ప్రకటనదారులను సంప్రదించవచ్చు. ప్రకటనదారులు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బును ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

నేటి వైఎస్ జగన్ పర్యటనకు సంఘీభావం తెలపాలి

తాడేపల్లి రూరల్: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు వెళ్లనున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సంఘీభావం తెలియజేసేందుకు సిద్ధం కావాలని పార్టీ పట్టణ, రూరల్ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, అమరా నాగయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమం తాడేపల్లి రూరల్ ప్రాతూరు అండర్‌పాస్ వద్ద ఉదయం 9.30 గంటలకు ప్రారంభం అవుతుందని.. అందరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు.

రత్నకుమారికి కడుపుకోత

మంగళగిరి టౌన్: వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా ఉపాధ్యక్షురాలు పచ్చల రత్నకుమారి ఇంట విషాదం నెలకొంది. రత్నకుమారి, శ్యామ్ బాబు దంపతుల కుమార్తె సాధన(17) అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, నియోజకవర్గ సమన్వయకర్త వేమారెడ్డి, మాజీ ఆప్కో చైర్మన్ చిల్లపల్లి మోహనరావు నవులూరులోని ఆమె నివాసానికి చేరుకుని సాధన భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు నాలి వెంకటకృష్ణ, మేకా అంజిరెడ్డి, సుధారాణి, ఆదాం, భూషణం, దుర్గానాయక్, హర్ష, ముదిగొండ ప్రకాష్, ఎండి గోరేబాబు, బత్తుల దాసు, గోపినాథ్, మాదాల గోపి, నూతక్కి శివ, కిరణ్, షేక్ సర్దార్ ఉన్నారు.

బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని డోలాస్‌నగర్ 9వ వార్డులో నివాసం ఉండే వైఎస్సార్ సీపీ నాయకులు గాజులవర్తి సురేష్(54) మృతిపట్ల పార్టీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు, పొన్నూరు నియోజకవర్గ పరిశీలకులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మంగళవారం సురేష్ మృతి చెందిన విషయం తెలుసుకుని వారి ఇంటికి వెళ్లి సురేష్ భౌతికకాయాన్ని సందర్శించారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. సోమిరెడ్డి వెంట రాష్ట్ర సోషల్ మీడియా కార్యదర్శి మేకా వెంకట రామిరెడ్డి, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు చిలుకోటి శ్రీనివాస మధు, 9వ వార్డు అధ్యక్షులు ఆనంద్, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఆశాలకు కనీస వేతనం అందించాలి

ఫిరంగిపురం: ఆశా వర్కర్లను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం, చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని సీఐటీయూ మండల కార్యదర్శి షేక్.మస్తాన్‌వలి అన్నారు. ఫిరంగిపురం పీహెచ్‌సీ సెంటర్‌లో ఆశాలకు కనీస వేతనం, చట్టబద్ధమైన సౌకర్యాల కోసం ఈనెల 12న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మార్పుల వెంగళరెడ్డి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పట్టపగలు ఇంట్లో చోరీ

దుగ్గిరాల: పట్టపగలే ఇంట్లో చోరీ జరిగిన ఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతలపూడిలోని కొప్పరాజు అప్పారావు ఇంటికి తాళం వేసి మధ్యాహ్నం దేవాలయానికి వెళ్లారు. తిరిగి వచ్చి చూడగా ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. బీరువాలోని 2 సవర్ల బంగారం, రూ.3 లక్షల నగదు దుండగులు దొంగిలించారని అప్పారావు భార్య మణికుమారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై దుగ్గిరాల ఎస్సై వెంకటరవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కేంద్ర బడ్జెట్‌లో చేనేతలకు మొండిచెయ్యి

మంగళగిరి టౌన్: కేంద్ర ఆర్థిక శాఖమంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో చేనేతలకు కేవలం రూ.200 కోట్లు మాత్రమే కేటాయించి మొండిచెయ్యి చూపించారని చేనేత కార్మిక సంఘం గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తూరి మోహనరావు విమర్శించారు. పట్టణంలోని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. మోహనరావు మాట్లాడుతూ.. వ్యవసాయం తరువాత ఉపాధి కల్పిస్తున్న చేనేత పరిశ్రమకు కేవలం రూ.200 కోట్లు కేటాయించడం బాధాకరమన్నారు. జిల్లా అధ్యక్షులు వెంకటకృష్ణ, ఉపాధ్యక్షులు గంజి శ్రీనివాసరావు, మంగళగిరి నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు గిరి, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కల్తీ ప్రచారకులపై చర్యలు తీసుకోవాలి

- ఫ్లెక్సీలపై దుష్ప్రచారం చేస్తే సహించం
- పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన దొంతిరెడ్డి వేమారెడ్డి

ఎస్ఐ రవీంద్ర నాయక్‌కు ఫిర్యాదు అందజేస్తున్న వేమారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు

మంగళగిరి టౌన్: చంద్రబాబు ప్రభుత్వం గద్దెనెక్కిన తరువాత రాష్ట్రంలో రాజ్యాంగ పాలన పూర్తిగా విఫలమైందని వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి మండిపడ్డారు. ప్రజల శాంతి భద్రతలకు భంగం కలిగేలా సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేస్తూ భక్తుల మనోభావాలు దెబ్బతీసిన వారిపై చర్యలు తీసుకోవాలని మంగళగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి పట్టణ ఎస్ఐ రవీంద్రనాయక్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వేమారెడ్డి మాట్లాడుతూ.. తిరుమల శ్రీవారి ప్రసాదానికి వాడే నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని ప్రచారం చేసి భక్తుల మనోభావాలను సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేషలు గాయపరిచారని విమర్శించారు. రాష్ట్రంలో పరిపాలనా యంత్రాంగం, పోలీస్ వ్యవస్థ కుప్పకూలిందన్నారు. తాజాగా సీబీఐ చార్జిషీటులో తిరుమల లడ్డూలో ఎలాంటి జంతువుల కొవ్వు కలువలేదని తేల్చిన విషయాన్ని గుర్తుచేశారు.

పార్టీ శ్రేణులపై దాడులు హేయం..

పవిత్ర తిరుమల లడ్డూ విషయంపై ఆరోపణలు అవాస్తవమని నిర్ధారణ కావడంతో డైవర్షన్ పాలిటిక్స్‌కు చంద్రబాబు ప్రభుత్వం తెర తీసిందని వేమారెడ్డి ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడులు చేయడం హేయమైన చర్య అని, మాజీ మంత్రి అంబటి రాంబాబు పూజలు చేయడానికి వెళితే ఆయనపై కర్రలు, రాళ్లతో దాడికి సిద్ధమైన వారిని పోలీసులు నిలువరించకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. సుమారు 5 గంటలకు పైగా దాడులు చేసినా పట్టించుకోకుండా పోలీసులు ప్రేక్షకపాత్ర వహించడం దారుణమన్నారు. వ్యవస్థలన్నీ నిర్వీర్యం చేసి రాష్ట్రాన్ని రావణ కాష్టంలా మార్చిన చంద్రబాబు ప్రభుత్వానికి పాలించే హక్కులేదన్నారు.

కూటమి రాతియుగం పాలన..

సంక్షేమ పథకాలను ప్రజలకు అందించలేక డైవర్షన్ పాలిటిక్స్‌తో కాలం గడుతుపున్నారని వేమారెడ్డి మండిపడ్డారు. అంబటి రాంబాబు, జోగి రమేష్ నివాసాలపై ఆటవికంగా దాడులు చేసి ఆస్తులను ధ్వంసం చేయడం రాతియుగం నాటి పాలనను తలపిస్తోందన్నారు. కార్యక్రమంలో మంగళగిరి పట్టణ, మండల అధ్యక్షులు ఆకురాతి రాజేష్, నాలి వెంకట కృష్ణ, తాడేపల్లి పట్టణ, మండల అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, అమరా నాగయ్య, రాష్ట్ర జాయింట్ సెక్రటరి మేకా అంజిరెడ్డి, జిల్లా యాక్టివిటీ కార్యదర్శి మల్లవరపు సుధారాణి, జిల్లా చేనేత విభాగ అధ్యక్షులు పాల శ్రీనివాసరావు, మంగళగిరి పట్టణ మహిళా అధ్యక్షురాలు సంకె సునీత, మండల ప్రధాన కార్యదర్శి అద్దాలి చిన్నారి యాదవ్, పట్టణ మైనార్టీ విభాగ అధ్యక్షులు షేక్ మాలక్ బాబు, పట్టణ యువజన విభాగ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు గోపికృష్ణ, హర్ష, పట్టణ విద్యార్థి విభాగ అధ్యక్షులు ప్రదీప్, రాష్ట్ర యువజన విభాగ సంయుక్త కార్యదర్శి జోష్, మండల ఎస్టీ విభాగ అధ్యక్షులు దుర్గా నాయక్, మండల మైనార్టీ విభాగ ప్రధాన కార్యదర్శి షేక్ సర్దార్, నాయకులు తుమ్మ రాంబాబు, నాగమయ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల మనోభావాలు దెబ్బతీసేందుకే తప్పుడు ప్రచారం

తాడికొండ: డైవర్షన్ పాలిటిక్స్‌కు అలవాటు పడిన చంద్రబాబు ప్రజలను తప్పుదోవ పట్టించి మనోభావాలను దెబ్బతీసేందుకే తిరుమల లడ్డూ విషయంలో తప్పుడు ప్రచారానికి తెరలేపారని పార్టీ తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు అన్నారు. మంగళవారం వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. లడ్డూ విషయంలో జంతు కొవ్వు కలిసిందని తప్పుడు ప్రచారానికి శ్రీకారం చుట్టిన చంద్రబాబు, కూటమి ప్రభుత్వానికి తగినశాస్తి తప్పదన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు విఫలమైన పరిస్థితి స్పష్టంగా కనబడుతుందన్నారు. ప్రశ్నించిన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు ఇంటిపై రాక్షసత్వంతో దమనకాండ చేయడం దుర్మార్గపు చర్య అని మండిపడ్డారు.

తాడికొండ పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రం అందజేస్తున్న వనమా బాల వజ్రబాబు

అంబటిపై దాడిలో పెమ్మసాని పాత్ర!!

అంబటి రాంబాబు ఇంటిపై దాడిలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పాత్ర తీవ్రంగా ఉందని, ఆయన పాత్ర లేకుండా శాసనసభ్యురాలితో పాటు ఆయన భర్త ఇంటిమీదకు వెళతారా అంటూ వజ్రబాబు ప్రశ్నించారు. గుంటూరు జిల్లా ప్రజల మధ్య చిచ్చు పెడుతున్న పెమ్మసాని భవిష్యత్తులో ఏ సమస్య వచ్చినా ఆయనే బాధ్యత వహించాలని పేర్కొన్నారు. దీనిపై తాము పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని వివరించారు. కార్యక్రమంలో 4 మండలాల పార్టీ అధ్యక్షులు మార్పుల శివరామిరెడ్డి, తాళ్లూరి వంశీకృష్ణ, వంగా పోలారెడ్డి, మైనేని నాగ మల్లేశ్వర రావు, పలు విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాల నేతలపై దాడి అమానుషం

మంగళగిరి టౌన్: తిరుపతి జిల్లా మోహనబాబు యూనివర్సిటీలో విద్యార్థి సంఘాల నేతలపై జరిగిన దాడి, కిడ్నాప్ అమానుషమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ఎస్టీ కమిషన్ సభ్యులు, గిరిజన ప్రజా సమాఖ్య, గిరిజన విద్యార్థి సమాఖ్య వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు వడిత్యా శంకర్ నాయక్ పేర్కొన్నారు. దీనిపై తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానిక రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాలయంలో మంగళవారం చైర్మన్ మధుమూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శంకర్‌నాయక్ మాట్లాడుతూ.. మోహనబాబు యూనివర్సిటీ యాజమాన్యం విద్యార్థుల నుంచి అక్రమంగా రూ.26 కోట్లు అధికంగా ఫీజులు వసూలు చేసినట్లు రాష్ట్ర ఉన్నత విద్యాకమిషన్ నిర్ధారించిందని, ఆ మొత్తాన్ని విద్యార్థులకు తిరిగి చెల్లించాలని ఆదేశించిందని అన్నారు. సర్టిఫికేట్ నిలిపివేసినందుకు రూ.16 లక్షలు జరిమానా విధించినా యూనివర్సిటీ యాజమాన్యం తమ తీరును మార్చుకోలేదని ఆరోపించారు. ఈ అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ విద్యార్థి సంఘాలు మంగళవారం తిరుపతి కలెక్టరేట్ వద్ద శాంతియుత ఆందోళనకు పిలుపునివ్వగా వర్సిటీకి చెందిన బౌన్సర్లు, గూండాలు సుమారు 40 మంది కార్లలో వచ్చి సంఘాల నేతలపై దాడిచేసి వారి కార్లలో బలవంతంగా ఎక్కించి కిడ్నాప్ చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని ఖండించారు. జరిగిన ఘటనపై తక్షణమే సమగ్ర, నిష్పక్షపాత విచారణ చేపట్టాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులు వినూత్నంగా ఆలోచన చేయాలి

మంగళగిరి టౌన్: నేటి ఆధునిక యుగంలో విద్యార్థులు వినూత్నంగా ఆలోచన చేసి విజయాలను సాధించాలని ఎంటీఎంసీ అడిషనల్ కమిషనర్ శకుంతల పేర్కొన్నారు. మంగళగిరి పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో మంగళవారం సైన్స్ అండ్ టెక్నాలజీ ఎక్స్‌పో–2026 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల క్రియేటివ్ ఇన్నోవేటివ్ ఏఐ రోబో బేస్డ్ ప్రాజెక్ట్ ప్రదర్శన చేసి వివరించారు. ముఖ్యమైన ప్రాజెక్టులు, వాటర్ క్లీనింగ్, రెడ్యూస్ రీసైకిల్ రీయూజ్ ప్రాజెక్టులు, వాయిస్ కంట్రోల్ రోబో, డాన్ సోలార్ సిస్టమ్, పేస్ ఆఫ్ మూన్ వంటి వివిధ రకాల మ్యాథ్స్ ప్రాజెక్టులు ప్రీ ప్రైమరీ ప్రాజెక్ట్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా శకుంతల మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు విద్యార్థుల్లోని సృజనాత్మకత, వినూత్న ఆలోచనలను అభివృద్ధి పరచడానికి, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించి భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేలా విద్యాబోధన అందించాలని అన్నారు. ఆక్స్‌ఫర్డ్ రీజనల్ ఇన్‌చార్జి అమీనా బేగం, ప్రిన్సిపల్ చైతన్య, చైర్మన్ ఫ్రాన్సిస్ రెడ్డి, డైరెక్టర్ జోసఫ్‌రెడ్డి, విజయ భాస్కర్‌రెడ్డి విద్యార్థులను అభినందించారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న అడిషనల్ కమిషనర్ శకుంతల

నూతన ఆవిష్కరణపై అవగాహన సదస్సు

ముఖ్యఅతిథి రియాజ్‌ను సత్కరిస్తున్న డాక్టర్ కె.రూత్ రమ్య, విజయరత్న

తాడేపల్లి రూరల్: వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో మంగళవారం నూతన ఆవిష్కరణపై అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రా ఏంజెల్ నెట్‌వర్క్స్ కో ఫౌండర్ అండ్ ఇన్వెస్టర్ డైరెక్టర్ అబ్దుల్ రియాజ్ హాజరై విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు తెలియజేశారు. స్టార్టప్ ప్రాముఖ్యత, వాటికి ప్రభుత్వం ఇచ్చే సపోర్ట్ గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం రియాజ్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వర్సిటీ వీసీ డాక్టర్ పార్థసారధి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్ వెంకట్‌రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ కె.రూత్ రమ్య, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ విజయ రత్నం తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి

రామమోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న పార్టీ నాయకులు

ఫిరంగిపురం: వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేస్తానని చేవూరి రామమోహన్‌రెడ్డి అన్నారు. పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా 113.తాళ్లూరు గ్రామానికి చెందిన చేవూరి రామమోహన్‌రెడ్డిని నియమిస్తూ పార్టీ అధిష్టానం నుంచి ఇటీవల ఉత్తర్వులు విడుదల అయ్యాయి. ఈ సందర్భంగా మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో రామమోహన్ రెడ్డిని పలువురు పార్టీ నాయకులు సన్మానించారు. కేకును కట్ చేసి అభినందనలు తెలిపారు. తనకు పదవి వచ్చేందుకు కృషి చేసిన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబుకు రామమోహన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, దాసరి సురేష్, ఉడుముల పిచ్చిరెడ్డి, రేపూడి రంజన్‌బాబు, గొట్టిపాటి ఇజ్రాయిల్, పెరికల చిన్నా, సయ్యద్ సైదు, బోయినపల్లి సాల్మన్, కె.ప్రతాప్, మోరంరెడ్డి, శ్రీనివాసరెడ్డి, బొడపాటి అంజిరెడ్డి, సయ్యద్ మీరా, అమానుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు కేరింగ్ కమ్యూనిటీ ప్రోగ్రామ్

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ కుంచనపల్లిలోని పీహెచ్‌ఈ పరిధి ఆశా వర్కర్లకు మంగళవారం కేరింగ్ కమ్యూనిటీ ప్రోగ్రామ్‌ను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ వైద్యనిపుణులు డాక్టర్ హర్ష వర్ధన్ విచ్చేసి మాట్లాడారు. డ్రగ్స్‌కు అలవాటుపడుతున్న పిల్లలను సమయానికి గుర్తించి వారికి మార్గనిర్దేశం చేస్తే వారి జీవితం మార్పు చెందుతుందని పేర్కొన్నారు. ఒక పిల్లవాడి భవిష్యత్తు మెరుగుపడాలంటే ప్రజలు, ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని వివరించారు. కార్యక్రమంలో నవజీవన్ బాలభవన్ ప్రోగ్రామ్ మేనేజర్ ఎండీ వసంత, ఎం.పావతి, శ్రీదేవి, సెంటర్ల టీచర్లు, వివిధ ప్రాంతాల ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కేరింగ్ కమ్యూనిటీ ప్రోగ్రామ్‌లో పాల్గొన్న ఆశా వర్కర్లు

అఖిల భారత సమ్మెను జయప్రదం చేయాలి

దుగ్గిరాల: అఖిల భారత సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సమ్మె నోటీసును ఈమని పీహెచ్‌సీ డాక్టరు రహీమున్నీసాకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జెట్టి బాలరాజు అందజేశారు. మంగళవారం దుగ్గిరాల మండలం ఈమని గ్రామంలో పీహెచ్‌సీలో ఆయన ఆశా కార్యకర్తలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికవర్గం ఎన్నో త్యాగాలు చేసి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా చేసిందని అన్నారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని.. కార్మిక వేతనాలు పెంచాలని.. తదితర సమస్యల పరిష్కారానికి ఈనెల 12న జరిగే అఖిల భారత సమ్మెలో ఆశాలు, అంగన్‌వాడీలు, తదితర కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రోజా, సునీత కుమారి, విమల, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలతో మాట్లాడుతున్న బాలరాజు

ఆశాలకు చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలి

డాక్టర్ మానసకు సమ్మె నోటీసును అందజేస్తున్న నాయకులు

తాడేపల్లి రూరల్: ఈనెల 12వ తేదీన జరిగే సార్వత్రిక సమ్మెలో ఉద్యోగులందరూ పాల్గొనాలని కోరుతూ మంగళవారం సీఐటీయూ నాయకులు తాడేపల్లి పట్టణ పరిధిలోని డ్రైవర్స్ కాలనీ యూపీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ మానస మంజరికి సమ్మె నోటీసును అందజేశారు. ఆశాలకు కనీస వేతనం అమలు చేయడంలేదని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కొప్పురాతి లక్ష్మి వాపోయారు.

మెడికల్ ఆఫీసర్లకు సమ్మె నోటీసులు అందజేస్తున్న నాయకులు

మంగళగిరి టౌన్: ఆశా వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని సీఐటీయూ నాయకులు ఎం.బాలాజీ డిమాండ్ చేశారు. పట్టణంలోని మూడు యూపీహెచ్ సెంటర్లలో మెడికల్ అధికారులను కలిసి సమ్మె నోటీసులను యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

• షాహిద్ కుటుంబ సభ్యులకు పరామర్శ

ఫిరంగిపురం: మండలంలోని బేతపూడి గ్రామానికి చెందిన షేక్.షాహిద్ పల్నాడు జిల్లా నరసరావుపేటలో సాక్షి యాడ్స్ విభాగంలో పనిచేస్తుంటారు. ఆయన గుండెపోటుతో మృతిచెందారన్న విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు బేతపూడి గ్రామానికి వెళ్లి షాహిద్ భౌతికదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వనమా వెంట మండల పార్టీ నాయకులు గంథూళి మస్తాన్‌వలి, ఉడుముల పిచ్చిరెడ్డి, కె.ప్రవీణ్‌రెడ్డి, షేక్.ఖాసిం, చేవూరి రామమోహన్‌రెడ్డి, ఖాజావలి, ఆర్.రంజన్‌బాబు, షరీఫ్, ఖాజావలి, నాయకులు పాల్గొన్నారు.

• విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు అందజేత

దుగ్గిరాల: విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలని పద్మాస్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు చుండూరు భాస్కరరావు అన్నారు. మంగళవారం దుగ్గిరాల మండలకేంద్రంలోని రెండు జిల్లా పరిషత్ ఉన్నత బాలుర, బాలిక పాఠశాలల్లో ఆయన పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్ కిట్లు అందజేశారు.

• మేడికొండూరు సీఐగా మధుసూదనరావు

మేడికొండూరు: మేడికొండూరు సీఐగా మధుసూదనరావు మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. గుంటూరు జిల్లాలోని చేబ్రోలు, కొత్తపేట, నగరంపాలెం, పల్నాడు జిల్లాలోని నరసరావుపేట, పిడుగురాళ్ల తదితర పోలీస్‌స్టేషన్‌లలో సీఐగా విధులు నిర్వర్తించిన ఆయన సాధారణ బదిలీలో భాగంగా మేడికొండూరు బదిలీ అయ్యారు.

• ఆశాల వేతనాలు పెంచాలి

తాడికొండ: ఈనెల 12న దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాజధాని డివిజన్ నాయకులు ఎం.రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆశా వర్కర్లతో కలిసి ఆయన మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్‌కు మంగళవారం సమ్మె నోటీసు అందజేశారు. అనంతరం లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, తమకు చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలన్న డిమాండ్‌లతో హాస్పిటల్ ఎదుట ఆశా వర్కర్స్ ఫ్లకార్డులతో నిరసన తెలిపారు. ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు టి.రిబ్కా, కె.శారద, కోటేశ్వరి, జయకుమారి, నాగమణి, షాకీరున్నీసా, నిర్మలకుమారి, వెంకట తులసి, రజిని రాణి, అంజలి, మంగ, సీఐటీయూ నాయకులు ఎస్.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అధికంగా యూరియా వాడరాదు

ఫిరంగిపురం: మండలంలోని యర్రగుంట్లపాడు, బేతపూడి గ్రామాల్లో మంగళవారం మొక్కజొన్న పంటపై రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో వాసంతి మాట్లాడుతూ.. మొక్కజొన్న పైరుకు ఎక్కువ మోతాదులో యూరియా వాడరాదని వివరించారు. వ్యవసాయశాఖ సూచనల మేరకు మాత్రమే ఎరువు వాడాలని చెప్పారు. శనగ పంటను ఆశించే ఎండు తెగులు నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ లీటరు నీటికి 5 గ్రాముల మందు కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎస్‌కే జానీ, గౌస్, బి.హకీమ్, రైతులు పాల్గొన్నారు.

ముగిసిన అమరావతి సెంట్రలైజ్డ్ హ్యాకథాన్-2026

తాడికొండ: మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో గత రెండు రోజులుగా కొనసాగుతున్న అమరావతి సెంట్రలైజ్డ్ హ్యాకథాన్–2026 కార్యక్రమం మంగళవారం ముగిసింది. ఈ హ్యాకథాన్‌లో 58 బ్యాచ్‌లకు చెందిన 287 మంది విద్యార్థులు వివిధ కళాశాలల నుంచి పాల్గొన్నారు. కోడింగ్ ఛాలెంజ్‌లు, ఇన్నోవేషన్ కార్యకలాపాలతో పాటు డీజే నైట్, రోబోరేస్, టెక్ ట్రెజర్ హంట్ వంటి సాంకేతిక, వినోదాత్మక కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు రూ.1 లక్ష విలువైన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా నాగ శ్రీనివాసరావు, ఏఐ విభాగాధిపతి శాంతిప్రియ, ఎఫ్ఈబీఈ డైరెక్టర్ ఆర్కే మోనికా, వ్యవస్థాపకుడు ఆర్కే మహన్, ప్రోగ్రాం డైరెక్టర్ కె.శ్రీనివాస్, డీన్‌లు డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ పి.బాల మురళీకృష్ణ, పలు విభాగాల హెచ్‌వోడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

భూమి ఆరోగ్యంపై రైతులకు అవగాహన

దుగ్గిరాల: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో తెనాలి డివిజన్ సహాయ సంచాలకులు ఆర్.విజయబాబు అధ్యక్షతన రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. లాం వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టరు దయానా, కీటకనాశక శాస్త్రవేత్త శీలతా వాణి, స్వాతి రైతులకు సూచనలను అందించారు. యార్డు చైర్మన్ ఉన్నం ఝాన్సీ రాణి, ఎంపీపీ షేక్.బజీన్, డిప్యూటీ ఎంపీడీవో కె.జె.నెహ్రూ, మండల అధ్యక్షురాలు కె.శ్రీఅనిత, మాజీ ఎంపీపీ వి.కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

SBI భారతీయ స్టేట్ బ్యాంక్
తాడేపల్లి బ్రాంచ్ 12870, తాడేపల్లి, గుంటూరు జిల్లా
శాఖ మార్పు తెలియజేయు ప్రకటన
ఇందుమూలముగా మా కస్టమర్లకు మరియు ప్రజలకు తెలియజేయునది ఏమనగా... స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, తాడేపల్లి బ్రాంచ్, D.No. 12-455/24, బైపాస్ రోడ్, హైవే టవర్స్ ఎదురుగా, తాడేపల్లి - 522 501 చిరునామా నందు కార్యకలాపాలు నిర్వహిస్తుంది. మెరుగైన ఖాతాదారుల సౌకర్యార్థం ఈరోజు 04-02-2026 బుధవారం నుండి కొత్త ప్రాంగణంలోకి మారనుంది. ఈ క్రింది చిరునామాలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాము అని తెలియపరుస్తున్నాము.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
డోర్ నెం: 22-7-202/1, శ్రీ లక్ష్మీనరసింహ ప్యారడైజ్, డి మార్ట్ దగ్గరలో, NH 16 సర్వీస్‌రోడ్, తాడేపల్లి - 522 501.
ప్రదేశం: తాడేపల్లి
తేది: 04-02-2026
సం/- బ్రాంచ్ మేనేజర్
తాడేపల్లి బ్రాంచ్. సెల్: 80190 59888

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com

> నేను ఎప్పుడూ దీర్ఘకాలిక లక్ష్యంతోనే పనిచేస్తాను. దీర్ఘకాలం ఉపయోగపడేదాన్ని నిర్మించడమే నా లక్ష్యం. అది కాకుండా వేరేది ఏదైనా అది నాకు దృష్టి మళ్లింపు వంటిదే.
>
> -మార్క్ జుకర్‌బర్గ్, మెటా సీఈవో

'నేటి యువతలో ఎందరో స్టార్టప్ ఔత్సాహికులు కనిపిస్తున్నారు. యంగ్ ఇండియాకు ఇది ఎంతో మేలు చేస్తుంది. అయితే వారు ప్రధానంగా తమ ఆలోచనలు, భవిష్యత్తు అవకాశాలపై అవగాహన పెంచుకోవాలి. దీంతోపాటు సరైన ప్రణాళిక, అభివృద్ధి వ్యూహాలు అనుసరించాలి' అంటున్నారు.. ప్రముఖ మొబైల్ అడ్వర్టయిజింగ్ సంస్థ ఇన్‌మొబి కో ఫౌండర్ పీయూష్ షా. ఐఎస్‌బీ వంటి ప్రఖ్యాత ఇన్‌స్టిట్యూట్‌లో మేనేజ్‌మెంట్ పీజీ పూర్తి చేసిన ఆయన.. సిటీ బ్యాంక్, డెట్యూ బ్యాంక్ వంటి అంతర్జాతీయ బ్యాంకుల్లో కీలక పదవులు చేపట్టారు. ఇన్‌మొబి, గ్లాన్స్ సంస్థల సహ వ్యవస్థాపకులుగా ఉన్న పీయూష్ షాతో ప్రత్యేక ఇంటర్వ్యూ..

ప్రణాళికతోనే.. స్టార్టప్ సక్సెస్

పీయూష్ షా

ఏ రంగంలోనైనా ఆసక్తితోనే ఉన్నత స్థానాలు

స్టార్టప్స్‌లో సైతం ప్రతిభ ఉంటేనే అవకాశాలు

ఇన్‌మొబి కో ఫౌండర్ పీయూష్ షా

ఇటీవల కాలంలో ఇన్‌స్టిట్యూట్స్‌లో ఇంక్యుబేషన్ సెంటర్లు పెరుగుతున్నాయి. దీనివల్ల సత్ఫలితాలు ఆశించొచ్చా?

అకడమిక్ స్థాయిలోనే ఇంక్యుబేషన్ సెంటర్లు ఏర్పాటు చేయడం వల్ల యువతలో విద్యార్థి దశ నుంచే ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా మారేందుకు అవకాశాలు మెరుగవుతాయి. అయితే యువత తమ ఆలోచనలకు కార్యరూపం ఇచ్చే దశలో.. సరైన మెంటార్స్‌ను ఎంచుకోవాలి. అదేవిధంగా తమకు ఆసక్తి ఉన్న ప్రొడక్ట్‌కు మార్కెట్ ఎలా ఉందో తెలుసుకోవడం కూడా ఎంతో ముఖ్యమని గుర్తించాలి.

దేశంలో స్టార్టప్ సంస్కృతి నేటికీ మెట్రో నగరాలకే పరిమితం కావడానికి కారణం?

భౌగోళిక పరిస్థితులు దీనికి ప్రధాన కారణంగా చెప్పుకోవాలి. ఫండింగ్ ఏజెన్సీలు, ఏంజెల్ ఫండింగ్ సంస్థలు అన్ని ప్రాంతాలకు వెళ్లలేకపోతున్నారు. వందల సంఖ్యలో ఇన్‌స్టిట్యూట్స్ గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లో ఉండడమే దీనికి ప్రధాన కారణం. దీంతో.. స్టార్టప్ ఔత్సాహికులకు ఫండింగ్, బిజినెస్ ప్రమోషన్ పరంగా పలు సంస్థలు ప్రత్యేక ఈవెంట్లు, కాంపిటీషన్స్ నిర్వహిస్తున్నప్పటికీ.. అవి ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలు, ఇన్‌స్టిట్యూట్‌ల విద్యార్థులకు తెలియడం లేదు. ఈ విషయంలో ఇన్‌స్టిట్యూట్‌లే చొరవ చూపాలి. అదేవిధంగా అభ్యర్థులు సైతం తమకు తాముగా స్వీయ అన్వేషణ సాగించాలి. అకడమిక్‌గా ఒక స్థాయికి చేరుకున్నాక.. ముఖ్యంగా ప్రొఫెషనల్ కోర్సుల్లో ఎక్కువగా సెల్ఫ్ మోటివేషన్‌పైనే భవిష్యత్తు లక్ష్యాల సాధన ఆధారపడి ఉంటుందని గుర్తించి ముందుకు సాగాలి.

స్టార్టప్ ఎకో సిస్టమ్‌లో ఏ సెగ్మెంట్‌కు డిమాండ్ నెలకొంది?

వాస్తవానికి గత కొంత కాలం వరకు స్టార్టప్ అంటే ఈ-కామర్స్ అనే భావన ఉండేది. స్టార్టప్ అభ్యర్థుల్లో అధిక శాతం మంది ఈ-కామర్స్ వైపు దృష్టి సారించారు. ఇందులో రిస్క్ ఫ్యాక్టర్ తక్కువగా ఉంది. అలాగే బి టు బి విధానంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. కానీ నేడు పరిస్థితులు క్రమేణా మారుతున్నాయి. స్టార్టప్ ఎకో సిస్టమ్‌లో ఆన్‌లైన్ మార్కెటింగ్, ఎడ్యుటెక్, ఫిన్‌టెక్‌లు కూడా భారీ పొటెన్షియల్ కలిగున్నాయి.

టెక్నాలజీ స్టార్టప్స్ సంగతి?

ఇటీవల కాలంలో యువత ఆలోచన ధోరణి క్రమేణా మారుతోంది. స్టార్టప్ అభ్యర్థుల్లో దాదాపు 40 శాతం మేరకు టెక్నాలజీ స్టార్టప్స్ వైపు దృష్టి పెడుతున్నారు. వినియోగదారుల్లోనూ వీటికి ఆదరణ పెరగడమే దీనికి కారణం. ఈ కామర్స్‌లోనూ ఏఐ అసిస్టెంట్ టూల్స్ అందుబాటులోకి వస్తున్నాయి. ప్రధానంగా యాప్ బేస్డ్ సొల్యూషన్స్, క్లౌడ్ సర్వీసెస్ అందించే సంస్థల ఏర్పాటు దిశగా అడుగులు వేస్తున్నారు. అయితే ఈ విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఒక మొబైల్ యాప్ ద్వారా ఒక ప్రొడక్ట్‌ను రూపొందించి మార్కెట్లోకి విడుదల చేసే క్రమంలో.. అప్పటికే మార్కెట్లో ఉన్న అలాంటి యాప్స్ వివరాలు, అందిస్తున్న సర్వీసులను అధ్యయనం చేయాలి. వీటికంటే వినూత్నంగా తమ యాప్స్ ఉండేలా చూసుకోవాలి. అప్పుడే మార్కెట్లో ఆదరణ లభిస్తుంది.

స్టార్టప్ సక్సెస్‌కు ఎలాంటి నైపుణ్యాలు ఉండాలి?

స్టార్టప్‌ను నడిపేందుకు నాయకత్వ లక్షణాలు ఎంతో ముఖ్యం. స్టార్టప్‌ను ఏర్పాటు చేసిన తర్వాత దానికి సంబంధించి పూర్తి బాధ్యతలను తీసుకోవాల్సి ఉంటుంది. మొదట్లో ఫండింగ్ ఏజెన్సీలను మెప్పించి నిధులు పొందడం నుంచి మార్కెట్లో వినియోగదారులను మెప్పించడం వరకు అంతా తామై వ్యవహరించాలి. అదే విధంగా మానవ వనరుల నిర్వహణ పరంగానూ చాలా జాగ్రత్తగా ఉండాలి. చాలా మంది స్టార్టప్స్‌లోనైతే తమ ప్రతిభను త్వరగా ప్రదర్శించే వీలుంటుందనే భావనతో వీటిలో చేరుతున్నారు. కానీ.. తమ లక్ష్యాలకు అనుగుణంగా సంస్థ కార్యకలాపాలు లేవనే కారణంతో కొద్ది కాలంలోనే మారిపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సంస్థలు కొత్తగా మానవ వనరులను నియమించుకునేటప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలి. వారి అంకిత భావాన్ని, స్టార్టప్ సంస్థలో పని చేయడానికి వారికి గల నిజమైన ఆసక్తిని క్షుణ్నంగా తెలుసుకోవాలి.

జాబ్ మార్కెట్‌లో పోటీ కారణంగా విద్యార్థులు స్టార్టప్ ఆఫర్స్‌కు మొగ్గు చూపుతున్నారనే వాదనపై మీ అభిప్రాయం?

స్టార్టప్ సంస్థల్లో ఉద్యోగాలపై ఆసక్తికి రెండు ప్రధాన కారణాలు.. ఒకటి పోటీ తక్కువగా ఉంటుందని ఆలోచించడం. రెండోది పని వాతావరణంలో స్వేచ్ఛ లభిస్తుందని భావించడం. అభ్యర్థులు గుర్తించాల్సిన అంశం ఏంటంటే.. స్వేచ్ఛతో పాటు బాధ్యతలు కూడా అంతే స్థాయిలో ఉంటాయి. సాధారణంగా ఒక మోస్తరు స్టార్టప్ సంస్థలో 20 నుంచి 50 మంది ఉద్యోగులు ఉంటారు. వారే సంస్థ కార్యకలాపాలన్నిటినీ నిర్వహించాల్సి ఉంటుంది. సంస్థ ఉత్పత్తులను మార్కెట్లో ముందుకు తీసుకెళ్లే విధంగా వ్యూహ రచన నుంచి.. అవసరమైతే క్షేత్ర స్థాయిలోనూ పని చేయడానికి వెనుకాడకూడదు.

విద్యార్థులు, ఉద్యోగార్థులకు సలహా?

విద్యార్థులు ఆసక్తికి అనుగుణంగానే అకడమిక్స్ వైపు అడుగులు వేయాలి. మార్కెట్ డిమాండ్ వల్ల అవకాశాలు ఎక్కువగా ఉంటాయనేది నిస్సందేహం. ఆసక్తి లేకున్నా కోర్సులో చేరితే.. భవిష్యత్తులో రాణించలేక ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుంది. అదే విధంగా జాబ్ సీకర్స్ క్యాంపస్ డ్రైవ్స్‌లోనే ఆఫర్ అందుకునేలా కృషి చేయాలి. సంస్థల ప్రాధాన్యతలను తెలుసుకుని.. సంబంధిత నైపుణ్యాలు పెంచుకోవాలి.

జాబ్ స్కిల్స్

డిజిటల్ మార్కెటింగ్.. ఇటీవల కాలంలో విస్తృతంగా వినిపిస్తున్న మాట. పల్లెలు మొదలు మెట్రో సిటీల వరకు.. ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్‌లోనే తమకు కావలసిన ఉత్పత్తుల సమాచారాన్ని తెలుసుకుంటున్నారు. సంస్థలు కూడా తమ ఉత్పత్తులకు డిమాండ్ పెంచుకునేందుకు ఆన్‌లైన్ బాట పడుతున్నాయి. సంప్రదాయ మార్కెటింగ్ రీతులకు భిన్నంగా.. డిజిటల్ మార్కెటింగ్ మార్గాన్ని అనుసరిస్తున్నాయి. ఆన్‌లైన్ మాధ్యమాల్లో తమ ప్రొడక్ట్‌ల సమాచారాన్ని అందుబాటులో ఉంచుతున్నాయి. అంతేకాకుండా తమ ప్రొడక్ట్‌లనే ఎందుకు కొనాలో తెలియజేస్తూ మార్కెటింగ్ వ్యూహాలు అమలు చేస్తున్నాయి. ఫలితంగా డిజిటల్ మార్కెటింగ్ నిపుణులకు డిమాండ్ నెలకొంది. ఈ నేపథ్యంలో.. డిజిటల్ మార్కెటింగ్ తాజా ట్రెండ్స్, ఉద్యోగ అవకాశాలు, అవసరమైన నైపుణ్యాలు, అందుకునేందుకు మార్గాలు, కెరీర్ స్కోప్ తదితర వివరాలు..

డిజిటల్ మార్కెటింగ్.. కెరీర్ రైజింగ్

కార్పొరేట్ సంస్థల డిజిటల్ మార్కెటింగ్ బాట

ఏటా సగటున 26 శాతం వృద్ధితో డిజిటల్ మార్కెటింగ్ సెక్టార్

యువతకు పెరుగుతున్న ఉద్యోగ అవకాశాలు

ఎంట్రీ లెవల్‌లో సగటున రూ.4లక్షల వార్షిక వేతనం

ఏ ప్రొడక్ట్.. ఎక్కడ అందుబాటులో ఉంది. వాటి నాణ్యత ఏంటి. ఏ సంస్థ అందించే ప్రొడక్ట్‌లకు ఎంత నాణ్యత ఉంది. ఇలా అన్నింటికీ ఆన్‌లైన్ మాధ్యమాలను ఆశ్రయిస్తున్న సంగతి తెలిసిందే. దీంతో.. దేశంలో పెరుగుతున్న ఇంటర్నెట్ వినియోగం కారణంగా... డిజిటల్ మార్కెటింగ్ విస్తరిస్తోంది. ఫలితంగా ఈ విభాగంలో లక్షల సంఖ్యలో ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నాయని పలు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

డిజిటల్ మార్కెటింగ్ అంటే..: వెబ్‌సైట్స్, సెర్చ్ ఇంజన్స్, సోషల్ మీడియా, ఈ మెయిల్, బ్లాగింగ్/వ్లాగింగ్, మొబైల్స్ వంటి మాధ్యమాల ద్వారా ఆన్‌లైన్‌లో ఉత్పత్తులను మార్కెటింగ్ చేయడమే.. డిజిటల్ మార్కెటింగ్. అయితే ఈ మార్కెటింగ్ వినియోగదారులకు చేరాలంటే.. సెర్చ్ ఇంజన్ ఆప్టిమైజేషన్, సెర్చ్ ఇంజన్ మార్కెటింగ్, సోషల్ మీడియా మార్కెటింగ్, ఆన్‌లైన్ అడ్వర్టయిజింగ్, ఆన్‌లైన్ బ్రాండింగ్, కంటెంట్ మార్కెటింగ్ తదితర విధానాలు పాటించాలి. అప్పుడే సదరు వస్తువుల సమాచారం కస్టమర్‌లకు చేరువవుతుంది.

అవసరమైన నైపుణ్యాలు..: సంస్థల డిజిటల్ మార్కెటింగ్ వ్యూహాలను అమలు చేసేందుకు నిపుణుల అవసరం ఏర్పడుతోంది. డిజిటల్ మార్కెటింగ్‌లో భాగంగా సదరు ప్రొడక్ట్‌కు సంబంధించి ఆన్‌లైన్ ప్రచార వ్యూహాలను రూపొందించాలి. వినియోగదారుల అంచనాలను అధ్యయనం చేస్తూ.. దానికి అనుగుణంగా వ్యూహాలను నిర్దేశించుకుని వాటిని అమలు చేయడం ఎంతో కీలకంగా నిలుస్తుంది. సంప్రదాయ మార్కెటింగ్‌తో పోల్చితే డిజిటల్ మార్కెటింగ్‌లో కస్టమర్స్ ఒక్క క్లిక్ దూరంలోనే ఉంటారు. దీనికి అనుగుణంగా వారిని ఆకట్టుకునే విధంగా ప్రొడక్ట్ సమాచారాన్ని రూపొందించాల్సి ఉంటుంది. అదే విధంగా.. వారి అభిరుచి, ఆసక్తులను పరిగణనలోకి తీసుకుంటూ.. ప్రొడక్ట్‌కు సంబంధించి మార్పుచేర్పులు చేయాల్సి ఉంటుంది. కొత్త మోడల్స్ ఆవశ్యకతను గుర్తించి.. ఆ వివరాలను సంస్థ యాజమాన్యాలకు తెలియజేయాల్సి ఉంటుంది. స్టాటిస్టిక్స్, టెక్నాలజీ, క్రియేటివిటీ, డేటా ఇంటర్‌ప్రిటేషన్, ఈ-కామర్స్, ఈ-బిజినెస్, ఆన్‌లైన్ కస్టమర్ బిహేవియర్ వంటి అంశాలపై అవగాహన ఉంటే.. ఈ విభాగంలో ఉజ్వల కెరీర్ అవకాశాలు సొంతం చేసుకోవచ్చు.



పలు స్పెషలైజేషన్స్..: డిజిటల్ మార్కెటింగ్ రంగంలో పలు ప్రత్యేక విభాగాలు ఆవిష్కృతం అవుతున్నాయి. వీటిల్లో అఫ్లియేట్ మార్కెటింగ్, అనలిటిక్స్, బ్లాగింగ్, కంటెంట్ స్ట్రాటజీ అండ్ మార్కెటింగ్, ఈ-మెయిల్ మార్కెటింగ్, మొబైల్ మార్కెటింగ్, ఎస్ఈఎం, ఎస్ఈఓ, ఎస్ఎంఓ వంటివి ముఖ్యమైనవి.

విస్తృత అవకాశాలు..: డిజిటల్ మార్కెటింగ్‌లో నైపుణ్యం సొంతం చేసుకుంటే విస్తృత ఉద్యోగావకాశాలు లభించడం ఖాయం. కారణం.. ఈ రంగంలో మానవ వనరుల డిమాండ్, సప్లయిల మధ్య ఎంతో వ్యత్యాసం ఉంది. పలు నివేదికల ప్రకారం-ఈ రంగంలో సగటున 40 శాతం కొరత నెలకొంది.

ఆకర్షణీయ వేతనాలు..: డిజిటల్ మార్కెటింగ్‌లో ఉద్యోగాలు పొందిన వారికి ఆకర్షణీయ వేతనాలు లభిస్తున్నాయి. ఎంట్రీ లెవల్‌లో సగటున నెలకు రూ.30 వేలు వేతనం అందుతోంది. అకడమిక్‌గా మేనేజ్‌మెంట్ డిగ్రీ ఉంటే సగటున రూ.50 వేల వేతనం ఖాయం.

పీజీ మీడియా మేనేజ్‌మెంట్‌లో ఒక సబ్జెక్ట్‌గా..: పలు ఇన్‌స్టిట్యూట్‌లు డిజిటల్ మార్కెటింగ్‌ను మీడియా మేనేజ్‌మెంట్ పీజీ కోర్సుల్లో భాగంగా ఒక సబ్జెక్ట్‌గా అందిస్తున్నాయి. ఎస్‌పీ జైన్ ఇన్‌స్టిట్యూట్, సింబయాసిస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్ వంటి పలు సంస్థలు పీజీ ఇన్ మీడియా మేనేజ్‌మెంట్‌లో ఒక కోర్సుగా డిజిటల్ మార్కెటింగ్‌ను అందిస్తున్నాయి.

నైపుణ్యాలకు ఎన్నో మార్గాలు..: ప్రస్తుతం డిజిటల్ మార్కెటింగ్, ఎస్ఈఓ, ఎస్ఈఎం వంటి విభాగాల్లో నెలకొన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని పలు ఇన్‌స్టిట్యూట్స్.. అకడమిక్ శిక్షణను అందిస్తున్నాయి. ఐఎస్‌బీ-హైదరాబాద్, ఐఐఎం-ఇండోర్, కోజికోడ్, కోల్‌కత, ట్రిచీ వంటి ప్రముఖ ఇన్‌స్టిట్యూట్‌లు; అదే విధంగా ఆల్ ఇండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజిటల్ మార్కెటింగ్ ఇండియా, డిజిటల్ విద్య, డిజిటల్ మార్కెటింగ్ అకాడమీ వంటి సంస్థలు.. ఎస్ఈఓ, ఎస్ఈఎం, డిజిటల్ మార్కెటింగ్ తదితర కోర్సులను ఆన్‌లైన్‌లో ప్రవేశపెడుతున్నాయి. వీటితోపాటు కోర్సెరా, ఎడెక్స్ వంటి సంసలు సర్టిఫికేషన్ కోర్సులను అందిస్తున్నాయి.

డిజిటల్ మార్కెటింగ్.. జాబ్ ప్రొఫైల్స్

డిజిటల్ మార్కెటింగ్ విభాగంలో పలు హోదాల్లో ఉద్యోగాలు లభిస్తాయి. ఆ వివరాలు..

ఎస్ఈఓ..: డిజిటల్ మార్కెటింగ్‌లో ఎంతో కీలకమైన ఉద్యోగంగా సెర్చ్ ఇంజన్ ఆప్టిమైజేషన్ స్పెషలిస్ట్‌ను పేర్కొనొచ్చు. సంస్థ వెబ్‌సైట్ ర్యాంకింగ్స్‌ను పెంచే వ్యూహాలను రూపొందించడం ఎస్ఈఓ విధులుగా ఉంటున్నాయి. అదే విధంగా విభిన్న మార్కెటింగ్ వ్యూహాలు సిద్ధం చేయడం కూడా ఎస్ఈఓలో మరో ముఖ్యమైన అంశం. బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసుకుని.. హెచ్‌టీఎంఎల్, సీఎస్ఎస్‌లో పరిజ్ఞానం పెంచుకుంటే ఎస్ఈఓ స్పెషలిస్ట్‌గా కొలువు సాధించొచ్చు.

సోషల్ మీడియా స్ట్రాటజిస్ట్(ఎస్ఎంఎస్)..: సంస్థ సమాచారాన్ని ఆన్‌లైన్ మాధ్యమాల్లో పొందుపర్చడమే కాకుండా.. సంస్థలు, వినియోగదారుల మధ్య పరస్పర సంప్రదింపులు జరిగేలా చూడడం ఎస్ఎంఎస్ బాధ్యత. ఇందులో బ్యాచిలర్ డిగ్రీతో అడుగు పెట్టొచ్చు.

సోషల్ మీడియా మార్కెటింగ్ మేనేజర్..: సోషల్ మీడియా, ఇతర ఆన్‌లైన్ మాధ్యమాల్లో సంస్థ చేపడుతున్న మార్కెటింగ్ వ్యూహాలు, కార్యకలాపాలను పర్యవేక్షిస్తూ.. వాటి తీరుతెన్నులను విశ్లేషించడం ఎంతో ముఖ్యం. ఈ విధులను నిర్వర్తించే వారే సోషల్ మీడియా మార్కెటింగ్ మేనేజర్స్. ఉత్తమ మార్కెటింగ్ టెక్నిక్స్‌ను గుర్తించి వాటికి అనుగుణంగా ప్రొడక్ట్ మార్కెటింగ్ వ్యూహాలను సిద్ధం చేయడం కూడా వీరి ముఖ్యమైన విధిగా ఉంటోంది. సంస్థలు ఎంబీఏ మార్కెటింగ్ స్పెషలైజేషన్ ఉత్తీర్ణులకు ప్రాధాన్యమిస్తున్నాయి.

ఆన్‌లైన్ కమ్యూనిటీ మేనేజర్..: డిజిటల్ మార్కెటింగ్ సోషల్ నెట్‌వర్క్ గ్రూప్స్, ఈ-మెయిల్ గ్రూప్స్‌కు సంస్థకు మధ్య వారధులుగా నిలిచే వ్యక్తులు.. ఆన్‌లైన్ కమ్యూనిటీ మేనేజర్స్. వీరు ప్రధానంగా ఆన్‌లైన్ కమ్యూనిటీస్‌కు తమ సంస్థకు సంబంధించిన సమాచారాన్ని, బ్రాండ్ లాయల్టీని తెలియజేస్తారు. తద్వారా వెబ్ ట్రాఫిక్ పెరిగేలా చూస్తారు. ఇది ప్రధానంగా విజువలైజేషన్ స్కిల్స్‌పై ఆధారపడి ఉంటుంది. అంటే తమ సంస్థకు సంబంధించిన సమాచారాన్ని పిక్చర్స్, వీడియోస్ రూపంలో ఆకట్టుకునే రీతిలో రూపొందించడం. ఈ ప్రొఫైల్ జాబ్ కోరుకునే అభ్యర్థులకు బ్యాచిలర్ డిగ్రీతో పాటు వీడియో ఎడిటింగ్, ఫోటోషాప్, వెబ్‌సైట్ డెవలప్‌మెంట్ వంటి ఇతర టెక్నికల్ నైపుణ్యాలు అవసరం.

కంటెంట్ మేనేజర్..: ఒక సంస్థ కొత్తగా ఒక ఉత్పత్తిని మార్కెట్‌లోకి తెస్తే.. సదరు కొత్త ఉత్పత్తికి సంబంధించిన సమాచారం, దాని ప్రత్యేకతలను కళ్లకు కట్టినట్లుగా సోషల్ మీడియాలో రాయడమే కంటెంట్ మేనేజర్ల ప్రధాన విధి. సరళంగా, సూటిగా, స్పష్టంగా రాసే నైపుణ్యం ఉన్న వాళ్లనే కంపెనీలు కంటెంట్ మేనేజర్లుగా నియమించుకుంటున్నాయి. ఇటీవల కాలంలో సంస్థలు, వెబ్‌సైట్స్ నుంచి కంటెంట్ మేనేజర్లకు డిమాండ్ పెరుగుతోంది. వేతనాలు కూడా ఆ స్థాయిలోనే ఉంటున్నాయి. కంప్యూటర్‌పై పరిజ్ఞానం, హెచ్‌టీఎంఎల్, వెబ్ పబ్లిషింగ్, ఎస్ఈఓ నైపుణ్యాలుంటే కంటెంట్ మేనేజర్లుగా సుస్థిర భవిష్యత్తు ఖాయం.

డిజిటల్ మార్కెటింగ్ మేనేజర్..: వెబ్‌సైట్స్, సెర్చ్ ఇంజన్స్, ఈ-మెయిల్స్ వంటి ఆన్‌లైన్ సాధనాలను వినియోగిస్తూ.. తమ సంస్థ ఉత్పత్తుల సమాచారం, వాటి ప్రత్యేకతలను అన్ని వర్గాలకు తెలియజేయడమే డిజిటల్ మీడియా మేనేజర్ ముఖ్యమైన విధిగా పేర్కొనొచ్చు. అంతేకాకుండా సంస్థలోనే అంతర్గతంగా మార్కెటింగ్ బృందాలు, సంస్థ వెండార్స్‌తో నిరంతరం సంప్రదింపులు సాగిస్తూ వారి ఆలోచనలకు అనుగుణంగా ఆన్‌లైన్ రూపమివ్వడం కూడా మరో ముఖ్యమైన విధి. ఈ ఉద్యోగానికి కూడా ఇంటర్ పర్సనల్ స్కిల్స్, టీమ్ వర్కింగ్ స్కిల్స్, ఇంటరాక్టివ్ స్కిల్స్ అవసరం. మార్కెటింగ్ విభాగంలో పట్టభద్రులకు సంస్థలు అవకాశం కల్పిస్తున్నాయి.

మార్కెట్ రీసెర్చ్ అనలిస్ట్..: సంస్థ ఉత్పత్తులు, దానికి సరితూగే విధంగా మార్కెట్లో ఉన్న ఉత్పత్తుల గురించి పరిశోధించడం.. ఇతర సంస్థల ఉత్పత్తుల కంటే తమ ఉత్పత్తి ఎలా ఉంటే వినియోగదారులను ఆకట్టుకుంటుందో తెలియజేయడం.. మార్కెట్ రీసెర్చ్ అనలిస్ట్ ముఖ్య విధి. వెబ్ అనలిటిక్స్ టూల్స్‌తో వినియోగదారుల అభిరుచులను విశ్లేషించి.. మార్కెటింగ్ సిబ్బందికి అందజేయాల్సి ఉంటుంది. డేటా అనలిటిక్స్ నైపుణ్యాలున్న వారికి మెరుగైన అవకాశాలు లభిస్తాయని చెప్పొచ్చు.

ఉద్యోగ సమాచారం

బ్యాంక్ ఆఫ్ బరోడాలో 418 పోస్టులు

ప్రభుత్వ రంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ బరోడా.. రెగ్యులర్ ప్రాతిపదికన వివిధ విభాగాల్లో మేనేజర్, సీనియర్ మేనేజర్, ఇంజనీర్, ఆఫీసర్, ఐటీ డెవలపర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 418.
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, ఎంటెక్, ఎంసీఏలో ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** ఆఫీసర్‌కు 22 నుంచి 32 ఏళ్లు, మేనేజర్‌కు 24 నుంచి 34 ఏళ్లు, సీనియర్ మేనేజర్‌కు 27 నుంచి 37 ఏళ్లు.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, సైకోమెట్రిక్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 19.02.2026.
- **వెబ్‌సైట్:** https://bankofbaroda.bank.in/

బీఎస్ఎన్ఎల్‌లో 120 పోస్టులు

భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్(బీఎస్ఎన్ఎల్).. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన సీనియర్ ఎగ్జిక్యూటివ్ ట్రెయినీ, జూనియర్ ఎగ్జిక్యూటివ్ ట్రెయినీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 120.
- **పోస్టుల వివరాలు:** సీనియర్ ఎగ్జిక్యూటివ్ ట్రెయినీ(టెక్నికల్)-95, సీనియర్ ఎగ్జిక్యూటివ్ ట్రెయినీ(ఫైనాన్స్)-25.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్, సీఏ/సీఎంఏలో ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** 21 నుంచి 30 ఏళ్లు ఉండాలి.
- **ఎంపిక విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 05.02.2026.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 07.03.2026.
- **వెబ్‌సైట్:** https://bsnl.co.in/

నిట్ కాలికట్‌లో 14 అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్-2 పోస్టులు

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్) కాలికట్ ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్-2 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 14.
- **విభాగాలు:** ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్, బయోసైన్స్ అండ్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, హ్యూమానిటీస్, ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్సెస్ తదితరాలు.
- **అర్హత:** సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి పీహెచ్‌డీ ఉత్తీర్ణులవ్వాలి.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.02.2026.
- **వెబ్‌సైట్:** https://nitc.ac.in/

నిట్ కాలికట్‌లో 50 అప్రెంటిస్‌లు

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్), కాలికట్ సెంటర్ ఫర్ కంటిన్యూయింగ్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్(సీసీఈఎస్‌డి) ద్వారా గ్రాడ్యుయేట్, డిప్లొమా, ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్ ట్రైనీ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం ఖాళీల సంఖ్య:** 50.
- **ఖాళీల వివరాలు:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ ట్రైనీ-07, డిప్లొమా అప్రెంటిస్ ట్రైనీ-24, ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్ ట్రైనీ-19.
- **అర్హత:** సంబంధిత విభాగంలో డిప్లొమా/ఐటీఐ ఉత్తీర్ణులవ్వాలి.
- **వయసు:** 28 ఏళ్ల నుంచి 35 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక విధానం:** అకడమిక్ మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 09.02.2026.
- **వెబ్‌సైట్:** https://nitc.ac.in/

ఇర్కాన్‌లో 26 అప్రెంటిస్‌లు

న్యూఢిల్లీలోని ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్.. వివిధ విభాగాల్లో గ్రాడ్యుయేట్, డిప్లొమా అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం ఖాళీల సంఖ్య:** 26.
- **విభాగాలు:** సివిల్, ఎలక్ట్రికల్, ఎస్‌టీ.
- **ఖాళీల వివరాలు:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్-17, డిప్లొమా అప్రెంటిస్-09.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ(ఇంజనీరింగ్), డిప్లొమా ఉత్తీర్ణులవ్వాలి.
- **వయసు:** 01.01.2026 నాటికి 18 నుంచి 30 ఏళ్లు ఉండాలి.
- **స్టైపెండ్:** నెలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు రూ.10,000, డిప్లొమా అప్రెంటిస్‌కు రూ.8,500.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 17.02.2026.
- **వెబ్‌సైట్:** https://ircon.org/

22195 గ్రూప్-డి పోస్టులు...

రైల్వే కొలువు మీ లక్ష్యమా..? మీ విజయానికి సాక్షి ఎడ్యుకేషన్ 'ఫ్రీ' గైడెన్స్..!

రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డ్ 22195 గ్రూప్-డి పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. ఉద్యోగ సాధన లక్ష్యంగా ఉన్న అభ్యర్థుల కోసం సాక్షిఎడ్యుకేషన్ వెబ్‌సైట్ గ్రూప్-డి సిలబస్, సమగ్ర స్టడీ మెటీరియల్స్, గత ప్రశ్నపత్రాలు, టెస్ట్ సిరీస్‌లు, ప్రతిరోజూ కరెంట్ అఫైర్స్ వంటి విలువైన సమాచారాన్ని అందిస్తోంది. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి అభ్యర్థులు మెటీరియల్‌ను ఉచితంగా పొందొచ్చు.

Heredity: How Traits Pass from Parents to Children



***Heredity** explains how physical and biological traits are passed from parents to their offspring.*

- *Traits like eye colour, height, blood group, and certain diseases are inherited.*
- *Genes are the basic units of heredity and are present on chromosomes.*
- *Each child receives one set of genes from the mother and one from the father.*
- *Gregor Mendel, known as the Father of Genetics, discovered the basic laws of inheritance using pea plants.*
- *Traits can be dominant or recessive; dominant traits appear in the first generation.*
- *Variation in traits helps organisms survive and adapt to changing environments.*
- *Some diseases, like haemophilia and colour blindness, are hereditary.*
- *Understanding heredity helps in medicine, agriculture, and genetic research.*
- *Heredity explains both similarities and differences among family members.*

8 MARKS QUESTIONS

1. How is the equal genetic contribution of male and female parents ensured in the progeny?

A. 1. The equal genetic contribution from parents is ensured through chromosomes.
2. Humans have 46 chromosomes in most body cells, arranged in 23 pairs.
3. We get 23 chromosomes from the mother's egg cell and 23 chromosomes from the father's sperm cell.
4. When the egg and sperm combine during fertilization, the new offspring gets exactly half of its genetic material from each parent.
5. This means the offspring receives one chromosome from each pair from the mother and one from the father, ensuring an equal genetic contribution.

2. Independent Inheritance of Traits How do Mendel's experiments show that traits are inherited independently?

A. 1. Mendel used his dihybrid cross experiment to show that traits are inherited independently.
2. He crossed pea plants that differed in two traits at the same time, like seed shape (Round/Wrinkled) and seed color (Yellow/Green).
3. In the second generation (F2), he observed all possible combinations of the two traits.
4. This showed that the allele for seed shape was inherited separately from the allele for seed color.
5. This proved Mendel's Law of Independent Assortment, which states that the inheritance of one trait does not influence the inheritance of another.

3. Male Responsibility for Sex Determination Male / Father is responsible for sex determination of the baby - Do you agree? If so, explain your answer with a flow chart.

A. 1. Yes, the father is responsible for determining the sex of the baby.
2. Human cells have 23 pairs of chromosomes, including one pair of sex chromosomes.
3. Females have two X chromosomes (XX), so their egg cells only carry an X chromosome.
4. Males have one X and one Y chromosome (XY), so their sperm can carry either an X or a Y chromosome.
5. If a sperm carrying an X chromosome fertilizes the egg, the baby will be a girl (XX).
6. If a sperm carrying a Y chromosome fertilizes the egg, the baby will be a boy (XY).
7. Since the mother always gives an X, the father's sperm decides the baby's sex.

4. Explain the process of monohybrid cross to understand Mendel's experiment with the checkerboard? (punnet square).

A. 1. Mendel's monohybrid cross studied the inheritance of one trait at a time, like the height of a pea plant.
2. He crossed a pure tall plant (TT) with a pure dwarf plant (tt).
3. The first generation (F1) all came out tall (Tt), showing that the tall trait is dominant.
4. He then crossed two of these F1 plants {Tt} to create the F2 generation.
5. The Punnett square (checkerboard) is used to predict the results of this cross.
6. It shows that in the F2 generation, the traits appear in a ratio of 3 Tall to 1 Dwarf, proving the principle of inheritance.

5. How do traits get expressed? Explain with an example.

A. 1. Cellular DNA is the information source for making proteins in the cell.
2. A section of DNA that provides information for one protein is called the gene for that protein.
3. Let us take the example of tallness as a characteristic.
4. We know that plants have hormones that can trigger growth.
5. Plant height can thus depend on the amount of a particular plant hormone.
6. The amount of the plant hormone made will depend on the efficiency of the process for making it.
7. Consider now an enzyme that is important for this process.
8. If this enzyme works efficiently, a lot of Hormone will be made, and the plant will be tall.
9. If the gene for that enzyme has an alteration that makes the enzyme less efficient, the amount of hormone will be less, and the plant will be short.
10. Thus, genes control characteristics, or traits.

4 MARKS QUESTIONS

1. Describe Mendel's law of segregation and law of independent assortment.

A. 1. **Law of Segregation:** During gamete formation, the two factors (alleles) for each trait separate so that each gamete receives only one allele.
2. **Law of Independent Assortment:** Alleles of different traits separate independently during gamete formation, leading to formation of new combinations.
3. These laws explain how traits are inherited from parents to off spring and why variations occur.

2. A study found that children with light-coloured eyes are likely to have parents with light-coloured eyes. On this basis, can we say anything about whether the light eye colour trait is dominant or recessive? Why or why not?

A. 1. No, it is impossible to tell whether the light eye color trait is dominant or recessive based on the given information.
2. Determining if a trait is dominant or recessive requires knowledge of its genetics.
3. To fully understand the genetics, we need information about at least three generations and the genotypes of the parents.
4. In this case, since we only know about two generations, we cannot draw any conclusions.

3. Dominance in Blood Groups A man with blood group A marries a woman with blood group O and their daughters have blood group O. Is this information enough to tell you which of the traits - blood group A or O - is dominant? Why or why not?

A. 1. Yes, this information is enough to determine which blood group trait is dominant.
2. The daughter has blood group O, meaning she inherited the O allele from both her mother and her father.
3. Since the father has blood group A, but passes on the O allele to his daughter, his genotype must be heterozygous (AO).
4. This shows that the A trait was present in the father but was not expressed in his daughter's blood (O), which can only happen if O is recessive.
5. Therefore, we can conclude that blood group A is dominant over blood group O.

4. If you were a scientist, propose a genetic modification plan to help farmers in drought- affected regions. Mention four features of your designed crop variety.

A. Genetically modified crop for drought regions may include:
1. Ability to grow with minimal water.
2. Deeper root system to absorb underground moisture.
3. Faster growth rate to reduce crop-failure risk.
4. Resistance to common pests and diseases in dry climates. Such a crop will ensure stable food production even in drought conditions.

5. How many pairs of contrasting characters did Mendel select in pea plants?

A. 1. Seed shape: Round / Wrinkled
2. Seed colour: Yellow / Green
3. Flower colour: Violet / White
4. Pod shape: Inflated / Constricted
5. Pod colour: Green / Yellow

Continued on next page..

6. Flower position: Axial / Terminal
7. Stem height: Tall / Dwarf

2 MARKS QUESTIONS

1. **A normal pea plant bearing-coloured flowers suddenly start producing plants with white flowers. What could be the possible cause?**

A. Mutation occurred in the gametes of the parent plant may be responsible for the appearance of white flowers. Normal colour of the flowers may be the recessive trait. When it is crossed with dominant white coloured plant, it starts producing white-coloured flowering plants.

2. **How do you appreciate the role of genes in heredity?**

A. 1. The genes are the parts of chromosomes which carry the genetic information from parents to progeny.
2. The genes are having the DNA
3. These genes are responsible for the variations and creating the new charact the off springs.

3. **How does the creation of variations in species promote survival?**
1. Variations in a species promote survival by helping organisms adapt to environmental changes,
2. Which can prevent extinction and allow the species to continue.

4. **Write any two slogans on female feticide?**
1. Save the girl child, save the future.
2. Don't kill your future in the womb.

5. **State Mendel's laws of inheritance.**

A. 1. Law of Dominance - Only the dominant trait is expressed in hybrids.
2. Law of Segregation - Allele pairs separate during gamete formation.
3. Law of Independent Assortment - Alleles of different traits assort independently

6. **Explain a monohybrid cross with an example.**

A. A monohybrid cross is between individuals differing in one trait, such as tall (TT) and dwarf (tt) plants. All F_1 offspring are tall (Tt). In F_2 generation, phenotypic ratio is 3:1 and genotypic ratio is 1:2:1.

7. **Distinguish between genotype and phenotype.**
Genotype refers to the genetic makeup (TT, Tt, tt), while phenotype refers to the observable traits (tall or dwarf). Genotype determines phenotype.

8. **Explain the inheritance of sex in humans.**
1. Humans have 23 pairs of chromosomes. Females are XX and males are XY.
2. The father contributes either X or Y chromosome, determining the sex of the child.

9. **What are acquired and inherited traits? Give examples.**

A. 1. Inherited traits are passed genetically from parents (eye colour).
2. Acquired traits develop during life (muscle building) and are not inherited.

10. **Explain variation and its importance.**
1. Variation refers to differences among individuals.
2. It helps organisms adapt to environmental changes and ensures survival and evolution.

11. **What is a dihybrid cross? State its phenotypic ratio.**

A. 1. A dihybrid cross involves two contrasting traits.
2. The phenotypic ratio obtained in F_2 generation is 9:3:3:1.

12. **Describe the term allele with an example.**
Alleles are alternative forms of a gene controlling the same trait, such as T (tall) and t (dwarf) in pea plants.

13. **Why are acquired traits not inherited?**
Acquired traits do not affect the DNA of germ cells, so they are not passed to the next generation.

14. **Explain dominant and recessive traits with an example.**
A dominant trait expresses even in heterozygous condition, while a recessive trait expresses only when both alleles are recessive. Example: Tallness is dominant over dwarfness.

1 MARK QUESTIONS

1. What is Heredity?
A. Heredity is the passing of traits from parents to their offspring.
2. Expand DNA?
A. Deoxyribonucleic Acid.
3. Who is called the Father of Genetics?
A. Gregor Mendel.
4. Mention any two recessive traits of a garden pea?
A. Wrinkled seed shape and green seed color.
5. What is the genotypic ratio of a Monohybrid cross?
A. 1:2:1 (F2 generation).
6. What is the phenotypic ratio of a dihybrid cross?
A. 9:3:3:1 (F2 generation).
7. Which of the gametes - sperm or egg decides the sex of the child?
A. The sperm (male gamete) decides the sex of the child.
8. Males are called heterogametic. Why?
A. Because males produce two different types of gametes (sperm), one with an X chromosome and one with a Y chromosome.
9. If a trait A exists in 10% of a population of an asexually reproducing species and a trait B exists in 60% of the same population which trait is likely to have arisen earlier?
A. Trait B is likely to have arisen earlier than trait A in an asexually reproducing species
10. Give any two examples for organisms in which sex determination is not genetic?
A. Two examples are Turtles and Snails.
11. Write examples of variations in human beings.
A. Different skin color, eye color, and hair type.
12. Sex determination is by males, but blaming females for girl child. Write a slogan on it.
A. It's a Y-sperm decision, not a she decision.
13. Why did Mendel choose pea plants for his experiments?
A. Because pea plants have contrasting traits and short life cycle, making results easy to observe.
14. What is the genotypic ratio of monohybrid cross.
A. 1:2:1
15. What is a dominant trait?
A. A trait that expresses itself even in the presence of an alternative trait.
16. If a tall plant (Tt) is crossed with a dwarf plant (tt), what will be the phenotype of the offspring?
A. 50% tall and 50% dwarf
17. A trait suddenly appears in the F_2 generation but not in F_1. What type of trait is it?
A. Recessive trait.
18. Why do chromosomes exist in pairs in body cells?
A. One chromosome inherited from each parent.
19. Give a slogan to encourage awareness about genetic diseases.
A. Know Your Genes, Protect the Next Generation."
20. What is the phenotypic ratio of the F2 generation in dihybrid cross
A. 9:3:3:1
21. What is a gene?
A. A gene is a unit of DNA on a chromosome which governs the synthesis of particular protein that controls specific characteristics or (traits) of an organism.
22. Who is responsible for the sex in the new born baby?
A. Male is responsible for the sex in the new born baby.
23. What is the phenotypic ratio of monohybrid cross?
A. The phenotypic ratio of monohybrid cross is 3:1.

P. Neelakantaiah
ZPHS Karakambadi,
Tirupati Dist.

Daily Quiz

సమాధానాలు రాయడానికి ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

1. **Identify the Correct Pair from the following**
A) Producers- Phytoplankton
B) Primary Consumers - Wolf
C) Secondary Consumers insects
D) Tertiary Consumers - Rabbit

2. **Which one of the following pair belongs to the same trophic level?**
A) Frog - Lizard
B) Snake - Squirrel
C) Rabbit-Fox D) Hawk-Rat

3. **Which level in the food chain has minimum Energy?**
A) Producers B) Primary Consumers
C) Secondary Consumers
D) Tertiary Consumers

4. **In an ecosystem, herbivores represent**
A) Producers
B) Primary Consumers
C) Secondary Consumers
D) Tertiary Consumers

5. **A food chain comprising Eagle, Green Plants, Grasshoppers, Frog and Snake. The concentration of harmful chemicals entering the food chain will be maximum in**
A) Frog B) Grasshoppers
C) Eagle D) Snake

క్లుప్తంగా...

నేడు అంబటి కుటుంబాన్ని పరామర్శించనున్న వైఎస్ జగన్

సాక్షి,అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం గుంటూరులో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి ఆయన గుంటూరు వెళతారు. ఇటీవల టీడీపీ గూండాల చేతిలో దాడికి గురైన మాజీ మంత్రి అంబటి రాంబాబు నివాసానికి చేరుకుని ఆయన కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. అనంతరం తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

మాపై కేసులు కొట్టేయండి

హైకోర్టులో వైఎస్సార్‌సీపీ నేతల పిటిషన్లు

సాక్షి, అమరావతి: తమపై నమోదు చేసిన అక్రమ కేసులను కొట్టేయాలని కోరుతూ వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మరో 27 మంది వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. తిరుమల లడ్డూ నెయ్యి వ్యవహారంలో టీడీపీ మూకలు చేస్తున్న తప్పుడు ప్రచారం నేపథ్యంలో వినుకొండ, శ్రీనివాసనగర్‌లోని శ్రీవెంకటేశ్వస్వామి ఆలయంలో పూజలు చేసేందుకు వెళ్తుండగా పోలీసులు బొల్లా బ్రహ్మనాయుడుతో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ నేతలను అడ్డుకుని, వారిపై జనవరి 31న కేసులు నమోదు చేశారు. ఈ వ్యాజ్యాలపై హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప బుధవారం విచారణ జరపనున్నారు.

శ్రీవారిని రాజకీయ వివాదాల్లోకి లాగుతున్న చంద్రబాబు

తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి

సాక్షి, న్యూఢిల్లీ: చంద్రబాబు దుర్మార్గపు రాజకీయాలకు పాల్పడుతున్నారని వైఎస్సార్‌సీపీ తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి విమర్శించారు. మంగళవారం ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. తిరుమల శ్రీవారిని సైతం స్వార్థ ప్రయోజనాల కోసం రాజకీయ వివాదాల్లోకి లాగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన సిట్ తిరుపతి లడ్డూలో ఎలాంటి జంతువుల కొవ్వును ఉపయోగించలేదని స్పష్టంగా తేల్చిందని గుర్తు చేశారు. అయినా, టీడీపీ, చంద్రబాబు పనిగట్టుకుని అసత్య ప్రచారానికి తెరలేపుతున్నారని మండిపడ్డారు. తమ అంచనాలకు అనుగుణంగా నివేదిక రాలేదనే సాకుతో చంద్రబాబు మరో విచారణ కమిటీ వేస్తామనడం దురదృష్టకరమన్నారు. ఇందుకోసమే కేబినెట్ సమావేశం ఏర్పాటు చేశారన్నారు. తిరుమల లడ్డూ వ్యవహారం తప్ప ప్రజా సమస్యలకు చోటులేదనే విధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. నివేదిక అధికార పార్టీకి అనుకూలంగా లేదన్న కారణంతోనే అధికారి అనిల్‌కుమార్ సింఘాల్‌ను బదిలీ చేశారని ఆరోపించారు. ఇకనైనా ఈ రాజకీయ డ్రామాలకు స్వస్తి పలికి రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి సారించాలని గురుమూర్తి పిలుపునిచ్చారు.

కాకాణిపై మరో రెండు అక్రమ కేసులు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: వైఎస్సార్‌సీపీ శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై మరో రెండు అక్రమ కేసులు నమోదు చేశారు. జిల్లాలోని పొదలకూరు, నెల్లూరు దర్గామిట్ట పోలీస్‌స్టేషన్లలో టీడీపీ నేతల తప్పుడు ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేశారు. తిరుమల లడ్డూపై దుష్ప్రచారంపై నిజమే గెలిచిందంటూ కాకాణి వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి గత నెల 29న మాగుంట లేఅవుట్‌లో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆ సందర్భంగా చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేశ్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ మనుబోలు మండల టీడీపీ నేత పచ్చిపాల రామిరెడ్డి ఈ నెల 2న నెల్లూరు దర్గామిట్ట పోలీసులకు తప్పుడు ఫిర్యాదు చేశారు.అలాగే టీడీపీ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని నావూరుపల్లికి చెందిన తలచీరు మస్తాన్‌బాబు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కాకానిపై అక్రమ కేసు నమోదు చేశారు.

పోలీసు వ్యవస్థతో కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు

జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసయాదవ్



గుంటూరు ఎడ్యుకేషన్: పోలీసు వ్యవస్థ వ్యవహార శైలి కారణంగా కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస యాదవ్ అన్నారు. అమరావతిరోడ్డులోని పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం శ్రీనివాసయాదవ్ మీడియాతో మాట్లాడారు. మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీనేత అంబటి రాంబాబు ఇల్లు, కార్యాలయాలపై జరిగిన దాడి, అంతకు ముందు చోటు చేసుకున్న ఫ్లెక్సీ వివాదంలో పోలీసుల వైఫల్యం ఉందన్నారు. నల్లపాడు సీఐ నిర్లక్ష్యం కారణంగానే చిల్లీస్ సెంటర్‌లో ఘర్షణ వాతావరణం నెలకొందన్నారు. గోరంట్ల వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి వచ్చిన అంబటి రాంబాబును వేరే మార్గంలో పంపాల్సి ఉందని పేర్కొన్నారు. నల్లపాడు సీఐ ఆ విధంగా చేయకపోవడం వల్ల అక్కడ టీడీపీ శ్రేణులతో వాగ్వాదం, ఘర్షణ జరిగిందన్నారు. అదేరోజు సాయంత్రం అంబటి ఇంటి వద్దకు పెద్ద సంఖ్యలో వస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలను నిలువరించడంలో పట్టాభిపురం సీఐ విఫలమయ్యారని చెప్పారు. సమావేశంలో జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావుపాల్గొన్నారు.

టీడీపీ చేతిలో ఖాకీలు బొమ్మలు

అంబటి ఇంటిపై దాడిలో ఆ ఇద్దరు పోలీసుల కీలకపాత్ర

- తన పరిధిలో దాడి జరిగినా చోద్యం చూసింది ఒకరు..
- తెలుగుదేశం క్యాడర్ కర్రలతో దాడికి సిద్ధమైతే వారికి కాపలా కాసింది మరొకరు..
- అంబటి వాహనంలో ఆయుధాలు ఉన్నాయంటూ తప్పుడు ప్రచారం
- స్టేషన్‌లో అంబటిని హింసించింది ఆ ఇద్దరు పోలీసు అధికారులే
- పక్క సబ్ డివిజన్‌లోని స్టేషన్‌లో ఆ సీఐకి ఏం పని?
- ఆ ఇద్దరిపై ఉన్నతాధికారుల శాఖాపరమైన చర్యలేవీ?

సాక్షి టాస్క్‌ఫోర్స్: వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇంటిపై దాడి చేసి ధ్వంసం చేయడంతోపాటు ఆయనపై హత్యాయత్నం జరిగిన ఘటనలో ఇద్దరు పోలీస్ అధికారులు కీలక పాత్ర పోషించినట్లు సమాచారం. తెలుగుదేశం పార్టీ చేతిలో కీలుబొమ్మలై ఆ పార్టీ అధిష్టానం చెప్పినట్టు నడుచుకున్నట్టు తెలుస్తోంది. మాజీ మంత్రి అంబటి రాంబాబు శనివారం గోరంట్ల గ్రామంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో పూజలు చేసి తిరిగి వస్తున్న సమయంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, కార్పొరేటర్లు గోరంట్ల చిల్లీస్ సెంటర్‌లో కర్రలు, మారణాయుధాలతో కాపుగాశారు. అంబటి రాంబాబు వాహనాన్ని అడ్డుకుని కారు మీద చేతులతో కొడుతూ అసభ్య పదజాలంతో దూషించారు. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ వందనాదేవి అయితే ''నువ్వు మొగోడివి అయితే రారా''అంటూ అంబటిని రెచ్చగొట్టారు. మారణాయుధాలతో తెలుగుదేశం నేతలు పెద్ద సంఖ్యలో గుమిగూడినా వారిని నియంత్రించడంలో నల్లపాడు సీఐ వంశీధర్ విఫలమయ్యారు.పైగా టీడీపీ నేతలకు కొమ్ముగాశారు. వైఎస్సార్‌సీపీ నేతల నుంచి ప్రతిస్పందన రాకుండా తెలుగుదేశం మూకలకు రక్షణగా నిలబడ్డారు. పైగా అంబటి వాహనంలో మారణాయుధాలు ఉన్నాయంటూ దుష్ప్రచారం చేశారు.

వ్యూహాత్మకంగా దాడి..

అంబటిపై కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కూడా అతిగా స్పందించారు. రాంబాబుకు 24 గంటల్లో తామేంటో సినిమా చూపిస్తామని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. ఆ తర్వాత కొద్దిసేపటికే శనివారం మధ్యాహ్నం 3.45 గంటలకు నల్లపాడు సీఐ వంశీధర్ సిద్ధార్థనగర్‌లోని అంబటి ఇంటికి వెళ్లి నోటీసు ఇచ్చేందుకు వచ్చామని చెప్పారు. అయితే నోటీసు ఇవ్వకుండానే ఇప్పుడే వస్తామని చెప్పి వెళ్లిపోయారు. వెళ్లేటప్పుడు అంబటి ఇంటి వద్ద ఎంత మంది ఉన్నారో గమనించి వెళ్లి టీడీపీ నేతలకు ఉప్పందించారని సమాచారం. ఈ నేపథ్యంలో అంబటిని అరెస్ట్ చేస్తున్నారన్న సమాచారంతో మీడియా అక్కడికి చేరుకుంది. అదే సమయంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులూ తరలివచ్చాయి. సాయంత్రం 4 గంటలకు తెలుగుదేశం పార్టీ మహిళా కార్యకర్త లంకా మాధవి అంబటి ఇంటి వద్దకు వచ్చి అంబటిని ''నా కొడకా రా..రా.. చెప్పుతో కొడతా''అంటూ దుర్భాషలాడింది. దీనికి వైఎస్సార్‌సీపీ మహిళా నాయకులు ప్రతిస్పందించారు. టీడీపీ కార్యకర్తను అడ్డుకునేందుకు యత్నించారు. దీంతో పోలీసులు లంకా మాధవిని అక్కడి నుంచి తప్పించారు. అప్పటికే వ్యూహాత్మకంగా పశ్చిమఎమ్మెల్యే గల్లా మాధవి, ఆమె భర్త రామచంద్రరావు, అబ్బూరి మల్లి, ఇతర కార్పొరేటర్లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అంబటి ఇంటికి చేరుకుని ఒక్కసారిగా మారణాయుధాలు, కత్తులు, కర్రలు, ఇనుప రాడ్లతో దాడి చేసి విధ్వంసం సృష్టించారు. అప్పటికే పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు నేతృత్వంలో వందమందికిపైగా పోలీసులు అక్కడ మోహరించినా.. వారిని అడ్డుకునే యత్నం చేయకుండా చోద్యం చూశారు. గోనుగుంట్ల కోటేశ్వరరావు అనే టీడీపీ దివ్యాంగుల విభాగం నేత మైక్ సెట్‌తో వచ్చి ''బయటకు రారా నా కొడకా'' అంటూ అంబటిపై బూతుపురాణం లంకించుకున్నా.. పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించారు. తెలుగుదేశం పార్టీ గూండాలకు అండగా నిలబడ్డారు.

టీడీపీ గూండాలు దాడి చేస్తున్నా ప్రేక్షకపాత్ర వహిస్తున్న పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు (ఫైల్)

ఈ ఇద్దరూ అధికారపార్టీ తొత్తులే!

సీఐలు గంగా వెంకటేశ్వర్లు, వంశీధర్ ఇద్దరూ అధికారపార్టీ తొత్తులేనని వైఎస్సార్‌సీపీ నేతలు విమర్శిస్తున్నారు. పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు గతంలో పలుమార్లు వైఎస్సార్‌సీపీ ర్యాలీలు, సభలను అడ్డుకున్నారు. కొన్ని సందర్భాల్లో అంబటి రాంబాబుతో వాగ్వాదానికీ దిగారు. ఈ నేపథ్యంలోనే ఈ ఇద్దరు సీఐలు అధికార పార్టీ నేతల ఆదేశాల ప్రకారం అంబటిని ఇబ్బంది పెట్టాలనే వ్యూహరచన చేశారని వైఎస్సార్‌సీపీ వర్గాలు మండిపడుతున్నాయి. వీరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. దీనిపై కోర్టును ఆశ్రయించడానికి సన్నద్ధమవుతున్నాయి.

పక్క సబ్ డివిజన్ స్టేషన్‌లో ఆ సీఐకి ఏం పని?

ఉదయం టీడీపీ నేతలు అంబటిపై దాడికి యత్నించిన ప్రదేశం గోరంట్ల చిల్లీస్ సెంటర్ నల్లపాడు స్టేషన్ పరిధిలోకి వస్తుంది. ఈ నేపథ్యంలో అన్యాయంగా అక్రమంగా అంబటిపై కేసు నమోదు చేసిన పోలీసులు ఆయనను శనివారం రాత్రి 10.30 గంటలకు నల్లపాడు స్టేషన్‌కు తరలించి లాకప్‌లో పెట్టారు. నల్లపాడు గుంటూరు సౌత్ సబ్‌డివిజన్ పరిధిలోకి వస్తుంది. ఆ స్టేషన్‌లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు అంబటిని కలవకుండా ఉండేలా ఉన్నతాధికారులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అయితే అర్ధరాత్రి లాకప్‌లో నిద్రపోతున్న అంబటిని నల్లపాడు పోలీస్ స్టేషన్ పైఅంతస్తుకు పోలీసులు తీసుకువెళ్లారు. అక్కడ నల్లపాడు సీఐ వంశీధర్‌తోపాటు పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లూ ఉన్నారని స్వయాన అంబటి రాంబాబు న్యాయమూర్తి ముందు వాంగ్మూలం ఇచ్చారు. గంగా వెంకటేశ్వర్లు, వంశీధర్ ఇద్దరూ తనను గోడకు ఆనించి కూర్చోబెట్టి రెండు కాళ్లు చీల్చి ఇబ్బందికి గురి చేశారని అంబటి ఆవేదన వ్యక్తం చేశారు. వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని పట్టాభిపురం స్టేషన్ సీఐ గంగా వెంకటేశ్వర్లుకు సౌత్ సబ్‌డివిజన్‌లోని నల్లపాడు స్టేషన్‌లో ఏం పని అనే విమర్శలు వినిపిస్తున్నాయి.

జోగి రమేశ్ ఇంటిపై దాడి చేసేందుకు వెళ్తున్న విజయవాడ పశ్చిమ నియోజకవర్గ టీడీపీ నేతలు ఆషా, ఫతావుల్లా

ఎంపీ చిన్నితో ఫతావుల్లా (ఫైల్)

లోకేశ్, ఎంపీ చిన్నితో షేక్ ఆషా (ఫైల్)

ఆషా కుమారుని పెళ్లిలో చంద్రబాబు

కరకట్ట ప్యాలెస్ కిరాతకమే

- మాజీ మంత్రి జోగి రమేశ్ ఇంటిపై దాడికి కుట్ర అక్కడి నుంచే
- పెదబాబు, చినబాబు ఆదేశాలతోనే టీడీపీ గూండాల అరాచకం
- టీడీపీ పార్లమెంటు నియోజకవర్గ ముఖ్యనేత డైరెక్షన్‌లోనే దాడి
- ఇందుకు సహకరించిన ఓ పోలీసు అధికారి
- ముందే దాడి సమాచారం తెలిసినా పట్టించుకోని ఖాకీలు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: కరకట్ట ప్యాలెస్ కేంద్రంగానే వైఎస్సార్‌సీపీ నేత జోగి రమేశ్ ఇంటిపై దాడికి వ్యూహ రచన జరిగినట్లు స్పష్టమైంది. పెదబాబు, చినబాబు ఆదేశాల మేరకే ఓ పార్లమెంట్ నియోజకవర్గం ముఖ్య నేత ఈ ధ్వంస రచన చేశారని విశ్వసనీయ సమాచారం. శనివారం గుంటూరులో అంబటి రాంబాబు ఇంటిపై దాడి జరగ్గానే.. అదే రోజు రాత్రి పొద్దుపోయాక టీడీపీ పార్లమెంట్ నియోజకవర్గ ముఖ్య నేతకు చినబాబు కాల్ చేసినట్లు సమాచారం. ఆ మరుసటి రోజే.. అంటే ఆదివారం జోగి రమేశ్ ఇంటిపై దాడి చేయాలని దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది. దీంతో ఆ పార్లమెంట్ నియోజకవర్గ ముఖ్యనేత.. విజయవాడ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఫతావుల్లాతోపాటు, మైనార్టీ మహిళా నేత ఆషా, గొల్లపూడికి చెందిన టీడీపీ నేతలు, విజయవాడ, మైలవరం నియోజకవర్గానికి చెందిన నేతలకు ఈ దాడి బాధ్యతను అప్పగించినట్లు తెలిసింది. దాడిలో కీలకంగా పాల్గొన్న షేక్ ఆషా, ఫతావుల్లాలిద్దరూ చంద్రబాబు, లోకేశ్, హోంమంత్రి అనితకు బాగా తెలుసని.. దాడులు చేయడానికి రౌడీ మూకలను కూడగట్టడంలో వారిది అందెవేసిన చేయి అని సమాచారం. ముఖ్య నేతల ఆదేశాలు కావడంతో నగరంలోని పలు ప్రాంతాల నుంచి పెట్రో బాంబులు విసిరే వారిని ఆగమేఘాలపై రప్పించి.. దాడికి పురిగొలిపినట్లు తెలిసింది. ఈ విషయాన్ని కొందరు టీడీపీ కార్యకర్తలే బహిరంగంగా వెల్లడిస్తుండడం గమనార్హం. 'అధికారంలో ఉన్నది మేమే.. మళ్లీ ఎన్నికలొచ్చినా గెలిచేది మేమే.. ఎలా గెలవాలో పెదబాబు, చినబాబుకు తెలుసు. అందువల్ల మాకేం భయం లేదు. మమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరు. ఎవరైనా సరే నోరు అదుపులో పెట్టుకోక పోతే ఆయనకు పట్టిన గతే పడుతుంది' అని ఆషా, ఫతావుల్లాలతోపాటు, గొల్లపూడి, మైలవరానికి చెందిన నేతలు రౌడీలను సిద్ధం చేసి దాడికి పురమాయించారు. ఈ ఇద్దరు నేతలకు ఇదివరకే 'మీకు మంచి భవిష్యత్ ఉంటుంది. పార్టీ సూచనల మేరకు నడుచుకోండి' అని చినబాబు దిశానిర్దేశం చేశారని.. అందువల్లే వారు, పార్టీనేతలతో కలిసి, రెచ్చిపోయి ధ్వంసరచన చేసినట్లు తెలిసింది.

పోలీసులకు ముందే తెలిసినా..

మాజీ మంత్రి జోగి రమేశ్ ఇంటిపై దాడి జరుగుతుందని ముందస్తు సమాచారం ఉన్నా.. పోలీసులు ప్రేక్షక పాత్ర వహించినట్లు స్పష్టం అవుతోంది. దాడికి వెళ్తున్న పచ్చ మూకలకు రక్షణగా పోలీసులు వెళ్లినట్లు ఘటనా స్థలంలో పరిస్థితులను చూస్తే స్పష్టమవుతోంది. ఈ దాడుల స్కెచ్‌లో ఓ పోలీసు అధికారి కీలక భూమిక పోషించినట్లు తెలుస్తోంది. దాడులు జరుగుతున్న సమయంలో సమీప సెంటర్‌లో టీడీపీ నేతలతో కలిసి ఉండి , ప్రోత్సహించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇదిలా ఉంటే తిరుమల లడ్డూ వ్యవహారంలో చంద్రబాబు చేసిన విమర్శల్లో నిజం లేదని సీబీఐ సిట్ చార్జిషీట్ తేల్చడంతో డైవర్షన్ పాలిటిక్స్‌ల్లో భాగంగానే మాజీ మంత్రుల ఇళ్లపై దాడులకు టీడీపీ ముఖ్యనేతలు కుట్ర పన్నినట్టు స్పష్టమవుతోంది. మాజీ మంత్రుల ఇళ్లపై దాడులు జరుగుతున్న సమయంలో స్పందించని పోలీసులు, ప్రభుత్వం దాడుల తంతంగమం ముగిశాక తాపీగా సీఎం చంద్రబాబు నాయుడు తాను ఉద్రిక్తతలకు దారితీసే పరిస్థితులను సహించబోనని, శాంతి భద్రతల విషయంలో రాజీపడబోనని నీతి వచనాలు వల్లెవేస్తూ సన్నాయి నొక్కులు నొక్కడంపై సర్వతా ఆగ్రహం వ్యక్తమవుతోంది.

పరామర్శకు వెళ్లిన వైఎస్సార్‌సీపీ నేతలపై కేసులు

దాడులకు పాల్పడిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోని పోలీసులుదాడులు జరిగిన తర్వాత మాజీ మంత్రి జోగి రమేశ్ ఇంటికి పరామర్శకు వెళ్తున్న ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దేవినేని అవినాష్, నందిగామ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ జగన్మోహనరావును అడ్డుకొని, అన్యాయంగా అక్రమ కేసు నమోదు చేసి అరెస్టు చేసి విజయవాడలోని పోలీసు స్టేషన్‌కు తరలించారు. అలానే బాధితుడైన మాజీ మంత్రి జోగి రమేశ్‌పైనా అన్యాయంగా అక్రమ కేసులు నమోదు చేయడం గమనార్హం. టీడీపీ మూకల దాడులపై అన్ని ఆధారాలతో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. నామమాత్రం కేసులతో చేతులు దులుపుకున్నారు.

గల్లా మాధవి దంపతులకు క్లీన్ చిట్!

- అంబటి రాంబాబు ఫిర్యాదు చేసినా వారిపై కేసు నమోదు చేయని పోలీసులు
- వారిద్దరి పేర్లు లేకుండానే కార్పొరేటర్ బుజ్జి, మరికొందరు.. అంటూ ఎఫ్ఐఆర్
- నేడు వైఎస్ జగన్ రానున్న నేపథ్యంలో హడావుడిగా క్లూస్ టీమ్ తనిఖీలు
- మాజీ మంత్రి కార్యాలయాన్ని తగలబెట్టిన ఆనవాళ్లే లేవన్న సీఐ
- మరోవైపు నెల్లూరు జిల్లాలో అంబటిపై రెండు అక్రమ కేసులు

అంబటి కార్యాలయం వద్ద దాడికి పాల్పడిన టీడీపీ గూండాలు, కార్పొరేటర్ బుజ్జితోపాటు ఎమ్మెల్యే మాధవి

అంబటి కార్యాలయంపై దాడి చేస్తున్న వారితో టీడీపీ ఎమ్మెల్యే మాధవి భర్త గల్లా రామచంద్రరావు

సాక్షి ప్రతినిధి, గుంటూరు/లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, కాపునేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇల్లు, కార్యాలయంపై చేసిన దాడిపై పోలీసులు మొక్కుబడిగా కేసు నమోదు చేశారు. అంబటిరాంబాబు ఫిర్యాదు మేరకు పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు కేసు నమోదు చేశారు. అయితే, దాడికి పాల్పడిన, పురిగొల్పిన టీడీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి, ఆమె భర్త రామచంద్రరావుతోపాటు ముఖ్యమైన టీడీపీ నాయకుల పేర్లను తప్పించారు. అంబటిఫిర్యాదులో దాడికి పాల్పడిన ముఖ్యమైన వారి పేర్లు స్పష్టంగా పేర్కొన్నారు. అయినా టీడీపీ కార్పొరేటర్ వేములపల్లి శ్రీరామ్‌ప్రసాద్ అలియాస్ ఇసుక బుజ్జి, మరికొందరు... అంటూ మొక్కుబడిగా కేసు నమోదు చేసి వదిలేశారు.

కేసు నమోదుకు తర్జనభర్జనలు...

వైఎస్సార్‌సీపీ లీగల్ టీం ద్వారా అంబటి రాంబాబు సోమవారం మధ్యాహ్నం ఫిర్యాదు చేస్తే తర్జనభర్జనల అనంతరం రాత్రి 11.45 గంటలకు గుంటూరు పట్టాభిపురం పోలీసులు క్రైమ్ నంబర్ 43 /2026గా కేసు నమోదు చేశారు. ఎమ్మెల్యే గల్లా మాధవి, ఆమె భర్త రామచంద్రరావు టీడీపీ గూండాలతో వచ్చి తన ఇల్లు, కార్యాలయంపై దాడి చేసి, హత్యాయత్నానికి పాల్పడినట్లు ఫిర్యాదు చేస్తే... పోలీసులు మాత్రం టీడీపీ నాయకుల వద్ద మరిన్ని మార్కులు కొట్టేసేందుకు కేసును నీరు గార్చే విధంగా సెక్షన్లు నమోదు చేశారు. ఎమ్మెల్యే మాధవి, భర్త రామచంద్రరావు పేర్లకు బదులు కార్పొరేటర్ వేములపల్లి శ్రీరామ్‌ప్రసాద్ అలియాస్ బుజ్జి మరి కొంతమంది.. అంటూ కేసు నమోదు చేయడంపై వైఎస్సార్‌సీపీ నేతలు, పార్టీ శ్రేణులు, ప్రజా సంఘాల నాయకులు మండిపడుతున్నారు. ఈ వ్యవహారంలో ఎమ్మెల్యే మాధవి, ఆమె భర్త రామచంద్రరావులను ఏ1, ఏ–2గా కేసు నమోదు చేసే వరకూ పోరాటం చేస్తామని వైఎస్సార్‌సీపీ నాయకులు చెబుతున్నారు. కాగా, అంబటి ఫిర్యాదుపై నమోదు చేసిన సెక్షన్లతో తక్కువ శిక్షలు పడతాయని నిపుణులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే.. ఎమ్మెల్యే మాధవి టీడీపీ కార్యాలయంలో మంగళవారం ప్రెస్‌మీట్ పెట్టి అంబటి ఇంటిపై దాడితో తమకు సంబంధం లేదని, క్షమాపణ మాత్రమే కోరామని చెప్పడం గమనార్హం.

అంబటి ఇంటి వద్ద పోలీసుల హైడ్రామా..

అంబటి రాంబాబు ఇంటి వద్ద మంగళవారం పోలీసులు హైడ్రామా నడిపారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం అంబటి కుటుంబాన్ని పరామర్శించనున్న నేపథ్యంలో... మంగళవారం సాయంత్రం అంబటి ఇంటి వద్ద క్లూస్ టీమ్‌తో పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు ప్రత్యక్షమయ్యారు. టీడీపీ మూకలు విధ్వంసం సృష్టించిన మూడు రోజుల తర్వాత వచ్చి అంబటి ఇంటి వద్ద పగిలిన కుండీలు, విరిగిపోయిన ఫర్నీచర్, ధ్వంసమైన కార్లను స్టేషన్‌కు తరలించేందుకు ప్రయత్నించారు. దీనికి అంబటి కుటుంబ సభ్యులు అంగీకరించలేదు. దీంతో తూతూ మంత్రంగా క్లూస్ టీమ్‌తో పరీక్షలు చేయించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నేరస్థల పరిశీలనలో కార్లు, ఫర్నీచర్, అద్దంతో కూడిన కిటికీలు ధ్వంసమైనట్లు గుర్తించామని చెప్పారు. అంబటి కార్యాలయాన్ని తగలబెట్టిన ఆనవాళ్లు కనిపించలేదన్నారు. ఇదిలా ఉండగా శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని మనుబోలు, దుత్తలూరులో టీడీపీ నేతల ఫిర్యాదుల మేరకు పోలీసులు మంగళవారం మాజీ మంత్రి అంబటి రాంబాబుపై అక్రమ కేసులు నమోదు చేశారు.

బాబు పాలనలో బాధితులే ముద్దాయిలు

అంబటితో మాజీ మంత్రులు ముద్రగడ, చెల్లుబోయిన, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ములాఖత్



మీడియాతో మాట్లాడుతున్న ముద్రగడ పద్మనాభం, వేణు, రాజా, తోట త్రిమూర్తులు

సాక్షి, రాజమహేంద్రవరం: మాజీ మంత్రుల ఇళ్లు తగులబెట్టడం హేయమైన చర్యని, రాష్ట్రంలో ఆటవిక పాలన సాగుతోందని వైఎస్సార్‌సీపీ నేతలు విమర్శించారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న మాజీ మంత్రి అంబటి రాంబాబుతో కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం , ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ మంగళవారం ములాఖత్ అయ్యారు. అనంతరం జైలు బయట విలేకర్లతో మాట్లాడారు. తిరుమల ప్రసాదంలో కల్తీ జరగలేదని నివేదిక వచ్చినప్పుడైనా సీఎం చంద్రబాబు క్షమాపణ చెప్పి ఉంటే ఆయన గౌరవం పెరిగేదన్నారు. టీడీపీ కూటమి నాయకులు తప్పు చేసి, తప్పించుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. దేశంలో మాజీ మంత్రుల ఇళ్లు తగులబెట్టిన అరాచకం ఎక్కడా జరగలేదన్నారు. చంద్రబాబు పాలనలో బాధితులే ముద్దాయిలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య రక్షణ కోసం ఎన్ని రోజులైనా జైల్లో ఉంటానని అంబటి చెప్పారని తెలిపారు.వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా పాల్గొన్నారు.

అంబటి కుటుంబ సభ్యులకు వైఎస్సార్‌సీపీ నేతల పరామర్శ

అంబటి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

నగరంపాలెం: టీడీపీ గూండాల విధ్వంసకాండలో ధ్వంసమైన వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇంటికి ఆ పార్టీ సీనియర్ నాయకులు మంగళవారం చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. గుంటూరు సిద్ధార్థనగర్‌లో ధ్వంసమైన ఇల్లు, కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ హోంమంత్రి మేకతోటి సుచరిత, ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, లేళ్ల అప్పిరెడ్డి, మురుగుడు హనుమంతరావు, మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్, గుంటూరు పార్లమెంట్ పరిశీలకులు పోతిన మహేష్, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, నియోజకవర్గాల ఇన్‌చార్జిలు బాలవజ్రబాబు (తాడికొండ), అంబటి మురళీకృష్ణ (పొన్నూరు), దొంతిరెడ్డి వేమారెడ్డి (మంగళగిరి) తదితరులు అంబటి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఇల్లు, కార్యాలయం వద్ద జరిగిన విధ్వంసకాండపై అంబటి భార్య విజయలక్ష్మి, కుమార్తెలు మౌనిక, మనోజ్ఞ వివరించారు.

రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతోంది

జోగి రమేష్‌ను పరామర్శించిన వైఎస్సార్‌సీపీ నేతలు

జోగి రమేశ్‌తో మాట్లాడుతున్న అనిల్ కుమార్ యాదవ్ తదితరులు

ఇబ్రహీంపట్నం: రాష్ట్రంలో డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా రాక్షస పాలన కొనసాగుతోందని వైఎస్సార్‌సీపీ నేతలు విమర్శించారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో మాజీ మంత్రి జోగి రమేశ్ ఇంటిపై జరిగిన దాడి నేపథ్యంలో మాజీ మంత్రులు తానేటి వనిత, పేర్ని నాని, అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మంగళవారం జోగి రమేశ్‌ను పరామర్శించారు. ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ.. నీచ రాజకీయాలకు దేవుడిని వాడుకున్న ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు.

నిందను సమర్థించుకునేందుకే కేబినెట్ భేటీ

మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్



సాక్షి, అమరావతి: తిరుమల లడ్డూ వ్యవహారంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై వేసిన నిందను సమర్థించుకునేందుకు, తప్పును ఒప్పు అని చెప్పేందుకే రాష్ట్ర మంత్రి వర్గం సమావేశమైందని మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్ ధ్వజమెత్తారు. మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. తిరుమల లడ్డూ ప్రసాదంలో వాడిన నెయ్యిలో జంతు కొవ్వు, పంది కొవ్వు, చేప నూనె కలిసినట్టు ఇన్నాళ్లూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని ప్రతిష్టాత్మక ల్యాబ్‌లు ఎన్‌డీడీబీ, ఎన్‌డీఆర్ఐ తేల్చి చెప్పడం.. అదే విషయాన్ని సుప్రీంకోర్టు నియమించిన సిట్ కూడా తన చార్జిషీట్‌లో స్పష్టం చేసిందని చెప్పారు. దీంతో దిక్కుతోచని ప్రభుత్వం మళ్లీ విచారణకు సిట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించడం తప్పు అన్నారు. 'సుప్రీంకోర్టు నియమించిన సిట్ ఉండగా.. మరో సిట్ ఏర్పాటుచేయాలని నిర్ణయించడం రాజ్యాంగవిరుద్ధం' అని ఆయన చెప్పారు.

ఇప్పటికే క్యాన్సర్ చికిత్సారంగంలో విప్లవాత్మకమైన మార్పులొచ్చాయి. ఇక కృత్రిమ మేధ (ఏఐ)ను కనుగొన్న తర్వాత వచ్చిన, వస్తున్న పురోగతులు చెప్పడానికీ, వినడానికీ, చదవడానికే ఆశ్చర్యం కలిగించేలా ఉంటున్నాయి. ఇది 'సైన్స్ ఫిక్షన్ కాదు... మెడిసిన్' అని అనుక్షణం నిరూపితమవుతోంది. ఈ ఏడాది క్యాన్సర్ డే థీమ్ 'యునైటెడ్ బై యునీక్'! ఈ నినాదం అర్థమేమిటంటే... ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ రోగులందరికీ (యునైటెడ్‌గా) చికిత్స అందేలా చేస్తూనే... ప్రతి ఒక్కరికీ ప్రత్యేకంగా... వ్యక్తిగతంగా నిర్దిష్టమైన (యూనిక్) చికిత్స అందేలా చూడటం. ఈరోజు 'వరల్డ్ క్యాన్సర్ డే'. ఈ సందర్భంగా ఈ అంశాలన్నింటితో ప్రత్యేక కథనం...



• క్యాన్సర్ చికిత్సలో సరికొత్త ఆవిష్కరణలు

వయొలెంట్ Ai సైలెంట్ కణంపై రణం!

ఒక చిన్న అంశాన్ని ఊహించండి... మన దేహమంతా ఓ నగరం అనుకోండి. అప్పుడు మన ఒంట్లోని ప్రతి కణమూ ఒక ఇల్లవుతుంది. అప్పుడు మన ఇంట్లోని జన్యువు (జీన్) స్విచ్ అనుకుందాం...

● బాగా పనిచేసే ఆ 'స్విచ్చు' ఆన్ చేసినప్పుడల్లా 'లైట్' వెలుగుతుంది. అది నార్మల్ పెరుగుదలకు సంకేతం! ● కొన్నిసార్లు వాటిని ఆన్ చేసినప్పుడు అలారం మోగుతుంది. అంటే రిపేర్లు అవసరమనే సూచన. ● కొన్ని స్విచ్చులు అవసరాన్ని బట్టి పోలీస్‌ను పిలుస్తాయి. అది కణం మరణం!

● ఈ పోలికలతో చెప్పాలంటే... క్యాన్సర్ ఎప్పుడు పుడుతుందంటే..?

● కొన్ని స్విచ్చులు అలా ఆన్ అయ్యాక 'స్టక్' అయిపోయి... ఆఫ్ కాకుండా ఇరుక్కుపోయినప్పుడు... అంటే... ఆన్ అయిన ఆ స్విచ్చు అలాగే జామ్ అయిపోతే... లైట్ అలా కంటిన్యువస్‌గా వెలుగుతూనే ఉంటుంది!... అది అప్రతిహతమైన పెరుగుదల.... ఎంతకూ ఆగకుండా పెరిగే క్యాన్సర్ పెరుగుదల! ● అలారం మెకానిజం దెబ్బతిని అలారం మోగకుండా పోవడమంటే... కణంలో ఏదో తప్పు జరిగి... అది జరిగిందనే హెచ్చరికలు అందకుండా పోవడం. ● ఇక సెల్ డెత్‌కు కారణమయ్యే పోలీస్ ఇన్‌స్పెక్టర్ తన పని మానేసి నిశ్శబ్దంగా ఉండిపోయినప్పుడూ... అంటే నార్మల్ కణం కాస్తా క్యాన్సర్ కణంగా మారినప్పుడు... అది మరో నార్మల్ కణానికి అడ్డంకి కాకుండా ఉండేందుకూ, పొరుగుదాన్ని దెబ్బతీయకుండా ఉండటానికి నిశ్శబ్దంగా తనంతట తానే మరణించడం జరగకపోవడం.

ఇలా జీన్ అనే స్విచ్చులో ఏవైనా మార్పులు వచ్చి అది 'జామ్' అయిపోయిందంటే... అది క్యాన్సర్‌కు దారితీసినట్టేనని తెలుసుకోవాలి.

డాక్టర్ సురేశ్ ఏవీఎస్
సీనియర్ మెడికల్ ఆంకాలజిస్ట్,
కన్వీనర్, ఏఐ ఇన్ మెడికల్ ఎడ్యుకేషన్,
నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ & మెడికల్ సైన్సెస్

ఇలా కణాల్లోని 'పీ-53' అనే ఓ ప్రోటీన్... ఈ స్విచ్చులన్నింటికీ ఓ (మాలెక్యులార్) 'మాస్టర్ స్విచ్'గా పనిచేస్తుంది. అంటే ఇది మెయిన్ బోర్డు దగ్గర ఉంటుంది. దీన్నే 'గార్డియన్ ఆఫ్ జీనోమ్' గానూ చెప్పవచ్చు. అదే అవసరాన్ని బట్టి డీఎన్ఏ రిపేర్లు జరిగేలా చూస్తుంది. అప్పటికీ పని జరగకపోతే ఆ తప్పుడు కణం తనంతట తానే చనిపోయేలా చూస్తుంది. (దీన్నే 'ప్రోగ్రామ్‌డ్ సెల్ డెత్' అంటారు). అలా చేయడం ద్వారా మిగతా దేహాన్ని క్యాన్సర్ బారిన పడకుండా రక్షిస్తుంది. అంటే ఇంట్లో షార్ట్ సర్క్యూట్ అయితే... దానివల్ల ప్రమాదం జరగకుండా మెయిన్ బోర్డు దగ్గరే ఆఫ్ అయిపోయే మాస్టర్ స్విచ్‌లా పనిచేస్తుందన్నమాట.

ఇటీవల ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆవిష్కరణ తర్వాత క్యాన్సర్ చికిత్సా రంగంలో ఎన్నో మార్పులు వచ్చాయి. ఆ కొత్త ఆవిష్కరణలేమిటో... వాటితో వచ్చిన మార్పులేమిటో చూద్దాం.

మొదటి ఆవిష్కరణ
ఆలిగో న్యూక్లియటైడ్ థెరపీ

గతంలో ఒంట్లోని ఏదైనా స్విచ్ చెడిపోయిందంటే... డాక్టర్ దగ్గరికి వెళ్లాల్సి వచ్చేది. అప్పుడు డాక్టర్‌గారు తన పరికరాల (కీమోథెరపీ) సహాయంతో ఓ ఎలక్ట్రీషియన్‌లా లేదా ఓ మేసన్ (మేస్త్రి)లా పనిచేస్తూ చెడిపోయిన స్విచ్‌ను రిపేరు చేసేవారు. ఆ క్రమంలోనే బోర్డులో మరికొన్ని స్విచ్చులూ మార్చాల్సి వచ్చేది.

కానీ ఇప్పటి తాజా ఆవిష్కరణతో...

కణం నుంచి అది చెడిపోయినట్లు సిగ్నల్ రాగానే పేషెంటే ఆ చెడిపోయిన కణానికి సందేశాలు పంపుతాడు.

''చెడిపోయినట్లు వస్తున్న ఆ సిగ్నల్స్‌ను పరిగణనలోకి తీసుకోకు''

''నీ సేఫ్టీ రూల్స్‌కు అనుగుణంగా చెడిపోయిన కణాన్ని రిపేర్ చెయ్యి''

''ఇలా చేయడం ద్వారా చెడిపోయిన కణం వరకే పరిమితం అవ్వు. దేహంలోని మిగతా కణాలను చెడగొట్టకు''... లాంటి సందేశాలను కణానికీ, కణంలోని రిపేర్లు చేసే అంశాలకు పంపడం ద్వారా...దేహంలోని మిగతా కణాలన్నీ ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి. దాంతో క్యాన్సర్ మిగతా కణాలకు వ్యాపించదు.

ఇప్పుడు ఇదెలా జరుగుతుందంటే... మానవ కణాల్లో 'న్యూక్లియటైడ్స్' అనే ఇటుకలు (బిల్డింగ్ బ్లాక్స్) ఉంటాయి. అయితే డాక్టర్లు 'ఆలిగోన్యూక్లియటైడ్స్' అనే కృత్రిమ ఇటుకలను తయారు చేసి... క్యాన్సర్‌తో చెడిపోయిన ఇటుకల స్థానంలో వీటిని పెట్టి ఈ రిపేర్లు జరుగుతాయి.

ఇంకా మరొక పోలిక చెప్పాలంటే... మనకు ఇష్టం లేనిదీ, ఏదో అశ్లీలమైన ఎస్ఎమ్ఎస్ వచ్చిందంటే... చిరాకు పుట్టి ఫోన్‌ను విసిరికొట్టి దాన్ని ధ్వంసం చేయడం కంటే... కేవలం ఆ మెసేజ్ వరకే డిలీట్ చేయడం లాంటిదన్నమాట.

రెండో ఆవిష్కరణ
కార్టి / ఎన్‌కే సెల్ థెరపీ

అత్యంత కన్నింగ్ మోసగాడు... ఈ క్యాన్సర్ కణం! ఈ నేపథ్యంలో 'క్యాన్సర్ కణం' తాలూకు ఓ గుణాన్ని చూద్దాం. క్యాన్సర్ కణమనేది అత్యంత కన్నింగ్ మోసగాడిలాంటిది. వాడెంత కన్నింగ్ అంటే... ఎక్కణ్ణుంచో ఓ 'ఆర్మీ యూనిఫామ్'ను కొట్టేసి, ఫేక్ ఐడీ కార్డునొకదాన్ని పట్టేసి... తానూ ఓ రక్షణ కణంలా కనిపించేలా మారువేషం వేసుకుని మరీ ఆరోగ్యకరమైన కణాలను ధ్వంసం చేస్తుంటాడు.

అయితే ఇప్పటి సరికొత్త ఆవిష్కరణతో వచ్చిన ఈ అత్యంత నూతన, అధునాతన చికిత్స ప్రక్రియలో ఎన్‌కే అంటే... 'నేచురల్ కిల్లర్' అని అర్థం. ఇలా పిలిచే ఆర్మీ కమాండోస్ లాంటి ఈ 'ఎన్‌కే సెల్స్ థెరపీ'లో ఏం జరుగుతుందో చూద్దాం. ● గతంలోని ఆర్మీ కమేండోలు డేంజర్ సిగ్నల్స్ వచ్చేదాకా ఆగేవి. కానీ ఇప్పటి ఎన్‌కే సెల్స్ మాత్రం ఎవరి ఆదేశాల కోసం ఆగవు. అనుమానం వచ్చిందంటే చాలు ఆ క్యాన్సర్ సెల్‌ను అప్పటికప్పుడు ధ్వంసం చేసేస్తాయి. ● నిశితంగా ఎంచుకుని... నిర్దిష్టంగా కేవలం చెడిపోయిన లేదా క్యాన్సర్ కణంగా మారబోతున్న కణాన్నే తుదముట్టించేస్తాయి. ● ఇమ్యూనిటీ సెల్స్ అయిన బీ సెల్, టీ సెల్ లా తాను రక్షణ కవచాన్ని అని చెప్పే యూనిఫామ్ వేసుకోవు. సివిల్ డ్రస్‌లో ఉన్న సోల్జర్‌లా విరుచుకుపడి క్యాన్సర్ కణాన్ని ముట్టడించేస్తాయి. ఈ క్రమంలో అవి యూనిఫామ్ వేసుకుని మోసం చేసే క్యాన్సర్ కణం కన్నింగ్ వేషాల ట్రాప్‌లో పడిపోవు. సదరు క్యాన్సర్ కణాల కుయుక్తులనూ ముందే పసిగట్టేసి... వాటిని తుదముట్టిస్తాయి.

మూడో ఆవిష్కరణ
యాంటీబాడీ డ్రగ్ కాంజుగేట్ (ఏడీసీ) థెరపీ

ఓ పొలంలో చీడ పట్టిందనుకోండి. ఆ చీడ పురుగులను అంతం చేయడానికి మొత్తం పొలమంతా మందుకొట్టడం మామూలే. అలాగే ఊళ్లో ఉన్న దోమలను తుదముట్టించడానికి అత్యంత ఘాటుగానూ, ఊపిరి పీల్చుకోడానికే ఇబ్బంది పడేలా సఫకేట్ చేసేసే దోమలమందును ఊరంతా కొట్టడం సాధారణంగా జరిగేదే.

తాజా ఆవిష్కరణలతో వచ్చిన చికిత్స ఎలాంటిదంటే... ఇది చాలా ఖచ్చితంగా పనిచేసే కొరియర్ బాయ్ లాంటిది. ఆ ఊళ్లో ఆ వీధి ఎక్కడుందో... ఆ వీధిలో ఆ ఇల్లు ఎక్కడుందో కనుక్కుని... బాగా ప్యాక్ చేసి ఉన్న ఆ 'క్యాన్సర్ మందు'ను సరిగ్గా ఆ ఇంట్లోకి డెలివరీ చేసే ఓ కొరియర్ బాయ్‌లా పనిచేస్తుంది. ఆ ఇంట్లోవాళ్లు ఆ ప్యాక్‌ను తెరవగానే మందునంతా చిమ్మేసి క్యాన్సర్‌ను కమ్మేసి సైలెంట్‌గా చంపేస్తుంది. అలా పక్కనున్న ఇంటికి ఏమాత్రం ప్రమాదం జరగకుండా జాగ్రత్త పడుతుంది. ఈ తరహా కొత్త ఆవిష్కరణ ఫలితంగా బాధితుల్లో సైడ్ ఎఫెక్ట్స్ తగ్గుతాయి. దాంతో మునుపటి కీమోథెరపీల్లోని వేదనలూ, వెతల్లా కాకుండా చికిత్సను తేలిగ్గా తట్టుకోగలగడం సాధ్యమవుతుంది.

నాలుగో ఆవిష్కరణ
కృత్రిమ మేధ + జీనోమిక్స్

ఇది కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ప్లస్ జీనోమిక్స్ (జీనోమ్ చికిత్స)... ఈ రెండింటి సమన్వయంతో అందే అత్యంత అధునాతమైన సరికొత్త చికిత్స ప్రక్రియ.

ఈ అంశాన్నీ తేలిగ్గా వివరించాలంటే...

గతంలో నగరంలో ఎక్కడైనా అగ్నిప్రమాదం జరిగాక ఫైర్ అలారం మోగగానే ఫైర్ బ్రిగేడంతా నిప్పును ఆర్పడానికి ఉపక్రమించేవారు. ఇప్పుడు అలాకాదు..

● ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఓ సీసీటీవీ లా పనిచేసి... అగ్ని అంటుకునేందుకు అవకాశమున్న చోటిని పసిగట్టినట్టే... క్యాన్సర్ పుట్టే చోటిని ముందే పసిగడుతుంది. ● రక్తం / జెనెటిక్ సిగ్నల్స్... నాయిస్ సెన్సర్ మాదిరిగా పనిచేసి క్యాన్సర్ పుట్టేందుకు అవకాశమున్న ప్రదేశాన్ని ముందే కనిపెట్టేస్తాయి. ● ఇక్కడ మనుష్యులు ఆ స్వల్పాతి స్వల్పమైన అతి చిన్న తేడాను మిస్ కావచ్చేమోగానీ... ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహాయం కారణంగా ఆ అతిచిన్న తేడానూ పసిగట్టే వీలుంది.

ఇది ఎక్కడ ఉపయోగపడుతుందంటే...

● కుటుంబ చరిత్రలో క్యాన్సర్ ఉండి... హై-రిస్క్ ఉన్న కుటుంబాల్లో. ● చాలాకాలం నుంచి పొగతాగే అలవాటున్న స్మోకర్లలో. ● మహిళల్లోనే వచ్చే ఉమన్ క్యాన్సర్‌లను పసిగట్టే విషయంలో. ●క్యాన్సర్ వచ్చేందుకు అవకాశమున్న జీవనశైలిని అనుసరించేవారిలో లేదా అలాంటి వాతావరణంలో పనిచేసేవారిలో.

ఐదో ఆవిష్కరణ
పర్సనలైజ్‌డ్ థెరపీ (ప్రెసిషన్ ఆంకాలజీ)

గతంలో ఎవరైనా బాధితుడిలో ఒక రకం క్యాన్సర్‌ను కనుగొన్నారంటే... ఆ రకం క్యాన్సర్ వచ్చినవారందరికీ ఇచ్చే మందును లేదా చికిత్స ప్రక్రియను అతడికి కూడా అందించేవారు. కానీ కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ – ఏఐ) సహాయంతో ఇప్పుడు అతడిలో క్యాన్సర్ కణం ప్రవర్తించే పద్ధతిని (బిహేవియరల్ మేనర్‌ను) బట్టి, అతడి జీవనశైలి ఆధారంగా, అతడి బ్లడ్ మార్కర్స్, అతడి స్కాన్‌లూ, అతడికే ప్రత్యేకమైన అతడిలోని 'పీ-53' ప్రోటీన్... అంటే... అతడి 'మాలెక్యులార్ మాస్టర్ స్విచ్' ఎంత బలహీనంగా ఉందీ, అది ఏ మేరకు పనిచేయడంలేదు... లాంటి అంశాలన్నీ తెలుసుకొని అతడికే ప్రత్యేకమైన, ఎంతో ప్రభావపూర్వకంగా పనిచేసేలా అతడికే వ్యక్తిగతమైన చికిత్స అందించవచ్చు.

ఈ అధునిక ఆవిష్కరణలతో లాభాలివి...

● చాలా హాస్పిటల్స్‌లో ఇప్పటికే ఈ ప్రయోజనాలను పొందుతున్నారు. ● తమ జీవన నాణ్యతను (క్వాలిటీ ఆఫ్ లైఫ్‌ను) మెరుగుపరచుకుంటున్నారు. ● ఎంతో డబ్బునూ, టైమ్‌నూ ఆదాచేసుకోవడమే కాదు... గతంలో పేషెంట్లకు ఉండే ఎన్నో బాధలూ, వెతలూ, వేదనలకు దూరంగా ఉంచగలగడం సాధ్యమవుతోంది.

నిర్వహణ: యాసీన్

సాక్షి సినిమా

● శర్వానంద్

ఏప్రిల్‌లో రేస్ ఫిక్స్

ఈ సంక్రాంతికి 'నారీ నారీ నడుమ మురారి' సినిమాతో మంచి విజయం అందుకున్నారు శర్వానంద్. ఆయన హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'బైకర్'. అభిలాష్ కంకర దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో మాళవికా నాయర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. విక్రమ్ సమర్పణలో యూవీ క్రియేషన్స్‌పై వంశీ–ప్రమోద్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ఏప్రిల్ 3న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ''1990, 2000 బ్యాక్‌డ్రాప్‌లో సాగే 'బైకర్' మూవీ రేసింగ్ యాక్షన్‌తో పాటు ఎమోషనల్, మల్టీ జనరేషనల్ ఫ్యామిలీ డ్రామాగా రూపొందుతోంది. మూడు తరాల రేసింగ్ కలతో, కుటుంబ బంధాలతో సాగే అద్భుతమైన కథ ఇది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

కంటెంట్ బాగా నచ్చింది - రవితేజ



● అమర్‌దీప్, రవితేజ

''సుమతీ శతకం' టీజర్, ట్రైలర్ బాగున్నాయి. ఇందులోని కంటెంట్ బాగా నచ్చింది. ఈ సినిమా హిట్ అవ్వాలి. అమర్‌దీప్ భవిష్యత్ అద్భుతంగా ఉండాలని కోరుకుంటున్నాను'' అని హీరో రవితేజ తెలిపారు. అమర్‌దీప్ చౌదరి, శైలి చౌదరి జంటగా నటించిన చిత్రం 'సుమతీ శతకం'. ఎంఎం నాయుడు దర్శకత్వంలో సాయి సుధాకర్ కొమ్మాలపాటి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 6న విడుదలవుతోంది. తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని పంపిణీ చేస్తున్నారు. ఈ మూవీ టీజర్, ట్రైలర్‌ని చూసిన రవితేజ... 'సుమతీ శతకం' యూనిట్‌కి అభినందనలు తెలిపారు.

త్వరలో సన్ ఆఫ్...

సొంత నిర్ణయాలపై ఆధారపడే ఓ యువకుడు అనుకోకుండా సమస్యల్లో ఇరుక్కుంటాడు. ఆ సమస్యలను పరిష్కరించే బదులు తండ్రి బాధ్యతగా లేడంటూ కోర్టు మెట్లెక్కుతాడు. విలువలకు ప్రాధాన్యం ఇచ్చే ఆ తండ్రిపై కేసు పెడతాడు. అయితే ఆ తండ్రి కోర్టు ద్వారానే కొడుక్కి కూల్‌గా బుద్ధి చెబుతాడు. ఎలా చెబుతాడు? అనేది 'సన్ ఆఫ్' సినిమాలో చూడాల్సిందే. సాయి సింహాద్రి, మీరా రాజ్ హీరో హీరోయిన్లుగా కీలక పాత్రలో వినోద్ కుమార్ నటించిన ఈ చిత్రం ఈ నెలలో రిలీజ్ కానుంది. సతీష్ బత్తుల దర్శకత్వంలో సాయి రామ్ సింహాద్రి నిర్మించారు. ''తండ్రి–కొడుకు నేపథ్యంలో సాగే ఫ్యామిలీ ఎమోషనల్ డ్రామాగా రూపొందిన చిత్రం ఇది'' అని నిర్మాత తెలిపారు.

● సాయి సింహాద్రి, మీరా రాజ్

రెగ్యులర్ హారర్ మూవీ కాదు

● సుమన్ బాబు

శ్రీరామ్, కమల్ కామరాజు, అజయ్, బేబీ సాయి తేజస్విని, అయ్యప్ప పి. శర్మ, సుమన్ శెట్టి నటించిన సినిమా 'ఎర్రచీర: ది బిగినింగ్'. సుమన్ బాబు నటించి, దర్శకత్వం వహించారు. ఎన్వీవీ సుబ్బారెడ్డితో కలిసి సుమన్ బాబు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 6న రిలీజ్ కానుంది. మంగళవారం విలేకరుల సమావేశంలో సుమన్ బాబు మాట్లాడుతూ– ''హారర్, యాక్షన్, మదర్ సెంటిమెంట్‌తో రూపొందిన సినిమా ఇది. రెగ్యులర్ హారర్ మూవీ కాదు. వాస్తవ సంఘటనకు కాల్పనికత జోడించి ఈ సినిమా తీశాం. ఈ చిత్రంలో పోలీస్ ఆఫీసర్ పాత్ర చేశాను. నా బావ పాత్రలో సురేష్ కొండేటి నటించారు. 'ఎర్రచీర' సినిమాకు సీక్వెల్‌గా మరో వాస్తవ ఘటన ఆధారంగా 'అంబిక (ఎర్రచీర 2) అనే సినిమా, 'రాముడా? కృష్ణుడా' అనే మరో మూవీ చేయనున్నాను'' అన్నారు.

ఇదో ఎమోషనల్ జర్నీ

వంశీ తుమ్మల, సంధ్యా వశిష్ఠ నటించిన సినిమా 'శ్రీ చిదంబరంగారు'. వినయ్ రత్నం దర్శకత్వంలో చింతా వినీషా రెడ్డి, చింతా గోపాల కృష్ణారెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 6న రిలీజ్ కానుంది. ఈ చిత్రాన్ని వంశీ నందిపాటి థియేట్రికల్‌గా రిలీజ్ చేస్తున్నారు. మంగళవారం విలేకరులతో వినయ్ రత్నం మాట్లాడుతూ– ''25 షార్ట్ ఫిల్మ్స్ చేశాను. నిహారిక కొణిదెల గారి సమర్పణలో ఓ షార్ట్ ఫిల్మ్ చేశాను. 'శ్రీ చిదంబరంగారు' నా తొలి ఫీచర్ ఫిల్మ్. ఆత్మన్యూనతాభావం, అభద్రతాభావాలతో లైఫ్‌ని కాన్ఫిడెంట్‌గా లీడ్ చేయలేక ఇబ్బంది పడుతున్నవారిని చూశాను. నా ఫ్రెండ్ జయంత్ ఇన్‌సెక్యూర్ ఫీలింగ్‌తో ఎక్కడికీ వెళ్లడు. అతన్ని చూసి ఈ సినిమా కథ చెప్పాలనుకున్నాను. ఈ కథలో మంచి ఎమోషనల్ జర్నీ ఉంది. ఈ సినిమాలో మెల్లకన్ను ఉన్న హీరో పాత్రలో వంశీ నటించాడు. ఈ పాత్ర వల్ల ఎవరి మనోభావాలు దెబ్బ తినవు. నెక్ట్స్ రొమాంటిక్ కామెడీ మూవీ చేస్తాను'' అని చెప్పారు.

● వినయ్ రత్నం

యాసలందు అన్ని యాసలూ భేష

● రామ్‌చరణ్ ● అఖిల్ ● వరుణ్ తేజ్ ● విజయ్ దేవరకొండ

రోల్ డిమాండ్ చేస్తే నోరు తిరగని యాస నేర్చుకుని మరీ డైలాగులు చెప్పేస్తారు స్టార్స్. రామ్‌చరణ్ ఉత్తరాంధ్ర యాస మాట్లాడారు. అఖిల్, వరుణ్ తేజ్ రాయలసీమలో సంభాషణలు చెప్పారు. విజయ్ దేవరకొండ అయితే ఈస్ట్ గోదావరి, రాయలసీమ యాసలు నేర్చుకున్నారు. హీరో లేనా? హీరోయిన్ కావ్యా థాపర్ తెలంగాణ యాసలో రెచ్చిపోయారు. ఈ ఉత్తరాది బ్యూటీ ఈ యాస నేర్చుకుని మరీ తెలంగాణ అమ్మాయిలా మారిపోయారు. 'యాసలందు అన్ని యాసలూ భేష' అన్నట్లుగా ఈ స్టార్స్ ఏయే సినిమాల్లో ఏయే యాసలో మాట్లాడారో తెలుసుకుందాం.

సేసేయాల...

'ఓటే పని చేసే నాకి, ఒకే నాక బతికే నాకి ఇంత పెద్ద బతుకెందుకు?', 'ఏదైనా ఈ నేల మీదున్నప్పుడే సేసేయాల, పుడతాం ఏటి మళ్లీ' అంటూ ఉత్తరాంధ్ర యాసలో రామ్ చరణ్ పలికిన సంభాషణలకు ఫ్యాన్స్ ఫిదా అయిపోయారు. ఇక, థియేటర్లో వింటున్నప్పుడు ఈలలు, గోలలు పక్కా. 'పెద్ది' సినిమాలో చేస్తున్న పాత్రకి అనుగుణంగా రామ్‌చరణ్ ఉత్తరాంధ్ర యాస మాట్లాడారు. గుబురు గడ్డం, ఒత్తయిన జుట్టు, మాస్ లుక్‌తో రామ్‌చరణ్ హీరోగా ఈ చిత్రానికి బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్నారు. స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రం మార్చి 27న రిలీజ్ కానుంది.

సామి సాచ్చిగా...

''కదిరి నరసింహ సామి సాచ్చిగా ఈతూరి నవ్వించేకి వస్తుండా..' అంటూ వరుణ్ తేజ్ తన కెరీర్‌లోని 15వ సినిమాను ప్రకటించిన విషయం గుర్తుండే ఉంటుంది. ఈ సినిమాకు 'కొరియన్ కనకరాజు' అనే టైటిల్‌ను ఖరారు చేసి, ఇటీవల టైటిల్ గ్లింప్స్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ఈ సినిమాలో కనక రాజు పాత్రలో నటిస్తున్నారు వరుణ్ తేజ్. ఈ చిత్రం రాయలసీమలోని అనంతపురం బ్యాక్‌డ్రాప్‌లో సాగుతుందని తెలిసింది. దీంతో ఈ సినిమా కోసం రాయలసీమ యాసలో డైలాగ్స్ చెబుతున్నారు వరుణ్ తేజ్. రితికా నాయక్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో హాస్య నటుడు సత్య ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు నిర్మిస్తున్న ఈ సినిమా ఈ ఏడాదే విడుదల కానుంది. ఇండో–కొరియన్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే హారర్ కామెడీ సినిమా ఇది.

ఈస్ట్ గోదావరి.. రాయలసీమ

విజయ్ దేవరకొండ ప్రస్తుతం 'రణబాలి', 'రౌడీ జనార్ధన' సినిమాలు చేస్తున్నారు. ఈ రెండూ పీరియాడికల్ చిత్రాలే. 'రణబాలి' సినిమా కోసం రాయలసీమ యాసలో డైలాగ్స్ చెబుతున్న విజయ్ దేవరకొండ, 'రౌడీ జనార్ధన' చిత్రం కోసం ఈస్ట్ గోదావరి యాసలో డైలాగ్స్ చెబుతున్నారు. ఇలా ఒకే సమయంలో రెండు భిన్నమైన యాసలతో కూడిన క్యారెక్టర్స్‌లో విజయ్ దేవరకొండ నటిస్తుండటం విశేషం. రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో విజయ్ దేవరకొండ చేస్తున్న సినిమా 'రణబాలి'. 1854 నుంచి 1878 మధ్య బ్రిటిష్ పరిపాలనా కాలంలో జరిగిన వాస్తవ చారిత్రక ఘటనల ఆధారంగా రూపొందుతున్న ఈ సినిమాలో రష్మికా మందన్నా, ఆర్నాల్డ్ వోస్లూ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. గుల్షన్ కుమార్, భూషణ్ కుమార్, టీ సిరీస్ ఫిలింస్ సమర్పణలో నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ సినిమా సెప్టెంబరు 11న విడుదల కానుంది. ఇక విజయ్ దేవరకొండ హీరోగా రవికిరణ్ కోలా దర్శకత్వంలో రూపొందుతున్న రూరల్ యాక్షన్ డ్రామా 'రౌడీ జనార్ధన'. 1980 దశకం నేపథ్యంలో సాగే ఈ సినిమాలో కీర్తీ సురేష్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాది డిసెంబరులో విడుదల కానుంది.

ఏంది మీ లొల్లి...

'పండగ పూట మా బాబుకి బియ్యమిచ్చి నాలుగు ముక్కలు తిందమంటే ఏంది మీ లొల్లి..., ఏయ్ పండగ కాబట్టే కక్క ముక్క వండినం... చెప్పురంకుల్' అంటూ తెలంగాణ యాసలో రెచ్చిపోయారు కావ్యా థాపర్. 'నేను రెడీ' చిత్రం కోసమే కావ్య ఇలా తెలంగాణ మాట్లాడటానికి రెడీ అయ్యారు. 'నువ్విలా, జీనియస్, రామ్ లీలా, సెవెన్' వంటి చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న హవీష్ హీరోగా రూపొందుతున్న తాజా చిత్రం 'నేను రెడీ'. ఈ చిత్రంలో కావ్యా థాపర్ కథానాయికగా నటిస్తున్నారు. నక్కిన త్రినాథరావు దర్శకత్వంలో నిఖిల కోనేరు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వినోదాత్మక, కుటుంబ కథా చిత్రంగా రూపొందుతోన్న 'నేను రెడీ' వేసవిలో రిలీజ్ కానుంది.

● కావ్యా థాపర్

● దేవిశ్రీ ప్రసాద్

రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఇంటెన్స్ లవ్‌స్టోరీ 'లెనిన్' కోసం అక్కినేని అఖిల్ రాయలసీమ యాసలో డైలాగ్స్ చెబుతున్నారు. ఈ సినిమా ప్రధాన కథనం రాయలసీమ ప్రాంతంలోని చిత్తూరు నేపథ్యంలో సాగుతుందని తెలిసింది. మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని మే 1న రిలీజ్ చేయనున్నట్లుగా ఇటీవల మేకర్స్ ప్రకటించారు. ఇంకా రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌లో సాగే 'సంబరాల ఏటిగట్టు' సినిమా కోసం 'ఏటిగట్టు సాచ్చిగా సెప్తుండ ఈతూరి నరికినానంటే అరుపు గొంతులో నుంచి కాదు... తెగిన నరాల్లోన్నించి వస్తాది' అంటూ రాయలసీమ యాసలో సాయిధరమ్ తేజ్ సంభాషణలు పలికారు. ఈ చిత్రం ఈ ఏడాదే విడుదల కానుంది. సంగీత సంచలనం దేవిశ్రీ ప్రసాద్ హీరోగా నటిస్తున్న తొలి సినిమా 'ఎల్లమ్మ'. వేణు యెల్దండి దర్శకత్వంలో ఈ చిత్రాన్ని 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం కోసం రూటెడ్ తెలంగాణ యాసలో మాట్లాడనున్నారట దేవిశ్రీ ప్రసాద్. అలాగే 'డెకాయిట్' సినిమా కోసం అడివి శేష్ రాయలసీమ యాసలో, 'భోగి' సినిమా కోసం తెలంగాణ యాసలో శర్వానంద్, 'క్రేజీ కల్యాణం' కోసం అనుపమా పరమేశ్వరన్ తెలంగాణ యాసలో డైలాగ్స్ చెబుతున్నట్లుగా తెలిసింది. వీరే కాదు... తమ కొత్త సినిమాల కోసం విభిన్న యాసల్లో డైలాగ్స్ చెబుతున్న నటీనటులు మరికొంతమంది ఉన్నారు.

స్టాక్‌ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్‌ ▲	నిఫ్టీ ▲
2,073	639
83,739	25,728

విదేశీ సూచీలు

నాస్‌డాక్‌	23,184	▽	409
డోజోన్స్‌	49,113	▽	295
ఎఫ్‌టీఎస్‌ఈ 100	10,309	▽	32
డాక్స్‌	24,824	▲	35
షాంఘై	4,068	▲	52
నికాయ్‌	54,721	▲	2,065

•అమెరికా •బ్రిటన్‌ •జర్మనీ •చైనా •జపాన్‌

ఫారెక్స్‌ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్‌ డాలర్‌	ఎస్‌బీఐ	90.15	93.17
£	బ్రిటన్‌ పౌండ్‌	ఎస్‌బీఐ	124.16	128.62
€	యూరో	ఎస్‌బీఐ	107.47	111.49
¥	జపాన్‌ యెన్‌ (100)	ఎస్‌బీఐ	48.00	61.00
AU$	ఆస్ట్రేలియా డాలర్‌	ఎస్‌బీఐ	62.07	66.00
S$	సింగపూర్‌ డాలర్‌	థామస్‌కుక్‌	70.23	73.99
SAR	సౌదీ రియాల్‌	థామస్‌కుక్‌	23. 63	25.14
UAE D	యూఏఈ దిర్హామ్‌	థామస్‌కుక్‌	24.15	25.42
¥	చైనా యువాన్‌	థామస్‌కుక్‌	12.36	14.18

సెన్సెక్స్‌ సునామీ

అమెరికా ట్రేడ్‌ డీల్‌ ఎఫెక్ట్‌...

బుల్స్‌ దండయాత్ర

- ఇండెక్స్‌ 2,073 పాయింట్ల జంప్‌
- ఇంట్రాడేలో 4,200 పాయింట్లు ర్యాలీ
- 25,700 స్థాయిపైకి నిఫ్టీ
- ఒక్కరోజులో రూ.12.10 లక్షల కోట్లు పెరిగిన ఇన్వెస్టర్ల సంపద

ముంబై: భారత్‌తో వాణిజ్య ఒప్పందానికి అంగీకరిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ ట్రంప్‌ చేసిన ప్రకటనతో మంగళవారం దలాల్‌ స్ట్రీట్‌లో బుల్‌ లాభాల రంకె వేసింది.భారత్‌–అమెరికా ట్రేడ్‌ డీల్‌ ఇన్వెస్టర్లలో భారీ ఉత్సాహాన్ని నింపింది. ఫలితంగా సెన్సెక్స్‌ 2,073 పాయింట్లు ఎగసి 83,739 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 639 పాయింట్లు దూసుకెళ్లి 25,728 వద్ద నిలిచింది. గతేడాది 2025, మే 12 తర్వాత గడిచిన 8 నెలల్లో సూచీలకు ఒకరోజులో అతిపెద్ద ర్యాలీ ఇదే కావడం విశేషం.

ఇంట్రాడే ట్రేడింగ్‌లో రికార్డు: ఉదయమే ఉత్సాహంగా మొదలైన సెన్సెక్స్‌ 3,657 పాయింట్ల లాభంతో 85,323 వద్ద, నిఫ్టీ 1,220 వద్ద పాయింట్లు పెరిగి 26,308 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. దలాల్‌ స్ట్రీట్‌ చరిత్రలోనే మునుపెన్నడూ లేనంతంగా ఇంట్రాడే లాభాలు ఆర్జించాయి. సెన్సెక్స్‌ ఏకంగా 4,205 పాయింట్లు (5.14%) ఎగసి 85,872 వద్ద, నిఫ్టీ 1,253 పాయింట్లు దూసుకెళ్లి 26,341 వద్ద గరిష్టాలు తాకాయి. తద్వారా సూచీలు ఇంట్రాడేలో అత్యధిక లాభాలు ఆర్జించిన కొత్త రికార్డు నమోదైంది.

ఇన్వెస్టర్లకు లాభాల పంట: స్టాక్‌ మార్కెట్‌ రెండున్నర శాతం ర్యాలీతో ఇన్వెస్టర్లకు లాభాల పంట పండింది. ఒక్కరోజే రూ. 12.10 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. ఫలితంగా ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలో లిస్టెడ్‌ కంపెనీల మొత్తం మార్కెట్‌ క్యాపిటలైజేషన్‌ రూ.467.14 లక్షల కోట్లకు చేరుకుంది.

- సెన్సెక్స్‌ సూచీలోని 30 షేర్లలో టెక్‌ మహీంద్రా (–0.47%), బీఈఎల్‌(–0.02%) మాత్రమే నష్టపోయాయి. మిగిలిన 28 షేర్లు లాభపడ్డాయి. అత్యధికంగా అదానీ పోర్ట్స్‌ 9.12%, బజాజ్‌ ఫైనాన్స్‌ 6.68%, ఇండిగో 5.51%, పవర్‌గ్రిడ్‌ 4.85%, సన్‌ఫార్మా 4.54 శాతం పెరిగాయి.
- స్టాక్‌ మార్కెట్‌ ర్యాలీలో అన్ని రంగాల షేర్లూ పాలుపంచుకున్నాయి. బీఎస్‌ఈలో రంగాల వారీ సూచీల్లో సర్వీసెస్‌ 4.86%, రియల్టీ 4.79%, పవర్‌ 4.79%, యుటిలిటీస్‌ 3.92%, క్యాపిటల్‌ గూడ్స్‌ 3.71%, ఇండస్ట్రియల్స్‌ 3.44%, కన్జూమర్‌ డిస్క్రెషనరీ 3.06%, మెటల్స్‌ 2.85%, ఫార్మా 2.83%, ఫైనాన్షియల్స్‌ సర్వీసెస్‌ 2.83% లాభపడ్డాయి.

టెక్స్‌టైల్‌, లెదర్‌ స్టాక్స్‌: గోకుల్‌దాస్‌ ఎక్స్‌పోర్ట్స్‌ 20%, వెల్‌స్పన్‌ లివింగ్‌ 19.85%, గర్వారే టెక్నికల్‌ ఫైబర్స్‌ 17.07%, కేపీఆర్‌ మిల్స్‌ 15.31 శాతం ర్యాలీ చేశాయి.ఎస్‌పీ అప్పరెల్స్‌ 14.19% వర్ధమాన్‌ టెక్స్‌టైల్స్‌ 12.12%, ట్రిడెంట్‌ 11.27%, అర్వింద్‌ లిమిటెడ్‌ 10.23%, పేజ్‌ ఇండస్ట్రీస్‌ 3.79%, రేమాండ్‌ లైఫ్‌స్టయిల్‌ 3.39 శాతం లాభపడ్డాయి.

సీఫుడ్స్‌ ఎక్స్‌పోర్ట్స్‌ షేర్లు: అవంతీ ఫీడ్స్‌, అపెక్స్‌ ఫ్రోజెన్‌ పుడ్స్‌ 20% ర్యాలీ చేసి వరుసగా రూ.961, రూ.351 వద్ద అప్పర్‌ సర్క్యూట్‌ తాకాయి. జీల్‌ ఆక్వా 10.58%, కింగ్స్‌ ఇన్‌ఫ్రా 7.64%, ముక్కా ప్రొటీన్స్‌ 5.01%, కోస్టల్‌ కార్పొరేషన్‌ 5% లాభపడ్డాయి.

స్పెషాలిటీ కెమికల్స్‌: ఆర్తి ఇండస్ట్రీస్‌ 15.10%, గుజరాత్‌ ఫ్లోరో 6.82%, నవీన్‌ ఫ్లోరైన్‌ 6.22%, నియోజెన్‌ కెమ్‌ 6.19% పెరిగాయి. అతుల్‌ ఇండస్ట్రీస్‌ 5.25%, వినతి ఆర్గానిక్స్‌ 4.67%, ఎస్‌ఆర్‌ఎఫ్‌ 3.76%, ఆక్విటాస్‌ కెమ్‌ 1.26% లాభపడ్డాయి.

వజ్రాభరణాల షేర్లు: గోల్డియమ్‌ ఇంటర్నేషనల్‌ 20%, వైభవ్‌ గ్లోబల్‌ 9.13%, కళ్యాణ్‌ జ్యువెలరీ 4.91%, శ్రింగార్‌ హౌస్‌ 4.51% మెరిశాయి. టైటాన్‌ 3%, పీఎన్‌ గాడ్గిల్‌ జ్యువెలర్స్‌ 1.52%, పీసీ జ్యువెలర్‌ 0.29% లాభపడ్డాయి.

ఆటో ఉపకరణాల కంపెనీల షేర్లు: బెల్‌రైజ్‌ ఇండస్ట్రీస్‌ 7.37%, భారత్‌ ఫోర్జ్‌ 6.56%, సంవర్ధన మదర్సన్‌ ఇంటర్నేషనల్‌ 6.44% బీఎల్‌డబ్ల్యూ ప్రిసిషన్‌ ఫోర్జింగ్స్‌ 6.13%, సుందరం ఫాస్టెనర్స్‌ 4%, భాష్‌, యూఎన్‌ఓ మిండా 3% పెరిగాయి.

అదానీ షేర్ల పరుగులు: స్టాక్‌ మార్కెట్‌ ర్యాలీలో భాగంగా అదానీ కంపెనీల షేర్లు పరుగులు పెట్టాయి. అదానీ గ్రీన్‌ ఎనర్జీ 10.61%, అదానీ ఎంటర్‌ప్రైజస్‌ 10.38%, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్‌ 10.23%, అదానీ పోర్ట్స్‌ 9.12%, అదానీ పవర్‌ 6.76%, అదానీ టోటల్‌ గ్యాస్‌ 4.52%, సంఘీ ఇండస్ట్రీస్‌ 3.60% లాభపడ్డాయి.

యమహా ఈసీ06

ఎలక్ట్రిక్‌ స్కూటర్‌ @ రూ. 1.67 లక్షలు

చెన్నై: ద్విచక్ర వాహనాల తయారీ దిగ్గజం యమహా మోటర్స్‌ దేశీయంగా ఎలక్ట్రిక్‌ వాహనాల మార్కెట్లోకి ప్రవేశించింది. తమ తొలి ఎలక్ట్రిక్‌ స్కూటర్‌ ఈసీ–06ని ఆవిష్కరించింది. దీని ధర రూ. 1,67,600గా (ఢిల్లీ ఎక్స్‌షోరూం రేటు) ఉంటుందని సంస్థ వెల్లడించింది. ఒక్కసారి చార్జి చేస్తే ఇది 169 కి.మీ. వరకు రేంజినిస్తుంది. ముందుగా ఎంపిక చేసిన నగరాల్లో కంపెనీకి చెందిన బ్లూ స్క్వేర్‌ షోరూంల ద్వారా ఈ స్కూటర్లను విక్రయించనున్నట్లు సంస్థ తెలిపింది. పర్యావరణహితమైన అర్బన్‌ మొబిలిటీ దిశగా తమ సంస్థ ప్రస్థానంలో ఇదొక కీలక మైలురాయని యమహా మోటర్‌ ఇండియా గ్రూప్‌ చైర్మన్‌ హజిమె యోటా తెలిపారు.

రూపాయి రయ్‌.. రయ్‌..!

117 పైసలు అప్‌ • 90.32 వద్ద ముగింపు

ముంబై: భారత్‌–అమెరికాల మధ్య వాణిజ్య ఒప్పందం కుదరడంతో మంగళవారం రూపాయి విలువ భారీ ర్యాలీ చేసింది. డాలర్‌ మారకంలో ఏకంగా 117 పైసలు బలపడి రెండున్నర వారాల గరిష్టం 90.32 వద్ద ముగిసింది. దేశీయ ఈక్విటీ మార్కెట్‌ 2.50% పెరగడం, అంతర్జాతీయంగా క్రూడాయిల్‌ ధరలు దిగిరావడం, విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్ల అంశాలు దేశీయ కరెన్సీ ర్యాలీకి సహకరించాయి. ఉదయం ఫారెక్స్‌ మార్కెట్లో డాలర్‌ మారకంలో రూపాయి విలువ 90.30 వద్ద మొదలైంది. ఇంట్రాడేలో 144 పైసలు ర్యాలీ చేసి 90.05 గరిష్టాన్ని తాకింది. అలాగే 90.52 స్థాయి కనిష్టానికి దిగివచ్చింది. ‘‘అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదరడం ద్వారా విదేశీ ఇన్వెస్టర్ల పునరాగమనం మొదలవుతుంది. దేశీయ మార్కెట్లోకి విదేశీ పెట్టుబడుల రాకతో రూపాయిపై ఒత్తిడి తగ్గుతుంది’’ అని ఫారెక్స్‌ నిపుణులు అభిప్రాయపడ్డారు.

అదానీ పోర్ట్స్‌ లాభం జూమ్‌

క్యూ3లో రూ. 3,043 కోట్లు

న్యూఢిల్లీ: మౌలిక రంగ దిగ్గజం అదానీ పోర్ట్స్‌ అండ్‌ సెజ్‌ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. అక్టోబర్‌–డిసెంబర్‌(క్యూ3)లో కన్సాలిడేటెడ్‌ నికర లాభం 21 శాతం జంప్‌చేసి రూ. 3,043 కోట్లను తాకింది. కార్గో హ్యాండ్లింగ్‌ బిజినెస్‌లో వృద్ధి కారణంగా ఆదాయం పుంజుకోవడం ఇందుకు సహకరించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 2,518 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 7,964 కోట్ల నుంచి రూ. 9,705 కోట్లకు బలపడింది. ఇది 22 శాతం అధికంకాగా.. దేశీ పోర్టుల నుంచి రూ. 6,701 కోట్లు, అంతర్జాతీయ పోర్టుల నుంచి రూ. 1,067 కోట్లు చొప్పున టర్నోవర్‌ సాధించింది. ఈ కాలంలో కార్గో హ్యాండ్లింగ్‌ 9 శాతం పుంజుకుని 123 మిలియన్‌ మెట్రిక్‌ టన్నులకు చేరింది. పూర్తి ఏడాదికి రూ. 11,000–12,000 కోట్ల పెట్టుబడి వ్యయాలపై దృష్టి పెట్టింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్‌ఈలో 9 %పైగా జంప్‌చేసి రూ. 1,531 వద్ద ముగిసింది.

‘సాక్షి ప్లస్‌’ ఈ-పేపర్‌లో ..

ఎగుమతులకు బూస్ట్‌	జీసీసీలకు హాట్‌స్పాట్‌గా భారత్‌

లియోనార్డోతో అదానీ గ్రూప్‌ భాగస్వామ్యం

న్యూఢిల్లీ: భారత్‌లో సమగ్ర హెలికాప్టర్ల తయారీ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు ఇటాలియన్‌ దిగ్గజం లియోనార్డోతో అదానీ డిఫెన్స్‌ అండ్‌ ఏరోస్పేస్‌ చేతులు కలిపింది. భారత సాయుధ బలగాలకు అవసరమైన ఉత్పత్తులను, ముఖ్యంగా లియోనార్డోకి చెందిన ఏడబ్ల్యూ169ఎం, ఏడబ్ల్యూ109 ట్రెకర్‌ఎం హెలికాప్టర్లకి సంబంధించి అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. దశలవారీగా దేశీయంగా ఉత్పత్తి చేసేందుకు, మెయింటెనెన్స్‌–రిపేర్‌–ఓవర్‌హాల్‌ (ఎంఆర్‌వో) సామర్థ్యాలను పెంపొందించుకునేందుకు, పైలట్లకు శిక్షణనిచ్చేందుకు ఈ డీల్‌ ఉపయోగపడుతుందని అదానీ గ్రూప్‌ తెలిపింది.

మళ్లీ ట్రెండ్‌లోకి వెండి

ర్యాలీ షురూ! • రూ. 24,000 అప్‌
రూ.5,000 పెరిగిన బంగారం

న్యూఢిల్లీ: జీవితకాల గరిష్ట స్థాయిల నుంచి వరుసగా మూడు రోజుల పాటు తీవ్ర పతనాన్ని చూసిన వెండి, బంగారం ధరలు తిరిగి కోలుకున్నాయి. అంతర్జాతీయంగా సానుకూల పవనాల మధ్య ఢిల్లీ మార్కెట్లో విలువైన లోహాల ధరలు ర్యాలీ చేశాయి. వెండి కిలోకి ఏకంగా రూ.24,000 పెరిగి (9.23 శాతం) రూ.2.84 లక్షలకు (పన్నులతో కలుపుకుని) చేరింది. పసిడి సైతం 10 గ్రాములకు రూ.5,000 లాభపడి (3.3 శాతం) రూ.1,57,700 స్థాయిని తాకింది. జనవరి 29న వెండి రూ.4,04,500 వద్ద, పసిడి సైతం రూ.1,83,000 వద్ద ఆల్‌టైమ్‌ గరిష్టాలను నమోదు చేయడం తెలిసిందే.

కొనుగోళ్ల మద్దతు..

‘‘బంగారం ఇటీవలి నష్టాలను మంగళవారం కొంత భర్తీ చేసుకుంది. వెండి ధర సైతం గణనీయంగా పెరిగింది. రెండు రోజుల భారీ విక్రయాలతో ధరలు క్షీణించడాన్ని ఇన్వెస్టర్లు చక్కని అవకాశంగా చూశారు’’అని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్‌ కమోడిటీ సీనియర్‌ అనలిస్ట్‌ సౌమిల్‌ గాంధీ తెలిపారు. దీర్ఘకాల పొజిషన్లు తీసుకునేందుకు దిద్దుబాటు కోసం వేచి చూసిన ఇన్వెస్టర్లు.. ధరలు దిగిరావడాన్ని అవకాశంగా భావించినట్టు వివరించారు. అంతర్జాతీయ మార్కెట్లో వెండి స్పాట్‌ ధర ఔన్స్‌కు 9.55 డాలర్లు (12.07) పుంజుకుని 88.77 డాలర్లకు చేరింది. బంగారం సైతం ఔన్స్‌కు (31.10 గ్రాములు) 275 డాలర్లు లాభపడి (5.91 శాతం) 4,935.49 డాలర్ల స్థాయిని తాకింది. బంగారం, వెండికి అధిక మార్జిన్లు అవసరం కావడం, ఈ ఏడాది మేలో ఫెడ్‌ చైర్మన్‌ పావెల్‌ పదవీ కాలం ముగిసే వరకూ రేట్ల సవరణ ఉండదన్న అంచనాలు, రేట్ల పరంగా కఠిన దృక్పథం కలిగిన వార్ష్‌ను కొత్త చైర్మన్‌గా ప్రతిపాదించడం క్రితం మూడు సెషన్లలో బంగారం, వెండిలో విక్రయాలకు దారితీసినట్టు కోటక్‌ సెక్యూరిటీస్‌ కమోడిటీ ఏవీపీ కేనత్‌ చైన్‌వాలా వివరించారు. వీటి ధరలు సమీప కాలంలో అస్థిరంగానే ఉండొచ్చన్నారు.

తొలి రౌండ్‌లోనే సహజ పరాజయం

ముంబై ఓపెన్‌ డబ్ల్యూటీఏ–125 టెన్నిస్‌ టోర్నమెంట్‌ మహిళల సింగిల్స్‌ విభాగంలో భారత క్రీడాకారిణుల పోరాటం తొలి రౌండ్‌లోనే ముగిసింది. భారత నంబర్‌వన్‌, హైదరాబాద్‌ ప్లేయర్‌ సహజ యామలపల్లి... భారత రెండో ర్యాంకర్‌, హైదరాబాద్‌కే చెందిన భమిడిపాటి శ్రీవల్లి రష్మికలకు నిరాశ ఎదురైంది. ముంబైలో మంగళవారం జరిగిన తొలి రౌండ్‌ మ్యాచ్‌ల్లో సహజ 5–7, 2–6తో ఎరి షిమిజు (జపాన్‌) చేతిలో, రష్మిక 1–6, 3–6తో క్రిస్టియానా సిదోరోవా (రష్యా) చేతిలో ఓడిపోయారు. భారత్‌కే చెందిన మాయా రాజేశ్వరన్‌, వైష్ణవి అడ్కర్‌, అంకిత రైనా కూడా తొలి రౌండ్‌లోనే వెనుదిరిగారు. మాయ 3–6, 2–6తో లాన్లానా తారారుడీ (థాయ్‌లాండ్‌) చేతిలో, వైష్ణవి 5–7, 4–6తో లిల్లీ టాగెర్‌ (ఆస్ట్రియా) చేతిలో, అంకిత 4–6, 0–6తో మిసాకి మత్సుద (జపాన్‌) చేతిలో పరాజయం పాలయ్యారు. తొలి రౌండ్‌లో ఓడిపోయిన భారత ప్లేయర్లకు 1,200 డాలర్ల (రూ. 1 లక్ష 8 వేలు) చొప్పున ప్రైజ్‌మనీ లభించింది.

యువ భారత్‌ను ఆపతరమా!

నేడు అఫ్గానిస్తాన్‌తో రెండో సెమీఫైనల్‌

- మధ్యాహ్నం 1 గంట నుంచి స్టార్‌ స్పోర్ట్స్‌, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

వైభవ్‌

హరారే: అండర్‌–19 ప్రపంచకప్‌లో అజేయంగా దూసుకెళ్తున్న యువ భారత్‌ ఇదే జోరుతో ఫైనల్‌ చేరాలని ఆశిస్తోంది. నేడు జరిగే రెండో సెమీఫైనల్లో భారత జట్టు అఫ్గానిస్తాన్‌తో తలపడుతుంది. ఫామ్‌ పరంగా చూసినా, మొత్తం టీమ్‌ ప్రదర్శన చూసినా ఆయుశ్‌ మాత్రే సారథ్యంలోని భారత్‌ను అడ్డుకోవడం అఫ్గాన్‌కు సాధ్యమయ్యే పనైతే కాదు. అండర్‌–19 ప్రపంచకప్‌ల చరిత్రలోనే ఐదు టైటిళ్లతో అత్యంత విజయవంతమైన జట్టుగా నిరూపించుకున్న యువ భారత్‌... 2000, 2008, 2012, 2018, 2022 సరసన ఈ ఏడాదిని కూడా చేర్చాలని ఆరాట పడుతోంది. మన కుర్రాళ్లు ఆడుతున్న తీరు, గెలుస్తున్న వైనం చూస్తుంటే ఇదేమంత కష్టం కానేకాదు. ఇప్పటివరకు ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ తిరుగులేని విజయాలు సాధించింది. ఇలాంటి దుర్బేధ్యమైన భారత సేనను ఎదుర్కోవాలంటే అఫ్గానిస్తాన్‌ పెద్ద కసరత్తే చేయాలి. ఇక గెలవాలంటే మాత్రం ఓ సంచలనం నమోదవ్వాలి. అయితే ప్రత్యేకించి ఈ టోర్నీలో అఫ్గానిస్తాన్‌ కూడా బాగా ఆడింది. భారత కుర్రాళ్లు ఐదు గెలిస్తే... అఫ్గాన్‌ కేవలం ఒకటి ఓడి, నాలుగు విజయాలతో సత్తా చాటుకుంది. ఇలాంటి మేటి ప్రదర్శన కనబరిచిన అఫ్గాన్‌ను తక్కువ అంచనా వేయకూడదని ఆయుశ్‌ బృందానికి బాగా తెలుసు. ఆదమరుపు లేకుండా ఎప్పటిలాగే మరో మ్యాచ్‌ విజయం కోసం చెమటోడ్చాలని యువ బృందం పట్టుదలతో ఉంది. టీనేజ్‌ సంచలనం, ఓపెనింగ్‌ హిట్టర్‌ వైభవ్‌ సూర్యవంశీ సహా టాపార్డర్‌ బ్యాటర్లు ప్రత్యర్థి బౌలర్ల భరతం పడుతున్నారు. ఆల్‌రౌండర్‌ విహాన్‌ మల్హోత్రా బ్యాట్‌తో, కెప్టెన్‌ ఆయుశ్‌ మాత్రే బంతితో ప్రత్యర్థి జట్ల పని పడుతున్నారు. వీరితో పాటు పేసర్లు హెనిల్‌ పటేల్‌, అంబరీశ్‌ నిప్పులు చెరుగుతుండటం బౌలింగ్‌ దళానికి వెన్నుదన్నుగా ఉంది. అఫ్గానిస్తాన్‌ కూడా మ్యాచ్‌మ్యాచ్‌కు రాటుదేలుతున్నప్పటికీ భారత్‌ లాంటి ఆల్‌రౌండ్‌ సామర్థ్యమున్న జట్టును ఓడించాలంటే సర్వశక్తులు ఒడ్డినా సరిపోదేమో!

ఆస్ట్రేలియాపై గెలిచి ఫైనల్లో ఇంగ్లండ్‌

థామస్‌ ర్యూ

మంగళవారం జరిగిన తొలి సెమీఫైనల్లో ఇంగ్లండ్‌ 27 పరుగుల తేడాతో ఆస్ట్రేలియాను ఓడించి ఫైనల్లోకి దూసుకెళ్లింది. మొదట ఇంగ్లండ్‌ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్లకు 277 పరుగులు చేసింది. కెప్టెన్‌ థామస్‌ ర్యూ (107 బంతుల్లో 110; 14 ఫోర్లు, 1 సిక్స్‌) సెంచరీ సాధించాడు. అనంతరం 278 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన ఆస్ట్రేలియా అండర్‌–19 జట్టు 47.3 ఓవర్లలో 250 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. కెప్టెన్‌ ఒలివర్‌ పీక్‌ (88 బంతుల్లో 100; 10 ఫోర్లు, 1 సిక్స్‌) సెంచరీతో రాణించినా ఫలితం లేకపోయింది. భారత్‌, అఫ్గానిస్తాన్‌ మధ్య రెండో సెమీఫైనల్‌ విజేతతో శుక్రవారం జరిగే ఫైనల్లో ఇంగ్లండ్‌ తలపడుతుంది.

మళ్లీ ఢిల్లీనే...

‘ప్లేయర్‌ ఆఫ్‌ ద మ్యాచ్‌’ జెమీమా

వరుసగా నాలుగోసారి డబ్ల్యూపీఎల్‌ ఫైనల్లోకి క్యాపిటల్స్‌

- ‘ఎలిమినేటర్‌’ మ్యాచ్‌లో 7 వికెట్లతో గుజరాత్‌ జెయింట్స్‌పై గెలుపు
- బంతితో మెరిసిన హెన్రీ, నందిని • బ్యాట్‌తో దంచేసిన లిజెల్లీ లీ
- రేపు రాయల్‌ చాలెంజర్స్‌ బెంగళూరుతో ఢిల్లీ టైటిల్‌ పోరు

చినెల్లి హెన్రీ సంబరం

వడోదర: ఢిల్లీ క్యాపిటల్స్‌ మళ్లీ ఫైనల్‌ చేరింది. మహిళల ప్రీమియర్‌ లీగ్‌ (డబ్ల్యూపీఎల్‌)లో మంగళవారం జరిగిన ఎలిమినేటర్‌ మ్యాచ్‌లో ఢిల్లీ 7 వికెట్ల తేడాతో గుజరాత్‌ జెయింట్స్‌పై ఘనవిజయం సాధించింది. వరుసగా నాలుగోసారి ఫైనల్‌ చేరిన జట్టుగా ఢిల్లీ ఘనత వహించింది. గురువారం జరిగే టైటిల్‌ పోరులో రాయల్‌ చాలెంజర్స్‌ బెంగళూరు (ఆర్‌సీబీ)తో క్యాపిటల్స్‌ తలపడుతుంది. 2024లోనూ ఇరు జట్లు టైటిల్‌ కోసం ఢీకొనగా ఆర్‌సీబీ విజేతగా నిలిచింది. మొదట గుజరాత్‌ జెయింట్స్‌ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 168 పరుగులు చేసింది. ఓపెనర్‌ బెత్‌ మూనీ (51 బంతుల్లో 62 నాటౌట్‌; 6 ఫోర్లు) ఒంటరి పోరాటం చేయగా, జార్జియా వేర్‌హమ్‌ (25 బంతుల్లో 35; 3 ఫోర్లు, 1 సిక్స్‌) ధాటిగా ఆడింది. స్టార్‌ ఆల్‌రౌండర్‌ సోఫీ డివైన్‌ (0), కెప్టెన్‌ యాష్లీ గార్డ్‌నర్‌ (0) విఫలమయ్యారు. చినెల్లి హెన్రీ 3 వికెట్లు, నందిని శర్మ 2 వికెట్లు తీశారు. అనంతరం ఢిల్లీ 15.4 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 169 పరుగులు చేసి గెలిచింది. లిజెల్లీ లీ (24 బంతుల్లో 43; 8 ఫోర్లు, 1 సిక్స్‌), కెప్టెన్‌ జెమీమా రోడ్రిగ్స్‌ (23 బంతుల్లో 41; 4 ఫోర్లు, 1 సిక్స్‌) దంచేశారు. షఫాలీ వర్మ (21 బంతుల్లో 31; 7 ఫోర్లు), లౌరా వోల్వార్డ్‌ (24 బంతుల్లో 32 నాటౌట్‌; 2 ఫోర్లు, 1 సిక్స్‌) ధాటిగా ఆడారు. వేర్‌హమ్‌కు 2 వికెట్లు దక్కాయి.

స్కోరు వివరాలు

గుజరాత్‌ జెయింట్స్‌ ఇన్నింగ్స్‌: బెత్‌ మూనీ (నాటౌట్‌) 62; సోఫీ డివైన్‌ (సి) లిజెల్లీ (బి) హెన్రీ 6; అనుష్క (సి) హెన్రీ (బి) నందిని 16; యాష్లీ గార్డ్‌నర్‌ (సి) స్నేహ్‌ రాణా (బి) నందిని 0; కనిక (స్టంప్డ్‌) లిజెల్లీ (బి) మిన్ను మణి 6; వేర్‌హమ్‌ (సి) వోల్వార్డ్‌ (బి) హెన్రీ 35; భారతి (సి అండ్‌ బి) హెన్రీ 0; కాశ్వీ గౌతమ్‌ (రనౌట్‌) 18; తనూజ (నాటౌట్‌) 0; ఎక్స్‌ట్రాలు 25; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 168.** వికెట్ల పతనం: 1–9, 2–38, 3–38, 4–59, 5–120, 6–125, 7–164. **బౌలింగ్‌:** మరిజాన్‌ కాప్‌ 4–0–32–0, చినెల్లీ హెన్రీ 4–0–35–3, నందిని శర్మ 4–0–44–2, మిన్ను మణి 4–0–23–1, స్నేహ్‌ రాణా 1–0–3–0, శ్రీచరణి 3–0–25–0.

ఢిల్లీ క్యాపిటల్స్‌ ఇన్నింగ్స్‌: లిజెల్లీ లీ (ఎల్బీడబ్ల్యూ) (బి) వేర్‌హమ్‌ 43; షఫాలీ వర్మ (బి) వేర్‌హమ్‌ 31; వోల్వార్డ్‌ (నాటౌట్‌) 32; జెమీమా (సి) సోఫీ (బి) రాజేశ్వరి 41; మరిజాన్‌ కాప్‌ (నాటౌట్‌) 4; ఎక్స్‌ట్రాలు 18; **మొత్తం (15.4 ఓవర్లలో 3 వికెట్లకు) 169. వికెట్ల పతనం:** 1–89, 2–92, 3–160. **బౌలింగ్‌:** రేణుక 2–0–27–0, కాశ్వీ గౌతమ్‌ 2–0–17–0, రాజేశ్వరి 3–0–33–1, సోఫీ డివైన్‌ 3–0–35–0, జార్జియా వేర్‌హమ్‌ 3.4–0–28–2, తనూజ 1–0–5–0, యాష్లీ గార్డ్‌నర్‌ 1–0–15–0.

వికెట్‌పడ్డా.. టెస్టుల్లో ఇక ఆఖరి ఓవర్లో 6 బంతులు పడాల్సిందే!

- క్రికెట్‌ నియమావళిలో మార్పులు
- ఈ అక్టోబర్‌ నుంచి అమలు

లండన్‌: క్రికెట్‌ నియమావళి మారింది. కొత్త మార్పులు ఈ ఏడాది నుంచే అమలవుతాయని మెరిల్‌బోన్‌ క్రికెట్‌ క్లబ్‌ (ఎంసీసీ) వెల్లడించింది. నియమావళిలో ఏకంగా 73 సవరణలు జరిగినప్పటికీ ప్రధానంగా టెస్టుల్లో ఇకపై ఆఖరి ఓవర్‌ను తప్పనిసరిగా పూర్తి చేయాలన్న నిబంధన అమలుకానుంది. దశాబ్దాలుగా సంప్రదాయ ఫార్మాట్‌లో ఆ రోజు చివరి ఓవర్లో వికెట్‌ పడితే అక్కడితోనే ఆట ముగిస్తున్నారు. మరో బ్యాటర్‌ రావడం... మిగతా బంతులు ఆడటం జరగట్లేదు. బ్యాడ్‌లైట్‌ లాంటి ప్రతికూల వాతావరణం లేకుంటే ఇకపై బ్యాటర్‌ క్రీజులోకి రావాల్సిందే... మిగిలిన బంతులు ఆడాల్సిందేనని ఎంసీసీ సవరించిన నియమావళి చెబుతోంది. ఆఖరి ఓవర్‌ డ్రామాను అర్ధంతరంగా ముగించడానికి వీల్లేదని స్పష్టం చేసింది. కొత్త మార్పులు, నియమావళిని ఈ అక్టోబర్‌ నుంచి అమలు చేయనున్నట్లు ఎంసీసీ పేర్కొంది.

ల్యామినేటెడ్‌ బ్యాట్లకు సై

పురుషులు ఆడే క్లబ్‌ క్రికెట్‌లో ఇకపై ల్యామినేటెడ్‌ బ్యాట్లను అనుమతిస్తారు. ల్యామినేటెడ్‌ బ్యాట్లకు దూరంగా ఉన్న ఎంసీసీ తొలిసారిగా 2017లో జూనియర్‌ క్రికెట్‌లో అనుమతించింది. ఇప్పుడు సీనియర్‌ క్రికెట్‌లో సై అంటున్నారు. బంతిని ఆడే క్రమంలో బ్యాటర్‌ తనను తాను నియంత్రించుకోకుండా వికెట్లను తగిలితే హిట్‌ వికెట్‌గా అవుట్‌ ఇస్తారు. ఇది యథాతథం. అయితే బ్యాటర్‌ ప్రమేయం లేకుండా ఫీల్డర్ల పొరపాటు వల్ల వికెట్లను తాకితే ఇకమీదట ఆ బ్యాటర్‌ను హిట్‌ వికెట్‌గా పెవిలియన్‌కు పంపించరు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్‌ స్పోర్ట్స్‌ ఈ-పేపర్‌లో

గత టీడీపీ హయాంలోనే నెయ్యి కల్తీ

87 వేల కిలోల కల్తీ నెయ్యి కొని ఫ్లేవర్ కలిపి దురాగతం | భోలేబాబాను తీసుకొచ్చిందీ చంద్రబాబు సర్కారే

సాక్షి ప్రతినిధి, తిరుపతి: పవిత్ర తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడింది గత చంద్రబాబు ప్రభుత్వ హయాంలోనేనని వైఎస్సార్‌సీపీ నేత, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి స్పష్టం చేశారు. కల్తీ నెయ్యితో చేసిన లడ్డూలకు మంచి వాసన వచ్చేందుకు నెయ్యి ఫ్లేవర్ వాడారని దుయ్యబట్టారు. చంద్రబాబు సీఎంగా ఉన్న 2018, ఆగస్టు 27న టీటీడీ ప్రొక్యూర్‌మెంట్ విభాగం 87 వేల కేజీల నెయ్యిని కొందని, నెయ్యికి ఆ వాసన తీసుకొచ్చేందుకు ఆవు నెయ్యి ఫ్లేవర్ కొన్నారని విమర్శించారు. ఆ రోజున చంద్రబాబు సర్కారు వాడిన నెయ్యి కల్తీ కాబట్టే వాసన రాలేదని, అందుకే ఏకంగా రూ.3.37 కోట్లు ఖర్చు పెట్టి ఫ్లేవర్‌ను కలిపారని భూమన దుయ్యబట్టారు. భోలేబాబా డెయిరీని తీసుకొచ్చిన అలీబాబా కూడా చంద్రబాబేనని గుర్తు చేశారు. జంతుకొవ్వు, చేపనూనె కలిపిన నెయ్యి వాడారని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేసిన సీఎం చంద్రబాబు, అందులో ఏ మాత్రం వాస్తవం లేదన్న సీబీఐ సిట్ చార్జ్‌షీట్‌తో అడ్డంగా దొరికిపోయి, ఇప్పుడు తన తప్పును కప్పిపుచ్చుకునేందుకు నానాపాట్లు పడుతున్నారని ఎద్దేవా చేశారు. నెయ్యిలో ఏ కొవ్వూ కలవలేదని దేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు నియమించిన సిట్ చెప్పినా, మళ్లీ ప్రభుత్వం ప్రత్యేక విచారణ చేయించాలని నిర్ణయించడమే ఇందుకు నిదర్శనం అని ఆయన వెల్లడించారు. ప్రభుత్వానికి చేతనైతే సిట్ రిపోర్ట్ తప్పు అని సుప్రీంకోర్టును ఆశ్రయించి, అక్కడ రుజువు చేయాలని సవాల్ విసిరారు. సుప్రీం నియమించిన సిట్ రిపోర్టుపై ప్రభుత్వం తిరిగి విచారణ చేపట్టడం తగదని పేర్కొన్నారు. తిరుపతిలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం మీడియాతో భూమన మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

సిట్ రిపోర్ట్‌పై కేబినెట్ నిర్ణయమా!

సుప్రీంకోర్టు నియమించిన సిట్ అధికారుల్ని సీఎం చంద్రబాబు పిలిపించుకోవడం అసాధారణ విషయం. వారి దగ్గరి నుంచి 11 పేజీల నివేదిక తీసుకుని సుదీర్ఘమైన చర్చ చేశామని మంగళవారం కేబినెట్ భేటీ నుంచి బయటికి వచ్చిన మంత్రులు చెప్పారు. చంద్రబాబును కాపాడడానికి, ఆయన చెప్పిన అబద్ధాల్ని కప్పిపుచ్చడానికే వీళ్ల ప్రయాస. చంద్రబాబు అధికారంలోకి రాగానే 2024 సెప్టెంబర్ 20న గత ప్రభుత్వంలో తిరుమల ప్రసాదం తయారీకి జంతు నెయ్యి కలిసిన నెయ్యి వాడారని అబద్ధపు ఆరోపణలు చేశారు. దీనిపై వాస్తవాలు నిగ్గు తేల్చాలని పూర్వ టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీంతో ఏ విషయమూ నిర్ధారణ కాకుండా జంతుకొవ్వు అంటూ భక్తుల మనోభావాలు దెబ్బతినే వ్యాఖ్యలు చేయొద్దంటూ చంద్రబాబును తప్పుబట్టిన సుప్రీంకోర్టు, ఈ వ్యవహారంపై సిట్ ఏర్పాటుచేసింది. సిట్ తన చార్జిషీట్‌లో జంతుకొవ్వు , చేప నూనె కలిసినట్టు ఎక్కడా చెప్పలేదు. అయినా చంద్రబాబు ఈ చార్జిషీట్‌పై సంతృప్తి చెందకుండా కేబినెట్ సమావేశంలో నెయ్యి విషయంలో ప్రత్యేక విచారణ చేపడుతున్నట్లు మంత్రులతో బయట ప్రకటన చేయించారు. సుప్రీంకోర్టు నియమించిన సిట్ రిపోర్టు కాకుండా, మళ్లీ విచారణ చేయించాలన్న నిర్ణయం పూర్తిగా తప్పు. సిట్ నివేదికపై విచారణ జరిపే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదు.

Sub: TTD - Marketing Department – Procurement wing, Tirupati – Procurement of 87,750 kgs of enhanced flavor of Cow ghee through Tins from the dairies of Southern India - e-tenders invited – Technical bid and financial bid opened – Recommendations of the Purchase Committee – Placed before the TTD Board for approval - Regarding.

Ref: e-Tender dated: 27-08-2018 (Tech. Bid) & 28-08-2018 (fin.bid)

@@@

NOTE:

(1) This is with regard to procurement of 87,750 Kgs of enhanced flavor of Cow ghee with Agmark Special Grade through tins from the dairies located in Southern India for use in moulding of Laddu prasadams in Srivari Temple for a period of 3 months on trail basis.

1	Name of the product	:	Enhanced flavor of Cow ghee through tins
2	Requirement of three months period	:	87,750 Kgs (through Tins)
3.	Type of contract a. Single contract b. Multiple vendor contract	:	Single vendor contract
4	Consumption during last six months	:	Newly procurement
5.	Average daily consumption	:	975 Kgs
6.	Tenders published in News Papers	:	Yes, published

2018లోనే నుంచి 87 వేల 750 కిలోల ఆవు నెయ్యి టీటీడీకి సరఫరా చేసినట్లు ఆధారం

9. The details of cow ghee net rates is as follows.

Agmarknet rate as on 28.07.2018	Rs.388-50 per Kg

10. as per the L-1 rate of **Rs. 385-00 Ps per Kg**, an amount of **Rs 3,37,83,750/-** (Rupees three Crore thirty seven lakh eighty three thousand seven hundred and fifty only) will be required for procurement of **87,750 Kgs of enhanced flavor of Cow Ghee through tins** for a period of **three months.**

2018లో కిలో నెయ్యి 385 రూపాయలకే కొనుగోలు చేసినట్లు టెండర్లో పేర్కొన్న భాగం

'భోలేబాబా డెయిరీ' వెనుక ఉన్న 'ఆలీ బాబా' చంద్రబాబే

ఈ భోలే బాబా డెయిరీని తెచ్చింది చంద్రబాబే. 2018లోనే భోలే బాబా డెయిరీ రంగప్రవేశం చేసింది. దాదాపు 87 వేల కేజీల నెయ్యి ఈ కంపెనీ సరఫరా చేసింది. ఈ విషయం స్పష్టంగా సీబీఐ నివేదికలోనే ఉంది. కానీ దాన్ని వదిలేసి మా హయాంలోనే నెయ్యి సరఫరా చేసినట్లు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. భోలే బాబాకు ముందున్న పేరు హర్ష్–ఫ్రెష్ డెయిరీ. ఈ డెయిరీకి అనుమతి ఇచ్చింది చంద్రబాబు ప్రభుత్వమే. బీజేపీ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు ఇప్పుడు భోలే బాబాను తెచ్చిన ఆలీ బాబా ఎవరో తెలిసిందని అనుకుంటున్నాం.

ఆ నెయ్యిపైనా విచారణ జరిపించాలి

ఈ సిట్ విచారణ 2019–24 మధ్య కాలానికి వేశారు. ఇందులో నిందితులుగా పేర్కొన్న ప్రీమియర్ డెయిరీ 2013 నుంచి 2024 వరకూ నెయ్యిని అనేకమార్లు టెండర్లలో పాల్గొని సరఫరా చేసింది. మీకు నిజంగా తిరుమల శ్రీవారి మీద భక్తి ఉంటే, మీ గత ప్రభుత్వంలో సరఫరా అయిన నెయ్యిపైనా విచారణ చేయించాలి. ఆ రోజు 90 శాతానికిపైగా నెయ్యి సరఫరా చేసిన డెయిరీయే మా హయాంలోనూ సరఫరా చేసిందన్న విషయం మీకు గుర్తు చేస్తున్నాం.

నెయ్యి ఫ్లేవర్ కలిపి కల్తీ చేసింది మీరే కదా!

విభజిత రాష్ట్రంలో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడే 2018, ఆగస్టు 27న టీటీడీ ప్రొక్యూర్‌మెంట్ విభాగం 87 వేల కేజీల నెయ్యిని కొన్నది. నెయ్యికి ఆ వాసన తీసుకొచ్చేందుకు ఆవు నెయ్యి ఫ్లేవర్‌ను కొన్నారు. ఇప్పుడు అనిల్ కుమార్ సింఘాల్ దోషి అంటున్నారు. సిట్ ఏర్పాటు చేశాక జంతుకొవ్వు అంటూ విమర్శలు చేసిన మీరు ఆయన్ను రెండోసారి ఎందుకు ఈవోగా నియమించారు? చంద్రబాబు, పవన్ కళ్యాణ్ పదే పదే నెయ్యిపై దుష్ప్రచారం చేశారు. అందులో నిజం లేదని తేలిపోయింది. అయినా ప్రభుత్వం ప్రతిపక్షంపై ఎదురుదాడి చేస్తోంది.

దోషులెవరో సిట్ చెప్పినా మాకు అంటగట్టే యత్నం

చంద్రబాబు జంతుకొవ్వు, కలిపారని చెప్పిన నాలుగు ట్యాంకర్లలో నెయ్యిని శ్యామలరావు ఈవోగా, మీరు(చంద్రబాబు) సీఎంగా ఉండగానే లడ్డూల్లో వాడారని సీబీఐ తన నివేదికలో చెప్పింది. ఇప్పుడు చెప్పండి దొంగలెవరో? దోషులెవరో? మా హయాంలో నాణ్యత లేని 18 నెయ్యి ట్యాంకర్లను మేం వెనక్కి పంపిన సందర్భాలు ఉన్నాయి. మేం తప్పు చేయలేదు. అందుకే గట్టిగా నిలబడ్డాం.

టీటీడీ అర్చకులు, పోటు కార్మికులపై రెడ్ బుక్ రాజ్యాంగమా?

సాక్షి,అమరావతి: తిరుమల లడ్డూ ప్రసాదంపై విషప్రచారం కోసం చంద్రబాబు ప్రభుత్వం బరితెగిస్తోందని టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి మండిపడ్డారు. ఈమేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తిరుమల క్షేత్రంలోనూ రెడ్‌బుక్ బాధలు తప్పడం లేదని, టీటీడీ అర్చకులు, పోటులోని కార్మికులపైనా తెలుగుదేశం కూటమి సర్కారు రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని ప్రయోగిస్తోందని ధ్వజమెత్తారు. తాము చెప్పినట్టుగా గత ప్రభుత్వం, గత టీటీడీ పాలకమండలిపై విమర్శలు చేస్తూ ప్రకటనలు చేయాలని వేధింపులు, ఒత్తిళ్లు తెస్తున్నారని దుయ్యబట్టారు. గత టీటీడీ బోర్డు కాలంలో లడ్డూ ప్రసాదం తయారు చేసినప్పుడు దుర్వాసన వచ్చేదని, లడ్డూ కూడా వాసన వచ్చేదని చెప్పాలంటూ ఒత్తిడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము చెప్పినట్టు చేయకపోతే కష్టాలు తప్పవని హెచ్చరికలు జారీచేస్తున్నారని, దీంతో అర్చకులు, పోటు కార్మికులు కన్నీరుమున్నీరవుతున్నారని, తాము అలాంటి ప్రకటనలు చేసి పాపం మూట గట్టుకోలేమని లోలోన మదనపడుతున్నారని భూమన ఆందోళన వ్యక్తం చేశారు. చంద్రబాబు సర్కార్ దురాగతాలకు అంతు లేకుండా పోతోందని భూమన విమర్శించారు. ఇలాంటి పాపాలు చేసేవారిని ఎట్టి పరిస్థితుల్లోనూ భగవంతుడు క్షమించడని హెచ్చరించారు.

క్లుప్తంగా...

ఎల్‌వోఎక్స్ మీథేన్ ఇంజిన్ పరీక్ష విజయవంతం

ఎల్‌వోఎక్స్ మీథేల్ ఇంజిన్‌ను ప్రయోగాత్మకంగా పరీక్షిస్తున్న దృశ్యం

సూళ్లూరుపేట: నెక్స్ట్ జనరేషన్ లాంచింగ్ వెహికల్స్ (తదుపరి తరం ప్రయోగ వాహనాలు) కోసం ఇస్రో ఒక ఎల్‌వోఎక్స్ మీథేన్ ఇంజిన్‌ను అభివృద్ధి చేసింది. దీన్ని తమిళనాడులోని మహేంద్రగిరిలో ఉన్న ఇస్రో ప్రపల్షన్ సెంటర్‌లోని థ్రస్ట్ చాంబర్ ఫెసిలిటీలో ప్రయోగాత్మక పరీక్షను జనవరి 27న విజయవంతంగా నిర్వహించినట్టు మంగళవారం ఇస్రో వెబ్‌సైట్ ద్వారా తెలిపింది. సింగిల్ ఇంజెక్టర్‌తో థ్రస్ట్ చాంబర్‌స్థాయిలో హై థ్రస్ట్ ఎల్‌వోఎక్స్ మీథేన్ ఇంజిన్ మొదటి హాట్‌టెస్ట్‌ను విజయవంతంగా నిర్వహించారు. థ్రస్ట్ చాంబర్ లోపల జ్వలన, జ్వాల స్థిరత్వం సాధించింది. ఈ ఇంజిన్‌లో అన్ని వ్యవస్థలు బాగా పనిచేశాయి.

పారిశుద్ధ్య కార్మికురాలికి రజనీకాంత్ అభినందనలు

నిజాయితీని మెచ్చి బంగారు గొలుసు ఇచ్చిన సూపర్‌స్టార్

తమిళ సినిమా: పారిశుద్ధ్య కార్మికురాలికి ప్రముఖ నటుడు, సూపర్ స్టార్ రజనీకాంత్ నుంచి అరుదైన అభినందనలు లభించాయి. గత నెల 11న చెన్నై టి.నగర్ ప్రాంతాల్లో పద్మ అనే పారిశుద్ధ్య కార్మికురాలు విధులు నిర్వహిస్తుండగా ఓ సంచి కనిపించింది. అందులో 15 సవర్ల బంగారు నగలున్నాయి. వెంటనే ఆ సంచిని పద్మ టి.నగర్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించింది. ఆ నగలు స్థానిక నంగనల్లూర్‌కు చెందిన పరమేశ్ అనే వ్యక్తివి అని విచారణలో తేలడంతో వాటిని అతడికి పోలీసులు అందజేశారు. ఈ విషయం తమిళనాడు సీఎం స్టాలిన్ దృష్టికి రావడంతో ఆయన పద్మ నిజాయితీని అభినందించి రూ.లక్ష చెక్కును బహుమతిగా అందించారు. బ్యాంక్‌లో ఆమె పేరుతో రూ.15 లక్షల ప్రమాద బీమా చేయించారు. తాజాగా పద్మను రజనీకాంత్ ఇంటికి పిలిపించి బంగారు గొలుసు ఇచ్చి అభినందించారు.

ఏపీలో రాష్ట్రపతి పాలన విధించండి

పార్లమెంట్ మకర ద్వారం వద్ద వైఎస్సార్‌సీపీ ఎంపీల నిరసన

సాక్షి, న్యూఢిల్లీ: సీఎం చంద్రబాబు డైరెక్షన్‌లోనే వైఎస్సార్ సీపీ నేతలపై టీడీపీ గూండాలు, కార్యకర్తలు, నాయకులు దాడులకు తెగబడుతున్నారని వైఎస్సార్‌సీపీ ఎంపీలు మండిపడ్డారు. పట్టపగలు కత్తులు, రాడ్లు పట్టుకుని వెళ్లి మరీ దాడులు చేసినా పోలీసులు ఏమాత్రం పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారన్నారు. కాపు నాయకుడు మాజీ మంత్రి అంబటి రాంబాబు, మరో మాజీ మంత్రి, బీసీ నేత జోగి రమేష్, వైఎస్సార్‌సీపీ నేతలపై కొంతకాలంగా చంద్రబాబు డైరెక్షన్‌లో టీడీపీ గూండాలు చేస్తున్న భౌతిక దాడులపై వైఎస్సార్‌సీపీ ఎంపీలు ఢిల్లీలో పార్లమెంట్ సాక్షిగా కదం తొక్కారు. మంగళవారం పార్లమెంట్‌లోని మకర ద్వారం వద్ద ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత, ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, లోక్‌సభా పక్షనేత, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎంపీలు వైఎస్ అవినాష్‌రెడ్డి, మేడ రఘునాథరెడ్డి, పిల్లి సుభాష్‌చంద్రబోస్, గొల్ల బాబూరావు, మద్దిల గురుమూర్తి, గుమ్మా తనూజారాణి చంద్రబాబు అండ్ కో చేస్తున్న ఆగడాలను ప్రశ్నిస్తూ నినాదాలు చేశారు. బుధవారం జాతీయ మానవ హక్కుల సంఘాన్ని కలవనున్నట్టు చెప్పారు. త్వరలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను కలిసి ఫిర్యాదు చేస్తామని వెల్లడించారు. చంద్రబాబు సీఎంగా అధికారం చేపట్టిన నాటినుంచీ వైఎస్సార్‌సీపీ నేతలే లక్ష్యంగా దాడులు చేస్తున్నారని ఎంపీ వైవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా, డైవర్షన్ రాజకీయాలకు తెరలేపుతున్నారని మండిపడ్డారు. మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేష్‌పై అత్యంత భయంకరంగా చంద్రబాబు మనుషులు దాడులు చేశారని ఆరోపించారు. ఇది ప్రజాస్వామ్యానికి సిగ్గుచేటని, రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాల్సిందేనని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

పెట్రోల్ బాంబులతో దాడులా?

టీడీపీ గూండాలు మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇంటికి నిప్పు పెట్టడం, బీసీ నేత జోగి రమేష్ ఇంటిపై పెట్రోల్ బాంబులతో దాడులు చేయడం అత్యంత దారుణమైన ఘటనలు అని ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఇళ్లు తగలబెట్టే సంస్కృతికి సీఎం చంద్రబాబు శ్రీకారం చుడుతున్నారని ఆరోపించారు. బాధ్యులపైనే కేసులు పెట్టాల్సిన ప్రభుత్వం బాధితులపై కేసులు పెడుతూ జైలుకు పంపడం చూస్తుంటే రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని అర్థం అవుతోందన్నారు. చంద్రబాబు ఇష్టానుసారంగా దాడులు చేయిస్తూ రాష్ట్రంలో జంగిల్ రాజ్యం నడుపుతున్నారని ఎద్దేవా చేశారు.

అధికార మదంతో రెచ్చిపోతున్నారు

రాష్ట్రంలో చంద్రబాబు, టీడీపీ గూండాలు అధికార మదంతో రెచ్చిపోతున్నారని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టపగలు నడిరోడ్డుపై దాడులు చేస్తుంటే పోలీసులు గాడిదలు కాస్తున్నారా అని ప్రశ్నించారు. మాజీ మంత్రులను, మాజీ ఎమ్మెల్యేలను, వైఎస్సార్‌సీపీ నాయకులను చంద్రబాబు అక్రమ అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. జంగిల్ రాజ్యాధిపతి చంద్రబాబు అరాచకాలు, ఆ పార్టీ నేతల గూండాగిరిని తాము నిత్యం ప్రశ్నిస్తూనే ఉంటామని హెచ్చరించారు.

ఎమ్మెల్యేలను రెచ్చగొడుతున్న పవన్

వైఎస్సార్‌సీపీ నేతలపై మాట్లాడండి అంటూ కూటమి ఎమ్మెల్యేలను డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ రెచ్చగొడుతున్నారని ఎంపీ మేడ రఘునాథరెడ్డి అన్నారు. అధికారంలోకి వస్తే చట్టబద్ధంగా వ్యవహరిస్తామని చెప్పిన చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ఇప్పుడు చట్టవిరుద్ధమైన పనులు ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. కేబినెట్ సమావేశంలోనే మంత్రులను రెచ్చగొడుతూ, వైఎస్సార్‌సీపీని టార్గెట్ చేస్తూ వ్యాఖ్యలు చేయాలని చంద్రబాబు మాట్లాడటం సిగ్గుచేటన్నారు.

చంద్రబాబువి డైవర్షన్ పాలి'ట్రిక్స్'

మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆగ్రహం

సాక్షి, విశాఖపట్నం: తిరుమల లడ్డూ నెయ్యిపై చంద్రబాబు చేసిన ఆరోపణలన్నీ అవాస్తవాలని విచారణలో తేలడం, విశాఖలో గీతం వర్సిటీకి రూ.5 వేల కోట్ల భూ దోపిడీ చేయడంపై నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే వైఎస్సార్‌సీపీ నాయకులపై టీడీపీ నేతలు హత్యాయత్నాలు, దాడులు చేస్తున్నారని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మండిపడ్డారు. మంగళవారం విశాఖపట్నంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. తిరుమల లడ్డూ నెయ్యిలో జంతు కొవ్వు కలిసిందంటూ చంద్రబాబు చేసిన ఆరోపణలు అసత్యమని సీబీఐ సిట్ నివేదికలో బయటపడడంతో టీడీపీ నాయకులు ఉలిక్కిపడ్డారని చెప్పారు. దీంతో ఫ్లెక్సీలు, హోర్డింగులతో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీవేంకటేశ్వరస్వామి ప్రసాదంపై తప్పుడు ఆరోపణలు చేసిన కూటమి పార్టీల నేతలు.. కోట్లాది మంది హిందువులకు జవాబు చెప్పలేక మత విద్వేషాలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. పథకం ప్రకారమే మాజీ మంత్రి అంబటి రాంబాబుపై రాళ్లు, కర్రలు, రాడ్లతో టీడీపీ గూండాలు దాడి చేశారన్నారు. ఆయన నివాసం వద్దకు వెళ్లి విధ్వంసం సృష్టించారని మండిపడ్డారు. ఈ దాడి జరిగి 24 గంటలు కూడా గడవకముందే మాజీ మంత్రి జోగి రమేష్ ఇంటిపై పెట్రోలు బాంబులతో దాడి చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న ఆటవిక పాలనకు ఇదే నిదర్శనమన్నారు. అసభ్యపదజాలం గురించి చంద్రబాబు, లోకేశ్, పవన్ కళ్యాణ్, హోం మంత్రి అనిత, స్పీకర్ అయ్యన్నపాత్రుడుతో సహా కూటమి నేతలు నీతులు చెప్పడం హాస్యాస్పదమన్నారు. ఓ కేంద్ర మంత్రి 24 గంటల్లో సినిమా చూపిస్తామని అంబటి రాంబాబుకు వార్నింగ్ ఇవ్వగా.. మంత్రి లోకేశ్ దాడిని లైవ్‌లో చూసి ఎంజాయ్ చేశారన్నారు. తనపై దాడి చేసి, తన కుటుంబాన్ని దారుణంగా బూతులు తిట్టిన వారిపై అంబటి రాంబాబు ప్రతిస్పందిస్తే... దాన్ని చంద్రబాబుకు ఆపాదించి దాడులకు పాల్పడ్డారని మండిపడ్డారు. దీన్ని కచ్చితంగా కాపు నాయకుల మీద దాడిగా పరిగణిస్తామని చెప్పారు.

క్షమాపణలు చెప్పమన్నందుకే దాడులు

మాజీ మంత్రి విడదల రజిని

సాక్షి,అమరావతి: తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వు కలిసిందని ఆధారాలు లేకుండా తప్పుడు ప్రచారం చేసిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసినందుకే మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేష్‌తో పాటు తనపై టీడీపీ కూటమి నాయకులు దాడులతో తెగబడ్డారని మాజీ మంత్రి విడదల రజిని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడారు. సీబీఐ–సిట్ చార్జిషీట్‌తో తిరుమల లడ్డూకి వాడిన నెయ్యిలో జంతువుల కొవ్వు కలవలేదని తేలిపోయిందన్నారు. విషప్రచారం చేసిన చంద్రబాబు క్షమాపణలు చెప్పాల్సిందేనని ఆమె డిమాండ్ చేశారు. ఆధారాలు లేకుండా శ్రీవారి లడ్డూపై వారు చేసిన తప్పుడు ప్రచారం టీడీపీ ప్రభుత్వానికి ఉరితాడులా బిగుసుకుందని, దాన్నుంచి బయటకు రాలేక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని చెప్పారు. అయితే, చేసిన తప్పునకు క్షమాపణలు చెప్పాల్సిందిపోయి ఇంకా దిగజారిపోయారని ఆమె మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ నాయకులపై చంద్రబాబు దాడులు చేయిస్తున్నాడని ఆరోపించారు. ఆయన చెప్పినట్టు రూల్ ఆఫ్ లా అమలు జరిగితే టీడీపీ ఎమ్మెల్యే గల్లా మాధవి, కేంద్ర మంత్రి పెమ్మసాని ఈ పాటికే జైల్లో ఉండేవారన్నారు. దాడులు చేసిన వారిని వదిలేసి బాధితులమైన తమపై కేసులు పెట్టి జైళ్లకు పంపుతూ రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని దుయ్యబట్టారు. సీఎం స్థానంలో ఉన్న చంద్రబాబు శాంతిభద్రతలను కాపాడాల్సిందిపోయి తానే విధ్వంసాలకు పథక రచన చేస్తూ రాష్ట్రంలో అశాంతికి కారణమవుతున్నారని ధ్వజమెత్తారు. 'రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో 20 నెలలుగా రాష్ట్రాన్ని నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఇండియన్ పీనల్ కోడ్‌ని లోకేశ్ పీనల్ కోడ్‌గా మార్చేశారు. పాలనలో పూర్తిగా విఫలమైన చంద్రబాబుకి అప్పులు తప్ప అభివృద్ధి చేయడం చేతకావడం లేదు. ప్రభుత్వ వైఫల్యాలపై ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ ప్రశ్నిస్తుంటే ఓర్చుకోలేకపోతున్నారు. చంద్రబాబుకి చేతనైతే మాజీ సీఎం వైఎస్ జగన్ కన్నా మంచి పాలన అందించి, ప్రజల మన్ననలు పొందాలి. కానీ ఇలాంటి దాడులతో వైఎస్సార్‌సీపీని అడ్డుకోవాలని చూడటం అవివేకం' అని విడదల రజిని స్పష్టం చేశారు.

రెడ్ బుక్ రాజ్యాంగంపై దద్దరిల్లిన రాజ్యసభ

టీడీపీ కూటమి పాలనపై మండిపడ్డ ఎంపీ గొల్ల బాబూరావు

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న రెడ్ బుక్ రాజ్యాంగంపై వైఎస్సార్‌సీపీ ఎంపీ గొల్ల బాబూరావు రాజ్యసభ వేదికగా నిప్పులు చెరిగారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ.. బీజేపీ, టీడీపీ, జనసేన ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, రాజకీయ కక్షసాధింపు చర్యలు పెచ్చుమీరాయని ఆరోపించారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు వంటి వారి ఇళ్లను తగులబెడుతున్నారని, రాష్ట్రంలో 'రెడ్ బుక్ రాజ్యాంగం' అమలవుతోందని సభ దృష్టికి తెచ్చారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా దిగజారిందని, రాజ్యాంగం స్థానంలో రెడ్ బుక్ రాజ్యాంగం రాజ్యమేలుతోందని ధ్వజమెత్తారు. వెంటనే హోంమంత్రి, ప్రధాని జోక్యం చేసుకుని రాష్ట్రాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

పోలవరం నిధులు 'పీనట్స్'

కేంద్ర బడ్జెట్‌లో పోలవరం ప్రాజెక్టుకు కేటాయించిన రూ.3,320 కోట్లు ఏమాత్రం సరిపోవని, ఇది 'పీనట్స్' (వేరుశనగ గింజల) కంటే తక్కువని ఎంపీ బాబూరావు ఎద్దేవా చేశారు. పోలవరం ఎత్తును 45 నుంచి 41 మీటర్లకు తగ్గించే కుట్ర జరుగుతోందని, అదే జరిగితే రాష్ట్రం కలల ప్రాజెక్టు నిరుపయోగంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించకుండా కేంద్రం తాత్సారం చేస్తోందని మండిపడ్డారు. కానీ, అనకాపల్లిలోని ఒక ప్రైవేట్ స్టీల్ ఫ్యాక్టరీకి మాత్రం రాష్ట్ర ప్రభుత్వం గనులు కేటాయించడం దారుణమని, ఇది ప్రజలకు చేస్తున్న అన్యాయమని అన్నారు. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు వైద్యం చేరువ చేసేందుకు 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను మంజూరు చేస్తే.. టీడీపీ కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేట్‌పరం చేస్తోందని విమర్శించారు. పీపీపీ అంటే పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ కాదని, అది వ్యక్తిగత లబ్ధి చేకూర్చే 'పర్సనల్' పార్ట్‌నర్‌షిప్ అని చురకలు అంటించారు. దాదాపు కోటి మంది ప్రజలు దీనికి వ్యతిరేకంగా సంతకాలు చేశారని ఆయన సభలో ప్రస్తావించారు.

ఏపీ ఇన్ పార్లమెంట్

రాజ్యసభ

ఏపీలో అరాచకం.. శాంతిభద్రతలు గాలికి!

- రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ నిరంజన్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, రాష్ట్రంలో నెలకొన్న అరాచక పరిస్థితులపై కేంద్రం తక్షణం దృష్టి సారించాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ నిరంజన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దేశాభివృద్ధికి సుస్థిరత ఎంత అవసరమో, రాష్ట్రాల స్థాయిలో శాంతిభద్రతల పరిరక్షణ కూడా అంతే కీలకమని చెప్పారు. 'రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా గాడి తప్పాయి. రాజకీయ కక్ష సాధింపు చర్యలతో రాష్ట్రంలో అశాంతిని సృష్టిస్తున్నారు. ఇది కేవలం శాంతిభద్రతల సమస్యగానే కాకుండా రాష్ట్ర ఆర్థిక సుస్థిరతను, అభివృద్ధిని దెబ్బతీసేలా ఉంది' అని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం వల్ల ఏర్పడిన ఈ గందరగోళ పరిస్థితులను చక్కదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని, ఏపీని మళ్లీ అభివృద్ధి పథంలో నడిపించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

న్యాయవ్యవస్థలో సంస్కరణలు అత్యవసరం

దేశంలో న్యాయ సంస్కరణల ఆవశ్యకతను కూడా నిరంజన్‌రెడ్డి ప్రస్తావించారు. న్యాయవ్యవస్థలో జాప్యం వల్ల వ్యాపార లావాదేవీల్లో అనిశ్చితి నెలకొంటోందని, ఇది విదేశీ పెట్టుబడులకు, దేశీయ వ్యాపారాలకు ఆటంకంగా మారుతోందన్నారు. అనవసర వ్యాజ్యాలతో కోర్టు సమయాన్ని వృథాచేసే వారికి భారీ జరిమానాలు విధించేలా 'కంపల్సరీ కాస్ట్స్' విధానాన్ని తీసుకురావాలన్నారు.

లోక్‌సభ

అమరావతి భూ సమస్యలపై సమీక్షించలేదు

సాక్షి, న్యూఢిల్లీ: అమరావతి ప్రాంతంలో భూసమీకరణ పూర్తిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని అంశమని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. భూసేకరణ ప్రక్రియ ఫలితాలు/రైతుల ఫిర్యాదులపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి ప్రత్యేక సమీక్ష కానీ.. ప్రభావ అంచనా కానీ చేయలేదని పార్లమెంట్ వేదికగా తెలిపింది. అమరావతి ప్రాంతంలో భూసమీకరణ, దాని ప్రభావంపై కేంద్రం ఏమైనా ప్రత్యేక సమీక్షలు నిర్వహించిందా అని వైఎస్సార్‌సీపీ లోక్‌సభా పక్షనేత, ఎంపీ మిథున్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ మౌఖిక సమాధానమిచ్చారు. పట్టణ ప్రణాళిక అనేది రాజ్యాంగంలోని 12వ షెడ్యూల్ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలు, పట్టణ స్థానిక సంస్థల పరిధిలోని అంశమన్నారు. అయితే, రైతుల హక్కుల పరిరక్షణ, భూసేకరణ, పునరావాస చట్టం–2013 బలమైన రక్షణ కల్పిస్తుందని తెలిపారు. ఈ చట్టం ద్వారా సామాజిక ప్రభావ అంచనా, బాధితుల సమ్మతి, మార్కెట్ విలువ ఆధారంగా పెంచిన పరిహారం, పునరావాస, పునర్‌నిర్మాణ చర్యలు తప్పనిసరిగా అమలు చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

ఎంజీఎన్ఆర్‌జీ కంటే తక్కువ ఉండొద్దు

వీబీ–జీ రామ్‌జీ చట్టం 2025లోని సెక్షన్ 10 ప్రకారం ఈ పథకానికి సంబంధించిన వేతన రేట్లను కేంద్ర ప్రభుత్వం అధికారిక నోటిఫికేషన్ ద్వారా ప్రకటించే అధికారం కలిగి ఉందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కమలేష్ పాశ్వాన్ తెలిపారు. ఎంపీ మద్దిల గురుమూర్తి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వకంగా సమాధానమిస్తూ.. ఈ విధంగా ప్రకటించే వేతనాలు సంబంధిత రాష్ట్రాలు, జిల్లాల్లో అమలులో ఉన్న ఎంజీఎన్ఆర్‌జీ పథకంలో ఇస్తున్న వేతనాల కంటే తక్కువగా ఉండకూడదని చట్టంలోనే స్పష్టంగా పేర్కొన్నట్టు తెలిపారు.

డ్రగ్స్‌పై చర్చకు అవకాశమివ్వండి

లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాను కోరిన వైఎస్సార్‌సీపీ ఎంపీలు



సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో డ్రగ్స్ అధికంగా పట్టుబడుతున్నాయని వైఎస్సార్‌సీపీ లోక్‌సభ పక్షనేత, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా దృష్టికి తెచ్చారు. ఈ అంశంపై తాము సభలో మాట్లాడేందుకు ఎక్కువ సమయం కేటాయించాలని కోరారు. తమ ప్రశ్నలకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా సభావేదికగా సమాధానం చెప్పాలని కోరారు. మంగళవారం లోక్‌సభ స్పీకర్‌తో ఎంపీలు మిథున్‌రెడ్డి, మద్దిల గురుమూర్తి, గుమ్మా తనూజారాణి భేటీ అయ్యారు. సభ సజావుగా, చక్కగా సాగేందుకు సలహా ఇవ్వాలంటూ ఎంపీలను ఓంబిర్లా కోరారు. ఈ సందర్భంగా ఎంపీ మిథున్‌రెడ్డి డ్రగ్స్ అంశాన్ని స్పీకర్ ఎదుట ప్రస్తావించారు. సముద్ర తీర ప్రాంతాల మీదుగా పెద్దఎత్తున డ్రగ్స్ సరఫరా అవుతూ పట్టుబడుతున్న విషయాన్ని గుర్తు చేశారు. చాలా ప్రాంతాల్లో డ్రగ్స్ తీసుకుని యువత పెడదోవ పడుతున్నారని చెప్పారు. అసలు ఈ డ్రగ్స్ మన దేశంలోకి ఎలా వస్తున్నాయి, వచ్చిన ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలకు రవాణా ఎలా జరుగుతోంది, వీటి వెనుక ఉన్న వారెవరు అనే విషయాలపై కేంద్రం సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని వివరించారు. ఈ అంశంపై మాట్లాడేందుకు వైఎస్సార్‌సీపీకి 'కాలింగ్ ఇన్ అటెన్షన్' ఇవ్వాలని స్పీకర్‌ను కోరారు. ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ.. అన్ని అంశాలపై అన్ని పార్టీల ఎంపీలకు మాట్లాడేందుకు అవకాశాలు కల్పించాలని అడిగారు. గుమ్మా తనూజారాణి మాట్లాడుతూ.. కమిటీల పనితీరు మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అంశాలపై స్పీకర్ ఓంబిర్లా సానుకూలంగా స్పందించారని, త్వరలో డ్రగ్స్‌పై సభలో మాట్లాడతామని మిథున్‌రెడ్డి చెప్పారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP).,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801.
Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

క్లుప్తంగా...

బీసీ హాస్టళ్ల మరమ్మతులకు నిధులు విడుదల

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో బీసీ హాస్టళ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేశామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత వెల్లడించారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసినట్లు తెలిపారు. మంగళవారం ఆమె సచివాలయంలోని తన చాంబర్‌లో బీసీ సంక్షేమ శాఖాధికారులతో సమీక్ష నిర్వహించారు. మరికొద్ది రోజుల్లో 2026–27 బడ్జెట్‌ను కూటమి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న నేపథ్యంలో ఈ సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన, చేపట్టబోతున్న పథకాలు, హాస్టళ్లు, గురుకులాల అభివృద్ధికి నిధులు రాబట్టడంపై చర్చించారు. సమావేశంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి సత్యనారాయణ, డైరెక్టర్ మల్లికార్జున, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అమెరికా టారిఫ్ తగ్గింపు ఆక్వా రంగానికి శుభవార్త

- మంత్రి అచ్చెన్నాయుడు

సాక్షి, అమరావతి: అమెరికా ప్రభుత్వం భారతీయ సముద్ర ఆహార ఎగుమతులపై విధించిన టారిఫ్‌ను 25 శాతం నుంచి 18 శాతానికి తగ్గించడాన్ని స్వాగతిస్తున్నామని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. భారత్, అమెరికా వాణిజ్య ఒప్పందంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకోవడం వల్ల రాష్ట్రంలోని సముద్ర ఆహార ఎగుమతిదారులకు, ముఖ్యంగా ఆక్వా రంగానికి గణనీయమైన ఉపశమనం లభిస్తుందన్నారు. ఇది రాష్ట్రంలోని ఆక్వారంగానికి కూడా శుభవార్త అన్నారు.

మంత్రి జనార్దన్‌రెడ్డితో తైవాన్ కంపెనీ ప్రతినిధుల భేటీ

సాక్షి, అమరావతి: రాష్ట్ర రహదారులు– భవనాలు, పెట్టుబడులు మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని తైవాన్‌కు చెందిన లక్స్ షేర్ కంపెనీ ప్రతినిధులు మంగళవారం సచివాలయంలో భేటీ అయ్యారు. రాష్ట్రంలో ఫైబర్‌నెట్ రంగంలో సరికొత్త టెక్నాలజీ వినియోగం, కొత్త ఉత్పత్తుల గురించి మంత్రికి లక్స్ షేర్ కంపెనీ ప్రతినిధులు వివరించారు. ట్రిపుల్ ప్లే విత్ వైఫై, ఓటీటీ వంటి సేవల గురించి తెలిపారు. ఈ పెట్టుబడుల ద్వారా స్థానికంగా దాదాపు 10వేల మందికి పైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని పేర్కొన్నారు.

'చలో ఢిల్లీ.. మార్చ్ టు పార్లమెంట్' రేపు

సాక్షి, అమరావతి: అఖిల భారత ఉపాధ్యాయ జాయింట్ యాక్షన్ కమిటీ(ఆప్టా) ఆధ్వర్యంలో గురువారం తలపెట్టిన 'చలోఢిల్లీ – మార్చ్ టు పార్లమెంట్'కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని ఆప్టా రాష్ట్ర అధ్యక్షుడు కె.ప్రకాష్ రావు, ప్రధానకార్యదర్శి ఎంజీ మెహది, అఖిల భారత ప్రాథమిక ఉపాధ్యాయ సమాఖ్య జాతీయ కార్యనిర్వహక కార్యదర్శి ఏజీఎస్ గణపతిరావు పిలుపునిచ్చారు. ఏపీ నుంచి ఎక్కువ మంది ఉపాధ్యాయులు నిరసనలో పాల్గొనాలని కోరారు. సర్వీస్‌లో ఉన్న టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని, పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలనే డిమాండ్లతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు.

డిమాండ్‌కు తగ్గట్టుగా ఆర్టీసీ బస్సులు నడపాలి

సాక్షి, అమరావతి: ఆర్టీసీలో ఆక్యుపెన్సీ 98 శాతం ఉన్నా తగినన్ని బస్సులు నడపకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం రాష్ట్ర కమిటీ పేర్కొంది.రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ బస్సులు నడపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథం అధ్యక్షతన విజయవాడలో రెండు రోజులుగా జరుగుతున్న పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశంలో పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, యు.వాసుకీ, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పలు అంశాలపై చర్చించారు. బస్సుల కొరత వల్ల విద్యార్థులు సకాలంలో స్కూళ్లు, కాలేజీలకు చేరుకోలేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంది.

ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకాలు విడుదల చేయాలి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు రావాల్సిన పెండింగ్ ప్రోత్సాహకాలను విడుదల చేయాలని, బ్యాంకుల జప్తు చర్యల నుంచి రక్షణ కల్పించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందించారు. ఏపీలోని ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం నుంచి సకాలంలో ప్రోత్సాహకాలు అందకపోవడంతో వారు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్నారని తెలిపారు.

మిగిలిన నర్సింగ్ సీట్ల భర్తీకి అనుమతి

సాక్షి, అమరావతి: బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశాల్లో భాగంగా అన్ని రౌండ్ల కౌన్సెలింగ్ అనంతరం మిగిలిపోయిన సీట్లను ఇంటర్మీడియట్ మార్కుల ఆధారంగా భర్తీ చేయడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు మంగళవారం వైద్య శాఖ కార్యదర్శి సౌరభ్‌గౌర్ ఉత్తర్వులు ఇచ్చారు. 2025–26 విద్యా సంవత్సరానికి మాత్రమే ఈ ఉత్తర్వులు వర్తిస్తాయని పేర్కొన్నారు.

తాచుపాముల తావుల్లో విషపు కాటుకు గురై.. పువ్వంటి బాల్యం బుగ్గిపాలవుతోంది. ఆకులు రాలి, మోడువారిన చెట్టులా వెక్కివెక్కి ఏడుస్తోంది. పరమాన్నం పెట్టేవాడు పరమాత్మ కాదని, ఆటబొమ్మలిచ్చే వాడు ఆదుకొనేవాడు కాదని గుర్తించలేక.. పసిప్రాయం కామాంధుల దాహానికి కర్కశంగా బలవుతోంది. మృగాళ్ల కాటుకు బలై.. తల్లై.. ప్రసవ వేదనతో చిక్కిశల్యమై.. కన్నవారికి బరువై తల్లడిల్లిపోతోంది.

పసి మొగ్గలపై విషపు కాటు



చిన్నారులపై వరుస అఘాయిత్యాలు

- లేత వయసులోనే గర్భం దాల్చుతున్న దుస్థితి
- అధికారికంగా 13 మంది
- అనధికారికంగా మరింత మంది!
- చేష్టలుడిగి చూస్తున్న యంత్రాంగం

కాకినాడ క్రైం: ఆడపిల్ల పుడితే సాక్షాత్తూ ఆ శ్రీమహాలక్ష్మే తమ కడుపున పుట్టిందని తల్లిదండ్రులు మురిసిపోతారు. రెక్కలు విచ్చుకున్న సీతాకోకచిలుకలా.. ఘల్లుమనే గజ్జెల సవ్వడితో నట్టింట్లో నడయాడుతూంటే ఆనందపరవశులవుతారు.. అటువంటి పసి మొగ్గలు.. లోకం పోకడలు తెలియని ప్రాయంలోనే కామాంధుల చేతుల్లో బలైపోతున్నారు. రేపటి తరాన్ని అందించాల్సిన బాలికలపై.. అక్క, చెల్లి, కూతురు, మనవరాలు.. ఇలా అన్ని వావివరుసలనూ మరచిన మృగాళ్లు.. ముక్కుపచ్చలారని వయస్సులోనే అఘాయిత్యాలకు ఒడిగడుతున్నారు. ఆ బాధిత బాలికలు పసి ప్రాయంలోనే గర్భవతులై జీవచ్ఛవాలుగా మిగిలిపోతున్నారు. అధికారిక లెక్కల ప్రకారం ఏడాది వ్యవధిలో జిల్లావ్యాప్తంగా 13 మంది బాలికలు మృగాళ్ల అఘాయిత్యాలకు గురై, గర్భం దాల్చారు. అనధికారికంగా ఈ సంఖ్య మరింత ఉంటుందన్నది అంచనా. గర్భం దాల్చిన వారు కాకుండా.. లైంగిక దాడులకు గురైన వారు మరెంతో మంది ఉంటున్నారు.

విలువలు లుప్తం.. లోపిస్తున్న భయం

- సమాజంలో నానాటికీ విలువలు లుప్తమవడం ఈ అకృత్యాలకు జరగడానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. దీంతోపాటు అవగాహన లోపం, బలప్రయోగాలకు గురవడం, సరైన పెంపకం లేకపోవడం వంటివి కూడా కారణాలవుతున్నాయి.
- బాలికలపై అత్యాచారం చేసి, హత్య కూడా చేసిన సంఘటనలు దేశంలో, రాష్ట్రంలో ఎన్నో జరిగాయి. అయినప్పటికీ నిందితులపై కఠిన చర్యలు చేపట్టడం లేదు. చట్ట ప్రకారం చర్యలున్నా, అవి తీవ్ర స్థాయిలో లేకపోవడంతో ఘాతుకానికి పాల్పడుతున్న వారికి భయం లేకుండా పోతోంది. ఎలాగైనా తప్పించుకోవచ్చనే భావనను కలిగిస్తోంది. కేసులు ఆలస్యంగా నమోదవడం, సాక్ష్యాలు లభించకపోవడం, రాజీ యత్నాలు, బాధిత బాలలు ఫిర్యాదు చేయలేకపోవడం మృగాళ్లకు కలిసొస్తున్నాయి. ఫలితంగా బాధితులకు తక్షణ న్యాయం లభించడం లేదు. దీంతో, చిన్నారులపై లైంగిక దాడులు నిత్యకృత్యమైపోతున్నాయి.
- కొన్ని సందర్భాల్లో పిల్లలకు తల్లి లేదా తండ్రి లేదా ఇద్దరూ ఉండని దుస్థితి. కొంత మంది పిల్లలను బంధువుల ఇళ్లల్లో ఉంచి, జీవనోపాధికి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతున్నారు. అలా తల్లిదండ్రులు లేని లోటుతో జీవితాన్ని గడుపుతున్న పిల్లలకు కామాంధులు రకరకాల ఆకర్షణలు ఎరగా వేస్తున్నారు. అలాగే, బాల కార్మికులు, బిచ్చగాళ్లుగా జీవిస్తున్న చిన్నారులు లైంగిక దోపిడీకి గురవుతున్నారు.
- అసురక్షిత పరిస్థితుల్లో లైంగిక దాడులు జరుగుతూండటంతో పలువురు బాలికలు గర్భవతులవుతున్న దుస్థితి నెలకొంది.

'సమ్మతి' అనే ప్రశ్నే లేదు

ఇలాంటి దురాగతాల్లో బాధిత బాలికను పెళ్లి చేసుకుంటామని ఎర వేయడం పరిపాటిగా మారింది. నిరుపేద, వెనుకబడ్డ, తల్లిదండ్రులు లేక సంరక్షకుల వద్ద బతుకీడుస్తున్న అనాథ బాలల వర్గాల్లో ఇది పరిపాటిగా మారింది. వివాహం చేసుకుంటే కేసు రద్దవదు. కేసుతో పాటు నేరం చేసినందు వల్ల చైల్డ్ మ్యారేజ్ యాక్ట్ పరిధిలో చట్ట పరమైన చర్యలు తప్పవు. ఇది కాక, పోక్సో చట్టం వర్తిస్తుంది. 10 ఏళ్ల నుంచి 20 ఏళ్ల వరకూ జైలు శిక్ష విధించే అవకాశం ఉంది. నేర తీవ్రతను బట్టి జీవిత ఖైదు కూడా విధించవచ్చు. నేరంలో క్రూరత్వం స్పష్టమైతే మరణ దండనకూ ఆస్కారం ఉంటుంది. మైనర్లపై లైంగిక దోపిడీలో 'సమ్మతి' అనే ప్రశ్నే లేదు.

– ఎండీ జవహర్ ఆలీ, ప్రముఖ న్యాయవాది, కాకినాడ

పెడోఫిలిక్ డిజార్డర్‌తో..

పెడోఫిలిక్ డిజార్డర్ అనే మానసిక సమస్య వల్ల కూడా పసి వాళ్లపై లైంగిక వాంఛలకు లోనవుతూంటారు. వారితో తమ కోరిక తీర్చుకోవడానికి ఎంతటి దారుణానికైనా ఒడిగడతారు. అలాగని ఘాతుకానికి పాల్పడిన ప్రతి వాడూ పెడోఫైల్ కాదు, ప్రతి పెడోఫైల్ నేరం చేస్తాడనీ లేదు. ఈ సమస్య వల్ల నేరం చేశానని తప్పించుకునే అవకాశం లేదు. వ్యక్తి సమస్యతో బాధపడుతున్నాడా లేదా అన్నది గుర్తించడం వైద్యపరంగా సులభమే. చిన్న పిల్లలపై చెడు ఆలోచనలు కలిగితే తక్షణమే మానసిక వైద్య నిపుణుడిని సంప్రదించాలి. సైకియాట్రిక్ కౌన్సెలింగ్, బిహేవియర్ థెరపీ, ఇంపల్స్ కంట్రోల్ మెడిసిన్ ద్వారా సమస్యను నియంత్రించవచ్చు.

– డాక్టర్ వానపల్లి వరప్రసాద్, మానసిక వ్యాధుల నిపుణుడు, హెచ్ఓడీ (ఇన్‌చార్జి), రంగరాయ వైద్య కళాశాల, కాకినాడ

చైల్డ్ పోర్నోగ్రఫీ

అరచేతిలోకి ఇంటర్నెట్ అందుబాటులోకి రావడంతో చైల్డ్ పోర్నోగ్రఫీ వీక్షణం పరిపాటిగా మారింది. వీటిని వీక్షిస్తున్న వారిని సాంకేతికత ఆధారంగా గుర్తించి భరతం పట్టాల్సిన పోలీసు శాఖ ఈ విషయంలో విఫలమవుతోంది. అశ్లీల వీడియోలు చూస్తున్న ఎంతో మంది వికృత చేష్టలతో పసిమొగ్గలను చిదిమేస్తున్నారు.

చేతులెత్తేసిన సర్కారు

బాలికలపై దురాగతాల్ని నిలువరించలేక ప్రభుత్వం చేతులెత్తేసింది. బాధ్యత వహించాల్సిన పోలీస్, మాతా శిశు సంక్షేమ శాఖ అనుబంధ విభాగాలు, రూ.కోట్లు వెనకేసుకుంటున్న ఎన్జీవోలు పూర్తిగా విఫలమవుతున్నాయి. అవగాహన కార్యక్రమాల పేరుతో ఫొటోలకే పరిమితమవుతున్నారు. అక్కడక్కడ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నా అవి ఫలవంతంగా జరగడం లేదనే విమర్శలున్నాయి. పాఠశాల లేదా మరేదైనా ప్రాంతంలో ఒకసారి సదస్సు నిర్వహించి వదిలేస్తున్నారు. దీనివలన ప్రయోజనం ఎంతవరకూ ఒనగూడిందనే పరిశీలన ఉండటం లేదు. అలాగే, బాధిత బాలికలు చేరి, సాంత్వన పొందే విభాగంలో కనీసం వారి డేటా కూడా తగిన రీతిలో నిర్వహించడం లేదు.

- గత మే నెలలో కిర్లంపూడిలో 13 ఏళ్ల బాలికకు పక్కింటి వృద్ధుడు చాక్లెట్లు ఇచ్చి లైంగిక దాడికి ఒడిగట్టాడు. ఓ తాతయ్య చాక్లెట్లు ఇస్తున్నాడని ఆ బాలిక పాఠశాలలో తోటి స్నేహితులకు చెప్పడంతో.. ఆ పిల్లలు కూడా చాక్లెట్ల కోసం వెళ్లగా.. వారిపై కూడా ఆ దుర్మార్గుడు అఘాయిత్యానికి పాల్పడ్డాడు.
- ఇలా ఏడుగురు బాలికలపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఈ దారుణంతో ఓ బాలిక గర్భవతి కావడంతో అధికారుల అనుమతితో అబార్షన్ చేయించారు.
- గండేపల్లి మండలం సూరంపాలెంలో 13 ఏళ్ల బాలికపై ఓ లారీ డ్రైవర్ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. పెద్దమ్మ ఇంటికి వెళ్తే కన్ను వేసి, బెదిరించి పలుమార్లు దారుణానికి తెగబడ్డాడు, ఆ మృగాడి నిర్వాకంతో ఆ బాలికకు జగ్గంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవం జరిగి, ఆడ శిశువు జన్మించింది.
- కాకినాడ జగన్నాథపురంలో 14 ఏళ్ల బాలికపై పొరుగింట్లో ఉంటున్న 40 ఏళ్ల దుర్మార్గుడు లైంగిక దాడికి ఒడిగట్టాడు. గర్భవతి అయిన ఆ చిన్నారికి అబార్షన్ చేయించేందుకు ఇంటర్ చదువుతున్న ఓ యువకుడికి చెప్పాడు. అతడు కూడా ఆ బాలికను బెదిరించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. వీరిద్దరి ఘాతుకానికి బలైపోయిన ఆ బాలిక.. ఆడపిల్లకి జన్మనిచ్చింది.
- గత నవంబర్‌లో ఉప్పాడకు చెందిన 16 ఏళ్ల బాలికకు తినుబండారాలు కొనిచ్చి, తాతయ్య వరుస అయ్యే వ్యక్తి ఘాతుకానికి పాల్పడ్డాడు. గర్భం దాల్చిన ఆ బాలికకు కాకినాడ జీజీహెచ్‌లో అధికారుల ఆదేశాలతో అబార్షన్ చేశారు.
- కాకినాడ అచ్చంపేటకు చెందిన 17 ఏళ్ల బాలికను ఓ వివాహితుడు ప్రేమ పేరుతో మోసగించి, దుర్మార్గానికి ఒడిగట్టాడు. ఆ బాలిక గత నవంబర్ 29న బాబును ప్రసవించింది. ఆ శిశువును శిశుగృహకు అప్పగించారు.
- బాబాయి అత్యాచారం చేయడంతో తాళ్లరేవులో 16 ఏళ్ల బాలిక గత అక్టోబర్‌లో పాపను ప్రసవించింది.
- పిఠాపురానికి చెందిన 15 ఏళ్ల బాలికపై సొంత బంధువే అఘాయిత్యానికి ఒడిగట్టాడు. అధికారుల ఆదేశాలతో ఆమెకు అబార్షన్ చేశారు.
- కరప మండలం నడకుదురుకు చెందిన ఓ బాలికను తెలిసున్న వ్యక్తే నమ్మించి మోసం చేశాడు. కాకినాడ కోకిల సెంటర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఆ బాలిక మగ శిశువును ప్రసవించింది. ఆ శిశువును అధికారులకు అప్పగించారు.
- ఇవన్నీ కేవలం ఏడాది వ్యవధిలో జరిగిన దారుణాలు. మచ్చుకు కొన్నే అయినా, అభం శుభం తెలియని బాలికలపై అఘాయిత్యాలు ఏ రీతిలో జరుగుతున్నాయనే విషయాన్ని చెప్పకనే చెబుతున్నాయి.

హైడ్రోజన్ టెక్నాలజీస్ కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్

- ఎస్ఆర్ఎం యూనివర్సిటీతో ప్రభుత్వం ఎంఓయూ

ఎంఓయూ చేసుకుంటున్న ఎస్ఆర్ఎం ప్రతినిధులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో హైడ్రోజన్ టెక్నాలజీస్ అభివృద్ధి, పరిశోధనల కోసం జేకే శ్రీవాస్తవ హైన్‌ఫ్రాపీఎస్ఏ లిమిటెడ్‌తో ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం ఎంఓయూ చేసుకున్నట్లు ఎస్ఆర్ఎం గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (రీసెర్చ్) ప్రొఫెసర్ డి.నారాయణరావు తెలిపారు. మంగళవారం విజయవాడలోని ఒక హోటల్‌లో ఈ ఒప్పందం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హైడ్రోజన్ ప్రాముఖ్యత, భవిష్యత్తు అవసరాలను గుర్తించి భారత ప్రభుత్వం 'నేషనల్ హైడ్రోజన్ మిషన్' ప్రోగ్రాం ప్రారంభించిందన్నారు. అందుకు అనుగుణంగా 'గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ' ఏర్పాటులో ఎస్ఆర్ఎం యూనివర్సిటీ కీలక పాత్ర పోషించబోతోందన్నారు. అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ (పరిశోధన)పై దృష్టి సారించనుందన్నారు. మార్చి 18న శ్రీకాకుళం జిల్లా మూలపేట వద్ద ఐదు లక్షల మెట్రిక్ టన్నుల గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి ప్లాంట్‌కు శంకుస్థాపన జరగనుందన్నారు. ఈ ప్రాజెక్ట్ కోసం ప్రభుత్వం దాదాపు 282 ఎకరాల భూమిని కేటాయించడానికి అంగీకరించిందన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సీహెచ్ సతీష్ కుమార్, జేకే శ్రీవాస్తవ ఇన్‌ఫ్రా పీఎస్ఏ లిమిటెడ్ ఫౌండర్, చైర్మన్ జేకే శ్రీవాస్తవ తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌తో ఈఎన్‌సీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ భేటీ

సీఎస్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న సుశీల్ మీనన్

విశాఖ సిటీ: రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌ను తూర్పు నావికాదళం చీఫ్ ఆఫ్ స్టాఫ్ వైస్ అడ్మిరల్ సుశీల్ మీనన్ విజయవాడలో మంగళవారం కలిశారు. ఈనెల 15 నుంచి 25 వరకు జరగనున్న అంతర్జాతీయ నౌకా దళ సమీక్ష, మిలాన్, ఐయాన్స్ కార్యకలాపాలపై చర్చలు జరిపారు. ఈ విన్యాసాలను విజయవంతంగా నిర్వహించడానికి అవసరమైన అన్ని సహాయ, సహకారాలు అందిస్తామని సీఎస్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఐఎఫ్ఆర్‌కు రావాల్సిందిగా సీఎస్‌కు ఆహ్వాన పత్రికను అందజేశారు.

మోడరన్ కబడ్డీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రిఫరీ బోర్డు చైర్మన్‌గా వంశీకృష్ణ

వంశీకృష్ణ

సింగరాయకొండ: ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం పాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తున్న తేళ్ల వంశీకృష్ణ ప్రతిష్టాత్మకమైన మోడరన్ కబడ్డీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రిఫరీ బోర్డు జాతీయ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఫెడరేషన్ ప్రెసిడెంట్ ఆనంద్‌సాహూ, ఫౌండర్ అండ్ సెక్రటరీ జనరల్ డాక్టర్ కుంభం రామిరెడ్డి అధికారికంగా నియామకపత్రాన్ని మంగళవారం అందజేశారు. మోడరన్ కబడ్డీలో వంశీకృష్ణకు ఉన్న అనుభవం, సాంకేతిక నైపుణ్యం గుర్తించి ఫెడరేషన్ ఈ బాధ్యతలు అప్పగించింది.

నామినేషన్ మైనింగ్ లీజులపై కొత్త నిబంధనలు

సాక్షి, అమరావతి: నామినేషన్ పద్ధతిలో ఇచ్చే మైనింగ్ లీజులపై గనుల శాఖ కొత్త నిబంధనలను అమల్లోకి తీసుకువచ్చింది. ఇందుకోసం 1966 ఏపీ మైనర్ మినరల్ కన్సెషన్ రూల్స్‌కు సవరణలు చేస్తూ మంగళవారం ఉత్తర్వులిచ్చింది. నామినేషన్ పద్ధతిలో ఇచ్చే మైనింగ్ లీజులను రెండు రకాలుగా విభజించి వాటిల్లో మార్పులు చేసింది. క్యాప్టివ్ వినియోగం కోసం..పీఎస్‌యూ (కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పబ్లిక్ సెక్టర్ సంస్థలకు) ప్రాజెక్టుల అవసరాలకే ఉపయోగించే లీజులను ఒక కేటగిరీగా నిర్ణయించారు. వాణిజ్య అవసరాల కోసం అంటే మార్కెట్‌లో అమ్మకాలు చేసే మైనింగ్ లీజులను రెండవ కేటగిరీలో ఉంచారు. క్యాప్టివ్ ఉపయోగం కోసం ఇచ్చే లీజుల్లో ప్రీమియంగా వార్షిక డెడ్ రెంట్‌కు ఐదు రెట్లు చెల్లించాలని జీఓలో నిర్దేశించారు. ఈ మొత్తాన్ని రెండు విడతల్లో చెల్లించేందుకు అవకాశం ఇచ్చారు. వాణిజ్య అవసరాల కోసం ఇచ్చే మైనింగ్ లీజులకు సంబంధించి ఖనిజ నిల్వల అంచనా విలువపై 5 శాతం ప్రీమియాన్ని ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుందని నిర్ణయించారు. ఈ లీజుల విషయంలో మూడేళ్ల రాయల్టీ లేదా సీనరేజ్ ఫీజును ముందుగానే వసూలు చేస్తారు. తద్వారా ప్రభుత్వం ముందస్తుగా ఆదాయం సమీకరించాలని భావిస్తోంది. లీజుల ప్రక్రియపైనా ఈ ఉత్తర్వుల్లో స్పష్టత ఇచ్చారు. నామినేషన్ పొందిన పీఎస్‌యూ దరఖాస్తు చేసిన తర్వాత మైన్స్ అండ్ జియాలజీ అధికారులు క్వారీ ప్రాంతాన్ని సర్వే చేస్తారు. అనంతరం ప్రతిపాదనలను పరిశీలించి లెటర్ ఆఫ్ ఇంటెంట్ జారీ చేస్తారు. ఆ లెటర్ వచ్చిన తేదీ నుంచి రెండేళ్లల్లోపు మైనింగ్ ప్లాన్, పర్యావరణ అనుమతి, కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు పొందాలి. అవసరమైతే మరో రెండేళ్ల వరకు గడువు పొడిగించే అవకాశం కూడా ఉంటుంది. అన్ని నిబంధనలు పూర్తయ్యాకే తుది లీజు డీడ్ అమలు చేస్తారు.

ఇక పండుగే

జీడిమామిడి.. ఈ పంటకు పండగ వస్తోంది. మన్యంలో విరివిగా సాగయ్యే ఈ పండ్లకు డిమాండ్ పెరగనుంది. ఇప్పటి వరకూ నేలపైనే వదిలేసే, ఈ పండ్ల నుంచి విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీకి శాస్త్రవేత్తలు ముందుకు రావడం శుభ పరిణామంగా మారింది.. పందిరిమామిడి డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్తల కృషికి ఫలితం దక్కనుంది.. ఆ వివరాలు తెలుసుకుందాం రండి మరి..

- జీడిమామిడి పండ్లతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ
- వైఎస్సార్ ఉద్యాన పరిశోధన స్థానం కృషి
- త్వరలో గిరిజన యువతకు శిక్షణ

జెల్లీ

రంపచోడవరం: మన్యంలో జీడిమామిడి సాగు అగ్రస్థానంలో ఉంది. సుమారు 50 వేల ఎకరాల్లో సాగవుతోంది. దేశంలో ముఖ్యమైన వాణిజ్య పంట ఇది. ముఖ్యంగా ఏపీ, కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, గోవా, తమిళనాడు, ఒడిశా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో జీడిమామిడి పంట బాగా అభివృద్ధి చెందింది. వివిధ ఆధారిత ఉత్పత్తుల తయారీతో అక్కడి రైతులు లాభాలు ఆర్జిస్తున్నారు. ఈ పంటలో జీడిమామిడి పిక్కల కంటే పండ్ల లభ్యత ఎక్కువగా ఉంటుంది. కానీ వాటివల్ల ఇప్పటి వరకూ ఇక్కడి రైతులకు ఎలాంటి ప్రయోజనం లేదు. అందువల్లే వాటిని చెట్లకు వదిలేయడంతో కింద పడి నేలపై కుళ్లిపోతూ ఉంటున్నాయి. అయితే జీడిపిక్కలను సేకరించి జీడిపప్పు అమ్మకంపైనే రైతులు ఏటా ఆశలు పెట్టుకుంటున్నారు. ఎక్కువగా ఈ పంట వేసవిలో చేతికి వస్తుంది.

వారి కృషి ఫలితంగా..

ఏజెన్సీలో విరివిగా లభ్యమయ్యే జీడిమామిడి పండు ద్వారా విలువ ఆధారిత ఆహార పదార్థాల తయారీకి పందిరిమామిడి డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారు. ఈ పండ్లతో ఇప్పటికే వివిధ రాష్ట్రాల్లో అనేక రకాలైన ఆహార ఉత్పత్తులు తయారీ చేసి లాభాలు ఆర్జిస్తున్నారు. మన ఏజెన్సీలో మాత్రం వృథాగా పడేస్తున్నారు. ఈ పండ్ల ద్వారా గిరిజన యువతను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఉద్యాన పరిశోధన స్థానం ముందుకు వచ్చింది. ఇందులో భాగంగా ఈ పండ్లతో వివిధ రకాల ఆహార ఉత్పత్తులు ఎలా తయారు చేయాలో శిక్షణ ఇచ్చేందుకు చర్యలు చేపట్టింది. దీనికి గాను ఈ నెల మొదటి వారంలో శిక్షణ తరగతులను నిర్వహించనుంది. బ్యాచ్‌కు 30 మంది రైతులకు చొప్పున 3 నుంచి 5 రోజుల పాటు శిక్షణ ఇవ్వంది.

ఫలం.. పోషక గుణం

జీడిమామిడి పండులో విలువైన అనేక పోషకాలు ఉంటాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇందులో విటమిన్–సి ఎక్కువగా ఉంటుంది. మిగతా పండ్లతో పోల్చితే నాలుగు రేట్లు అధికం. అలాగే చక్కెర, టానిన్, ఖనిజ లవణాలు, ఫాస్పరస్, కాల్షియం, ఐరన్ ఉంటాయి. తేమ 84 నుంచి 88 శాతం, మాంసకృత్తులు 0.15 శాతం, కొవ్వు పదార్థాలు 0.5 శాతం, పీచు పదార్థాలు 0.5 నుంచి 1 శాతం ఉంటాయి. ఈ పండు తియ్యగా ఉన్నప్పటికీ, నేరుగా తింటే ఫినాలిక్స్ వల్ల గొంతులో కీచు ఏర్పడుతుంది. దీనిని అధిగమించి విలువ ఆధారిత ఉత్పత్తులు తయారీకి శాస్త్రవేత్తలు ప్రణాళిక రూపొందించారు.

పశువులకు ఎంతో మేలు

ఈ పండు నుంచి వివిధ రకాల ఉత్పత్తులు తయారు చేయవచ్చు. వీటిని తయారు చేయగా, వచ్చే పిప్పి నుంచి కూడా అనేక ప్రయోజనాలు ఉంటాయని అధికారులు చెబుతున్నారు. పిప్పిని పశువుల దాణాగా ఉపయోగించవచ్చు. దీనిలో విటమిన్–సి అధికంగా ఉండడంతో పశువుల్లో పాల దిగుబడి పెరుగుతుందని అంటున్నారు. ఇదిలా ఉంటే విలువ ఆధారిత చిన్న పరిశ్రమల స్థాపనకు కేంద్ర ప్రభుత్వం రాయితీతో కూడిన రుణాలను గిరిజనులకు అందిస్తుందని అధికారులు వివరిస్తున్నారు.

సేకరణ ఇలా..

జీడిమామిడి చెట్టు నుంచి పండును జాగ్రత్తగా సేకరించాలి. ఇందులో పిక్కలను వేరుచేసి పండును శుభ్రంగా కడగాలి. ముఖ్యంగా పండును సేకరించిన తర్వాత రెండు, మూడు గంటల్లోనే శుద్ధి చేసి ఇతర పదార్థాలుగా తయారు చేయాలి. లేకుంటే పాడయ్యే అవకాశం ఉంది.

- పండును ముక్కలుగా కోసి జ్యూస్‌ను తీసి హీటర్‌లో వేసి 80 డిగ్రీల వరకూ వేడి చేసి హానికరమైన సూక్ష్మజీవులను తీసివేస్తారు. దీనికి కల్చర్‌ను కలిపి పులియ బెట్టడం ద్వారా 12 శాతం ఆల్కహాల్ గల వైన్ సేకరించి ఫిల్టర్ చేసి బాటిలింగ్ చేయవచ్చు. జీడిమామిడి నుంచి ముఖ్యంగా ఆర్‌టీఎస్ జ్యూస్, జామ్, జెల్లీ, స్క్వాష్ అనేక ఆహార పదార్థాలు చేయవచ్చు. తక్కువ ఆల్కాహాల్ గల డ్రింక్‌లను కూడా చేయవచ్చు. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో దాదాపు 15 రకాల ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి.

వైన్

గిరిజన యువతకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త వెంగయ్య

ఆర్థికాభివృద్ధి సాధించేందుకు..

ఏజెన్సీలో జీడిమామిడి పండ్లను ఉపయోగంలోకి తీసుకువచ్చేందుకు డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన స్థానం ద్వారా కృషి చేస్తున్నాం. ఇప్పటికే వివిధ రకాల ఆహార పదార్థాలు తయారీపై అవగాహన కల్పిస్తున్నాం. దీనిపై ఫిబ్రవరి మొదటి వారంలో గిరిజన యువతకు శిక్షణ ఇచ్చేందుకు చర్యలు చేపట్టాం. గిరిజనుల ఆర్థిక అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.

– డాక్టర్ పీసీ వెంగయ్య, సీనియర్ సైంటిస్టు, హెచ్ఆర్ఎస్

వన్స్ మోర్

చిత్ర పరిశ్రమలో ఒక్కోసారి ఒక్కో ట్రెండ్ కొనసాగుతుంటుంది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ... ఇలా ఏ ఇండస్ట్రీ చూసుకున్నా ప్రస్తుతం రీ రిలీజ్‌ల ట్రెండ్ కొనసాగుతోంది. ఇతర చిత్ర పరిశ్రమలతో పోలిస్తే ఈ ట్రెండ్ తెలుగులో ఇంకాస్త ఎక్కువగా ఉందనడంలో ఎలాంటి సందేహం లేదు. గతంలో సూపర్ హిట్‌గా నిలిచిన మూవీస్‌ని 'వన్స్ మోర్' అంటూ మళ్లీ చూసేందుకు ఆడియన్స్ ఎంతో ఉత్సాహంగా ఉంటున్నారు. ఈ కారణంగా తమ సినిమాలను మరోసారి విడుదల చేసేందుకు మేకర్స్ అమితాసక్తి చూపిస్తున్నారు. హీరోల పుట్టిన రోజు కావచ్చు... లేదా ఆ సినిమాకి సంబంధించి ఏదైనా ప్రత్యేకమైన రోజు కావచ్చు.. అదీ కాకుంటే ఆ సినిమాకి ఆడియన్స్‌లో ఉన్న ప్రత్యేకమైన క్రేజ్... ఇలా సందర్భాలను బట్టి తమ సినిమాలను రీ రిలీజ్ చేసేందుకు హీరోలు, దర్శకులు, నిర్మాతలు ఆసక్తి కనబరుస్తున్నారు. పైగా హిట్ సినిమాలను రీ రిలీజ్ చేస్తుండటంతో ఆయా హీరోల అభిమానులతో పాటు ప్రేక్షకులు కూడా మరోసారి చూసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఈ కారణంగానే రీ రిలీజ్‌లో కూడా ఆయా సినిమాలు భారీగానే వసూలు చేస్తున్నాయి. పైగా గత చిత్రాలను 4కె క్వాలిటీకి మార్చి అందిస్తుండటంతో ప్రేక్షకులు సరికొత్త అనుభూతిని పొందుతున్నారు. అందులో భాగంగానే ప్రస్తుతం ధనుష్ నటించిన '3' సినిమా, రామ్‌చరణ్ నటించిన 'ఆరెంజ్', రాఘవ లారెన్స్ 'కాంచన', నాగచైతన్య 'లవ్ స్టోరీ', 'ఏమాయ చేసావె', ఉదయ్ కిరణ్ 'మనసంతా నువ్వే' వంటి అరడజను సినిమాలు రీ రిలీజ్‌కి ముస్తాబవుతున్నాయి. ఆ వివరాలు, విశేషాలు తెలుసుకుందాం.

● జెనీలియా, రామ్‌చరణ్

● శ్రుతీహాసన్, ధనుష్

● నాగచైతన్య, సాయిపల్లవి

● రాఘవ లారెన్స్, రాయ్ లక్ష్మి

● నాగచైతన్య, సమంత

● ఉదయ్ కిరణ్, రీమాసేన్

● పదమూడేళ్ల తర్వాత...

ధనుష్ హీరోగా నటించిన చిత్రం '3'. ఆయన సతీమణి ఐశ్వర్య (ఐశ్వర్యా రజనీకాంత్) ఈ మూవీతో డైరెక్టర్‌గా పరిచయం అయ్యారు. ఈ సినిమాలో శ్రుతీహాసన్ హీరోయిన్‌గా నటించారు. ప్రభు, భానుప్రియ, రోహిణి ఇతర పాత్రలు పోషించారు. కె. విమలాగీత, ధనుష్ నిర్మించిన ఈ సినిమా 2012 మార్చి 30న విడుదలైంది. తమిళ, తెలుగు భాషల్లో ఈ సినిమా హిట్‌గా నిలిచింది. ప్రధానంగా ఈ మూవీకి అనిరుధ్ రవిచందర్ అందించిన సంగీతం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రత్యేకించి.. ధనుష్ పాడిన 'వై దిస్ కొలవెరి డి...' పాట యూత్‌ని ఉర్రూతలూగించింది. 'కొలవెరి డి...' పాటతో రిలీజ్‌కు ముందే ఇటు ఇండస్ట్రీ వర్గాల్లో అటు జనాల్లో విపరీతమైన క్రేజ్ తెచ్చుకున్న ఈ మూవీ అదే స్థాయిలో ఓపెనింగ్స్‌ని రాబట్టింది. తొలి భాగం అందమైన ప్రేమకథను ఆవిష్కరించిన ఈ చిత్రం సెకండాఫ్‌లో మాత్రం విషాదాంత ప్రేమ కథగా మిగిలింది. ఈ చిత్రంలో రామ్ పాత్రలో ధనుష్, జనని పాత్రలో శ్రుతీహాసన్ అద్భుతంగా నటించారు. తమిళ, తెలుగు ప్రేక్షకులను అలరించిన ఈ సినిమా పదమూడేళ్ల తర్వాత ఈ నెల 6న మరోసారి ప్రేక్షకుల ముందుకొస్తోంది.

● పదిహేనేళ్ల తర్వాత...

'మగధీర' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత రామ్ చరణ్ హీరోగా నటించిన చిత్రం 'ఆరెంజ్'. 'బొమ్మరిల్లు' మూవీ ఫేమ్ భాస్కర్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో జెనీలియా కథానాయికగా నటించారు. ప్రకాశ్‌రాజ్, షాజాన్ పదంసీ, ప్రభు, బ్రహ్మానందం, శ్రీనివాస్ అవసరాల, మధురిమ, మంజుల, సంజయ్, సమీర్, పవిత్రా లోకేష్, వెన్నెల కిషోర్, సంచిత, నాగబాబు ఇతర పాత్రలు పోషించారు. నాగబాబు నిర్మించిన ఈ సినిమా 2010 నవంబరు 26న విడుదలైంది. 'మగధీర' సినిమాతో బ్లాక్‌బస్టర్ అందుకోవడంతో పాటు వందకోట్లకు పైగా వసూళ్లు సాధించారు రామ్‌చరణ్. ఆ మూవీ తర్వాత పూర్తి లవర్ బాయ్ లుక్‌లో నటించిన చిత్రం 'ఆరెంజ్'. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా థియేటర్లలో ప్రేక్షకుల అంచనాలు అందుకోలేకపోయింది. కానీ, ఈ మూవీ బుల్లితెరపై మాత్రం సూపర్ హిట్‌గా నిలిచింది. ప్రత్యేకించి హారిస్ జయరాజ్ సంగీతం అందించిన ఈ మూవీలోని పాటలు యూత్‌ని ఆకట్టుకున్నాయి. ఆస్ట్రేలియా నేపథ్యంలో సాగే ఈ కథలో రామ్ పాత్రలో రామ్‌చరణ్, జాను క్యారెక్టర్‌లో జెనీలియా తమదైన నటనతో ఆకట్టుకున్నారు. పదిహేనేళ్ల తర్వాత మరోసారి ఈ నెల 7న 'ఆరెంజ్' సినిమా రీ రిలీజ్ అవుతుండటం విశేషం.

● పద్నాలుగేళ్ల తర్వాత...

'ముని' సినిమాతో తనదైన నటనతో ప్రేక్షకులను భయపెట్టారు రాఘవ లారెన్స్. ఆ సినిమాకి సీక్వెల్‌గా ఆయన లీడ్ రోల్‌లో నటించడంతో పాటు దర్శకత్వం వహించిన హారర్ థ్రిల్లర్ మూవీ 'కాంచన'. ఈ సినిమాలో రాయ్‌లక్ష్మి హీరోయిన్‌గా నటించారు. శరత్‌కుమార్, కోవై సరళ, దేవదర్శిని, శ్రీమాన్ ఇతర పాత్రల్లో నటించారు. రాఘవ లారెన్స్, ఎన్. రాధ నిర్మించిన ఈ సినిమా 2011 జూలై 15న విడుదలైంది. ఈ సినిమాని తెలుగులో నిర్మాత బెల్లంకొండ సురేష్ రిలీజ్ చేశారు. తెలుగు, తమిళ భాషల్లో విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకులను మరోసారి భయపెట్టింది. ముఖ్యంగా రాఘవ లారెన్స్, శరత్ కుమార్ నటన హైలెట్‌గా నిలిచింది. ప్రత్యేకించి శరత్‌కుమార్ ఈ మూవీలో హిజ్రా పాత్రలో అద్భుతంగా నటించారు. రాయ్‌లక్ష్మి తనదైన గ్లామర్‌తో కుర్రకారుని అలరించారు. కోవై సరళ, దేవదర్శిని, శ్రీమాన్ పాత్రలు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించాయి. పతాక సన్నివేశాల్లో వచ్చే పాటలో లారెన్స్ నటన, హావభావాలు అద్భుతంగా పండించారు. తమన్ సంగీతం, నేపథ్య సంగీతం ఈ మూవీకి అదనపు ఆకర్షణగా నిలిచాయి. పద్నాలుగేళ్ల తర్వాత 'కాంచన' చిత్రాన్ని ఈ నెల 13న మళ్లీ విడుదల చేస్తున్నారు మేకర్స్.

● ప్రేమికుల దినోత్సవం కానుకగా...

రేవంత్–మౌనికల ప్రేమకథ మరోసారి సిల్వర్ స్క్రీన్‌పై కనిపించనుంది. ఈ లవ్‌స్టోరీ సరిగ్గా ప్రేమికుల దినోత్సవానికి రానుంది. రేవంత్‌గా నాగచైతన్య, మౌనికగా సాయి పల్లవి నటించిన చిత్రం 'లవ్ స్టోరి'. శేఖర్ కమ్ముల దర్శకత్వం వహించారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ ఎల్ఎల్‌పీ, అమిగోస్ క్రియేషన్స్ పతాకంపై నారాయణ్ దాస్ కె. నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మించారు. 2020లో విడుదల కావాల్సిన ఈ చిత్రం కోవిడ్ కారణంగా వాయిదా పడి, 2021 సెప్టెంబరు 24న విడుదలైంది. శేఖర్ కమ్ముల తనదైన శైలిలో సహజత్వానికి దగ్గరగా తెరకెక్కించిన ఈ ప్రేమకథా చిత్రానికి అద్భుత స్పందన లభించింది. తెలంగాణ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ చిత్రంలో నాగచైతన్య, సాయి పల్లవి తమ నటనతో ఆకట్టుకున్నారు. అలాగే సంగీత దర్శకుడు పవన్ సీహెచ్ అందించిన పాటల్లో 'నీ చిత్రమ్ చూసి...', 'సారంగ దరియా...' పాటలకు మంచి ఆదరణ లభించిన విషయం తెలిసిందే. అందమైన ప్రేమకథా చిత్రంగా రూపొందిన 'లవ్ స్టోరి'ని ప్రేమికుల దినోత్సవం కానుకగా ఈ నెల 14న మళ్లీ విడుదల చేస్తోంది చిత్రయూనిట్. సో... నాలుగున్నరేళ్ల తర్వాత ప్రేమికుల దినోత్సవం సందర్భంగా రేవంత్–మౌనిక తమ ప్రేమ కథతో మరోసారి అలరించనున్నారన్న మాట.

● పదిహేనేళ్ల తర్వాత...

కార్తీక్, జెస్సీలు తమ ప్రేమకథతో వెండితెరపై ప్రేక్షకులను మాయ చేశారు. ప్రేమికుల దినోత్సవం కానుకగా మరోసారి మాయ చేసేందుకు వస్తున్నారు ఈ ప్రేమికులు. నాగచైతన్య హీరోగా నటించిన చిత్రం 'ఏమాయ చేసావె'. గౌతమ్ వాసుదేవ్ మీనన్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ద్వారా సమంత తెలుగు చిత్ర పరిశ్రమకు పరిచయం అయ్యారు. కృష్ణుడు, తాన్య, సురేఖా వాణి, సంజయ్ స్వరూప్, దేవన్, లక్ష్మి, త్రిష అలెక్స్ ఇతర పాత్రలు పోషించారు. ఇందిరా ప్రొడక్షన్స్‌పై మంజుల ఘట్టమనేని, సంజయ్ స్వరూప్ నిర్మించారు. ఈ సినిమా 2010 ఫిబ్రవరి 26న విడుదలైంది. లవ్, రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌గా నిలిచింది. ఈ మూవీలో కార్తీక్ పాత్రలో నాగచైతన్య, జెస్సీగా సమంత తమదైన నటనతో ఆకట్టుకున్నారు. తన రెండవ సినిమాతోనే నాగచైతన్య తన నటనలో పరిణితి చూపించారనే ప్రశంసలు దక్కాయి. గౌతమ్ వాసుదేవ్ మీనన్ తనదైన శైలిలో ఈ అందమైన ప్రేమకథని తెరపైకి తీసుకొచ్చారు. ఏఆర్ రెహమాన్ సంగీతం, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఈ మూవీకి అదనపు ఆకర్షణగా నిలిచాయి. మనోజ్ పరమహంస విజువల్స్ కూడా అద్భుతంగా నిలిచాయి. చివరి సన్నివేశంలో త్రిష, శింబు కనిపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పదిహేనేళ్ల తర్వాత ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఈ నెల 14న ఈ మూవీ రీ రిలీజ్ అవుతోంది.

● 24 ఏళ్ల తర్వాత...

ఉదయ్ కిరణ్ హీరోగా నటించిన అందమైన ప్రేమకథా చిత్రం 'మనసంతా నువ్వే'. వీఎన్ ఆదిత్య దర్శకత్వం వహించారు. ఈ మూవీలో రీమా సేన్ హీరోయిన్‌గా నటించారు. తనూ రాయ్, పరుచూరి వెంకటేశ్వరరావు, చంద్రమోహన్, తనికెళ్ల భరణి, శివ పార్వతి, బ్రహ్మానందం, సునీల్, సుధ, దేవదాస్ కనకాల, శివారెడ్డి, పావలా శ్యామల ఇతర పాత్రలు పోషించారు. సుమంత్ ఆర్ట్స్ ప్రొడక్షన్స్‌పై ఎంఎస్ రాజు ఈ మూవీ నిర్మించారు. అంతేకాదు... ఈ చిత్రానికి ఆయనే కథ అందించడం విశేషం. ఈ చిత్రంలో వేణుగా ఉదయ్ కిరణ్, రేణు పాత్రలో రీమా సేన్ కనిపిస్తారు. బాల్య స్నేహితులైన వీరి మధ్య ప్రేమని ఎంతో అందంగా, అద్భుతంగా తెరకెక్కించారు వీఎన్ ఆదిత్య. ఈ సినిమాకి ఆర్పీ పట్నాయక్ సంగీతం, నేపథ్య సంగీతం ఎంతో ప్లస్ అయ్యాయి. 2001 అక్టోబరు 19న విడుదలైన ఈ మూవీ సూపర్ హిట్‌గా నిలిచింది. ప్రత్యేకించి యువతరం ఈ మూవీని విపరీతంగా చూశారు. 24 ఏళ్ల తర్వాత ఈ సినిమాని ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఈ నెల 14న రీ రిలీజ్ చేస్తున్నారు.

పైన పేర్కొన్న సినిమాలే కాదు.. ఇప్పటికే మరికొన్ని సినిమాలు రీ రిలీజ్ కాగా ఇంకొన్ని విడుదలకు సిద్ధంగా ఉన్నాయి.

- డేరంగుల జగన్ మోహన్

ఇది నూతన భారతదేశం



● రణ్‌వీర్ సింగ్

రణ్‌వీర్ సింగ్ హీరోగా ఆదిత్య ధర్ దర్శకత్వంలో రూపొందిన స్పై యాక్షన్ థ్రిల్లర్ సినిమా 'ధురంధర్'. అక్షయ్ ఖన్నా, సంజయ్ దత్, అర్జున్ రాంపాల్, ఆర్. మాధవన్, సారా అర్జున్, రాకేష్ బేడి ఈ చిత్రంలోని ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. ఆదిత్య ధర్, లోకేశ్‌ధర్, జ్యోతి దేశ్‌పాండే నిర్మించిన ఈ చిత్రం 2025 డిసెంబరు 5న విడుదలై, బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా దాదాపు రూ. 1300 కోట్లకు పైగా వసూళ్లను సాధించిందని యూనిట్ పేర్కొంది. కాగా ఈ సినిమాకు సీక్వెల్ రానున్నట్లుగా మేకర్స్ ఆల్రెడీ ప్రకటించారు. ఈ సీక్వెల్‌కు 'ధురంధర్: ది రివెంజ్' అనే టైటిల్‌ను ఖరారు చేసి, ఈ సినిమాను మార్చి 19న హిందీ తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. అలాగే ఈ సినిమా టీజర్‌ను తెలుగు, తమిళ, హిందీ, కన్నడం, మలయాళ భాషల్లో రిలీజ్ చేశారు. ఇక 'ధురంధర్' సినిమా కేవలం హిందీ భాషలోనే రిలీజ్ కాగా, 'ధురంధర్: ది రివెంజ్' సినిమా హిందీ భాషతో పాటు ఇతర భాషల్లోనూ ఏకకాలంలో రిలీజ్‌కు సిద్ధం అవుతుండటం విశేషం. 'ఇది నూతన భారతదేశం. సరిహద్దులు దాటి చొరబడుతుంది. దెబ్బ కొట్టి తీరుతుంది" అన్న డైలాగ్ 'ధురంధర్: ది రివెంజ్' సినిమా తెలుగు టీజర్‌లో ఉంది.

ఐదు భాషల్లో పల్లి చట్టంబి

'2018' మూవీ ఫేమ్ టొవినో థామస్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'పల్లి చట్టంబి'. డిజో జోస్ ఆంటోనీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో కయాదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. వరల్డ్ వైడ్ ఫిలింస్, సి క్యూబ్ బ్రోస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్స్‌పై నౌఫల్, బ్రిజీష్, చాణుక్య చైతన్య చరణ్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఏప్రిల్ 9న తెలుగు, మలయాళ, హిందీ, తమిళ, కన్నడ భాషల్లో విడుదల కానుంది. కాగా మంగళవారం కయాదు లోహర్ ఫస్ట్ లుక్‌ని రిలీజ్ చేశారు. ''1950, 1960 దశకాల నేపథ్యంలో సాగే పీరియాడిక్ మూవీ 'పల్లి చట్టంబి'. భారీ బడ్జెట్‌తో రూపొందుతోన్న ఈ మూవీలో ఇప్పటివరకూ చూడని సరికొత్త పాత్రలో టొవినో థామస్ కనిపించనున్నారు. 'డ్రాగన్' మూవీ సక్సెస్ తర్వాత కయాదు లోహర్‌కి ప్రేక్షకుల్లో పెరిగిన క్రేజ్ మా సినిమాకి ప్లస్ కానుంది. ఇటీవలే ఐదు భాషల్లో రిలీజ్ చేసిన 'పల్లి చట్టంబి' మోషన్ పోస్టర్‌కు హ్యూజ్ రెస్పాన్స్ వచ్చింది. ఈ మూవీపై పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాలు నెలకొన్నాయి'' అని మేకర్స్ తెలిపారు. విజయ రాఘవన్, సుధీర్ కరమన, బాబురాజ్, వినోద్ కేదమంగళం, ప్రశాంత్ అలెగ్జాండర్ తదితరులు నటిస్తున్న ఈ సినిమాకి కెమెరా: టిజో టోమీ, సంగీతం: జేక్స్ బిజోయ్, అసోసియేట్ ప్రొడ్యూసర్స్: మేఘ శ్యామ్, తంజీర్.

● కయాదు లోహర్

బిజినెస్ రీల్

బ్లేడ్ బ్యాటరీ టెక్నాలజీతో కొత్త బస్సుల ఉత్పత్తి

- వచ్చే త్రైమాసికం నుంచి ప్రారంభం
- ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ వెల్లడి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అధునాతన బ్లేడ్ బ్యాటరీ టెక్నాలజీతో కొత్త ఎలక్ట్రిక్ బస్సుల ఉత్పత్తిని వచ్చే త్రైమాసికం నుంచి ప్రారంభించనున్నట్లు ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ తెలిపింది. దేశీయంగా ఎలక్ట్రిక్ బస్సుల రంగంలో తొలిసారిగా తాము రూపొందించిన ఈ ప్యాక్‌కి సర్టిఫికేషన్ లభించడం కంపెనీ ప్రస్థానంలో కీలక మైలురాయని సంస్థ ఎండీ మహేష్ బాబు చెప్పారు. మాతృ రంగ దిగ్గజం ఎంఈఐఎల్ అనుబంధ సంస్థ అయిన ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ. 46.68 కోట్ల నికర లాభం ప్రకటించింది. ఆదాయం 29 శాతం వృద్ధితో రూ. 663.60 కోట్లకు చేరుకుంది. నిర్వహణ సామర్థ్యాలను మెరుగుపర్చుకోవడం వల్ల ఆకర్షణీయమైన ఫలితాలను సాధించినట్లు మహేష్ బాబు తెలిపారు. ఒక్క త్రైమాసికంలోనే అత్యధికంగా 385 ఎలక్ట్రిక్ వాహనాలను డెలివరీ చేసి కొత్త రికార్డును నెలకొల్పినట్లు వివరించారు. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే 37 శాతం పెరిగినట్లు చెప్పారు. ఇప్పటివరకు 3,639 వాహనాలను డెలివరీ చేయగా, 9,439 వాహనాలకు ఆర్డర్ బుక్ ఉన్నట్లు కంపెనీ తెలిపింది.

రి సస్టైనబిలిటీతో జన్యు టెక్నాలజీస్ జట్టు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వ్యర్థాల నిర్వహణకు సంబంధించి సమగ్రమైన సొల్యూషన్స్ అందించే క్రమంలో రి సస్టైనబిలిటీ, జన్యు టెక్నాలజీస్ జట్టు కట్టాయి. ప్రమాదకరమైన వ్యర్థాల హ్యాండ్లింగ్, అత్యంత రిస్కీగా ఉండే పారిశ్రామిక వ్యర్థాల నిర్వహణను టెక్నాలజీ దన్నుతో సురక్షితమైన విధంగా చేపట్టేందుకు అవగాహన ఒప్పందం (ఓవోయూ) కుదుర్చుకున్నాయి. దేశీయంగా 20 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉన్న వేస్ట్ మేనేజ్‌మెంట్ పరిశ్రమ వేగంగా విస్తరిస్తోందని ఇరు సంస్థలు తెలిపాయి. అధునాతన రోబోటిక్స్ వినియోగంతో మానవ ప్రమేయం తగ్గించి, సామర్థ్యాలను మెరుగుపర్చుకునేందుకు వీలవుతుందని రి సస్టైనబిలిటీ ఎండీ మసూద్ మాలిక్ తెలిపారు.

వర్ధమాన రంగాలకు రుణాలపై ఎస్‌బీఐ ఫోకస్

ముంబై: దేశ ఆర్థిక పరివర్తనలో కీలక పాత్ర పోషించే కొత్త తరం రంగాలకి రుణ లభ్యతను పెంచే దిశగా చక్ర–సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ని (సీవోఈ) ప్రారంభించినట్లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెల్లడించింది. ప్రధానంగా రెన్యువబుల్ ఎనర్జీ, అడ్వాన్స్‌డ్ సెల్ కెమిస్ట్రీ–బ్యాటరీ స్టోరేజ్, ఎలక్ట్రిక్ మొబిలిటీ, సెమీకండక్టర్లులాంటి ఎనిమిది వర్ధమాన రంగాలపై దృష్టి పెడుతున్నట్లు పేర్కొంది. 2030 నాటికి ఈ ఎనిమిది రంగాలు దాదాపు రూ. 100 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షిస్తాయన్న అంచనాలు ఉన్నట్లు తెలిపింది. రాబోయే దశాబ్దాల్లో కొత్త ఆవిష్కరణలు, అధునాతన తయారీ సామర్థ్యాల దన్నుతో భారత్ వృద్ధి చెందుతుందని ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి తెలిపారు. శ్వేతపత్రాలు, సెక్టార్ రిపోర్టులు, పరిశ్రమ రౌండ్ టేబుల్ సమావేశాల నిర్వహణ మొదలైన మార్గాల్లో క్లయింట్లు, ఇన్వెస్టర్లు, విధాననిర్ణేతలు నిర్ణయాలు తీసుకునేందుకు చక్ర సెంటర్ తోడ్పడుతుందని వివరించారు. డెవలప్‌మెంట్ ఫైనాన్స్ సంస్థలు, బహుళపక్ష ఏజెన్సీలు, పరిశ్రమ సమాఖ్యలు, స్టార్టప్‌ల మధ్య సంప్రదింపులకు ఇది సహాయకరంగా ఉంటుందన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

4-2-2026

విశాఖ	490–00
చిత్తూరు	563–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	475–00
విజయవాడ	500–00
రిటైల్ ధర (డజను)	75.00
హైదరాబాద్	485–00
వరంగల్	487–00
రిటైల్ ధర	5.45

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	9,385
ఎన్ఎస్ఈ	1,74,056
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	3,50,418
ఎఫ్ఐఐ	+ 5,236
డీఐఐ	+ 1,014

ముడిచమురు... (బ్యారల్)

	రాత్రి 11.30కు		క్రితం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	62.89	$	62.14
బ్రెంట్	66.96	$	66.03

ఎగుమతులకు బూస్ట్

టారిఫ్‌ల కోతపై ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ: భారత ఉత్పత్తులపై టారిఫ్‌లను తగ్గించాలన్న అమెరికా నిర్ణయంతో ఎగుమతులకు ఊతం లభిస్తుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. కొత్తగా మరిన్ని మార్కెట్లు కూడా అందుబాటులోకి రావడంతో ఇకపై మన ఎగుమతులు పుంజుకోగలవని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. అమెరికాతో ఒప్పందం వివరాలు త్వరలోనే వెల్లడవుతాయని ఆమె చెప్పారు. 'మేడిన్ ఇండియా ఉత్పత్తులకు గుడ్ న్యూస్. ఇక వాటిపై టారిఫ్‌లు 18 శాతానికి తగ్గుతాయి' అని ఎక్స్‌లో ఆమె పోస్ట్ చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏకంగా 50 శాతం సుంకాలు విధించడంతో భారత ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడింది. ఉక్కు, అల్యూమినియం, టెక్స్‌టైల్స్, ఇంజినీరింగ్, ఇతరత్రా కొన్ని వ్యవసాయోత్పత్తుల ఎక్స్‌పోర్ట్స్ గణనీయంగా తగ్గాయి. తాజాగా వాణిజ్య అవరోధాలను తొలగించి, రష్యా నుంచి చమురు కొనుగోళ్లను కూడా నిలిపివేసి అగ్రరాజ్యం నుంచి క్రూడ్ కొనుగోళ్లు పెంచుకుంటామన్న భారత హామీకి ప్రతిగా టారిఫ్‌లను 18 శాతానికి తగ్గించేందుకు అంగీకరించినట్లు ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనితో 15–19 శాతం స్థాయిలో టారిఫ్‌లు ఎదుర్కొంటున్న ఇతర ఆసియా దేశాల సరసన భారత్ కూడా చేరుతుంది. మరోవైపు ఫ్యూచర్స్, ఆప్షన్స్‌పై (ఎఫ్అండ్‌వో) సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ (ఎస్‌టీటీ)ని పెంచాలన్న నిర్ణయం స్పెక్యులేటివ్ ట్రేడింగ్ వల్ల చిన్న ఇన్వెస్టర్లు నష్టాల పాలవకుండా కాపాడేందుకే తప్ప ఆదాయాన్ని పెంచుకునేందుకు తీసుకున్నది కాదని నిర్మలా సీతారామన్ చెప్పారు.

సాగు, డెయిరీ ప్రయోజనాలు పదిలం: గోయల్

అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునే విషయంలో దేశీయంగా కీలకమైన వ్యవసాయం, డెయిరీ రంగాల ప్రయోజనాలను పరిరక్షించేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. పోటీ దేశాల కన్నా అమెరికాతో భారత్‌కి 'చాలా మంచి' డీల్ కుదిరిందని మంత్రి చెప్పారు. వాణిజ్య ఒప్పందం తుది దశలో ఉందని, త్వరలోనే పూర్తి వివరాలతో ఇరు దేశాలు సంయుక్త ప్రకటన జారీ చేస్తాయని పేర్కొన్నారు. కీలక రంగాల ప్రయోజనాలను కాపాడుతూ, ప్రజలకు భారీగా అవకాశాలు కల్పించే విధంగా ఒప్పందం ఉంటుందని చెప్పారు. కార్మిక శక్తి ఎక్కువగా ఉండే టెక్స్‌టైల్స్, ప్లాస్టిక్స్, దుస్తులు, సేంద్రియ రసాయనాలు, రత్నాభరణాలు తదితర రంగాలకు అవకాశాలు పెరుగుతాయన్నారు.

వృద్ధికి ఊతం.. ఎగుమతులకు దన్ను

- మరిన్ని పెట్టుబడులకు అవకాశాలు
- ఆర్థిక బంధం బలోపేతం
- అమెరికాతో ఒప్పందంపై దేశీ కార్పొరేట్ల వెల్లడి

అమెరికాతో వాణిజ్య ఒప్పందం వల్ల భారతదేశ వృద్ధి లక్ష్యాల సాధనకు, ఎగుమతులకు ఊతం లభిస్తుందని దేశీ కార్పొరేట్ దిగ్గజాలు అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయంగా తయారీ, ఇన్నోవేషన్ హబ్‌గా ఎదగాలన్న ఆకాంక్షలను సాకారం చేసుకునేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడుల పరిస్థితులు గణనీయంగా మారతాయని తెలిపారు. ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడులపరమైన బంధాలను పటిష్టం చేసుకునే దిశగా ఇదొక కీలక ముందడుగని మహీంద్రా గ్రూప్ సీఈవో అనీష్ షా చెప్పారు. అలాగే పెట్టుబడులు పెట్టేందుకు భరోసా కల్పిస్తుందన్నారు. పెట్టుబడులు, వృద్ధి సాధనకు అపార అవకాశాలు అందుబాటులోకి వస్తాయని భారతి ఎంటర్‌ప్రైజెస్ వ్యవస్థాపకుడు సునీల్ భారతి మిట్టల్ పేర్కొన్నారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టీఏ) వెల్లువెత్తుతుండటమనేది అంతర్జాతీయంగా భారత్ కేంద్ర బిందువుగా మారడాన్ని సూచిస్తోందని చెప్పారు. టారిఫ్‌ల తగ్గింపనేది రెండు గొప్ప దేశాల మధ్య వ్యూహాత్మక, ఆర్థిక బంధాలు బలపడేందుకు తోడ్పడుతుందని ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్ కుమార మంగళం బిర్లా తెలిపారు. పెట్టుబడులు, పరస్పర సహకారాన్ని పెంపొందించుకునేందుకు మరిన్ని అవకాశాలు లభిస్తాయన్నారు. దీర్ఘకాలికంగా ద్వైపాక్షిక ఆర్థిక సంబంధాలు బలపడే దిశగా ఇదొక సానుకూల ముందడుగు కాగలదని టీవీఎస్ మోటర్స్ చైర్మన్ సుదర్శన్ వేణు అభిప్రాయపడ్డారు. భారత్–అమెరికా చారిత్రక డీల్‌తో వాణిజ్యం, తయారీ కార్యకలాపాలు పుంజుకుంటాయని, జీవనోపాధి అవకాశాలు మెరుగుపడతాయని ఐటీసీ చైర్మన్ సంజీవ్ పురి పేర్కొన్నారు.

స్టార్టప్‌లతో ఉపాధి విస్తృతం

- ప్రత్యామ్నాయ అవకాశాలు
- కేంద్ర సహాయ మంత్రి జితేంద్రసింగ్

న్యూఢిల్లీ: దేశంలో స్టార్టప్‌ల మజిలీ శరవేగాన్ని అందుకుందని, దశాబ్దాల క్రితం వందల్లో ఉంటే, ఇప్పుడు రెండు లక్షలకు పైగా చేరినట్లు సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. సంప్రదాయ వేతన ఉద్యోగాలకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలను స్టార్టప్‌లు కల్పిస్తున్నట్లు చెప్పారు. అటల్ ఇన్నోవేషన్ ఇంక్యుబేటర్ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. ఇంక్యుబేషన్, ఆవిష్కరణలు, మహిళల ఆర్థిక భాగస్వామ్యంపై ప్రత్యేక దృష్టి సారించడం ద్వారా.. దేశంలో స్టార్టప్‌లు, వ్యాపారవేత్తల వ్యవస్థకు బడ్జెట్ 2026–27 బలమైన ప్రోత్సాహాన్ని అందిస్తున్నట్టు చెప్పారు. ''350 స్టార్టప్‌లతో మొదలై, నేడు 2 లక్షలు దాటేసి, 21,000 మందికి పైగా ఉపాధి కల్పిస్తోంది. ఉపాధి అంటే ప్రభుత్వ ఉద్యోగమేనన్న సంప్రదాయ ధోరణిలో మార్పును తీసుకొస్తోంది''అని చెప్పారు. 2014 తర్వాత నిర్మాణాత్మక ఆవిష్కరణలకు నిర్ణయాత్మక రాజకీయ మద్దతు లభించినట్టు పేర్కొన్నారు. అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు, స్టార్టప్‌ల కోసం ఉద్దేశించిన విధానపరమైన చర్యలను ప్రస్తావించారు. దేశవ్యాప్తంగా 50వేలకు పైగా అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ఇప్పుడు పనిచేస్తున్నట్టు చెప్పారు.

ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ లాభం రూ. 1,666 కోట్లు

న్యూఢిల్లీ: జీవిత బీమా దిగ్గజాల్లో ఒకటైన ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ. 1,666 కోట్ల లాభం ప్రకటించింది. అంతక్రితం క్యూ3తో పోలిస్తే ఇది 4 శాతం అధికం. ఇక సమీక్షా కాలంలో న్యూ బిజినెస్ ప్రీమియం రూ. 26,256 కోట్ల నుంచి రూ. 31,326 కోట్లకు పెరిగింది. రెగ్యులర్ ప్రీమియం వసూళ్లు 15 శాతం పెరిగినట్లు సంస్థ తెలిపింది. ఇండివిడ్యువల్ న్యూ బిజినెస్ ప్రీమియం, ఇండివిడ్యువల్ రేటెడ్ ప్రీమియంనకు సంబంధించి వరుసగా 28.1 శాతం, 25.6 శాతం వాటాతో ప్రైవేట్ రంగంలో అగ్రగామిగా కొనసాగుతున్నట్లు వివరించింది. నిర్వహణలోని ఆస్తుల పరిమాణం (ఏయూఎం) 16 శాతం వృద్ధి చెంది రూ. 5,11,708 కోట్లకు పెరిగింది.

జీసీసీలకు హాట్‌స్పాట్‌గా భారత్

2030 నాటికి 2,400 సెంటర్లు

- 2024 చివరికి 1,700
- ఫిక్కీ–అనరాక్ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: అంతర్జాతీయ సామర్థ్య కేంద్రాలకు (జీసీసీలు) ఆకర్షణీయ కేంద్రంగా భారత్ స్థానం మరింత బలపడనుంది. 2024 చివరికి దేశవ్యాప్తంగా 1,700 జీసీసీలు ఉంటే, 2030 నాటికి వీటి సంఖ్య2,400కు పెరుగుతుందని ఫిక్కీ, అనరాక్ సంయుక్త నివేదిక అంచనా వేసింది. అంతేకాదు వీటి మార్కెట్ పరిమాణం 64 బిలియన్ డాలర్ల నుంచి 110 బిలియన్ డాలర్లకు విస్తరిస్తుందని తెలిపింది. 2024 నాటికి జీసీసీలు 19 లక్షల మంది నిపుణులకు ఉపాధి కల్పించగా, 2030 నాటికి 28 లక్షల మంది నిపుణులకు పెరుగుతుందని అంచనా వ్యక్తం చేసింది. దేశంలో జీసీసీల మార్కెట్ గత కొన్నేళ్లలో ఎంతో వేగంగా పెరిగినట్టు అనరాక్ చైర్మన్ అనుజ్ పురి పేర్కొన్నారు. ''కీలకమైన ఐటీ/ఐటీఈఎస్, బ్యాంకింగ్, ఫైనాన్షియల్, బీమా (బీఎఫ్ఎస్ఐ), ఆరోగ్య సంరక్షణ, లైఫ్ సైన్సెస్, ఇంజనీరింగ్ పరిశోధన, అభివృద్ధి (ఈఆర్అండ్‌డీ) రంగాల నుంచి డిమాండ్ పెరగడం జీసీసీల వృద్ధికి ఇంధనంగా నిలుస్తోంది. ఇదే ధోరణి ఇకముందూ కొనసాగొచ్చు. భారత జీసీసీ మార్కెట్ ఏటా 10 శాతం చొప్పున కాంపౌండెడ్‌గా పెరుగుతూ 2030 నాటికి 105–110 బిలియన్ డాలర్లకు చేరుకోవచ్చు''అని అనుజ్ పురి తెలిపారు.

టైర్–2 నగరాలకూ విస్తరణ

దేశంలో జీసీసీల కార్యకలాపాలు టాప్–7కు వెలుపలి ద్వితీయ శ్రేణి నగరాలకూ విస్తరిస్తున్నట్టు ఫిక్కీ–అనరాక్ నివేదిక తెలిపింది. జైపూర్, ఇండోర్, సూరత్, కోచి, కోయింబత్తూర్ పట్టణాల్లోనూ జీసీసీలు ఏర్పాటువుతున్నట్టు పేర్కొంది. ''మూడు దశాబ్దాలుగా భారత ఆఫీస్ రియల్ ఎస్టేట్ మార్కెట్ నిర్వహణను ఖర్చుగానే చూసే వారు. కానీ, ఇప్పుడు ఇదొక కీలక చోదకం. అంతర్జాతీయ పెట్టుబడులకు, ఉపాధి కల్పనకు కేంద్రాలుగా మారుతున్నాయి. భారత యువతకు ఎంపికలుగా మారుతున్నాయి''అని ఫిక్కీలో పట్టణాభివృద్ధి, రియల్ ఎస్టేట్ కమిటీ చైర్మన్‌గా ఉన్న రాజ్ మెండ తెలిపారు. దేశంలోని టాప్–7 నగరాల్లో 800 మిలియన్ చదరపు అడుగుల (ఎస్ఎఫ్‌టీ) గ్రేడ్–ఏ ఆఫీస్ వసతులు ఉన్నాయని.. సగం మేర బెంగళూరు, ఢిల్లీ ఎన్‌సీఆర్‌లోనే ఏర్పాటైనట్టు ఈ నివేదిక వెల్లడించింది. 2025లో నికర వినియోగం 58 మిలియన్ ఎస్ఎఫ్‌టీ కాగా, స్థూల లీజింగ్ 80 మిలియన్ ఎస్ఎఫ్‌టీగా ఉన్నట్టు తెలిపింది.

హైదరాబాద్‌లో జీఐ ఔట్‌సోర్సింగ్ జీసీసీ

అకౌంట్స్ ఔట్‌సోర్సింగ్, నాలెడ్జ్ ప్రాసెస్ మేనేజ్‌మెంట్ సంస్థ జీఐ ఔట్‌సోర్సింగ్ తాజాగా హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ టెక్ పార్క్‌లో తమ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ)ని ప్రారంభించింది. కోవసెంట్‌లో భాగమైన ఎనేబ్లర్‌తో కలిసి దీన్ని ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఇందులో 50 మంది సిబ్బంది ఉండగా వచ్చే 12 నెలల్లో ఇది 100కి పెరగనున్నట్లు గ్రూప్ సీఈవో తారిఖ్ హుసేన్ తెలిపారు. 2028 నాటికి మరో 100 మందిని తీసుకోనున్నట్లు వివరించారు. ముంబై, ఢిల్లీ, అహ్మదాబాద్‌లో ప్రస్తుతం తమకున్న కార్యకలాపాలకు ఈ సెంటర్ అనుబంధంగా ఉంటుందని హుసేన్ వివరించారు. గ్లోబల్ క్లయింట్లకు ప్రపంచ స్థాయి ఫైనాన్షియల్ సొల్యూషన్స్ అందించే క్రమంలో ఏఐ ఆధారిత జీసీసీని ఏర్పాటు చేయడంలో జీఐ ఔట్‌సోర్సింగ్‌కి తోడ్పాటు అందించినట్లు కోవసెంట్ సీఎండీ సీవీ సుబ్రమణ్యం తెలిపారు.

క్యూ3 ఫలితాలు

ఎన్ఎండీసీ లాభం క్షీణత

రూ. 1,747 కోట్లు
షేరుకి రూ. 2.5 డివిడెండ్

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ ఇనుపఖనిజ దిగ్గజం ఎన్ఎండీసీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 8 శాతం క్షీణించి రూ. 1,747 కోట్లకు పరిమితమైంది. అధిక వ్యయాలు ప్రభావం చూపాయి. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 1,897 కోట్లు ఆర్జించింది. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 2.5 చొప్పున మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. కాగా.. తాజా త్రైమాసికంలో మొత్తం ఆదాయం మాత్రం 15 శాతం ఎగసి రూ. 7,983 కోట్లను అధిగమించింది. అయితే మొత్తం వ్యయాలు సైతం రూ. 4,359 కోట్ల నుంచి రూ. 5,609 కోట్లకు పెరిగాయి.

ఫలితాల నేపథ్యంలో ఎన్ఎండీసీ షేరు బీఎస్ఈలో యథాతథంగా రూ. 82 వద్ద ముగిసింది.

పిడిలైట్ లాభం అప్

రూ. 624 కోట్లు

న్యూఢిల్లీ: స్పెషాలిటీ కెమికల్స్, అధెసివ్స్ దిగ్గజం పిడిలైట్ ఇండస్ట్రీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 12 శాతం ఎగసి రూ. 624 కోట్లను తాకింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 557 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 3,369 కోట్ల నుంచి రూ. 3,710 కోట్లకు బలపడింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 2,672 కోట్ల నుంచి రూ. 2,930 కోట్లకు పెరిగాయి.

ఫలితాల నేపథ్యంలో పిడిలైట్ షేరు బీఎస్ఈలో 1 శాతం బలపడి రూ. 1,428 వద్ద ముగిసింది.

ఏబీ క్యాపిటల్ లాభం జూమ్

రూ. 945 కోట్లు

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ ఫైనాన్షియల్ సర్వీసుల దిగ్గజం ఆదిత్య బిర్లా క్యాపిటల్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 33 శాతం జంప్‌చేసి రూ. 945 కోట్లను తాకింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 708 కోట్లు మాత్రమే ఆర్జించింది. స్టాండెలోన్ లాభం సైతం 29 శాతం ఎగసి రూ. 772 కోట్లకు చేరింది. కొత్త కార్మిక చట్టాల అమలుతో రూ. 38 కోట్ల ప్రభావం పడినట్లు కంపెనీ పేర్కొంది. నికర వడ్డీ ఆదాయం రూ. 1,756 కోట్ల నుంచి రూ. 2,113 కోట్లకు బలపడింది. నికర వడ్డీ మార్జిన్లు 0.12 శాతం మెరుగుపడి 6.12 శాతాన్ని తాకాయి. మొత్తం వ్యయాలు రూ. 8,436 కోట్ల నుంచి రూ. 10,702 కోట్లకు పెరిగాయి.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 4 శాతం జంప్‌చేసి రూ. 345 వద్ద ముగిసింది.

జైడస్ వెల్‌నెస్‌కు నష్టాలు

రూ. 40 కోట్లు

న్యూఢిల్లీ: వెల్‌నెస్ ఫుడ్ ప్రొడక్టుల కంపెనీ జైడస్ వెల్‌నెస్ లాభాలను వీడి నష్టాలలోకి ప్రవేశించింది. ఈ ఆర్థిక సంవత్సరం(2025–26) మూడో త్రైమాసికంలో రూ. 40 కోట్ల నికర నష్టం ప్రకటించింది. కొత్త కార్మిక చట్టాల అమలు కారణంగా పెరిగిన వ్యయాలు ప్రభావం చూపాయి. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 6 కోట్లకు పైగా నికర లాభం ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రెట్టింపై రూ. 965 కోట్లకు చేరింది. గత క్యూ3లో రూ. 462 కోట్ల టర్నోవర్ మాత్రమే సాధించింది. అయితే మొత్తం వ్యయాలు సైతం రూ. 456 కోట్ల నుంచి రెట్టింపై రూ. 1,001 కోట్లకు చేరాయి. వీటిలో ప్రకటనలు, ప్రమోషన్ ఖర్చులు రూ. 59 కోట్ల నుంచి రూ. 179 కోట్లకు ఎగశాయి. ఈ కాలంలో న్యూట్రాలైట్ బ్రాండ్ రెండంకెల వృద్ధిని అందుకున్నట్లు కంపెనీ పేర్కొంది. అంతేకాకుండా డిలైట్, షుగర్ ఫ్రీ గ్రీన్ సైతం పటిష్ట అమ్మకాలు సాధించినట్లు వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో జైడస్ వెల్‌నెస్ షేరు బీఎస్ఈలో 4% పతనమై రూ. 418 వద్ద ముగిసింది.

లాభాల్లోకి వన్ మొబిక్విక్

రూ. 4 కోట్లు

న్యూఢిల్లీ: ఫిన్‌టెక్ కంపెనీ వన్ మొబిక్విక్ సిస్టమ్స్ నష్టాలను వీడి లాభాల్లోకి ప్రవేశించింది. ఈ ఆర్థిక సంవత్సరం(2025–26) మూడో త్రైమాసికంలో రూ. 4 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం ఆర్జించింది. ప్రధానంగా పేమెంట్ ప్రాసెసింగ్ చార్జీలు తగ్గడంతోపాటు, వ్యయ నియంత్రణ ఇందుకు దోహదపడింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 55 కోట్ల నికర నష్టం ప్రకటించింది. మొత్తం ఆదాయం సైతం 7 శాతం వృద్ధితో రూ. 289 కోట్లకు చేరింది. చెల్లింపుల స్థూల మెర్కండైజ్ విలువ కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా రూ. 48,100 కోట్లను తాకినట్లు కంపెనీ పేర్కొంది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో దాదాపు 20శాతం దూసుకెళ్లి రూ. 237 వద్ద ముగిసింది.

నష్టాల్లో భారత్ కోకింగ్ కోల్

రూ. 23 కోట్లు

న్యూఢిల్లీ: పీఎస్‌యూ దిగ్గజం కోల్ ఇండియా అనుబంధ కంపెనీ భారత్ కోకింగ్ కోల్(బీసీసీఎల్) లాభాలను వీడి నష్టాలలోకి ప్రవేశించింది. ఈ ఆర్థిక సంవత్సరం(2025–26) మూడో త్రైమాసికంలో రూ. 23 కోట్ల నికర నష్టం ప్రకటించింది. ఆదాయం క్షీణించడం ప్రభావం చూపింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 425 కోట్ల నికర లాభం ఆర్జించింది. కంపెనీ గత నెలలో స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టయ్యాక తొలిసారి త్రైమాసిక ఫలితాలు విడుదల చేసింది. కాగా.. మొత్తం ఆదాయం సైతం రూ. 3,757 కోట్ల నుంచి రూ. 2,853 కోట్లకు నీరసించింది. ఈ ఏడాది తొలి 9 నెలల్లో(ఏప్రిల్–డిసెంబర్) 24.65 మిలియన్ టన్నుల(ఎంటీ) బొగ్గును ఉత్పత్తి చేసింది. గతేడాది ఇదే కాలంలో 29.06 ఎంటీ ఉత్పత్తి సాధించింది.

ఫలితాల నేపథ్యంలో భారత్ కోల్ షేరు బీఎస్ఈలో యథాతథంగా రూ. 39 వద్ద ముగిసింది.

వరుణ్ బెవరేజెస్ లాభం హైజంప్

రూ. 260 కోట్లు

న్యూఢిల్లీ: పానీయాల దిగ్గజం పెప్సీకోకు అతిపెద్ద ఫ్రాంచైజీ బాట్లర్‌గా వ్యవహరిస్తున్న వరుణ్ బెవరేజెస్ గత ఆర్థిక సంవత్సరం(2025) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 33 శాతం జంప్ చేసి రూ. 260 కోట్లను తాకింది. అమ్మకాల పరిమాణం పుంజుకోవడం ఇందుకు సహకరించింది. అంతక్రితం ఏడాది(2024) ఇదే కాలంలో కేవలం రూ. 196 కోట్లు ఆర్జించింది. కంపెనీ కేలండర్ ఏడాదిని ఆర్థిక సంవత్సరంగా పరిగణించే సంగతి తెలిసిందే. మొత్తం ఆదాయం సైతం 14 శాతం ఎగసి రూ. 4,335 కోట్లకు చేరింది. నిర్వహణ లాభం(ఇబిటా) 10 శాతం మెరుగుపడి రూ. 639 కోట్లను అధిగమించింది. మొత్తం ఆదాయం 10 శాతం వృద్ధితో రూ. 22,578 కోట్లకు చేరింది. అమ్మకాల పరిమాణం 8 శాతం అధికమై 121.21 కోట్ల కేసులను తాకింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 3.3 శాతం క్షీణించి రూ. 451 వద్ద ముగిసింది.

శ్రేయస్ మొవ్వ

మెరుపుల పండక్కి భారత సంతతి!

టి20 వరల్డ్‌కప్‌లో 40 మంది ప్రవాస భారత క్రికెటర్లు

మూడు జాతీయ జట్లకు మనోళ్లే సారథులు ● మరో 3 రోజుల్లో టి20 ప్రపంచకప్

సౌరభ్ నేత్రావల్కర్

న్యూఢిల్లీ: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) టి20 ప్రపంచకప్‌లో ఒక్కో జట్టు నుంచి 11 మంది ప్లేయర్లు మాత్రమే మైదానంలో అడుగు పెడతారు. కానీ మరో మూడు రోజుల్లో ప్రారంభం కానున్న వరల్డ్‌కప్‌లో మాత్రం లెక్కకు మిక్కిలి భారత ఆటగాళ్లు బరిలోకి దిగనున్నారు. అదేంటి ఏ జట్టుకైనా ఒకటే నిబంధన కదా అనే అనుమానం రాకమానదు. ఇక్కడే అసలు మెలిక ఉంది. టీమిండియా తరఫున ఆడేది పదకొండు మందే... కానీ, ప్రపంచకప్‌లో బరిలోకి దిగుతున్న 20 జట్లలో భారత్‌తో పాటు మరో తొమ్మిది జట్ల తరఫున మనదేశ సంతతి ఆటగాళ్లు ఆడనున్నారు. రెండోసారి టి20 ప్రపంచకప్‌నకు అర్హత సాధించిన కెనడా జట్టులో అత్యధికంగా 11 మంది భారత సంతతి ప్లేయర్లు ఉండగా... అమెరికా జట్టులో 9 మంది మనవాళ్లు ఉన్నారు. ప్రవాస భారతీయులు అధికంగా ఉండే ఒమన్, యూఏఈ నుంచి ఏడుగురు చొప్పున మన మూలాలున్న ప్లేయర్లు వరల్డ్‌కప్ ఆడనుండగా... ఇష్ సోధి, రచిన్ రవీంద్ర రూపంలో న్యూజిలాండ్ నుంచి ఇద్దరు భారత సంతతి ఆటగాళ్లు పోటీపడనున్నారు. ఇక దక్షిణాఫ్రికా, వెస్టిండీస్, ఇటలీ, నెదర్లాండ్స్ నుంచి ఒక్కొక్కరు చొప్పున వరల్డ్‌కప్‌లో ఆడనున్నారు. ఇందులో కెనడా, అమెరికా, ఒమన్ జాతీయ జట్లకు సారథ్యం వహిస్తుంది కూడా మనవాళ్లే కావడం విశేషం. మరో మూడు రోజుల్లో టి20 వరల్డ్‌కప్ ప్రారంభం కానున్న నేపథ్యంలో వివిధ దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న భారత సంతతి ఆటగాళ్లపై ఓ కన్నేద్దాం!

పాకిస్తాన్ పనిపట్టి...

సౌరభ్ నేత్రావల్కర్... ఈ పేరు గత టి20 ప్రపంచకప్ సమయంలో బాగా వినిపించింది. అమెరికా వేదికగా జరిగిన ఆ టోర్నమెంట్‌లో మాజీ చాంపియన్ పాకిస్తాన్‌ను అమెరికా ఓడించడంలో ఈ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కీలక పాత్ర పోషించాడు.

మోనాంక్ పటేల్

గ్రూప్ దశలో పాకిస్తాన్, అమెరికా మధ్య జరిగిన పోరులో స్కోర్లు సమం కాగా... సూపర్ ఓవర్‌లో బౌలింగ్ చేసిన నేత్రావల్కర్... పాక్ బ్యాటర్లను కట్టడి చేశాడు. అంతకుముందు మ్యాచ్‌లోనూ 4 ఓవర్లలో కేవలం 18 పరుగులకే ఇచ్చి 2 వికెట్లు పడగొట్టాడు. ముంబైలో పుట్టి పెరిగి... ఒకప్పుడు అండర్–19 స్థాయిలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన సౌరభ్ ప్రస్తుతం ఉద్యోగరీత్యా అమెరికాలో స్థిరపడ్డాడు. లెఫ్టార్మ్ మీడియం పేస్ బౌలింగ్‌తో రాణించి అమెరికా జాతీయ జట్టులో చోటు దక్కించుకున్నాడు. గత వరల్డ్‌కప్‌లో అమెరికా జట్టు 'సూపర్–8' దశకు చేరడంతో కీలకంగా వ్యవహరించిన 34 ఏళ్ల సౌరభ్... సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి సెలవు పెట్టి మరోసారి సత్తా చాటేందుకు సిద్ధమయ్యాడు. ఒకప్పుడు సూర్యకుమార్ యాదవ్‌తో కలిసి మ్యాచ్‌లు ఆడిన సౌరభ్ ఈ శనివారం ముంబైలోని వాంఖడే మైదానం వేదికగా అతడికి ప్రత్యర్థిగా బరిలోకి దిగనున్నాడు. 'ఎలా స్పందించాలో అర్థం కావడం లేదు. కానీ, ఇది చాలా భావోద్వేగ క్షణం. జీవితం ఒక చక్రం లాంటిది. నేను ఇక్కడే క్రికెట్ ఆడటం ప్రారంభించా... మళ్లీ ఇన్నేళ్ల తర్వాత ఇక్కడే టీమిండియతో మ్యాచ్ ఆడతానని ఎప్పుడూ ఊహించలేదు' అని నేత్రావల్కర్ అన్నాడు.

ఆర్యన్ దత్

మోనాంక్ పటేల్

భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాతో కలిసి ఒకప్పుడు మ్యాచ్‌లు ఆడిన మోనాంక్ పటేల్... ప్రస్తుతం అమెరికా జట్టుకు కెప్టెన్‌గా వరల్డ్‌కప్‌నకు సిద్ధమయ్యాడు. 2024 టి20 వరల్డ్‌కప్‌లో పాకిస్తాన్‌తో పోరులో చక్కటి అర్ధశతకంతో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచిన మోనాంక్... ఈసారి కూడా మెగా టోర్నీలో తనదైన ముద్ర వేయాలని భావిస్తున్నాడు. గుజరాత్‌లో పుట్టి పెరిగిన 32 ఏళ్ల మోనాంక్... అండర్–19 స్థాయిలో బుమ్రాతో మ్యాచ్‌లు ఆడాడు. 'మేమిద్దరం చిన్నప్పుడు కలిసి మ్యాచ్‌లు ఆడాం. ఆ తర్వాత ఇద్దరి దారులు వేరయ్యాయి. బుమ్రా ఇప్పుడు ప్రపంచ అత్యుత్తమ స్థాయికి ఎదిగాడు. టీమిండియాతో మ్యాచ్‌లో అతడి బౌలింగ్‌ను ఎదుర్కోవడం చాలా కష్టం అని తెలుసు. మా వరకు ఉత్తమ ప్రదర్శన కనబర్చాలని అనుకుంటున్నాం' అని మోనాంక్ అన్నాడు.

జస్‌ప్రీత్ సింగ్

మొదటిసారి ఐసీసీ టి20 ప్రపంచకప్ ఆడనున్న ఇటలీ జట్టులో పంజాబ్‌లో పుట్టి పెరిగిన జస్‌ప్రీత్ సింగ్ చోటు దక్కించుకున్నాడు. ఇరవై ఏళ్ల క్రితం మెరుగైన జీవనోపాధి కోసం కుటుంబంతో కలిసి ఇటలీకి వలస వెళ్లిన జస్‌ప్రీత్... అక్కడ క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తూనే క్రికెట్ కొనసాగించాడు. తన ప్రదర్శనతో జాతీయ జట్టుకు ఎంపికైన 32 ఏళ్ల జస్‌ప్రీత్... వరల్డ్‌కప్ కోసం ఉత్సుకతతో ఎదురుచూస్తున్నాడు.

ఆర్యన్ దత్

ఇప్పటికే 2023 వన్డే ప్రపంచకప్ సందర్భంగా నెదర్లాండ్స్ తరఫున భారత్‌లో మ్యాచ్‌లాడిన ఆర్యన్ దత్... ఇప్పుడు టి20 వరల్డ్‌కప్‌నకు సిద్ధమవుతున్నాడు. 22 ఏళ్ల ఈ ఆఫ్ స్పిన్నర్ భారత్‌లో పుట్టకపోయినా... అతడి తల్లిదండ్రులది పంజాబే. మెరుగైన జీవనోపాధి కోసం ఆర్యన్ కుటుంబం నెదర్లాండ్స్‌కు వలస వెళ్లగా... అక్కడ తన స్పిన్‌తో సత్తాచాటిన ఆర్యన్ జాతీయ జట్టులో చోటు దక్కించుకున్నాడు.

జతిందర్ సింగ్

టి20 ప్రపంచకప్‌లో భారత సంతతి ఆటగాళ్లు

కెనడా (11): దిల్‌ప్రీత్ బాజ్వా (కెప్టెన్), అజయ్‌వీర్ హుండల్, అంశ్ పటేల్, హర్ష్ థాకెర్, జస్‌కరణ్‌దీప్ బుట్టర్, కన్వర్‌పాల్ తత్గుర్, నవ్‌నీత్ ధలీవాల్, రవీందర్‌పాల్ సింగ్, శివం శర్మ, శ్రేయస్ మొవ్వ, యువరాజ్ సామ్రా.
అమెరికా (9): మోనాంక్ పటేల్ (కెప్టెన్), జెస్సీ సింగ్, మిలింద్ కుమార్, నోస్తుష్ కెంజిగె, సాయితేజ ముక్కామల, సంజయ్ కృష్ణమూర్తి, హర్మీత్ సింగ్, సౌరభ్ నేత్రావల్కర్, శుభం రంజనె.
ఒమన్ (7): జతిందర్ సింగ్ (కెప్టెన్), వినాయక్ శుక్లా, కరణ్ సోనావాలె, జై ఒడెద్రా, ఆశిష్ ఒడెద్రా, వసీం అలీ, జితేన్ రామనంది.
యూఏఈ (7): అలీషాన్ షరాఫు, ఆర్యాంశ్ శర్మ, ధ్రువ్ పరాశర్, హర్షిత్ కౌశిక్, మయాంక్ కుమార్, సిమ్రన్‌జీత్ సింగ్, సొహైబ్ ఖాన్.
న్యూజిలాండ్ (2): ఇష్ సోధి, రచిన్ రవీంద్ర
దక్షిణాఫ్రికా (1): కేశవ్ మహరాజ్
వెస్టిండీస్ (1): గుడకేశ్ మోతీ
ఇటలీ (1): జస్‌ప్రీత్ సింగ్
నెదర్లాండ్స్ (1): ఆర్యన్ దత్

దిల్‌ప్రీత్ బాజ్వా

వరల్డ్‌కప్‌లో బరిలోకి దిగనున్న కెనడా జట్టయితే పూర్తిగా భాతర సంతతి ఆటగాళ్లతో నిండి ఉంది. ఆ జట్టుకు సారథ్యం వహిస్తున్న దిల్‌ప్రీత్ బాజ్వా ఇటీవలే కెనడాకు వలస వెళ్లాడు. అనతి కాలంలోనే తన ప్రతిభతో అక్కడి జాతీయ జట్టుకు కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. ఏజ్ గ్రూప్ క్రికెట్‌లో పంజాబ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన దిల్‌ప్రీత్... కెనడా గ్లోబల్ టి20 లీగ్‌లో విజృంభించి వెలుగులోకి వచ్చాడు.

జతిందర్ సింగ్

పంజాబ్‌లోని లుధియానాలో పుట్టి పెరిగిన జతిందర్ సింగ్... ఈ ప్రపంచకప్‌లో ఒమన్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. దశాబ్దానికి పైగా భారత దేశవాళీల్లో ఆడిన 36 ఏళ్ల జతిందర్... అవకాశాలు రాకపోవడంతో ఒమన్‌కు వలసవెళ్లి ఆ దేశ జట్టులో చోటు దక్కించుకున్నాడు. అతడితో పాటు వినాయక్ శుక్లా, కరణ్ సోనావాలె, జై, ఆశిష్, వసీం, జితేన్ రామనంది ఇలా ఏడుగురు భారత సంతతి ఆటగాళ్లు ఒమన్ తరఫున బరిలోకి దిగనున్నారు.

తెలుగువాళ్లు కూడా...

అమెరికా తరఫున ఆడుతున్న ముక్కామల సాయితేజ రెడ్డి... కెనడా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రేయస్ మొవ్వ తెలుగు మూలాలున్న ఆటగాళ్లే. అమెరికాలోనే పుట్టి పెరిగిన సాయితేజ రెడ్డి అమెరికా జాతీయ జట్టు ఓపెనర్‌గా 37 వన్డేలు, 18 టి20లు ఆడాడు. మంచి స్ట్రయిక్ ప్లేయర్‌గా గుర్తింపు తెచ్చుకున్న సాయితేజ... ఈ మెగాటోర్నీలో ఎలాంటి ప్రదర్శన చేస్తాడో చూడాలి. భారత్‌లో పుట్టి కెనడాకు వలస వెళ్లిన శ్రేయస్ మొవ్వ ఆ దేశ జట్టు తరఫున ఇప్పటి వరకు 24 వన్డేలు, 24 టి20లు ఆడాడు.

సాయితేజ

పతకాల వేటకు భారత షూటర్లు సిద్ధం

నేటి నుంచి ఆసియా చాంపియన్‌షిప్

న్యూఢిల్లీ: సొంతగడ్డపై పతకాల పంట పండించేందుకు భారత షూటర్లు సిద్ధమయ్యారు. నేటి నుంచి పది రోజులపాటు జరిగే ఆసియా సీనియర్, జూనియర్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్ నుంచి ఏకంగా 118 మంది షూటర్లు బరిలో ఉన్నారు. తొలి రోజు నాలుగు ఈవెంట్స్‌లో ఫైనల్స్ జరగనున్నాయి. సీనియర్ విభాగంలో పురుషుల, మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఫైనల్స్... జూనియర్, యూత్ విభాగంలో పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఫైనల్ నిర్వహిస్తారు. మహిళల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో ఒలింపిక్ పతక విజేత మనూ భాకర్‌తోపాటు ప్రపంచకప్ చాంపియన్ సురుచి సింగ్, ఇషా సింగ్... పురుషుల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో సామ్రాట్ రాణాల నుంచి పతకాలు ఆశించవచ్చు. ప్రపంచ రెండో ర్యాంకర్ వరుణ్ తోమర్, శ్రావణ్ కుమార్‌లు కూడా పతకాలు సాధించే సత్తా గలవారు.


ఇషా సింగ్

సురుచి

జూనియర్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ షూటర్ ముకేశ్ నేలవల్లితోపాటు జొనాథన్ గావిన్ ఆంటోని, అభినవ్ దేశ్వాల్ ఫేవరెట్స్. భారత్ తర్వాత కజకిస్తాన్ నుంచి అత్యధికంగా 35 మంది షూటర్లు పోటీపడుతున్నారు. దక్షిణ కొరియా, జపాన్, చైనీస్ తైపీ, వియత్నాం, హాంకాంగ్ షూటర్ల నుంచి కూడా గట్టిపోటీ తప్పదు. అయితే చైనా, పాకిస్తాన్ జట్లు ఆసియా టోర్నీకి దూరంగా ఉన్నాయి. బంగ్లాదేశ్ నుంచి ఒక్కరే బరిలో ఉన్నారు.

ఇంగ్లండ్ 'క్లీన్‌స్వీప్'

చివరి టి20లోనూ ఓడిన శ్రీలంక

కరన్

పల్లెకెలె: సమష్టి ప్రదర్శనతో సత్తా చాటిన ఇంగ్లండ్ జట్టు... శ్రీలంకపై టి20 సిరీస్‌ను 'క్లీన్ స్వీప్' చేసింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా మంగళవారం జరిగిన ఆఖరి టి20లో ఇంగ్లండ్ 12 పరుగుల తేడాతో ఆతిథ్య శ్రీలంకను చిత్తు చేసింది. ఈ పర్యటనలో భాగంగా వన్డే సిరీస్‌ను 2–1తో సొంతం చేసుకున్న ఇంగ్లండ్... టి20 సిరీస్‌ను 3–0తో చేజిక్కించుకుంది. చివరి మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 128 పరుగులు చేసింది. సామ్ కరన్ (48 బంతుల్లో 58; 6 ఫోర్లు, 1 సిక్స్) హాఫ్‌సెంచరీతో రాణించగా... జోస్ బట్లర్ (25), లియామ్ డాసన్ (14) మాత్రమే రెండంకెల స్కరు చేశారు. కెప్టెన్ హ్యారీ బ్రూక్ (4), బెన్ డకెట్ (0), జాకబ్ బెథెల్ (3), టామ్ బాంటన్ (7), విల్ జాక్స్ (3) విఫలమయ్యారు. శ్రీలంక బౌలర్లలో దుశ్మంత చమీరా 24 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టగా... పతిరణకు 2 వికెట్లు దక్కాయి. అనంతరం ఛేదనలో లంక 19.3 ఓవర్లలో 116 పరుగులకు ఆలౌటైంది. నిషాంక (23), కుషాల్ మెండిస్ (26) కాస్తా పోరాడగా... తక్కినవాళ్లు పెద్దగా ఆకట్టుకోలేకపోయారు. ఇంగ్లండ్ బౌలర్లలో బెథెల్ 4, జాక్స్ 3 వికెట్లు పడగొట్టారు. సామ్ కరన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు దక్కాయి.

13,650 పాయింట్లతో...

● 'టాప్' ర్యాంక్‌లో అల్‌కరాజ్
● అత్యధిక ర్యాంకింగ్ పాయింట్లు సాధించిన మూడో ప్లేయర్‌గా గుర్తింపు

అల్‌కరాజ్

మెల్‌బోర్న్: తొలిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ సాధించడంతోపాటు 'కెరీర్ గ్రాండ్‌స్లామ్' పూర్తి చేసుకున్న స్పెయిన్ స్టార్ కార్లోస్ అల్‌కరాజ్ తన ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు. అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) ర్యాంకింగ్స్‌లో 22 ఏళ్ల అల్‌కరాజ్ టాప్ ర్యాంక్‌లో నిలిచాడు. అల్‌కరాజ్ ఖాతాలో 13,650 పాయింట్లు ఉండటం విశేషం. ఈ క్రమంలో ఏటీపీ ర్యాంకింగ్స్ చరిత్రలో అత్యధిక పాయింట్లు సాధించిన మూడో ప్లేయర్‌గా అల్‌కరాజ్ గుర్తింపు పొందాడు. ఈ జాబితాలో సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్ (16,950 పాయింట్లు; జూన్ 20, 2016), స్పెయిన్ మేటి రాఫెల్ నాదల్ (15,390 పాయింట్లు; ఏప్రిల్ 20, 2009) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు. ఏటీపీ ర్యాంకింగ్స్ చరిత్రలో ఇప్పటి వరకు 10 వేలకు పైగా పాయింట్లు సాధించిన వారు ఏడుగురే ఉన్నారు. ఆండీ ముర్రే (బ్రిటన్–12,685; నవంబర్ 21, 2016), రోజర్ ఫెడరర్ (స్విట్జర్లాండ్–12,315; అక్టోబర్ 29, 2012), యానిక్ సినెర్ (ఇటలీ–12,030; ఆగస్టు 4, 2025), డానిల్ మెద్వెదెవ్ (రష్యా–సెప్టెంబర్ 13, 2021) కూడా ఈ ఘనత సాధించారు.

చాంపియన్ హరియాణా థండర్స్

● ఫైనల్లో ఢిల్లీ దంగల్ వారియర్స్‌పై గెలుపు
● వరుసగా రెండోసారి ప్రొ రెజ్లింగ్ లీగ్ టైటిల్ కైవసం

న్యూఢిల్లీ: ప్రొ రెజ్లింగ్ లీగ్ (పీడబ్ల్యూఎల్)లో హరియాణా థండర్స్ జట్టు వరుసగా రెండోసారి చాంపియన్‌గా నిలిచింది. ఫైనల్లో హరియాణా 5–4 పాయింట్ల తేడాతో ఢిల్లీ దంగల్ వారియర్స్‌పై గెలిచింది. ఇప్పటి వరకు ఈ లీగ్ ఐదుసార్లు నిర్వహించగా... అందులో హరియాణా జట్టు రెండోసారి ట్రోఫీ చేజిక్కించుకుంది. చివరగా 2019లో జరిగిన లీగ్‌లో హరియాణా జట్టు టైటిల్ నెగ్గింది. తాజా లీగ్‌లో హోరాహోరీగా సాగిన తుది పోరులో ఎనిమిది బౌట్‌లు ముగిసేసరికి ఇరు జట్లు 4–4తో సమంగా నిలిచాయి. చివరగా జరిగిన మహిళల 62 కేజీల పోరులో పారిస్ ఒలింపిక్స్ రజత పతక విజేత ఇరినా కొలియాడెన్కో ఒత్తిడిని అధిగమిస్తూ... అంజలిని చిత్తుచేసింది. దీంతో హరియాణా థండర్స్ విజేతగా నిలిచింది. అంతకుముందు పురుషుల 74 కేజీల విభాగంలో జరిగిన తొలి బౌట్‌లో బైరమోవ్ (ఢిల్లీ) 8–2తో ప్రవిందర్ (హరియాణా)పై... రెండో బౌట్‌గా జరిగిన మహిళల 76 కేజీల పోరులో కాజల్ (హరియాణా) 3–1తో అనస్తసియా అల్పియోవా (ఢిల్లీ)పై... మూడో బౌట్ పురుషుల 65 కేజీల ఈవెంట్‌లో సుజీత్ కల్కల్ (ఢిల్లీ) 8–6తో తుమర్ ఒచిర్ తుల్గా (హరియాణా)పై... నాలుగో బౌట్ మహిళల 53 కేజీల పోరులో యూ సుసకీ (హరియాణా) 5–0తో సారిక (ఢిల్లీ)పై... ఐదో బౌట్ పురుషుల 86 కేజీల విభాగంలో హాది భక్తియార్ 11–0తో అశిరోవ్ అష్రఫ్ (హరియాణా)పై... ఆరో బౌట్ పురుషుల 57 కేజీల పోరులో అక్షయ్ ధేరె (హరియాణా) 16–0తో అమిత్ (ఢిల్లీ)పై... ఏడో బౌట్‌గా జరిగిన పురుషుల 125 కేజీల పోరులో రోనక్ 12–1తో అనిరుధ్ (హరియాణా)పై గెలిచారు. ఎనిమిదో బౌట్ మహళల 57 కేజీల విభాగంలో నేహ (హరియాణా) 8–2తో అంజలి (ఢిల్లీ)పై గెలిచారు. ఢిల్లీ దంగల్ వారియర్స్‌కు చెందిన యువ రెజ్లర్ తురాన్ బైరమోవ్ 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్' అవార్డు దక్కించుకున్నాడు. పురుషుల 57 కేజీల విభాగంలో పోటీపడిన అతడు... ఆడిన ఏడు బౌట్‌లలోనూ విజయాలు సాధించడం విశేషం. హరియాణా థండర్స్ రెజ్లర్ నేహా 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ... ఢిల్లీ దంగల్ వారియర్స్‌కు చెందిన రోనక్ (125 కేజీలు) 'ఫైటర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కించుకున్నారు. పంజాబ్ రాయల్స్‌కు చెందిన చంద్రమోహన్ లీగ్‌లో అత్యధిక పాయింట్లు సాధించిన రెజ్లర్‌గా నిలిచాడు. హరియాణా థండర్స్‌కు చెందిన అక్షయ్ 'ఇంపాక్ట్ ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు గెలుచుకున్నాడు.

మంచుమయంగా మారిన జర్మనీలోని హార్జ్ ప్రాంతం విహంగ వీక్షణం

జర్మనీలోని హాంబర్గ్‌లో ప్రయాణికుల పడవల చుట్టూ తేలుతున్న మంచు గడ్డలు

జర్మనీలోని హార్జ్‌లో హైటెన్షన్ విద్యుత్ తీగలపై పేరుకుపోయిన మంచు

పాకిస్తాన్, చైనా తరహాలో రాహుల్ ప్రవర్తన

మమతా బెనర్జీ ఉండాల్సింది జైల్లోనే...

- కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ ధ్వజం

న్యూఢిల్లీ: కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీపై బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆయన పాకిస్తాన్, చైనా తరహాలో వ్యవహరిస్తున్నాడని మండిపడ్డారు. మనీ లాండరింగ్ కేసులో సాక్ష్యాధారాలను బలవంతంగా లాక్కున్నందుకు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని జైల్లో పెట్టాలని అన్నారు. గిరిరాజ్ సింగ్ తాజాగా ఓ మీడియా సంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చారు. భారత్–చైనా సరిహద్దు అంశంపై ఈ సమయంలో పార్లమెంట్‌లో మాట్లాడాలని భావించడం సరైంది కాదని రాహుల్ గాంధీకి సూచించారు. లోక్‌సభలో స్పీకర్ రూలింగ్‌ను పాటించడానికి ఒక సభ్యుడు నిరాకరించడం పార్లమెంటరీ చరిత్రలోనే బహుశా ఇది మొదటిసారి కావొచ్చని తెలిపారు. రాహుల్ గాంధీకి ఎన్జీవో నుంచి చైనా సొమ్ము అందుతూ ఉండొచ్చని, అందుకే భారత సైన్యాన్ని పార్లమెంట్ లోపల, బయట కించపర్చడానికి ప్రయత్నిస్తున్నారని అనుమానం వ్యక్తంచేశారు. చట్టం, నిబంధనల ప్రకారమే పార్లమెంట్ కార్యకలాపాలు సాగుతాయని, స్పీకర్ సైతం ఆయా నిబంధనలు పాటించాల్సిందేనని తేల్చిచెప్పారు. లోక్‌సభలో ఐదుసార్లు రూలింగ్ ఇచ్చినా రాహుల్ పట్టించకోలేదని విమర్శించారు. ఆయన మూర్ఖుడు కాదని అన్నారు. రాష్ట్రపతి ప్రసంగంపై మాట్లాడుతూ దేశాన్ని అప్రతిష్టపాలు చేసేలా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నించారు. చైనా రాయబార కార్యాలయాన్ని ఎందుకు సందర్శించారో రాహుల్ చెప్పాలన్నారు. నిజంగా సరిహద్దు గురించి మాట్లాడాలనుకుంటే తొలుత 1962లో జరిగిన యుద్ధం గురించి మాట్లాడాలని రాహుల్‌కు సూచించారు. అప్పట్లో ఏం జరిగిందో, ఎన్ని వేల ఎకరాల భూమిని చైనాకు అప్పగించారో బయటకు రావాలన్నారు. మమతా బెనర్జీపైనా గిరిరాజ్ సింగ్ విమర్శలు గుప్పించారు. ఆమెకు ఓటమి భయం పట్టుకుందని, అందుకే డ్రామాలాడుతున్నారని ఆరోపించారు. మనీ లాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా ఐప్యాక్ కార్యాలయంలో ఈడీ సోదాలు చేస్తే మమతా బెనర్జీ రంగప్రవేశం చేసి, సాక్ష్యాధారాలు లాక్కెల్లారని మండిపడ్డారు. అందుకు ఆమెను జైల్లో పెట్టాలన్నారు.

అది గుర్తించదగిన వ్యాధి.. పూర్తిగా నిర్మూలించాలి

హైకోర్టులు తీర్పులను నెలలపాటు రిజర్వు చేయడంపై సుప్రీం వ్యాఖ్య

న్యూఢిల్లీ: హైకోర్టులు వివిధ కేసుల్లో విచారణలను పూర్తి చేసి, తీర్పులను విడుదల చేయకుండా నెలల తరబడి రిజర్వులో ఉంచడంపై సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ వైఖరిని గుర్తించదగిన వ్యాధిగా పేర్కొన్న అత్యున్నత న్యాయస్థానం దీనిని పూర్తిగా నిర్మూలించాల్సి ఉందంటూ వ్యాఖ్యానించింది. కక్షిదారులకు సకాలంలో న్యాయం అందేలా చూడాల్సిన బాధ్యతను నొక్కిచెప్పింది. జార్ఖండ్ హైకోర్టు గతేడాది డిసెంబర్ 4వ తేదీన ఓ పిటిషన్‌ను మౌఖికంగా కొట్టివేసి, తీర్పును ఇప్పటికీ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయలేదంటూ దాఖలైన పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం. పంచోలీల ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. తీర్పులను నెలల తరబడి ఆపడం అంటే చట్టంతో ఆడుకోవడమేనని, ఇలాంటి వ్యవహారంపై కచ్చితంగా ఒక బలమైన సందేశం వెళ్లాలని పిటిషనర్ తరఫున సీనియర్ లాయర్ ముకుల్ రోహత్గి పేర్కొన్నారు. స్పందించిన ధర్మాసనం.. మన వ్యవస్థలో మొత్తమ్మీద రెండు రకాలైన జడ్జీలున్నారు. ఒకరు ప్రతి రోజూ అందరి వాదనలు విని ఒకేసారి 10–15 కేసుల్లో తీర్పులను రిజర్వులో కూడా ఉంచుతారు. కొందరైతే తీర్పులేమీ ఇవ్వరు. ఇక్కడ ఏఒక్కరినీ వ్యక్తిగతంగా తప్పుపట్టడం లేదు. ఇది మొత్తం న్యాయవ్యవస్థ ముందున్న ఒక సవాల్. గుర్తించదగిన వ్యాధి. దీనికి చికిత్స చేసి నిర్మూలించాలి. ఇది మరింత ముదరనీయరాదు'అని పేర్కొంది. వచ్చే వారం చివరికల్లా పిటిషనర్ తరఫు లాయర్‌కు తీర్పు ప్రతిని అందివ్వాలని హైకోర్టును ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 16వ తేదీకి వాయిదా వేసింది. అదేవిధంగా, త్వరలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులతో జరిగే సమావేశంలో ఈ అంశాన్ని ప్రస్తావిస్తామని, అనుసరించదగిన పరిష్కారం వెతుకుతామని తెలిపింది. తీర్పును రిజర్వు చేసిన తేదీ, ప్రకటించిన తేదీ, అప్‌లోడ్ చేసిన తేదీలతో రిజర్వులో ఉంచిన తీర్పుల వివరాలతో నివేదిక ఇవ్వాలంటూ హైకోర్టులను గతేడాది నవంబర్‌లో సుప్రీంకోర్టు ఆదేశించింది.

ఏకబిగిన 4 గంటలు ఈదాడు

తల్లిని, తోబుట్టువులను రక్షించిన బుడతడు

మెల్‌బోర్న్: ఓ తల్లి, ఆమె ముగ్గురు పిల్లలు కలిసి కయాక్, పెడల్ బోర్డులతో సముద్రంలో సరదాగా ఈదుతున్నారు. అప్పటి దాకా ప్రశాంతంగా ఉన్న సముద్రంలో అలజడి మొదలయ్యింది. ఒక్కసారిగా అలల తాకిడి పెరిగిపోయింది. ప్రమాదాన్ని శంకించి తిరిగి ఒడ్డుకు చేరుకునేందుకు వారు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. నలుగురూ అలా సముద్రంలోకి దూరంగా కొట్టుకుపోయారు. అప్పుడు ఆ తల్లి తీసుకున్న ఓ నిర్ణయం నలుగురి ప్రాణాలను కాపాడింది. అదేమంటే..ఇద్దరు చిన్న పిల్లలను తనతోటే ఉంచుకుని పెద్ద కుమారుడిని మాత్రం ఒంటరిగానే తీరానికి ఈదుతూ వెళ్లి, అధికారులను అప్రమత్తం చేయాలని పురమాయించింది. ఆ బుడతడు గట్టోడు. తల్లి మాట ప్రకారం ఒంటరిగా తిరుగు పయనమయ్యాడు. వేగంగా ఈత కొట్టేందుకు అడ్డుగా ఉన్నాయంటూ తెచ్చుకున్న కయాక్‌ను, లైఫ్ జాకెట్‌ను పక్కకు పడేశాడు. మొండిగా ఈదడం మొదలుపెట్టాడు. భారీగా వచ్చి పడుతున్న అలలు తిరిగి వెనక్కి తోసేస్తున్నా ధైర్యం కోల్పోలేదు. మెల్లమెల్లగా ముందుకు సాగాడు. అలా నాలుగు గంటలు గడిచిపోయాయి. చివరికి కాలికి నేల తగిలింది. తీరానికి చేరుకున్నాడు. అప్పటికి సమయం సాయంత్రం 6 గంటలు. వెంటనే అక్కడున్న భద్రతాధికారులకు విషయం తెలిపాడు. వారు బోట్లు, హెలికాప్టర్లతో సముద్రంపై అన్వేషణ ప్రారంభించారు. రాత్రి 8.30 గంటల ప్రాంతంలో తల్లి, ఇద్దరు చిన్నారులు తీరానికి 14 కిలోమీటర్ల దూరంలో అలల మధ్యలో పెడల్ బోర్డులకు అతుక్కుని ఉండటం వారి కళ్లబడింది. వెంటనే తాళ్ల సాయంతో వారిని పైకి తీసుకుని, ఒడ్డుకు చేర్చారు. ఆస్ట్రేలియా తీరంలో శుక్రవారం చోటుచేసుకున్న ఈ ఘటనలో ఆ 13 ఏళ్ల బుడతడు ఆస్టిన్ అప్పెల్‌బీ కాగా, అతడు కాపాడింది తల్లి జోన్(47), తమ్ముడు బ్యూ(12), చెల్లెలు గ్రేస్(8)లను. వీరిది పెర్త్ నగరం. దాదాపు 10 గంటలపాటు సముద్రం నీళ్లలోనే ఉండిపోవడంతో ఆందోళన చెందినప్పటికీ, మొత్తమ్మీద వారికి ఆస్పత్రిలో చేరాల్సిన అవసరమే రాలేదని అధికారులు తెలిపారు. తాము అక్కడికి చేరుకునేటప్పటికి ముగ్గురూ చలి తీవ్రతకు వణుకుతున్నారని, బ్యూ కాళ్లు మొద్దుబారిపోయాయని అన్నారు.

ఆస్టిన్

తల్లి, ఇద్దరు తోబుట్టువులతో ఆస్టిన్(కుడి చివర)

అది కఠిన నిర్ణయం

ముగ్గురు పిల్లలతోపాటు సముద్రంలోకి దూరంగా కొట్టుకుపోయినట్లు తెలుసుకున్న తాను..ఎంతో భయపడినట్లు జోన్ తెలిపారు. 'ఆ సమయంలో నేను తీసుకున్న నిర్ణయం ఎంతో కఠినమైంది. అప్పటికే మెల్లమెల్లగా సూర్యాస్తమయం అవుతోంది. ఒడ్డుకు చేరి, అక్కడి వారికి మేం ప్రమాదంలో చిక్కుకున్న విషయం తెలపాలని ఆస్టిన్‌కు పురమాయించాను. ముగ్గురు పిల్లల్నీ కోల్పోలేను కదా..! ఆస్టిన్ ముందుకు వెళతాడని నమ్మకం ఉన్నా, అసలే చీకటి. సురక్షితంగా ఉంటాడో లేదో..అని లోలోపల అనుమానం'అని ఆమె వివరించారు. పిల్లలికి ధైర్యం చెబుతూ, పాటలు పాడుతూ సరదాగా గడిపేందుకు ప్రయత్నించా. రాత్రయిన కొద్దీ అలల తీవ్రత, చలి పెరిగిపోయాయి. ఎంతసేపటికీ సాయం అందకపోయేసరికి అపాయం శంకించాను'అని జోన్ తెలిపారు.. ఎలాగైతేనేం.. నాకు ముగ్గురు పిల్లలు. ముగ్గురూ సురక్షితంగా ఉన్నారు. ఇంత కన్నా కావల్సిందేముంటుంది?అని జోన్ గద్గదస్వరంతో తెలిపారు. '13 ఏళ్ల ఆస్టిన్‌ను ఎంత ప్రశంసించినా తక్కువే. పట్టుదల, ధైర్యంతో తల్లి, తోబుట్టువుల ప్రాణాలను కాపాడుకున్నాడు'అని పోలీస్ ఇన్‌స్పెక్టర్ జేమ్స్ బ్రాడ్లీ అన్నారు.

హైడ్రోజన్ ఇంధనంతో నడిచే ప్యాసింజర్ బస్సులు

- హెచ్‌వీఐసీ ఫౌండేషన్‌తో కొచ్చి విమానాశ్రయ ఒప్పందం
- జాతీయ స్థాయిలో మొట్టమొదటి సంస్థగా రికార్డు

కొచ్చి: విమానయాన రంగంలో క్లీన్ అండ్ గ్రీన్ మొబిలిటీ వైపు కేరళ ఒక ముందడుగు వేసింది. ప్రయాణికుల రవాణా కోసం హైడ్రోజన్ ఇంధనంతో నడిచే బస్సులను కొచ్చి ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (సీఐఏఎల్) ప్రవేశపెట్టనుంది. దీనికోసం కేరళ హైడ్రోజన్ వ్యాలీ ఇన్నోవేషన్ క్లస్టర్ (హెచ్‌వీఐసీ)ఫౌండేషన్, సీఐఏఎల్ మధ్య ఫిబ్రవరి 1న ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం కొచ్చి విమానాశ్రయంలో మూడు హైడ్రోజన్ ఇంధన సెల్ ఎలక్ట్రిక్ బస్సుల సేకరణ, నిర్వహణకు మార్గం సుగమం చేస్తుందని సీఐఏఎల్ ఒక ప్రకటనలో తెలిపింది. భారత ప్రభుత్వ జాతీయ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ కింద కేరళ హైడ్రోజన్ వ్యాలీ చొరవలో భాగంగా ఈ ప్రాజెక్టును రూపొందించారు. మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ. 8.7 కోట్లు కాగా, వీటిని దశలవారీగా విడుదల చేస్తారు. హైడ్రోజన్ బస్సుల సేకరణ 12 నెలల్లో పూర్తవుతుందని భావిస్తున్నారు. ఆ తరువాత బస్సుల యాజమాన్యం సీఐఏఎల్ పరిధిలోనే ఉంటుంది. అన్ని ఖర్చులను విమానాశ్రయ సంస్థే నిర్వహిస్తుంది. బీపీసీఎల్‌తో కలిసి సీఐఏఎల్ అభివృద్ధి చేస్తున్న గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ ద్వారా బస్సులకు ఇంధన సరఫరా చేస్తారు. ఈ ప్రాజెక్టు విమానాశ్రయ రవాణా కార్యకలాపాల నుంచి కర్బన ఉద్గారాలను గణనీయంగా తగ్గించడంతో పాటు ప్రయాణికుల సౌకర్యాన్ని మెరుగుపరుస్తుందని సీఐఏఎల్ తెలిపింది. హైడ్రోజన్ ఇంధనంతో నడిచే ప్యాసింజర్ బస్సులు కాలుష్య రహిత ప్రజా రవాణాకు ఒక విప్లవాత్మక పరిష్కారం. ఇవి హైడ్రోజన్, ఆక్సిజన్ కలయికతో విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ, కేవలం నీటి ఆవిరిని మాత్రమే ఉద్గారాలుగా విడుదల చేస్తాయి. ఒక్కసారి ఇంధనం నింపితే సుమారు 400–600 కి.మీ వరకు ఇవి ప్రయాణించగలవు.

2019 నుంచి 7,400 మంది నక్సల్స్ అరెస్ట్

లోక్‌సభకు తెలిపిన హోం శాఖ

న్యూఢిల్లీ: 2019 నుంచి 7,400 మందికి పైగా మావోయిస్టులు అరెస్ట్ కాగా, మరో 5,880 మంది లొంగిపోయారని కేంద్రం వెల్లడించింది. వామపక్ష తీవ్రవాదానికి సంబంధించిన ఘటనల్లో 2010 నుంచి 88శాతం మేర తగ్గదల నమోదైందని తెలిపింది. ఇటువంటి ఘటనలు 2010లో 1,936 కాగా, 2025కల్లా ఇవి 234కు తగ్గాయని మంగళవారం లోక్‌సభకు తెలిపింది. ఒక ప్రశ్నకు ఈ మేరకు హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ సమాధానమిచ్చారు. 2025లో వివిధ ఎన్‌కౌంటర్లలో 364 మంది ఉగ్రవాదులు చనిపోగా, 1,022 మందిని బలగాలు అరెస్ట్ చేశాయని, మరో 2,337 మంది లొంగిపోయారన్నారు. అదేవిధంగా, 2018లో దేశంలోని వివిధ రాష్ట్రాల్లో మావోయిస్ట్ ప్రభావిత జిల్లాలు 126 కాగా, 2025 డిసెంబర్ నాటికి ఇవి 8 మాత్రమే ఉన్నాయని తెలిపారు.

మామ ఆస్తుల వివరాల్ని అల్లుడికి ఇవ్వలేం

యూపీ సహ చట్టం కమిషనర్ స్పష్టీకరణ

లక్నో: మామ వ్యక్తిగత వివరాలైన వేతనం, ఆస్తులు, అప్పులకు సంబంధించిన సమాచారాన్ని సహ చట్టం కింద అతడి అల్లుడికి ఇవ్వలేమని యూపీ సమాచార హక్కు కమిషన్ తెలిపింది. ఈ మేరకు రాష్ట్ర కమిషనర్ మహ్మద్ నదీమ్ జనవరి 7వ తేదీన జారీ చేసిన ఆదేశాలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. ప్రైవేట్ కోర్టు కేసులకు అవసరమైన ఆధారాలను అందించడం, వ్యక్తిగత గోప్యతలో జోక్యం చేసుకోవడం సహచట్టం ఉద్దేశం కాదని స్పష్టత ఇచ్చారు. ఆస్తులు, వేతనం, పింఛను తదితర వ్యక్తిగత వివరాలను వేరెవ్వరికీ ఇవ్వరాదని ఇప్పటికే సుప్రీం కోర్టు స్పష్టంగా చెప్పిందంటూ గుర్తు చేశారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి 2015 జనవరి ఒకటో తేదీన రిటైరైన రిషిపాల్ సింగ్ ఆస్తులు, పింఛను వివరాలను అందజేయాలంటూ కుల్వంత్ సింగ్ అనే వ్యక్తి బిజ్నోర్ జిల్లా నజిబాబాద్ తహశీల్దార్‌కు 2025 జూలై 27వ తేదీన సహచట్టం కింద దరఖాస్తు చేసుకున్నాడు. రిషిపాల్ సింగ్ కుమార్తె భర్త, సొంత అల్లుడే కుల్వంత్ సింగ్. రూ.26 లక్షల కట్నం కోసం వేధిస్తున్నానంటూ భార్య తనపై కట్నం వేధింపుల కేసు పెట్టిందని, ఈ కేసుకు మామ ఆర్థిక స్థితిగతుల వివరాలు అవసరమని అతడు పేర్కొన్నాడు. ఈ దరఖాస్తుపై నజిబాబాద్ తహశీల్దార్ సమాధానమివ్వలేదు. దీంతో, కుల్వంత్ సింగ్ రాష్ట్ర సమాచార కమిషన్‌ను ఆశ్రయించాడు. 'ఈ సమాచారం కోరిన వ్యక్తి బయటి వాడు కాదు, అతడి సొంత ల్లుడే. ఈ సమాచారం వ్యక్తిగత అవసరాల కోసమే తప్ప, విస్తృత ప్రజా ప్రయోజనం కోసం మాత్రం కాదు. పైపెచ్చు ఇది కట్నం వేధింపుల కేసు. మామ తనకు రూ.26 లక్షలు ఇవ్వగల సత్తా ఉండి కూడా కుమార్తెతో వేధింపుల కేసు పెట్టించాడని వాదించేందుకు దీనిని వాడుకోవాలనుకున్నాడు. అందుకే అతడి దరఖాస్తును తిరస్కరించాం'అని రాష్ట్ర సహ కమిషనర్ నదీమ్ చెప్పారు. అంతగా కావాలంటే అతడు కోర్టుకు వెళ్లవచ్చన్నారు. కోర్టు అంగీకారంతో సంబంధిత అధికారుల నుంచి పూర్తి సమాచారాన్ని పొందవచ్చని వివరించారు.

లైంగిక దాడి కేసును దాచి పెట్టినందుకు.. భారత సంతతి వ్యక్తి అమెరికా పౌరసత్వం రద్దు

న్యూయార్క్: ట్యాక్సీలో ఎక్కిన ప్రయాణికురాలిపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలను దాచిన నేరానికిగాను భారత సంతతికి చెందిన గుర్మీత్ సింగ్ అమెరికా పౌరసత్వం రద్దయ్యే పరిస్థితి వచ్చింది. ఇందుకు సంబంధించి న్యూయార్క్ డిస్ట్రిక్ట్ కోర్టులో అధికారులు పిటిషన్ వేశారు. కుటుంబ ఆధారిత వలస చట్టం ఆధారంగా గుర్మీత్ సింగ్ కుటుంబం అమెరికాలోకి ప్రవేశించింది. క్యాబ్ నడుపుకునే గుర్మీత్.. ఓ ప్రయాణికురాలిని బెదిరించి అత్యాచారానికి పాల్పడిన నేరం రుజువు కావడంతో న్యూయార్క్‌లోని కోర్టు 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది. అయితే, పౌరసత్వం కోసం అధికారులకు అందజేసిన దరఖాస్తులో ఈ వివరాలను అతడు పేర్కొనలేదు. 2011లో పౌరసత్వం వచ్చింది. ఆ తర్వాత, అతడిపై అత్యాచారం, కిడ్నాప్ నేరాలకు పాల్పడిన కేసులున్నట్లు అధికారుల విచారణలో తేలింది. తీవ్రమైన నేరాలకు పాల్పడిన గుర్మీత్ మోసపూరితంగా పౌరసత్వం పొందాడని న్యాయశాఖ అధికారులు ఆరోపించారు. అందుకే, అతడి పౌరసత్వాన్ని రద్దు చేయాలని కోర్టును కోరినట్లు తెలిపారు.

దగ్గు సిరప్ తాగి నాలుగేళ్ల బాలుడు మృతి

బేతుల్ (ఎంపీ): కోల్డ్‌రిఫ్ దగ్గు సిరప్ తాగి తీవ్ర అనారోగ్యానికి గురైే నాలుగేళ్ల బాలుడు మృతి చెందాడు. సిరప్ తాగిన తరువాత నాలుగు నెలలపాటు కోమాలో ఉన్న బాలుడు.. పరిస్థితి విషమించడంతో నాగ్‌పూర్‌లోని ఎయిమ్స్‌లో ఆదివారం రాత్రి మరణించాడు. మధ్యప్రదేశ్‌లోని బేతుల్ జిల్లా టికాబరి గ్రామానికి చెందిన హర్ష్ చింద్వారాలోని పరాసియాలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నాలుగు నెలల కిందట చికిత్స పొందాడు. డాక్టర్ సూచించిన దగ్గు మందు తీసుకున్న తరువాత బాలుడి ఆరోగ్యం విషమించింది. కోమాలోకి వెళ్లిపోయాడు. నాలుగు నెలలపాటు నాగపూర్ ఎయిమ్స్‌లో చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం రాత్రి మృతి చెందినట్లు బేతుల్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ తెలిపారు.

అమెరికాతో ఒప్పందంపై రాజ్యసభలో రగడ

విపక్షాల వాకౌట్

న్యూఢిల్లీ: అమెరికాతో భారత వాణిజ్య ఒప్పందం అంశం మంగళవారం రాజ్యసభలో రగడకు దారితీసింది. దాన్ని ప్రకటించిన తీరు భారత్‌కు అవమానకరమని విపక్ష సభ్యులు ఆక్షేపించారు. ఒప్పందంపై ప్రభుత్వం చర్చకు రావాలని డిమాండ్ చేశాయి. జీరో అవర్ ముగియగానే కాంగ్రెస్ సభ్యుడు జైరాం రమేశ్ ఈ అంశాన్ని లేవనెత్తారు. అమెరికాకు ప్రధాని నరేంద్ర మోదీ లొంగిపోయారని, ఒప్పంద ప్రకటన ఆ దేశం నుంచి రావడమే ఇందుకు నిదర్శనమని ఆరోపించారు. ఒప్పందానికి సంబంధించిన అన్ని వివరాలనూ సభ ముందుంచాలని పలువురు సభ్యులు డిమాండ్ చేశారు. దాంతో సభా నాయకుడు జేపీ నడ్డా జోక్యం చేసుకున్నారు. విపక్ష సభ్యులు డిమాండ్ చేస్తున్నట్టుగా ఒప్పందంపై చర్చకు కేంద్రం సిద్ధమని ప్రకటించారు. సంబంధిత మంత్రి దీనిపై ప్రకటన చేస్తరని, ఒప్పందానికి సంబంధించిన ప్రతి అంశాన్నీ వివరిస్తారని చెప్పారు. విపక్షాలకు కావాల్సింది కేవలం ప్రతిదాన్నీ రాజకీయం చేయడమే మాత్రమేనని ఆక్షేపించారు. విపక్ష సభ్యులు అందుకు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పెద్దపెట్టున ముకుమ్మడి నినాదాలకు దిగారు. దేశ ప్రయోజనాలను మోదీ సర్కారు తాకట్టు పెడుతోందని ఆరోపిస్తూ తృణమూల్ కాంగ్రెస్, మిగతా సభ్యులు సభ నుంచి వేర్వేరుగా వాకౌట్ చేశారు.

6న ప్రధాని 'పరీక్షా పే చర్చ'

న్యూఢిల్లీ: వచ్చే శుక్రవారం ప్రసారం కానున్న 'పరీక్షా పే చర్చ' ప్రత్యేక ఎపిసోడ్‌ను వీక్షించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం ప్రజలను కోరారు. యువతతో జరిగే ఆసక్తికరమైన సంభాషణలను, వారిలోని సామూహిక స్ఫూర్తిని ఈ కార్యక్రమం ద్వారా చూడవచ్చని ఆయన పేర్కొన్నారు. పరీక్షా పే చర్చ సందర్భంగా విద్యార్థులతో ప్రధాని మోదీ ముఖాముఖి జరుగుతుంది. ఈ దఫా ఢిల్లీలోని లోక్ కల్యాణ్ మార్గ్‌లోని ప్రధాని మోదీ నివాసంలో జరిగే ఈ కార్యక్రమంలో గుజరాత్‌లోని దేవ్‌మోగ్రా, తమిళనాడులోని కోయంబత్తూర్, ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్, అస్సాంలోని గౌహతికి చెందిన విద్యార్థులు పాల్గొంటారని ప్రధానమంత్రి కార్యాలయం(పీఎంవో) తెలిపింది. ఈ కార్యక్రమం కోసం 4.5 కోట్ల మంది రిజిస్టర్ చేసుకోగా, మరో 2.26 కోట్ల మంది ఇందుకు సంబంధించిన క్విజ్ తదితర కార్యక్రమాల్లో క్రియాశీలకంగా ఉన్నారు. దీంతో, ఈ ఏడాది ఈ కార్యక్రమంలో 6.76 కోట్ల మంది భాగస్వామ్యులయ్యారని పీఎంవో తెలిపింది.

ఇరాన్–అమెరికా చర్చలకు పాక్

ఇస్లామాబాద్: ఇరాన్–అమెరికాల మధ్య త్వరలో జరిగే చర్చల్లో పాల్గొనాలని పాకిస్తాన్‌కు ఆహ్వానం అందింది. పాకిస్తాన్ విదేశాంగ శాఖ మంగళవారం ఈ విషయం వెల్లడించింది. ఇరాన్–అమెరికాల మధ్య కొనసాగుతున్న తీవ్ర ఉద్రిక్తతలను చల్లార్చేందుకు, ఒక ఒప్పందానికి వచ్చేందుకు తటస్థ దేశం తుర్కియే వేదికగా త్వరలో చర్చలు జరిగే అవకాశాలున్నాయి. శాంతి ప్రయత్నాలకు మరింత విస్తృతమైన గుర్తింపు, మద్దతు లభించేలా ఇరుగుపొరుగు దేశాలకు కూడా ఆహ్వానాలు అందుతున్నాయి. విదేశాంగ మంత్రుల స్థాయి చర్చల్లో పాల్గొనాలంటూ సౌదీ అరేబియా, ఖతార్, ఈజిప్టు, ఒమన్, యూఏఈ తదితర దేశాలకు కూడా ఆహ్వానాలందినట్లు సమాచారం. ఇరాన్ అణ్వాయుధాలను సమకూర్చుకునేందుకు చేస్తున్న యత్నాలను అమెరికా తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. రెండు దేశాల మధ్య వివాదానికి ఇదే ప్రధాన అంశంగా మారింది. తమపై ఉన్న ఆంక్షలను ఎత్తివేసిన పక్షంలో అణ్వాయుధాల అంశాన్ని వదిలేస్తామని ఇరాన్ అంటోంది.

పాక్‌లోని పూర్వీకుల ఇంటికి వెళ్లిన బంగా

లాహోర్: భారత సంతతి అమెరికన్, ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు అజయ్ బంగా(66) మంగళవారం పాకిస్తాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో ఉన్న తమ పూర్వీకుల ఇంటిని సందర్శించారు. ఇస్లామాబాద్ నుంచి బయలుదేరిన ఆయన లాహోర్‌కు 250 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఖుషాబ్‌లో ఉన్న పూర్వీకుల ఇంటికి వెళ్లారు. పూర్వీకుల సంబంధించిన సమాచారం కోసం స్థానిక రెవెన్యూ అధికారుల వద్ద ఉన్న రికార్డులను పరిశీలించారు. స్థానికంగా ఉన్న గురుద్వారా సింగ్ సభ ఖుషాబ్‌లో ప్రార్థన చేశారు. బంగా ప్రస్తుతం పాకిస్తాన్‌లో నాలుగు రోజుల పర్యటనలో ఉన్నారు. బుధవారంతో పర్యటన ముగియనుంది. మహారాష్ట్రలోని ఖడ్కీ పట్టణంలో 1959లో ఆయన జన్మించారు. ఢిల్లీలో డిగ్రీ, అహ్మదాబాద్ ఐఐఎంలో ఆయన చదువుకున్నారు. 2007లో ఆయనకు అమెరికా పౌరసత్వం వచ్చింది.

ఐ-ప్యాక్ దాడులపై విచారణ వాయిదా

న్యూఢిల్లీ: కోల్‌కతాలోని ఐ-ప్యాక్ కార్యాలయం, ఆ సంస్థ డైరెక్టర్ ప్రతీక్ జైన్‌ల కార్యాలయాల్లో సోదాలకు వెళ్లిన తమను బెంగాల్ ప్రభుత్వం, సీఎం మమతా బెనర్జీ అడ్డుకున్నారంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) వేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు మంగళవారం ఈ నెల 10వ తేదీకి వాయిదా వేసింది. పిటిషన్‌పై బెంగాల్ ప్రభుత్వం వేసిన అఫిడవిట్లను పరిశీలించేందుకు తమకు కొంత సమయం కావాలంటూ కేంద్రం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోరగా జస్టిస్ ప్రశాంత్ కుమార్, జస్టిస్ ఎన్వీ అంజారియాల ధర్మాసనం ఈ మేరకు అంగీకారం తెలిపింది. ఈడీ పిటిషన్‌పై జనవరి 15వ తేదీన విచారణ చేపట్టిన ధర్మాసనం .. జనవరి 8వ తేదీన బొగ్గు కుంభకోణం కేసు దర్యాప్తులో భాగంగా సోదాలకు వెళ్లిన ఈడీ అధికారులను సీఎం అడ్డుకున్నారన్న ఆరోపణలు చాలా తీవ్రమైనవంటూ వ్యాఖ్యానించడంతోపాటు ఈడీ అధికారులపై రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకుండా స్టే విధించింది. అదేవిధంగా, అప్పటి పరిణామాలపై సీబీఐతో విచారణ చేయించాలన్న ఈడీ అభ్యర్థన మేరకు సీఎం బెనర్జీ, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం, డీజీపీ రాజీవ్ కుమార్ తదితరులకు నోటీసులు జారీ చేసింది.

పాలస్తీనాకు మద్దతుగా రాజస్తాన్‌లో పోస్టర్లు

దేశం విడిచి వెళ్లాలని ఇద్దరు బ్రిటిషర్లకు నోటీసులు

జైపూర్: రాజస్తాన్‌లోని పుష్కర్‌లో పాలస్తీనా అనుకూల పోస్టర్లు అతికించిన ఇద్దరు బ్రిటిషర్లకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. వారు వెంటనే భారతదేశం విడిచి వెళ్లాలని ఆదేశించారు. 'ఫ్రీ పాలస్తీనా', 'బయ్‌కాట్ ఇజ్రాయెల్' నినాదాలతో పట్టణంలోని పలు ప్రాంతాల్లో పోస్టర్లు జనవరి 21న కనిపించాయి. దీనిపై సీఐడీ బృందం దర్యాప్తు చేపట్టింది. ఇద్దరు విదేశీ పర్యాటకులు ఈ పోస్టర్లు వేసినట్లు గుర్తించింది. వారిద్దరూ పర్యాటక వీసాలపై భారత్‌లో ఉన్నారని సీఐడీ తెలిపింది. దేశంలో ఉంటూ ఇతర దేశాల పట్ల అగౌరవాన్ని ప్రదర్శించకూడదనే వీసా నిబంధనలు ఉల్లంఘించడమేనని సీఐడీ ఉన్నతాధికారులు తెలిపారు. ఇమ్మిగ్రేషన్, విదేశీయుల చట్టం–2025 నిబంధనలకు అనుగుణంగా వారిద్దరూ దేశం విడిచి వెళ్లాలని ఆదేశిస్తూ నోటీసులు జారీ చేశామన్నారు. పుష్కర్‌కు ప్రతి ఏటా పెద్ద సంఖ్యలో విదేశీ పర్యాటకులు వస్తారు. వీరిలో ఇజ్రాయెల్ నుంచి ఎక్కువ మంది ఉంటారు. అయితే.. పోస్టర్లకు సంబంధించి పర్యాటకుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని, సీఐడీ జోక్యం తరువాత బహిరంగ ప్రదేశాల్లో పోస్టర్లు తొలగించినట్లు పోలీసులు తెలిపారు. విదేశీ పర్యాటకులు తరచుగా వచ్చే ప్రాంతాల్లో ఇలాంటి పోస్టర్లు లేకుండా చేసేందుకు తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు.

అధికారుల ఎదుట లొంగిపోండి

నటుడు రాజ్‌పాల్ యాదవ్‌కు ఢిల్లీ హైకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: చెక్ బౌన్స్ కేసులను ఎదుర్కొంటున్న బాలీవుడ్ నటుడు రాజ్‌పాల్ యాదవ్‌కు ఢిల్లీ హైకోర్టులో చుక్కెదురైంది. ఈ నెల 4వ తేదీలోగా జైలు అధికారుల ఎదుట లొంగిపోవాలని ఆయన్ను ఆదేశించింది. రూ.1.35 కోట్ల చొప్పున చెల్లించాల్సిన ఏడు కేసులు రాజ్‌పాల్‌పై ఉన్నాయన్న జడ్జి స్వర్ణకాంత శర్మ.. ఇప్పటికే హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ అకౌంట్‌లో జమ చేసిన రూ.75 లక్షలను ఫిర్యాదుదారులకు అందజేయాలని ఆదేశించారు. పిటిషనర్లతో నేరుగా సయోధ్య చేసుకునేందుకు, న్యాయస్థానం ద్వారా ఈ కేసును పరిష్కరించేందుకు ఇచ్చిన పలు అవకాశాలను ఆయన దుర్వినియోగం చేశారని పేర్కొన్నారు. కోర్టుకు ఇచ్చిన హామీలను పదేపదే ఉల్లంఘించారని తెలిపారు. ఇకపై ఎలాంటి వెసులుబాట్లను ఆయనకు కల్పించలేమని స్పష్టం చేశారు. ముంబైలోని సెషన్స్ కోర్టులో 4వ తేదీన సాయంత్రం 4 గంటల్లోగా లొంగిపోవాలని రాజ్‌పాల్ యాదవ్‌ను ఆదేశించారు. చెక్‌బౌన్స్ కేసుల్లో కోర్టు ఆయనకు 2019లో ఆరు నెలల జైలు శిక్ష విధించింది.

సరిహద్దు ప్రాంత ప్రజలను రెచ్చగొట్టారు

వాంగ్‌చుక్‌పై సుప్రీంకోర్టులో కేంద్రం వాదన

న్యూఢిల్లీ: పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ నిర్బంధంపై సుప్రీంకోర్టులో కేంద్రం వాదనలు మంగళవారం కొనసాగాయి. జస్టిస్ అరవింద్‌కుమార్, జస్టిస్ పీబీ వరాలేల ధర్మాసనం ఎదుట సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు. చైనా, పాకిస్తాన్‌లతో సరిహద్దులు పంచుకుంటున్న లద్దాఖ్ ఎంతో సున్నితమైన ప్రాంతమన్న ఆయన.. అక్కడి ప్రజలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నించినందుకే అధికారులు నిర్బంధంలోకి తీసుకున్నారని చెప్పారు.

ఎస్‌ఎఫ్‌డీఆర్ ప్రయోగం విజయవంతం

డీఆర్‌డీఓకు రాజ్‌నాథ్ అభినందనలు

న్యూఢిల్లీ: దీర్ఘశ్రేణి ఎయిర్ టు ఎయిర్ మిస్సైళ్ల అభివృద్ధిలో అత్యంత కీలకమైన సాలిడ్ ఫ్యూయల్ డక్టెడ్ రామ్‌జెట్ (ఎస్‌ఎఫ్‌డీఆర్)ను రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) మంగళవారం విజయవంతంగా పరీక్షించింది. తద్వారా ఈ టెక్నాలజీ కలిగిన అతి కొద్ది దేశాల జాబితాలో భారత్ చేరింది. ఒడిశాలోని చాందీపూర్‌లోని ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ (ఐటీఆర్)లో ఈ ప్రయోగం నిర్వహించినట్టు రక్షణ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఎస్‌ఎఫ్‌డీఆర్ మోటార్‌తో పాటు నాజిల్‌లెస్ బూస్టర్, ఫ్యూయల్ ఫ్లో కంట్రోలర్ వంటివన్నీ అనుకున్న మేరకు పనితీరు కనబరిచినట్టు పేర్కొంది. ప్రయోగాన్ని విజయవంతం చేసినందుకు డీఆర్‌డీఓను రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అభినందించారు. ఈ సాంకేతిక పరిజ్ఞానం వల్ల కీలక సమయాల్లో ప్రత్యర్థులపై మనకు కీలకమైన అడ్వాంటేజీ సమకూరుతుందంటూ ఆయన హర్షం వెలిబుచ్చారు. ప్రయోగంలో పాల్గొన్న సైంటిస్టుల బృందాన్ని డీఆర్‌డీఓ చైర్మన్ వి.కామత్ అభినందించారు.

ఇండియా కౌన్సిళ్ల చట్టం ఎప్పుడు ప్రవేశపెట్టారు?

పోర్చుగీసు నావికుడైన వాస్కోడిగామా అట్లాంటిక్ సముద్రం ద్వారా ప్రయాణించి ఆఫ్రికా దక్షిణాన ఉన్న గుడ్‌హోప్ అగ్రాన్ని చేరుకున్నాడు. ఆ తర్వాత హిందూ మహా సముద్రం ద్వారా 1498లో భారతదేశ పశ్చిమ తీరాన ఉన్న కాలికట్‌ను చేరుకున్నాడు. ఈ సంఘటన భారతదేశ చరిత్రలో కీలక మలుపునకు నాంది పలికింది. వాస్కోడిగామా చూపిన మార్గంలో అనేక మంది యురోపియన్లు భారత్ బాటపట్టారు. మొదట వీరంతా వర్తకం కోసం భారత్‌లోకి ప్రవేశించారు. ఆ తర్వాత మనదేశంపై పూర్తి గుత్తాధిపత్యం సాధించారు.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

ఆధునిక భారతదేశ చరిత్ర

వాస్కోడిగామా చూపిన మార్గంలో అనేక మంది పోర్చుగీసు వర్తకులు భారతదేశానికి వచ్చారు. 1503లో ఫ్రాన్సిస్-డి-అల్మీడా భారతదేశంలోని పోర్చుగీస్ స్థావరాలకు మొదటి గవర్నర్‌గా నియామకమయ్యాడు. ఇతడు నీలి నీటి విధానం (Blue Water Policy)ను విస్తరింపజేశాడు. ఆల్ఫెన్సో-డి-ఆల్బ్‌కర్క్ 1509 నుంచి 1515 వరకు భారత్‌లో రెండో పోర్చుగీసు గవర్నరుగా పని చేశాడు. ఇతడు పోర్చుగీస్ సామ్రాజ్యానికి పునాదులు వేశాడు. గోవాను, పర్షియా సింధుశాఖలోని హార్మోజ్‌ను 1510లో ఆక్రమించాడు.

ఆంగ్లేయుల రాక..

భారతదేశంలో మొదటిసారి అడుగుపెట్టిన ఆంగ్లేయుడు ఫాదర్ థామస్ స్టీవెన్స్. ఇతడు 1579లో గోవా చేరాడు. 1600లో ఎలిజబెత్ రాణి (లండన్) అనుమతితో భారతదేశంలో వాణిజ్యం చేయడానికి 'ఈస్టిండియా కంపెనీ'ని స్థాపించాడు. 1611లో కెప్టెన్ జేమ్స్ హాకిన్స్ భారతదేశం వచ్చి మొదటి జేమ్స్ ఉత్తరంతో మొగలు పాదుషా జహంగీర్‌ను కలుసుకున్నాడు. జహంగీర్ అనుమతితో ఇతడు 1612లో సూరత్‌లో మొదటి కర్మాగారం స్థాపించాడు. తర్వాత అహ్మదాబాద్, ఆగ్రా, హుబ్లీ, కాశింబజార్, ఢాకాలో కర్మాగారాలు ఏర్పాటు చేశాడు. ఆంగ్లేయులు భారతదేశంలో ప్రధానంగా దుస్తులు, నల్లమందు వ్యాపారం చేసేవారు. పోర్చుగీసువారితో బ్రిటిషర్లకు ఆధిపత్య పోరు మొదలైంది. 1614లో ఈస్టిండియా కంపెనీవారు పోర్చుగీసువారిని 'సూర్' సమీపంలో ఓడించారు. 1618లో మొదటి జేమ్స్ రాయబారిగా సర్ థామస్ (1615-19) జహంగీర్ ఆస్థానానికి వచ్చి రెండు 'ఫర్మానా'లు పొందాడు. వీటిలో మొదటిది భారతదేశంలో వాణిజ్యం చేసుకోవడానికి అనుమతించడం. రెండోది స్వదేశీ వాణిజ్యంపై సుంకాలు తగ్గించడం.

దక్షిణ భారతదేశంలో మొదటి కర్మాగారాన్ని మచిలీపట్నంలో స్థాపించారు. 1641లో సెయింట్-జార్జికోట (మద్రాసు) ను నిర్మించారు. 1654లో ఇంగ్లిష్ కంపెనీ వాణిజ్య ఆధిపత్యాన్ని పోర్చుగీస్ గుర్తించింది. 1661లో పోర్చుగీస్ వారు బ్రిటిష్ రాజైన రెండో చార్లెస్‌కు బొంబాయిని కట్నంగా ఇచ్చారు. 1698లో ఈస్టిండియా కంపెనీ సత్నొటి, కాలికట, గోవిందపూర్ ప్రెసిడెన్సీల్లో జమీందారీ హక్కులు పొందింది.

ఆ తర్వాత ఈ మూడు ప్రెసిడెన్సీలను కలిపి 'కలకత్తా' నగరాన్ని ఏర్పాటు చేశారు. 1690లో జాబ్ చార్నాక్ కలకత్తాకు శంకుస్థాపన చేశాడు. 1696లో ఇక్కడ జార్జి విలియం కోట నిర్మాణం మొదలైంది. 1746 నుంచి 1763 వరకు బ్రిటిషర్లు, ఫ్రెంచివారి మధ్య ఆధిపత్యం కోసం మూడు కర్ణాటక యుద్ధాలు జరిగాయి. ఇందులో మూడో కర్ణాటక యుద్ధం (1758-63) ముఖ్యమైంది. 1760లో వాండివాష్ యుద్ధంలో ఇంగ్లిషువారు, ఫ్రెంచివారిని ఓడించి పూర్తి ఆధిపత్యం సాధించారు. 1756లో బెంగాల్ నవాబైన సిరాజుద్దౌలా కలకత్తా పోర్టును ఆక్రమించి చీకటి గది ఉదంతానికి కారకుడయ్యాడు. 1757లో ప్లాసీ యుద్ధంలో సిరాజుద్దౌలాను ఓడించి ఇంగ్లిషువారు కలకత్తాను తిరిగి ఆక్రమించుకున్నారు. 1759లో ఇంగ్లిష్ కంపెనీవారు డచ్‌వారిని బెదరా యుద్ధంలో ఓడించారు. 1764 బక్సార్ యుద్ధం విజయంతో ఉత్తర భారతంలో బ్రిటిషర్ల ఆధిపత్యానికి తిరుగులేకుండా పోయింది. ఈ విజయం కారణంగా 1767లో బెంగాల్‌లో ద్వంద్వ ప్రభుత్వం ఏర్పాటైంది.

1664లో ఫ్రెంచ్ ఈస్టిండియా కంపెనీని 14వ లూయీ మంత్రి కోల్బర్ట్ స్థాపించాడు. 1667లో ఫ్రాంకోయిస్ కరన్ 'సూరత్' ఫ్యాక్టరీని స్థాపించాడు. ఫ్రాన్సిస్కో మార్టిన్ 1673లో ముస్లిం గవర్నర్ నుంచి అనుమతి పొంది పాండిచ్చేరికి పునాదులు వేశాడు. ఇతడు 1764లో గవర్నర్‌గా నియమితుడయ్యాడు. ఫ్రెంచ్‌వారు 1674లో షాయిస్థాఖాన్ నుంచి అనుమతి పొంది బాలాసోర్, కాశిం బజార్, చంద్రనాగూర్ వద్ద ఫ్యాక్టరీలు నిర్మించుకున్నారు. 1674లో డూప్లే పాండిచ్చేరి గవర్నర్‌గా నియమితుడయ్యాడు. ఇతడు రెండు ఆస్ట్రియా వారసత్వ యుద్ధాలు చేశాడు.

డచ్ కంపెనీ

డచ్చివారు యూరప్‌లోని హాలెండ్ (నెదర్లాండ్స్) దేశానికి చెందినవారు. వీరు 1602లో డచ్ ఈస్టిండియా కంపెనీ స్థాపించారు. వీరు తూర్పు ఇండియా సుగంధ దీవులపై దృష్టి కేంద్రీకరించారు. 1604లో గోల్కొండ నవాబు అనుమతితో మచిలీపట్నంలో మొదటి డచ్చి వర్తక స్థావరం ఏర్పాటు చేశారు. 1610లో పులికాట్ వద్ద స్థావరాన్ని నిర్మించుకున్నారు.

గవర్నర్ జనరల్స్

వారన్ హేస్టింగ్స్ (1772-85)

వారన్ హేస్టింగ్స్ 1772లో బెంగాల్ గవర్నర్‌గా నియమితులయ్యాడు. ఇతడు 1773 నుంచి 1785 వరకు గవర్నర్ జనరల్‌గా పనిచేశాడు. 1773లో ద్వంద్వ ప్రభుత్వాన్ని రద్దు చేశాడు. 1773లో రెగ్యులేటింగ్ చట్టం చేశారు. దీంతో కంపెనీకి తూర్పుదేశ వర్తకంపై గుత్తాధిపత్యం లభించింది. వారన్ హేస్టింగ్స్ రాజధానిని ముర్షిదాబాద్ నుంచి కలకత్తాకు మార్చాడు. సివిల్ న్యాయస్థానానికి కలెక్టరును, క్రిమినల్ న్యాయస్థానానికి భారతీయుడిని న్యాయాధిపతిగా నియమించాడు. న్యాయ సంస్కరణలలో భాగంగా ముఖ్యంగా జిల్లాల్లో 'దివానీ', 'ఫౌజ్‌దారీ' అదాలత్‌లను ప్రవేశపెట్టాడు. ప్రెసిడెన్సీ (కలకత్తా)లలో సాదర్, దివానీ సాదర్, నిజామత్ అదాలత్‌లను ఏర్పాటు చేసి హిందూ, ముస్లిం చట్టాలు అమలు చేశాడు. 1784లో బ్రిటిషర్లు పిట్స్ ఇండియా చట్టం చేశారు.

కారన్ వాలిస్ (1786-93)

ఇతడు సివిల్ సర్వీసులను ప్రవేశపెట్టాడు. ప్రభుత్వ యంత్రాంగంలో సంస్కరణలు ప్రవేశపెట్టాడు. వివిధ స్థాయిల్లో కోర్టులను ఏర్పాటు చేశాడు. న్యాయశాఖ నుంచి పరిపాలన శాఖను వేరుపరిచాడు. 1793లో శాశ్వత శిస్తు విధానం ప్రవేశపెట్టాడు. న్యాయ విచారణ పద్ధతిని రాయించాడు. న్యాయ పద్ధతిపై కారన్ వాలీస్ కోడ్‌ను పొందుపరిచాడు. మూడో మైసూర్ యుద్ధంలో టిప్పుసుల్తాన్‌ను ఓడించి రాజ్యంలో సగభాగాన్ని తీసుకున్నాడు.

సర్ జాన్‌షోర్ (1793-98)

శాశ్వత శిస్తు విధానంలో ఇతడి పాత్ర ప్రధానమైంది. జాన్‌షోర్ కాలంలో బ్రిటిష్ పార్లమెంట్ 1793లో చార్టర్ చట్టం చేసింది.

లార్డ్ వెల్లస్లీ (1798-1805)

ఇతడు ఉద్యోగుల శిక్షణ కోసం 1800లో పోర్ట్ విలియం కళాశాల స్థాపించాడు. సంస్థానాధీశులను సామంతులుగా చేసుకున్నాడు. నాలుగో మైసూర్ యుద్ధంలో టిప్పుసుల్తాన్‌ను ఓడించాడు. 1798లో సైన్య సహకార పద్ధతిని ప్రవేశపెట్టాడు. దీనికి మొదటగా హైదరాబాద్ నిజాం అంగీకరించి ఒప్పందం చేసుకున్నాడు. వెల్లస్లీ రెండో మరాఠా యుద్ధం చేశాడు. ఇతడి కాలంలో మద్రాస్ ప్రెసిడెన్సీ ఏర్పడింది.

- 1805 నుంచి 1807 వరకు జార్జ్‌బార్లో గవర్నర్ జనరల్‌గా పని చేశాడు. ఇతడి కాలంలో వెల్లూరు తిరుగుబాటు జరిగింది.

మొదటి లార్డ్ మింటో (1807-1813)

ఇతడి కాలంలో 1813లో చార్టర్ చట్టం చేశారు. రంజిత్ సింగ్‌తో అమృత్‌సర్ ఒప్పందం చేసుకున్నాడు.

లార్డ్ హేస్టింగ్స్ (1813-1823)

ఇతడు నేపాల్ యుద్ధం, మూడో మరాఠా యుద్ధం చేశాడు. పీష్వా పదవి రద్దు చేశాడు. బొంబాయి ప్రెసిడెన్సీ ఏర్పాటు చేశాడు. పిండారులు అనే దారి దోపిడీదారులను అదుపులోకి తెచ్చాడు. బొంబాయి, మద్రాసులో రైత్వారీ పద్ధతి అమలుపరిచాడు. దీనికి సర్ థామస్ మన్రో, ఎల్ఫిన్‌స్టోన్ సహకరించారు. 1817లో కలకత్తాలో ఆంగ్ల మాధ్యమంలో బోధించే హిందూ కళాశాలను స్థాపించాడు. 1813 చట్టంతో ఇంగ్లిష్ ఈస్టిండియా కంపెనీకి చైనాతో పూర్తి స్వేచ్ఛా వాణిజ్యం చేసుకునే వెసులుబాటు కలిగింది. హేస్టింగ్స్ 1799లో పత్రికలపై ఆంక్షలు రద్దు చేశాడు.

లార్డ్ అమ్హెర్స్ట్ (1823-1828)

ఇతడి కాలంలో మొదటి బర్మా యుద్ధం జరిగింది. భరత్‌పూర్‌ను ఆక్రమించాడు.

విలియం బెంటింక్ (1828-1835)

ఇతడు గవర్నర్ జనరళ్లలో గుర్తింపు పొందినవాడు. విలియం బెంటింక్ 'థగ్గులు' అనే దారి దోపిడీ దొంగలను అణచివేశాడు. మైసూర్ రాజును పదవి నుంచి తొలగించాడు. కాచర్, జైంషియా, కూర్గ్‌ను ఆక్రమించాడు. 1828లో బెంగాల్ రాష్ట్రానికే కాకుండా భారతదేశమంతటికీ గవర్నర్ జనరల్‌గా నియమితుడయ్యాడు. 1829లో సతీసహగమనాన్ని నిషేధించాడు. పురిటిలో ఆడ పిల్లలను చంపడం లాంటి దురాచారాలను అదుపు చేశాడు. భారతీయులు ఉన్నత ఉద్యోగాలకు అర్హులని ప్రకటించాడు. బెంటింక్ కలకత్తాలో వైద్య కళాశాలను స్థాపించాడు. 1835లో మెకాలే అధ్యక్షతన న్యాయ సంఘాన్ని నియమించాడు. దీనికి సంబంధించి ఇంగ్లిష్ భాషలో విద్యా బోధన ప్రవేశపెట్టాడు. 1833లో చార్టర్ చట్టంతో స్వేచ్ఛా వాణిజ్యాన్ని ఎత్తేశారు.

- 1835 నుంచి 1836 వరకు సర్ చార్లెస్ మెట్‌కాఫ్ గవర్నర్ జనరల్‌గా పని చేశాడు.
- 1836-42 మధ్య లార్డ్ ఆక్లాండ్ గవర్నర్ జనరల్‌గా ఉన్నాడు. ఇతడు అఫ్గానిస్తాన్‌లో బ్రిటిషర్ల పరాజయం ఫలితంగా పదవి కోల్పోయాడు.

లార్డ్ ఎలెన్‌బరో (1842-44)

ఇతడు సింధ్‌ను బ్రిటిష్ ఇండియాలో విలీనం చేశాడు. ఇతడి కాలంలో మొదటి అఫ్గాన్ యుద్ధం ముగిసింది. ఇతడు గ్వాలియర్ యుద్ధం చేశాడు.

మొదటి లార్డ్ హార్డింజ్ (1844-48)

ఇతడి కాలంలో మొదటి సిక్కు యుద్ధం జరిగింది. ఆంగ్ల మాధ్యమంలో చదివిన భారతీయులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాడు. ఇతడు నరమేధాన్ని అణచివేశాడు.

లార్డ్ డల్హౌసి (1848-56)

ఇతడు రెండో సిక్కు యుద్ధం తర్వాత పంజాబ్‌ను ఆక్రమించాడు. రెండో బర్మా యుద్ధం తర్వాత బర్మా దిగువ ప్రాంతాన్ని ఆక్రమించాడు. రాజ్య సంక్రమణ సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టి సతారా, సంబల్‌పూర్, ఝాన్సీ, నాగ్‌పూర్‌ను ఆక్రమించాడు. అయోధ్యను ఆక్రమించాడు. ఇతడి హయాంలో వితంతు పునర్వివాహ చట్టాన్ని ప్రవేశపెట్టారు. ఇతడి కాలంలో సంతాలులు తిరుగుబాటు చేశారు. ప్రతి రాష్ట్రంలో పబ్లిక్ వర్క్స్ శాఖను ప్రవేశపెట్టారు. 1854లో చార్లెస్ ఉడ్స్ అధ్యక్షుడిగా విద్యకు సంబంధించిన అంశాలపై కమిటీ ఏర్పాటు చేశాడు. ఈ కమిటీ సూచనలతో విద్యాలయం నుంచి విశ్వవిద్యాలయాల వరకు కీలక సంస్కరణలు ప్రవేశపెట్టాడు. 1853లో రైళ్లు, తంతితపాలా, రోడ్డు రవాణా సౌకర్యాలు ప్రవేశపెట్టాడు. బొంబాయి నుంచి థానే వరకు మొదటి రైల్వే లైన్ వేశారు. కలకత్తా నుంచి పెషావర్ వరకు మొదటి తంతి నిర్మించాడు. 1854లో మొదటిసారిగా తపాలా బిళ్లలను ప్రవేశపెట్టాడు. పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్‌ను ఏర్పాటు చేశాడు. 1853లో చార్టర్ చట్టంతో పోటీ పరీక్షలను ప్రవేశపెట్టారు. ఈ చట్టం వ్యాపార సంస్థలకు.. వ్యాపారంలో తప్ప మిగతా విషయాలతో సంబంధం లేకుండా చేసింది. 1854లో బొంబాయిలో మొదటి నూలు మిల్లు, కలకత్తాలో జనపనార మిల్లును స్థాపించారు.

లార్డ్ కానింగ్ (1856-62)

1857 సిపాయిల తిరుగుబాటు తర్వాత బ్రిటిష్ పార్లమెంట్ 1858లో ఒక చట్టం చేసింది. దీని ప్రకారం బ్రిటిష్ ఇండియాలో 'వైస్రాయ్' పదవిని ఏర్పాటు చేశారు. లార్డ్ కానింగ్ 1858 చట్టం ప్రకారం తొలి రాజప్రతినిధిగా నియమితులయ్యాడు. 1861లో ఇండియా కౌన్సిళ్ల చట్టం ప్రవేశపెట్టారు. 1859లో రాజ్య సంక్రమణ సిద్ధాంతాన్ని రద్దు చేశారు. 1858లో భారత శిక్షాస్మృతి, 1861లో హైకోర్టు చట్టాన్ని ప్రవేశపెట్టారు. 1865లో లారెన్స్ మూడు హైకోర్టులను స్థాపించాడు. 1857లో కానింగ్ కలకత్తా, బొంబాయి, మద్రాసులో విశ్వవిద్యాలయాలు స్థాపించాడు. ఇతడి కాలంలో 1859లో శ్వేత సైనికుల విప్లవం, 1860లో నీలి మందు రైతుల తిరుగుబాటు, 1863లో పాబ్నా రైతుల తిరుగుబాటు చెలరేగాయి.

ఎముకల సామాన్య విరుపునకు మరో పేరు?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

బయాలజీ

నమూనా ప్రశ్నలు (ఎస్ఏ)

1. హారిక బ్రెడ్‌ను ఆహారంగా తీసుకోవాలను కుంది. ప్యాకెట్ తెరిచి చూస్తే అది చెడిపోయినట్లు వాసన వచ్చింది. భూతద్దంతో పరిశీలిస్తే తంతువుల లాంటి పోగులు కనిపించాయి. ఆమె గుర్తించిన సూక్ష్మజీవులు ఏ రకానికి చెందుతాయి?
   1) శైవలాలు 2) శిలీంధ్రాలు
   3) బ్యాక్టీరియా 4) వైరస్
2. ఎల్లోస్పాట్‌లో ఎక్కువ సంఖ్యలో ఉండే కణాలు?
   1) దండాలు 2) రోమాలు
   3) కోనులు 4) ఉపకళా కణాలు
3. క్షయకరణ విభజనకు సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
   1) ప్రత్యుత్పత్తి కణాల్లో జరుగుతుంది
   2) క్రోమోజోముల సంఖ్య సగానికి తగ్గించడానికి ఉపకరిస్తుంది
   3) జీవుల్లో క్రోమోజోముల సంఖ్య స్థిరంగా ఉండటానికి దోహదపడుతుంది
   4) ఇది శారీరక కణాల్లోనే జరుగుతుంది
4. సంక్లిష్ట కణజాలాలకు ఉదాహరణ ఇవ్వండి అని ఉపాధ్యాయుడు అడిగినప్పుడు నలుగురు విద్యార్థులు కిందివిధంగా సమాధానం చెప్పారు. వీటిలో సరైనవి ఏవి?
   శేఖర్ - దృఢ కణజాలం
   శ్వేత - మృదు కణజాలం
   శ్రియ - దారు కణజాలం
   శంకర్ - పోషక కణజాలం
   1) శేఖర్, శంకర్ 2) శ్వేత, శ్రియ
   3) శ్రియ, శంకర్ 4) శ్వేత, శేఖర్
5. క్లోమరసంలో కీమోట్రిప్సిన్ అనే ఎంజైమ్ ఏ పదార్థాన్ని వేటిగా మారుస్తుంది?
   1) కొవ్వులు - కొవ్వు ఆమ్లాలు
   2) ప్రోటీన్లు- పెప్టైడులు
   3) పిండి పదార్థాలు - మాల్టోజ్
   4) పిండి పదార్థాలు - పెప్టోనులు
6. మొక్కల్లో లెగుమినేసి - రైజోబియం మాదిరిగా జంతువుల్లో...?
   1) పీతలు - సముద్ర జంతువులు
   2) పీతలు - సీ ఎనిమోన్లు
   3) ఆల్చిప్పలు - జలగలు
   4) సముద్ర నక్షత్రం - షార్క్ చేప
7. రాద్యులా కలిగి ఉన్న జీవికి ఉదాహరణ?
   1) దోమ 2) వానపాము
   3) నత్త 4) కప్ప
8. మానవ శరీరంలో అతి చిన్న ఎముకను కలిగి ఉండే అవయవం ఏది?
   1) కన్ను 2) చెవి
   3) ముక్కు 4) కపాలం
9. వినాళ గ్రంథులకు సంబంధించి కిందివాటిలో సరికాని ప్రవచనం?
   1) జీర్ణ రసాలను స్రవించవు
   2) అంతస్రావ గ్రంథులు అని కూడా అంటారు
   3) వీటి స్రావాలు నాళాల ద్వారా అవసరమైన చోటుకు ప్రవహిస్తాయి
   4) వీటి స్రావాలను హార్మోన్లు అంటారు
10. కిందివాటిలో వేటిలో పుపుస శ్వాసక్రియ జరగదు?
    ఎ. కప్ప బి. పావురం
    సి. చేపలు డి. టాడ్‌పోల్ లార్వా
    1) ఎ,బి 2) ఎ, డి
    3) బి, సి 4) సి, డి
11. ఎర్రరక్తకణాల శ్మశాన వాటిక అని ఏ అవయవాన్ని పేర్కొంటారు?
    1) ప్లీహం 2) కాలేయం
    3) ఊపిరితిత్తులు 4) ఎముక మజ్జ
12. విత్తనాలు లేని ఫలాలు ఏర్పడటానికి ఉపయోగపడే రసాయన పదార్థం?
    1) ఆక్సిన్లు 2) ఆబ్‌సిసిక్ ఆమ్లం
    3) ఇథిలిన్ వాయువు 4) జిబ్బరెల్లిన్లు
13. పన్నెండు జతల కపాల నాడుల్లో హృదయ స్పందన నియంత్రించే వేగస్ నాడీ ఎన్నోది?
    1) 9 2) 12 3) 10 4) 8
14. రవి కోపం, బాధ, ఆనందం లాంటి భావావేశాలను నియంత్రించుకోలేకపోతున్నాడు. అతడి మెదడులోని ఏ భాగంలో లోపం ఉండవచ్చు?
    1) అనుమస్తిష్కం 2) ద్వారగోర్థం
    3) మజ్జాముఖం 4) ఘ్రాణలంబికలు
15. సినర్జిడ్లు అనేవి మొక్కల్లోని ఏ భాగానికి సంబంధించినవి?
    1) పరాగకోశం 2) పిండకోశం
    3) వేరు పోషక కణాలు
    4) శిఖరాగ్ర మొగ్గలు
16. సయాన్స్, స్టాక్ అనేవి వేటిలో కనిపిస్తాయి?
    1) కోరకీభవనం 2) కణజాలవర్ధనం
    3) అంటుకట్టడం 4) ఫలదీకరణం
17. కిందివాటిలో ఏ రెండు జీవుల్లో బాహ్య ఫలదీకరణం జరుగుతుంది?
    ఎ. బొద్దింక బి. వానపాము
    సి. కప్ప డి. పాము
    1) ఎ, బి 2) బి, సి
    3) సి, డి 4) ఎ, డి
18. రాజేష్ వైద్యుడిని సంప్రదించినప్పుడు అతడు ప్రోటీన్లతో కూడిన ఆహార పదార్థాలు ఎక్కువగా తీసుకోకపోవడం వల్ల వ్యాధిగ్రస్తుడయ్యాడని తెలిపాడు. రాజేష్‌కు ఏ వ్యాధి వచ్చి ఉండవచ్చు?
    1) క్వాషియోర్కర్ 2) రికెట్స్
    3) అనీమియా 4) జీరాఫ్తాల్మియా
19. జ్యోతి అనే గృహిణి ఆహార పదార్థాలను అతిగా ఉడకబెడుతుంది. వారి కుటుంబ సభ్యుల్లో ఏ విటమిన్ లోపం ఉండవచ్చు?
    1) రెటినాల్ 2) కాల్సిఫెరాల్
    3) ఫోలిక్ ఆమ్లం 4) నియాసిన్
20. మలేరియా పరాన్నజీవి జీవితచక్రంలో షైజాంట్ దశ ఎక్కడ అభివృద్ధి చెందుతుంది?
    1) కాలేయ కణాలు
    2) లాలాజల గ్రంథులు
    3) ఎర్రరక్తకణాలు 4) జీర్ణాశయ గోడలు
21. ఎముకల సామాన్య విరుపునకు మరో పేరు?
    1) జటిల ఎముకల విరుపు
    2) మూసివేసిన ఎముకల విరుపు
    3) లేత ఎముక విరుపు
    4) బహిర్గత ఎముక విరుపు
22. కండరాలు ఉత్తేజం చెంది సంకోచస్థితిలోనే ఉండిపోవడాన్ని టిటాని అంటారు. ఈ స్థితికి కారణం?
    1) సమతుల ఆహార లోపం
    2) వాసోప్రెస్సిన్ తగినంత ఉత్పత్తి కాకపోవడం
    3) ఆహార పదార్థాల్లో తగినంత అయోడిన్ లేకపోవడం
    4) పారాథార్మోన్ అధికంగా ఉత్పత్తవడం
23. మెదడులోని ఏ భాగం అతి ముఖ్యమైన శ్వాసక్రియ, హృదయ స్పందన, రక్త పీడనం, శరీర ఉష్ణోగ్రత, లాలాజలం స్రవించడం లాంటి క్రియలను నియంత్రిస్తుంది?
    1) ద్వారగోర్థం 2) మజ్జాముఖం
    3) పిట్యూటరీ గ్రంథి
    4) మస్తిష్క గోళార్థాలు
24. ఒక మొక్క కణం పూర్తి మొక్కను ఇవ్వగలిగే శక్తిని ఏమంటారు?
    1) టోటిపొటెన్సీ 2) కాలస్
    3) ఎక్స్‌ప్లాంట్ 4) సయాన్
25. కిందివాటిలో ఏ రెండు ఆవశ్యక అమైనో ఆమ్లాలు కావు?
    ఎ. ఐసోలూసిన్ బి. గ్లిసరాల్
    సి. లైజీన్ డి. లిపిడ్లు
    1) ఎ, బి 2) బి, డి
    3) ఎ, సి 4) బి, సి
26. కిందివాటిలో నీటిలో, కొవ్వులో కరిగే విటమిన్లకు సంబంధించి సరైన క్రమం?
    1) BDE - ACK
    2) AEKC - BD
    3) BC - ADEK
    4) CD - ABEK
27. కిందివారిలో ఏ ఇద్దరు శాస్త్రవేత్తలు హెచ్ఐవీని కనుగొన్నారు?
    ఎ. ల్యూక్ మ్యాంట్ గ్నాయర్
    బి. ఇస్‌మార్క్
    సి. రాబర్ట్ గాలో
    డి. కార్ల్ లాండ్ స్టీనర్
    1) ఎ, బి 2) ఎ, సి
    3) బి, డి 4) బి, సి
28. సముద్ర అడుగు భాగంలో ఉండే జీవులను ఏమంటారు?
    1) నెక్టాన్ 2) ప్లవకాలు
    3) బెంథాస్ 4) నిమ్నటిక్
29. సముద్ర మొక్కలు దేన్ని నిక్షిప్తం చేసుకుంటాయి?
    1) క్లోరిన్ 2) బ్రోమిన్
    3) అయోడిన్ 4) సోడియం
30. పప్పుధాన్యాల్లో ఎక్కువగా ఉండే పోషకాలు?
    1) మాంసకృత్తులు 2) పిండి పదార్థాలు
    3) కొవ్వులు 4) విటమిన్లు
31. జుట్టు రాలకుండా ఉండటానికి ఉపయోగించే కొంథారిడియన్ తైలాన్ని స్రవించేది?
    1) సిల్వర్ ఫిష్ 2) లక్కమాత్
    3) పట్టుమాత్ 4) బ్లిస్టర్ బీటిల్
32. కిందివాటిలో ఎలక్ట్రాన్ గ్రహీత కానిది?
    1) పైరిడాక్సిన్
    2) అడినోసిన్ ట్రై ఫాస్ఫేట్
    3) సైటోక్రోం 4) ప్లాస్టో క్వినోన్
33. మైటోకాండ్రియా మాత్రికలో జరిగే శ్వాస క్రియ చర్యల వలయాలను విశదీకరించిన వారు?
    1) మెల్విన్ కాల్విన్ 2) ఆండ్రూ బెన్సన్
    3) సర్‌హాన్స్ క్రెబ్స్ 4) లిన్నియస్
34. కిరణజన్య సంయోగక్రియకు సంబంధించి కిందివాటిలో సరైంది ఏది?
    1) ఉష్ణశక్తి వినియోగితమవుతుంది
    2) ఉష్ణశక్తి విడుదలవుతుంది
    3) వికిరణ శక్తి వినియోగమవుతుంది
    4) రసాయన శక్తి విడుదలవుతుంది
35. నికర ప్రాథమిక ఉత్పాదకతను ప్రదర్శించేవి?
    1) మొక్కలు 2) సూక్ష్మజీవులు
    3) జంతువులు 4) నిర్జీవ కారకాలు
36. వాణిజ్యపరంగా విలువైన నారను ఇచ్చే మొక్క శాస్త్రీయనామం?
    1) టెక్టోనా గ్రాండ్
    2) క్రొటలేరియా జన్షియా
    3) షోరియారాబస్టా
    4) ఇల్యూసిస్ కొరకాన
37. కిందివాటిలో వరి వంగడం కానిది?
    1) బాసుమతి 2) పూసామోతి
    3) హంస 4) రవి
38. శక్తివనరు మొక్కకు సంబంధించిన కింది ఏ మొక్కలో ప్రత్యేక వేర్లు కనిపిస్తాయి?
    1) యూకలిప్టస్ 2) కాజురైనా
    3) అవిసీనియా 4) లూసినా
39. పెట్రో పంటగా దేన్ని పిలుస్తారు?
    1) డాల్బర్జియా లాటిపోలియా
    2) డిజిటాలిస్
    3) రిసినస్ కామ్యునిస్
    4) టోడ్రియో కైకస్ బ్రానై
40. ఏకదళ బీజ వర్గానికి చెందిన కార్బోహైడ్రేట్లను కలిగిన మొక్కల్లో పుష్పవిన్యాస రకం?
    1) స్పాడిక్స్ 2) సమశిఖి
    3) కంకి 4) గుచ్ఛం
41. చిన్న పిల్లల్లో ఎక్కువ సంఖ్యలో ఉండే రక్త కణాలు?
    1) ఎర్ర రక్తకణాలు 2) తెల్ల రక్తకణాలు
    3) లింఫోసైట్లు 4) త్రాంబోసైట్లు

సమాధానాలు

1) 2	2) 3	3) 4	4) 3	5) 2
6) 2	7) 3	8) 2	9) 3	10) 4
11) 1	12) 4	13) 3	14) 2	15) 2
16) 3	17) 2	18) 1	19) 3	20) 3
21) 2	22) 4	23) 2	24) 1	25) 2
26) 3	27) 2	28) 3	29) 3	30) 1
31) 4	32) 2	33) 1	34) 3	35) 1
36) 2	37) 2	38) 3	39) 4	40) 3
41) 1				

విద్య, ఉద్యోగ సమాచారం

ఎయిమ్స్ ఢిల్లీలో వివిధ పోస్టులు

ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్) న్యూఢిల్లీలో ఒప్పంద ప్రాతిపదికన ప్రోగ్రామ్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
- **పోస్టుల వివరాలు:** ప్రోగ్రామ్ అసిస్టెంట్-01, డేటా ఎంట్రీ ఆపరేటర్-01.
- **అర్హత:** సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిప్లొమా/ఇంటర్/ఎంబీఏ/పీజీడీఎంలో ఉత్తీర్ణులవ్వాలి.
- **వయసు:** 25ఏళ్ల నుంచి 45 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
- **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా.
- **ఈమెయిల్:** coeaiims.ai@gmail.com
- **దరఖాస్తులకు చివరితేది:** 04.02.2026.
- **వెబ్‌సైట్:** https://www.aiims.edu

డిజిటల్ ఇండియా కార్పొరేషన్‌లో వివిధ పోస్టులు

ఢిల్లీలోని డిజిటల్ ఇండియా కార్పొరేషన్‌లో తాత్కాలిక ప్రాతిపదికన యంగ్ ప్రొఫెషనల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
- **పోస్టుల వివరాలు:** యంగ్ ప్రొఫెషనల్(డొమైన్-జనరల్)-01, యంగ్ ప్రొఫెషనల్(డొమైన్-జీఐసీ-హ్యాకథాన్స్)-01.
- **అర్హత:** సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బీఈ/బీటెక్/ఎంసీఏ/ఎంటెక్ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **దరఖాస్తులకు చివరితేది:** 21.02.2026.
- **వెబ్‌సైట్:** https://dic.gov.in

ఐఐఎం లక్నోలో రీసెర్చ్ అసిస్టెంట్/ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ పోస్టులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం) లక్నో ఒప్పంద ప్రాతిపదికన రీసెర్చ్ అసిస్టెంట్/ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
- **పోస్టుల వివరాలు:** రీసెర్చ్ అసిస్టెంట్-01, ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్-01.
- **అర్హత:** సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఎంబీఏ/ఎమ్మెస్సీ ఉత్తీర్ణులవ్వాలి.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
- **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా.
- **ఈమెయిల్:** chairmarketingiimlko@gmail.com
- **దరఖాస్తులకు చివరితేది:** 05.02.2026.
- **వెబ్‌సైట్:** www.iiml.ac.in

హైదరాబాద్ సంస్థానంలో మొత్తం ఇనాందారుల సంఖ్య?

భారతదేశంలోని రైతాంగ పోరాటాల్లో తెలంగాణ, పశ్చిమ బెంగాల్‌లో జరిగిన ఉద్యమాలే విప్లవాత్మకమైనవని కొందరు చరిత్రకారుల భావన. తెలంగాణలో జరిగిన పోరాటం ఒక్కటే విప్లవాత్మకమైందని మరికొందరు పేర్కొన్నారు. నిజాం కాలంలో అనేక రకాల భూస్వామ్య విధానాలు అమలులో ఉండేవి. వీటిలో సంస్థానాలు, జాగీర్లు, ఇనామ్‌లు, సర్ఫేఖాస్, దివానీ లేదా ఖలసా లేదా రైత్వారీ పద్ధతులు ముఖ్యమైనవి. నిజాం నవాబుకు ప్రత్యేకంగా సేవ చేసినవారికి దానంగా ఇచ్చిన భూములను జాగీర్లు అనే వారు.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
తెలంగాణ ఎకానమీ

భూసంస్కరణల ఆవశ్యకత - కారణాలు

స్వాతంత్ర్యానంతరం భారతదేశం, రాష్ట్రంలోనూ వ్యవసాయ రంగంలో భూ సంస్కరణల పేరుతో భూ సంబంధాలు, వ్యవసాయక నిర్మాణంలో విప్లవాత్మకమైన మార్పులు రావడానికి అనేక కారణాలున్నాయి.

రాష్ట్రంలో భూ సంస్కరణలను ప్రధానంగా రెండు దశలుగా వర్గీకరించవచ్చు. మొదటి దశ 1947 నుంచి 1970 వరకు, రెండోదశ 1970 తర్వాత వచ్చిన భూ సంస్కరణలుగా పేర్కొనవచ్చు.

మొదటిదశ (1947–1970): భూ సంస్కరణలు రావడానికి మూడు అంశాలు ప్రధాన పాత్ర వహించాయని చెప్పొచ్చు.

1. **వ్యవస్థాపూర్వక అంశాలు:** ఇందులో భూస్వామ్య పద్ధతులు, కౌలు విధానాలు, భూ కేంద్రీకరణ మొదలైనవి ఉన్నాయి.
2. **రాజకీయ అంశాలు:** జాతీయస్థాయిలో అఖిల భారత కాంగ్రెస్, రాష్ట్ర కాంగ్రెస్ తీర్మానాలు, విధానాలు.
3. **రైతాంగ ఉద్యమాలు:** ఫ్యూడల్ దోపిడీకి వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగం పోరా టం చేసింది. ఉదా: 1920లో విస్నూరు దేశ్ ముఖ్‌కు వ్యతిరేకంగా జరిగిన రైతు పోరాటం.

భారతదేశ రైతాంగ పోరాటాల్లో తెలంగాణ, పశ్చిమ బెంగాల్‌లో జరిగిన రైతాంగ పోరాటాలే విప్లవాత్మకమైనవని కొందరు భావి స్తే, మరికొందరు తెలంగాణ పోరాటం ఒక్కటే విప్లవాత్మకమైందిగా పేర్కొంటారు.

I. వ్యవస్థాపూర్వక అంశాలు

రాష్ట్రంలో వ్యవస్థాపూర్వకమైన అంశాల్లో భూస్వామ్య వ్యవస్థలు, కౌలు విధానాలు, భూమి కేంద్రీకరణ మొదలైనవన్నీ వ్యవసాయ రంగం అభివృద్ధికి నిరోధంగా ఉన్నాయి. అయితే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ (1956) కు ముందు తెలంగాణ ప్రాంతం హైదరాబాద్ రాష్ట్రంలో, ఆంధ్రా ప్రాంతం 1953 అక్టోబర్ 1 వరకు మద్రాసు రాష్ట్రంలో భాగంగా ఉన్నాయి. ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల్లోని భూస్వామ్య పద్ధతుల్లో కొంత సారూప్యం ఉన్నప్పటికీ వీటిని సమగ్రంగా అర్థం చేసుకోవడానికి వేర్వేరుగా అధ్యయనం చేయడం ఉత్తమం.

- ❖ భారతదేశంలో బ్రిటిష్, నైజాం ప్రాంతాల్లో ప్రవేశపెట్టిన భూస్వామ్య పద్ధతులు రెండూ అభివృద్ధి నిరోధకాలే.
- ❖ తెలంగాణ, ఆంధ్రా ప్రాంతాల్లో ప్రవేశపెట్టిన జాగీర్దారీ లేదా జమీందారీ, రైత్వారీ మొదలైన పద్ధతులు వ్యవసాయాభివృద్ధికి ఉపయోగపడకపోగా స్తబ్ధతకు దారితీశాయి.
- ❖ జమీందారీ, రైత్వారీ పద్ధతులు రెండూ బ్రిటిష్ అధికారులు ప్రవేశపెట్టిన వ్యవసాయక విప్లవ రూపాలు. ఇవి ఒకదానికొకటి విరుద్ధమైనవిగా కార్ల్ మార్క్స్ గుర్తించారు. జమీందారీ విధానం పెత్తందారీ వ్యవస్థ కాగా, రైత్వారీ విధానాన్ని ప్రజాతంత్ర వ్యవస్థగా పేర్కొన్నారు.
- ❖ జమీందారీ విధానం బ్రిటిష్ భూస్వామ్య వ్యవస్థకు, రైత్వారీ విధానం ఫ్రెంచి రైతుస్వామ్య వ్యవస్థకు ప్రతిబింబాలు. కానీ ఈ రెండు పద్ధతులు హానికరమైనవేనని గుర్తించాలి. ఇవి రెండూ పరస్పర విరుద్ధ అంశాల మేళవింపుతో రూపొందాయి.
- ❖ ఈ పద్ధతులు భూమిని దున్నే రైతు, భూ యజమానుల ప్రయోజనాలకు ఉద్దేశించినవి కావు. భూములపై పన్ను వేసి, ప్రభుత్వానికి ఉపయోగపడే సాధనాలుగా గుర్తించారు.

హైదరాబాద్ రాష్ట్రంలో భూస్వామ్య విధానాలు

- ❖ హైదరాబాద్ రాష్ట్రం నిజాం పరిపాలనలో ఉండేది. వీరి కాలంలో అనేక రకాల భూస్వామ్య విధానాలుండేవి. అవి సంస్థానాలు, జాగీర్లు, ఇనాంలు, సర్ఫేఖాస్, దివానీ లేదా ఖలసా లేదా రైత్వారీ విధానాలు ముఖ్యమైనవి.

1. జాగీర్లు

నిజాం నవాబుకు ప్రత్యేకంగా సేవ చేసినవారికి లేదా ఆ వ్యక్తి గౌరవాన్ని నిలబెట్టడానికి దానపూర్వకంగా ఇచ్చిన భూములను జాగీర్లు అనే వారు. వీటిలో అనేక రకాలైన జాగీర్లుండేవి. కొన్ని నిజాంకు కొంత బాటకం చెల్లించాల్సినవి. కొన్ని భాటకం చెల్లించనవసరం లేని జాగీర్లు.

2. ఇనాందారులు

- ❖ హైదరాబాద్ ప్రాంతంలో కొన్ని విధులను నిర్వహించినందుకు పారితోషికంగా ప్రభుత్వం ఇచ్చిన భూములను ఇనాం భూములంటారు.
- ❖ ఈ భూముల నుంచి వచ్చే భూమి శిస్తును పొందే హక్కు పూర్తిగానో, పాక్షికంగానో ఇనాందారుడికి సంక్రమిస్తుంది.
- ❖ ఉద్యోగులు, సమాజానికి సేవలు అందించిన వారికి కూడా ఇనాం భూములు ఇచ్చేవారు.
- ❖ దేవాలయాలు, ధర్మాలయాల నిర్వహణ కూ ఇనాంలు ఇచ్చేవారు.
- • హైదరాబాద్ సంస్థానంలో మొత్తం ఇనాందారుల సంఖ్య 82,000 కాగా వీరిలో 57,000 మంది దివానీప్రాంతంలో ఉండగా 26000 మంది జాగీరు ప్రాంతంలో ఉండేవారు. వీరి ఆధీనంలో సుమారు 8 లక్షల ఎకరాల భూమి ఉండేది. వీటిలో కూడా అనేక రకాలైన ఇనాంలు ఉండేవి.

ఉదా: అరాజమక్తా, అరాజ అగ్రహార్, మజరాను బేసరి ఇనాం, బలవతా ఇనాం, నీరడి ఇనాం, చిధుమతి ఇనాం మొదలైనవి.

3. సర్ఫేఖాస్

- ❖ సర్ఫేఖాస్ భూములు నిజాం సొంత ఖర్చుల కోసం నిర్దేశించిన భూమి లేదా గ్రామాలు. వీటి నుంచి వచ్చే ఆదాయం లేదా భాటకం నిజాం ఖజానాకు వెళ్లేది. ఈ భూములు 5,682 చదరపు మైళ్ల విస్తీర్ణంలో 1,374 గ్రామాల్లో వ్యాపించి ఉండేవి.

4. ఖల్సా/దివానీ/రైత్వారీ పద్ధతి

- ❖ ఈ పద్ధతి హైదరాబాద్ ప్రాంతంలోని 60 శాతం విస్తీర్ణంలో ప్రభుత్వ ప్రత్యక్ష పాలన కింద ఉండేది. ప్రభుత్వ యంత్రాంగమే శిస్తు వసూలు చేసేది.
- ❖ ప్రభుత్వ యంత్రాంగమే శిస్తును వసూలు చేసే ప్రభుత్వ ప్రత్యక్ష పాలనలో ఉండే భూమిని ఖలీసా భూమి అంటారు.
- ❖ దివానీ భూములు సర్ఫేఖాస్ భూముల్లో భాగాలే.
- ❖ క్రమబద్ధమైన సర్వే సెటిల్‌మెంట్ పద్ధతిని మొదటి సాలార్‌జంగ్ 1875లో ప్రవేశపెట్టారు.
- ❖ క్రమబద్ధమైన సర్వే సెటిల్‌మెంట్ విధానాన్ని ప్రవేశపెట్టడానికి (1875) ముందు ఖల్సా/దివానీ భూముల్లో దళారీలు ఉండేవారు.

పామిగా జమీయత్

- ❖ పామిగా అంటే గుర్రాలను కట్టేసే స్థలం
- ❖ సైన్యానికి అవసరమైన గుర్రాలను పోషించడానికి ప్రతిఫలంగా ఇచ్చే జాగీర్లు.

జాత్

- ❖ విస్తృతమైన ప్రాంతాల్లో సేవ చేసినందుకు ఎలాంటి షరతులు లేకుండా ఇచ్చిన జాగీర్లు

అవతమామ్

- ❖ శిస్తు చెల్లించకుండానే వంశ పారంపర్యం గా వచ్చే హక్కులు ఉన్న జాగీర్లు

తనఖా

- ❖ జీతానికి బదులుగా ఇచ్చే జాగీర్లు

మాదద్ మాష్

- ❖ ఉద్యోగుల పోషణకు జీతానికి తోడుగా ఇచ్చే జాగీర్లు

మసురూదీ

- ❖ మత, సైనిక, పౌర సంబంధమైన సేవ చేసే షరతులపై ఇచ్చే జాగీర్లు
- ❖ పై విధంగా అనేక రకాలైన జాగీర్లు ఉండేవి. ఈ జాగీర్లు హైదరాబాద్‌లో 6535 గ్రామాల్లో 40,000 చదరపు మైళ్ల విస్తీర్ణంలో వ్యాపించి ఉండేవి. 1922లో జాగీర్ల సంఖ్య 1,167 కాగా, 1949 నాటికి 1500 వరకు పెరిగింది.

5. సంస్థానాలు

- ❖ హైదరాబాద్ ప్రాంతంలో మొదటి నుంచి అనేక చిన్న చిన్న ప్రాంతాలకు హిందూ రాజులు అధిపతులుగా ఉండేవారు. నిజాం వీరి హక్కులను అంగీకరించడానికి వీరు ఏటా నిజాంకు 'పేష్కష్' పేరుతో నిర్ణీతమైన డబ్బు చెల్లించాలి. వీరికి ఆయా ప్రాంతాల్లో విస్తృతమైన పరిపాలనా అధికారాలుండేవి.
- ❖ హైదరాబాద్ రాష్ట్రంలో మొత్తం 14 సంస్థానాలు ఉన్నప్పటికీ, వీటిలో ఐదు ప్రధానమైనవి. అవి
  1) గద్వాల్ (అతి పెద్దది)
  2) వనపర్తి 3) జటిప్రోలు
  4) అమరచింత 5) పాల్వంచ.
- ❖ ఈ ఐదు సంస్థానాల్లో పరిపాలన అంతా సంస్థానాధీశులదే. వీరి ఆధీనంలో 497 గ్రామాలు, 5,030 చదరపు మైళ్ల విస్తీర్ణంలో వ్యాపించి ఉండేవి. వీరికి సర్‌బస్తా, పాన్‌మక్తా, ఇజారా అనే మధ్యవర్తులుండేవారు.

సర్‌బస్తా: వేలంపాట ద్వారా శిస్తు వసూలు చేసుకునే హక్కును పొందినవారు.

పాన్‌మక్తా: స్థిరమైన కౌలును చెల్లించేవారు.

ఇజారా భూములు: నిర్మానుష్యమైన గ్రామాల్లోని భూములు. ఇక్కడ పునరావాసం ఉండే వారికి తక్కువ కౌలు చెల్లించే వెసులుబాటు ఉండేది.

- ❖ ప్రాంతీయంగా ఉండే వీరినే దేశ్‌ముఖ్, సర్ దేశ్‌ముఖ్, దేశాయ్, సర్‌దేశాయ్, దేశ్‌పాండేలుగా పిలిచేవారు. వీరికి శిస్తు వసూలు చేసే అధికారం ఉండటం వల్ల అనేక మార్గాల ద్వారా వేల ఎకరాలు తమ పేరున రాసుకొని 1875 తర్వాత ఖల్సా / దివానీ ప్రాంతాల్లో అతిపెద్ద భూస్వామ్యులుగా చెలామణి అయ్యారు.
- ❖ పై భూస్వామ్య విధానాలన్నింటిలోనూ జాగీర్దార్లు, ఇనాందార్లు, సంస్థానాధీశులు చివరకు భాటకాన్ని పొందే ఖల్సా ప్రాంతంలోని పెద్ద భూస్వాములందరూ భాటకాన్ని పొందే అను పస్థితి (అబ్సెంటీ ల్యాండ్‌లార్డ్స్) భూస్వాములుగా మారారు. వీరి సంఖ్య 1891లో లక్ష ఉండగా 1921 నాటికి 7.6 లక్షలకు పెరిగింది.
- ❖ ఈ ప్రాంతంలో భాటకం వసూలు చేసేవారు వ్యవసాయాభివృద్ధి కంటే కౌలును పెంచుకునే మార్గాలను అన్వేషించేవారు.
- ❖ భూమి శిస్తును ఉత్పత్తితో సంబంధం లేకుండా పెంచడం, కౌలు గడువు పెంచుకోవాలన్నా కొత్తగా సేద్యం చేసుకోవడానికి భూమిని తీసుకోవాలన్నా వీరికి 'నజరానాలు' (బహుమతులు) చెల్లించాల్సి వచ్చేది.
- ❖ భూమిశిస్తుతోపాటు ఇంటి పన్ను, వృత్తిపన్ను, మగ్గపు పన్ను..ఇలా అనేక అక్రమ పన్నులు నిర్బంధంగా వసూలు చేసేవారు.
- ❖ వీరి ఇళ్లలో ఏ శుభకార్యం జరిగినా రైతులు, కౌలుదారులు విధిగా చేసే వెట్టి చాకిరీ తోపాటు కట్నాలు, కానుకలు చెల్లించేవారు.
- ❖ ఫలవృక్షాలు, చింతచెట్లు మొదలైనవి జాగీర్దార్ల ఆస్తిగా భావించేవారు.
- ❖ వీరి దోపిడీ హైదరాబాద్ ప్రాంతంలో చాలా ఎక్కువగా ఉండేది. హైదరాబాద్ సంస్థాన రెవెన్యూ ఆదాయం రూ. 8 కోట్లు కాగా హైదరాబాద్ ప్రాంతంలోని 110 మంది జమీందార్ల ఆదాయం రూ. 10 కోట్లు ఉండేది.
- ❖ నిజాం జారీ చేసిన ఫర్మానాలో 82 రకాలైన అక్రమ నిర్బంధ వసూళ్లు ఉండేవని తెలుస్తుంది.
- ❖ కులమతాలు, వయసు, లింగ భేదాలతో సంబంధం లేకుండా అందరూ వెట్టి చాకిరీ చేయడం ఈ ప్రాంతం అంతటా ఉండేది.
- ❖ అత్యధికమైన భూ కేంద్రీకరణ, అధికార బలం, ఆర్థికబలం, అంగబలం వల్ల ఫ్యూడల్ దోపిడీ నిరాటంకంగా కొనసాగింది. దీంతోపాటు వడ్డీ వ్యాపారం, నిర్బంధ లేవీ పద్ధతి, ఆర్థికమాంద్యం మొదలైనవాటితో రైతాంగం పూర్తిగా కుంగిపోయింది. రైతాంగం కౌలుదారులు, వ్యవసాయ కూలీలు మారడమో, వలస వెళ్లడమో జరిగింది.

కౌలుదారీ విధానాలు

- ❖ హైదరాబాద్, ఆంధ్రా ప్రాంతంలోనూ భూస్వామ్య పద్ధతుల్లో ఉండే లోపాల వల్ల భాటకం వసూలు చేసేవారి సంఖ్య విపరీతంగా పెరగడం వల్ల కౌలుదారీ సంబంధాలు ఉండడం సర్వ సాధారణ విషయంగా మారింది.

హైదరాబాద్ రాష్ట్రంలో కౌలు విధానాలు

- ❖ హైదరాబాద్ సంస్థానంలో 1354 ఫసలీ (1944)లో ఆసామీ షక్మీ చట్టం అమలులోకి వచ్చే నాటికి రెండు రకాలైన కౌలుదార్లు ఉండేవారు.

షక్మీదారులు: వీరే శాశ్వత కౌలుదారులు. కౌలుదారునికి రక్షణ, భూమిని సాగు చేసుకునే హక్కులు ఉన్న వారే షక్మీదారులు.

ఆసామీ షక్మీదారులు: వీరు ఏ హక్కులు లేని కౌలుదారులు. ఆసామీ షక్మీదారులు కౌలుభూమిని 12 ఏళ్లు తన స్వాధీనంలో ఉంచుకోగలిగినప్పుడు షక్మీదారులుగా గుర్తింపు లభించేది. కానీ హైదరాబాద్ సంస్థానం వంటి ఫ్యూడల్ వ్యవస్థలో ఏ హక్కులు లేని కౌలుదారుడు పన్నెండేళ్లు కౌలుభూమిని తన స్వాధీనంలో ఉంచుకోవడం జరగదు. ఒకవేళ పన్నెండేళ్లు ఒకే భూమిని కౌలు పద్ధతిలో సాగు చేస్తున్నప్పటికీ దాన్ని రుజువు చేసుకోవడం అంత సులభం కాదు. దీంతో కౌలుదారులందరూ ఆసామి షక్మీదారులు (రక్షణలేని కౌలుదారులు)గానే ఉండేవారు.

Who amongst the five types the fastest?

BANK EXAMS
REASONING

Model Questions

1. In a certain code, PLANT is written as "$@2H©" and YIELD is written as "b64@%". How is "DELAY" written in that code?
   1) b4H2% 2) b4@2%
   3) %42@b 4) %4@2b
   5) None of these
2. How many meaningful English words can be formed with the letters ARILT using each letter only once in that word?
   1) None 2) One 3) Two
   4) Three 5) More than three
3. D said, "A's father is the only brother of my sister's son." How is A's father related to D?
   1) Cousin
   2) Nephew 3) Aunt
   4) Data inadequate
   5) None of these

Directions (Q. No. 4-6): The following questions are based on the 5 three-digit numbers given below:

394 632 783 576 895

4. If the positions of the first and the second digit within each number are interchanged, then which of the following will be the second highest number?
   1) 632 2) 783 3) 576
   4) 895 5) 394
5. If the first and second digits of each of the numbers are added, the resulting sum of which of the following numbers will not be exactly divisible by 3?
   1) 895 2) 394 3) 576
   4) 632 5) 783
6. If 2 is added to the last digit of each number and then the positions of the first and the third digits are interchanged, which of the following will be the highest number?
   1) 576 2) 895 3) 783
   4) 394 5) 632
7. If A is coded as 1, B as 3, C as 5 and so on, which of the following is the numerical value of the word "FAZED"?
   1) 81 2) 79 3) 77
   4) 80 5) None of these
8. Which of the following pairs of words have the same relationship as FAN : HEAT?
   1) Water : Drink
   2) Light : Night
   3) Teach : Student
   4) Air : Breathe 5) Food : Hunger
9. Q types faster than R but not as fast as V. T types faster than R. S types faster than V. Who amongst the five types the fastest?
   1) V 2) T 3) S
   4) Data Inadequate
   5) None of these
10. If "B × C" means "B is the daughter of C", "B + C" means "B is the husband of C" and "B – C" means "B is the sister of C", then what does "M + N – P × Q" mean?
    1) M is the brother-in-law of Q
    2) M is the uncle of Q
    3) M is the son-in-law of Q
    4) Q is the mother-in-law of M
    5) None of these

Directions (Q. No. 11-15): Study the following arrangement carefully and answer the questions given below:

RDAK5BI2M JEN97
UZV1W3H4FY8P6TG

11. How many such numbers are there in the above arrangement, each of which is immediately preceded by a consonant and immediately followed by a vowel?
    1) None 2) One 3) Two
    4) Three 5) More than three
12. Which of the following is the eighth to the left of the seventeenth from the left end?
    1) M 2) J 3) 8
    4) 5 5) None of these
13. Four of the following five are alike in a certain way based on their positions in the above arrangement and so form a group. Which is the one that does not belong to that group?
    1) E 9 J 2) Z 1 U 3) H W 4
    4) Y 4 8 5) B 2 K
14. Which of the following is the sixth to the right of the nineteenth from the right end?
    1) 5 2) Z 3) V
    4) 1 5) None of these
15. How many such consonants are there in the above arrangement, each of which is immediately preceded by a number and immediately followed by another consonant?
    1) None 2) One
    3) Two 4) Three
    5) More than three

Directions (Q. No. 16-19): Each of the questions below consists of a question and two statements numbered I and II given below it. You have to decide whether the data provided in the statements are sufficient to answer the question. Read both the statements and

Give answer:

1) If the data in statement I alone are sufficient to answer the question, while the data in statement II alone are not sufficient to answer the question.
2) If the data in statement II alone are sufficient to answer the question, while the data in statement I alone are not sufficient to answer the question.
3) If the data either in statement I alone or in statement II alone are sufficient to answer the question.
4) If the data given in both the statements I & II together are not sufficient to answer the question.
5) If the data in both the statements I & II together are necessary to answer the question.

16. How is 'never' written in a code language?
    I) "never ever go there" is written as "na ja ni ho" in that code language.
    II) "go there and come back" is written as "ma ho sa ni da" in that code language.
17. Among M, P, K, J, T and W, who is lighter than only the heaviest?
    I) P is heavier than M and T.
    II) W is heavier than P but lighter than J who is not the heaviest.
18. What does "$" mean in a code language?
    I) "5 $ # 3" means "flowers are really good".
    II) "7 # 3 5" means "good flowers are available".
19. How many students are there between Suresh and Mohan in a row of fifty students?
    I) Suresh is twelfth from the left end and Mohan is seventeenth from the right end.
    II) Suresh is six places away from Jayesh, who is twentieth from the left end.

Key And Explanations

1. Ans: 4

P	L	A	N	T	Y	I	E	D	
$	@	2	✳	©	β	6	4	%	

\ DELAY Þ %4@2b

2. Ans: 3. TRAIL, TRIAL,
3. Ans: 2. A's father
   = the only brother of D's sister's son
   = D's sister's son
   = D's nephew
4. Ans: 5. Interchanging the first two digits, we get 934, 362, 873, 756 and 985. Of these, 934 is the second highest.
5. Ans: 1. 895 Þ 8 + 9 = 17 is not divisible by 3.
6. Ans: 1. Look for the highest third digit.
7. Ans: 2. In general, n^{th} letter of the alphabet =2n–1 Here, FAZED = 11 + 1 + 51 + 9 + 7 = 79
8. Ans: 5. The first dispels the second.
9. Ans: 4. V > Q > R; T > R; S > V
   Combining, we get S > V > Q > R and T > R. Hence, either S or T is the fastest.
10. Ans: 3.
    Q
    |
    M(+) Û N(–)<—>P(–)
11. Ans: 1.
12. Ans: 1. 8^{th} to the left of 17^{th} from left = 17 – 8 = 9^{th} from the left = M
13. Ans: 5. In all others, the first and third elements are consecutive ones.
14. Ans: 3. 6^{th} to the right of 19^{th} from the right = 19 – 6 = 13^{th} from the right = V
15. Ans: 4. M, F and T
16. Ans: 4. Only two words are common between I and II.
17. Ans: 5. From I: P > M, T
    From II: J > W > P
    Combining, we get K > J > W > P > M, T Hence, K is the heaviest and J lighter than only the heaviest.
18. Ans: 5.
    From I: 5$#3 = flowers are really good ... (i)
    From II: 7#35 = good flowers are available ... (ii)
    From I and II: 5#3 = flowers are good ... (iii)
    Putting (iii) in (i), we get: $ = really.
19. Ans: 1. **From I:** Suresh = 12^{th} from left
    Mohan = 17^{th} from right
    \ No. of students between them = 50 – 29 (12+17) = 21
    From II: No data about Mohan.